
# యెషయా గ్రంథ పరిచయము



టి.పి వరప్రసాద రెడ్డి

# యెషయా గ్రంథ పరిచయము

రచయిత

టి.పి. వరప్రసాదరెడ్డి

ప్రతులకు

టి.పి. వరప్రసాదరెడ్డి
షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు పోస్టాఫీస్
అనంతపురము - 515002
సెల్: 9440285883

Date of Publishing: 09-09-2013

**వెల : రూ. 60.00**

**ప్రతులకు :**

**1. లోగోస్ బుక్ సెంటర్**

10/1, అరండల్‌పేట గుంటూరు – 522 002

ఫోన్ : (0863)2336927 సెల్:9866296843

**౨. టి.పి. వరప్రసాదరెడ్డి**

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము – 2

సెల్: 94402 85883

**౩. మోరే ప్రార్థన మందిరము**

1088, 3వ ఫేజ్, కె.పి.హెచ్.బి. కాలనీ,

హైదరాబాద్–72, సెల్: 7396202017

**4. జి. రాజారావు**, పెద్దకాకాని – 522 509,

గుంటూరు జిల్లా

**5. టి. రత్నారెడ్డి**, మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్,

గిద్దలూరు, ప్రకాశం జిల్లా. సెల్: 9490000789

# విషయ సూచిక


| వ.సం. | అంశము –అధ్యాయములు | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రవక్తల పెద్ద గ్రంథముల పరిచయము | 4 |
| 2. | యెషయా గ్రంథ పరిచయము | 14 |
| 3. | యూదా, యెరూషలేమును గూర్చిన దేవోక్తి 1-12 అ. | 19 |
| 4. | చుట్టున్న పది శత్రు దేశములకు తీర్పును గూర్చిన దేవోక్తి 13-23అ. | 51 |
| 5. | శ్రమలు, ఆశీర్వాదాల చిన్న గ్రంథము 24-27అ. | 69 |
| 6. | శ్రమలు, ఆశీర్వాదాల పెద్ద గ్రంథము 28-33అ. | 78 |
| 7. | శ్రమలు, ఆశీర్వాదాల అతి చిన్న గ్రంథము 34-35అ. | 89 |
| 8. | హిజ్కియా రాజు చరిత్ర 36-39అ. విమోచన గ్రంథము 40-66అ. | 94 |
| 9. | శరీర విమోచన 40-48అ. | 99 |
| 10. | ఆత్మీయ విమోచన 49-57అ. | 120 |
| 11. | సార్వత్రిక విమోచన 58-66అ. | 140 |

# ప్రవక్తల పెద్ద గ్రంథముల పరిచయము

యూదా ఇశ్రాయేలు వారికి మూల పురుషుడైన అబ్రాహాము, కల్దీయుల దేశము (ప్రస్తుత ఇరాక్ దేశము) లోని ఊరు అను గ్రామమునకు చెందినవాడు. అబ్రహాము పితరులు యితర దేవతలను పూజించేవారు. (యెహోషువ 24:1-2). మహిమ గల దేవుడు అబ్రహామునకు ప్రత్యక్షమై నేను నీకు చూపించు దేశమునకు రమ్మనగా దేవుని యందు విశ్వాసముంచి క్రీ.పూ. 2075 సం॥ కనాను దేశమునకు వచ్చి నివసించాడు. (అపొ 7:1-4వ). అబ్రహాము క్రీ.పూ 2004 సం॥లో ఇస్సాకును, ఇస్సాకు క్రీ.పూ. 1944లో యాకోబును కనెను. యాకోబు 12గురు కుమారులను కుమార్తెలను కనెను. యాకోబు సంతానము ఇశ్రాయేలీయులుగా పిలువబడిరి, యాకోబు కుమారుడైన యోసేపు క్రీ.పూ. 1857లో పుట్టెను. క్రీ.పూ 1836-40లో అన్నలు అమ్మివేయగా ఐగుప్తుకు వెళ్ళెను. ఇశ్రాయేలు తన సంతానమైన 12 గోత్రముల వారితో క్రీ.పూ. 1814లో ఐగుప్తుకు వెళ్ళెను. ఇశ్రాయేలీయులు క్రీ.పూ. 1440లో మోషే నాయకత్వాన ఐగుప్తును విడచి క్రీ.పూ. 1400లో కనానుకు తిరిగివచ్చారు.

కనానులో అప్పుడు నివసించు ఏడు జాతుల వారిని సంహరించి యెహోషువ ద్వారా ఆ దేశమంతటిని దేవుడు 12 గోత్రముల ఇశ్రాయేలీయుల వారికి క్రీ.పూ. 1400-1370 వరకు పంచి పెట్టాడు (అపొ.13:20). అప్పటి నుండి అది ఇశ్రాయేలు దేశమని పిలువబడినది. యెరూషలేము నుండి క్రింది భాగము బెన్యామీను, యూదా గోత్రముల వారికి పంచిపెట్టబడెను. యెరూషలేము నుండి, పై నున్న ఉత్తర దేశము మిగిలిన 10 గోత్రముల వారికి పంచిపెట్టబడెను. న్యాయాధిపతుల గ్రంథమందు క్రీ.పూ. 1370 నుండి 1060 వరకు సుమారు 310 యేండ్లు దేవుడు వారిని న్యాయాధిపతుల ద్వారా పాలించెను. తరువాత ప్రజల కోరికపై దేవుడు వారికి రాజుల నిచ్చాడు. ఇశ్రాయేలు 12 గోత్రముల వారిని సౌలు రాజు (క్రీ.పూ 1050-1010), దావీదు రాజు (క్రీ.పూ 1010-970), సొలొమోను రాజు (క్రీ.పూ. 970-930) పరిపాలించిన తదుపరి రాజైన రెహబాము కాలమందు రాజ్యము రెండు భాగములై యూదా, బెన్యామీను గోత్రాలవారు యూదావారని పిలువబడిరి. యూదా ప్రజలను 20 మంది రాజులు యెరూషలేము నుండి క్రీ.పూ. 930-586 వరకు పాలించిరి. వారిలో 8 మంది మంచివారు, 12 మంది చెడ్డవారు, మిగిలిన 10 గోత్రాల ప్రజలు ఇశ్రాయేలు వారని పిలువబడి 19 మంది రాజులచే షోమ్రోను, తిర్సాలు ముఖ్య పట్టణములుగా నుండి క్రీ.పూ. 930-721 వరకు పాలించబడిరి. వారందరు చెడ్డవారు. అందుచేత వారు (క్రీ.పూ. 732, 721)లో అష్షూరు చెరకు వెళ్ళి నేటికి తిరిగిరాలేదు. యూదా వారిని పాలించిన రాజులలో 8 మంది మంచివారు,

మిగిలిన 12 మంది రాజులు, ప్రజలు చెడ్డవారైనందున దేవుడు వారిని క్రీ.పూ. 606, 597, 586లో మూడు విడతలుగా బబులోనుకు చెరకు పంపెను. సొలొమోను రాజు క్రీ.పూ. 967-960 వరకు యెరూషలేములో కట్టించి క్రీ.పూ. 959లో ప్రతిష్ఠించిన మందిరము క్రీ.పూ. 586లో పడగొట్టబడెను. యెరూషలేము పట్టణము కాల్చబడెను. 606 నుండి 70 ఏండ్ల చెర పిదప క్రీ.పూ. 536లో బబులోను నుండి యూదులు తిరిగి వచ్చిరి. క్రీ.పూ. 535-516 వరకు మందిరము నిర్మించబడినది. ఇశ్రాయేలీయులు లేవీ.25:3-11 ప్రకారము ప్రతి ఏడవ సం॥ ఏబది సం॥ భూమికి విశ్రాంతినివ్వాలి కాని ఇవ్వలేదు. క్రీ.పూ. 959-516 వరకు బాకీగా నున్న 70 విశ్రాంతి సంవత్సరములను ఈ చెర కాలమందు దేశము అనుభవించినది. క్రీ.పూ. మందిరము ఎజ్రాచే అలంకరించబడినది. క్రీ.పూ. 445లో నెహెమ్యాచే పట్టణ ప్రకారము కట్టబడిన తరువాత క్రీ.పూ. 396 వరకు మలాకీ గ్రంథ రచనద్వారా ప్రజల జీవితములు కట్టబడినవి. యూదా వారు విగ్రహములను పూజించిన కారణమున మరియు ధర్మశాస్త్రమును మీరిన కారణమున దేవుడు యెషయా ద్వారా క్రీ.పూ. 760 నుండి 700 వరకు 60 ఏండ్లు యిర్మీయా ద్వారా క్రీ.పూ. 626 నుండి 586 వరకు 40 ఏండ్లు బుద్ధి చెప్పినను వారు విననందున యూదావారిని క్రీ.పూ. 606లో రాజైన యెహోయాకీము దినములలో బబులోనుకు మొదటి విడతగా చెరకు పంపాడు. చెరకు వెళ్ళినవారిలో ప్రముఖులైన దానియేలు, షద్రకు, మేషాకు, అబేద్నెగోలు కలరు. యూదయలో మిగిలినవారు ఇంకను జీవితాలు దిద్దుకొననందున రెండవ విడతగా క్రీ.పూ. 597లో యెహోయాకీను రాజు దినాలలో యూదావారిని చెరకు బబులోనుకు పంపాడు. వీరిలో ప్రముఖుడైన యెహెజ్కేలు ద్వారా క్రీ.పూ. 592 నుండి 572 వరకు 20 ఏండ్లు బుద్ధి చెప్పారు. తదుపరి చివరి రాజైన సిద్కియా దినాలలో క్రీ.పూ. 586లో యూదా దేశము పతనమై యెరూషలేము పట్టణము, నాశనము కాగా యిర్మీయా విలపించిన గ్రంథము విలాపవాక్యములు. దేశములో మిగిలిన వారు యిర్మీయా యొద్దకు వెళ్ళి ప్రార్థించి దేవుని చిత్తమును తెలుపుమనికోరగా యిర్మీయా ప్రార్థించాడు. జవాబుగా దేవుడు మిగిలినవారు ఎక్కడకు వెళ్ళవద్దని యూదయలోనే ఉండవలెనని సెలవిచ్చాడు. కాని దేవుని మాట వినక మిగిలిన సామాన్యులు యిర్మీయాను వెంటబెట్టుకొని ఐగుప్తుకు వెళ్ళిరి. క్రీ.పూ. 606లోని మొదటి విడత చెర నుండి 70 ఏండ్లకు క్రీ.పూ. 536 పారశీకులు రాజైన కోరేషు దినాలలో చెర నుండి విడుదల పొంది యెరూషలేముకు తిరిగి వచ్చిరి. క్రీ.పూ. 606 నుండి 533 వరకు సుమారు 80 ఏండ్లు రాజనగరు నుండి దానియేలు ప్రవచించాడు. యెషయా దేవుని రక్షణను గూర్చి, యిర్మీయా దేవుని తీర్పుల గూర్చి, యెహెజ్కేలు దేవుని ప్రభావము గూర్చి, దానియేలు దేవుని మహిమను గూర్చి ప్రవచించిరి. క్రీ.పూ. 535-515

మధ్య యూదులు దేవాలయమును కట్టిరి. వివరములు ఎజ్రా గ్రంథమందు, హగ్గయి, జెకర్యా గ్రంథములందు గలవు. పాడైన పట్టణ ప్రాకారమును నెహెమ్యా కాలములో క్రీ.పూ. 445లో బాగు చేసిన వివరములు నెహెమ్యా గ్రంథమందు కలవు. యూదా ప్రజల జీవితములు కట్టబడుట హగ్గయి, జెకర్యా, మలాకీ గ్రంథములందు కలదు. యూదావారిని శిక్షించిన బబులోనీయులను, వారికి సహకరించిన చుట్టునున్న శత్రు దేశాలను 1. అష్షూరు 2. ఫిలిష్తీయ 3. మోయాబు 4. దమస్కు 5. కూషు 6. ఐగుప్తు 7. అరేబియా 8. తూరు 9. ఎదోమును దేవుడు తదుపరి శిక్షించాడు. రమారమి దానియేలు 80 ఏండ్లు, యెషయా 60 ఏండ్లు, యిర్మీయా 40 ఏండ్లు యెహెజ్కేలు 20 ఏండ్లు ప్రవచించిరి. పది గోత్రముల ఇశ్రాయేలు వారు అష్షూరుకు క్రీ.పూ 732, 721లో చెరగా వెళ్ళి నేటికిని తిరిగి రాలేదని చూచితిమి. యూదావారు క్రీ.పూ. 606, 597, 586లో చెరగా బబులోనుకు వెళ్ళి క్రీ.పూ. 536, 458, 455లో తిరిగి వచ్చిరని లేఖనములనుబట్టి నేర్చుకొనగలము. క్రీ.పూ. 536-397 వరకు హగ్గయి, జకర్యా, మలాకీ ప్రవక్తల ద్వారా దేవుడు వారిని హెచ్చరించుట ద్వారా వారి జీవితములు దిద్దాడు. అప్పటినుండి క్రీస్తు జననము వరకు ప్రచురింపబడిన ప్రవచనములు లేవు. యేసు ప్రభువు జన్మించినప్పుడు యూదులు ఆయనను అంగీకరించక క్రీ.శ 30లో సిలువ వేసిరి. ఆయన రక్త అపరాధమునుబట్టి ప్రపంచమంత చెదరిపోయిరి. కాని క్రీస్తు సిలువలో కార్చిన రక్తము ద్వారా అపరాధులైన మానవులకు పాపక్షమాపణ అనగా విమోచన లభించింది. క్రీస్తును రక్షకుడుగా నమ్మినవారు సంఘములో చేర్చబడిరి. అంత్య కాలములో ప్రభువు రెండవ రాకడలో అంజూరపు చెట్టు చిగిరించునను లేఖన ప్రకారము (మార్కు 13:28-29) యూదులు తిరిగి వచ్చుట/ ఆయన రాకడ సంభవించును. మార్కు13:28-29 -- అంజూరపు చెట్టును చూచి యొక ఉపమానము నేర్చుకొనుడి. దాని కొమ్మ యింక లేతదై చిగిరించునప్పుడు వసంతకాలము సమీపముగా ఉన్నదని మీకు తెలియును. అ ప్రకారమే మీరు ఈ సంగతులు జరుగుట చూచునప్పుడు ఆయన సమీపముననే ద్వారము దగ్గరనే ఉన్నాడని తెలిసికొనుడి. ప్రభువు రాకడ రెండంచెలలో నుండును. మొదట ఆకాశమండలమునకు, ఏడేండ్ల తరువాత భూమి మీదకు వచ్చును.

ప్రభువు రెండవ రాకడ నుండి వరుసగా జరుగు సంభవములు క్రొత్త నిబంధన ఒకే ప్రవచన గ్రంథమగు ప్రకటన గ్రంథములో చెప్పబడినవి.

1) ప్రభువు ఆకాశమండలమునకు రాగా సంఘము ఎత్తబడుట:- ప్రకటన 1-3అ.లో చెప్పబడిన సంఘ కాలము ముగిసిన తరువాత దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు ఆకాశ మండలమునకు దిగివచ్చును. ఇది రెండవ రాకడలోని మొదటి భాగము.

ప్రస్తునందుండి (సంఘము) మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము (సజీవులుగానున్న సంఘ విశ్వాసులు) ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద (కీర్తన 104:3, ద్వితీ 33:26 ప్రకారము మేఘము ప్రభువు వాహనము) కొనిపోబడుదుము (1 థెస్స. 4:16).

2) ఆకాశమండలమునుండి సంఘ విశ్వాసులు పరలోకమునకు వెళ్ళి బహుమానములు పొంది తండ్రిని, కుమారుని చూచి స్తుతించుచుందురు. ప్రక 5:10-14లో ఆ నాలుగు జీవులు ఆమేన్ అని చెప్పగా ఆ పెద్దలు సాగిలపడి తండ్రియైన దేవునికిని, కుమారుడైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి నమస్కారము చేయుచుండిరి (ప్రక 4-5అ).

3) తరువాత శ్రమలు, మహా శ్రమల కాలములో (ప్రక 6-18అ) ఇశ్రాయేలీయులు శ్రమల పాలగుదురు. దేవుడు ఆశ్చర్యముగా వారికి సహాయముచేసి కాపాడును. కొద్దిమంది అన్యులు కూడా వారికి సహాయము చేసి వారిని శ్రమల నుండి తప్పించుదురు. బబులోను పట్టణము ప్రక 18అ.లోను, మతపరమైన వ్యవస్థ ప్రక 17అ.లోను నాశనమగుట చూతుము. యెషయా 24-35 అధ్యాయములలో శ్రమల కాలమందు ఇశ్రాయేలీయులకు కలుగు శ్రమలు, వేయిఏండ్ల కాలమందు కలుగు ఆశీర్వాదములు వివరించబడినవి.

4) శ్రమల కాల అంతములో గొఱ్ఱెపిల్ల వివాహము:- ప్రక 19:7 ఆయనను స్తుతించుడి, గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది, ఆయన భార్య తన్ను తాను సిద్ధపరచుకొనియున్నది. యోహాను 3:29 పెండ్లికుమార్తెగలవాడు పెండ్లి కుమారుడు, అయితే నిలువబడి పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు ఆ పెండ్లి కుమారుని స్వరము విని మిక్కిలి సంతోషించును. ఈ నా సంతోషము పరిపూర్ణమైయున్నది. ఆదాము మొదలు పాతనిబంధన భక్తులందరు బాప్తిస్మమిచ్చు యోహానుతో కూడా పునరుత్థానులు కాకపోయినను పరదైసులో నున్న దేహముతోనే ఈ పెండ్లిలో అతిథులుగా పాల్గొనెదరని స్పష్టమగుచున్నది. నూతన నిబంధనకాల భక్తులు పెండ్లి కుమార్తె కనుక సంఘకాల విశ్వాసుల ఆధిక్యత ఎంతో గొప్పది.

5) గొఱ్ఱెపిల్ల వివాహము తరువాత ప్రభువు భూమి మీదకువచ్చి క్రీస్తు విరోధిని, అబద్ధ ప్రవక్తను అగ్ని గుండములో వేయును. ఇది రెండవ రాకడలోని రెండవ భాగము (ప్రక 19అ).

6) పాత నిబంధన భక్తుల, పునరుత్థానము, వారి బహుమానములు: మత్త 19:28 యేసు వారితో ఇట్లనెను. (ప్రపంచ పునర్జననమందు మనుష్యకుమారుడు తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడైయుండునప్పుడు నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనములమీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములవారికి తీర్పు తీర్చుదురు.

ప్రక 11:18 జనములు కోపగించినందున నీకు కోపము వచ్చెను. మృతులు తీర్పుపొందుటకును, నీ దాసులగు ప్రవక్తలకును పరిశుద్ధులకును, నీ నామమునకు భయపడువారికిని తగిన ఫలము నిచ్చుటకును (పాత నిబంధన భక్తులకు), సమయము వచ్చియున్నదని చెప్పిరి. దాని 12:1-4 ఆ కాలమందు నీ జనుల పక్షమున నిలుచునట్టి మహా అధిపతియగు మిఖాయేలు వచ్చును. అప్పుడు నీ జనులు రాజ్యముగా కూడినకాలము మొదలుకొని యీ కాలమువరకు ఎన్నటికిని కలుగునంత ఆపదకలుగును. (శ్రమలకాలము) అయితే నీ జనులలో గ్రంథము నందు దాఖలైన వారెవరో వారు తప్పించుకొందురు. (మూడవ ఆకాశమగు పరదైసులో నున్నందున) మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు. కొందరు నిత్యజీవము అనుభవించుటకును మేల్కొనెదరు. యోబు 19:25-27లో సజీవుడైన నా విమోచకుని భూమిమీద చూతును అంటున్నాడు. పై వచనముబట్టి పాతనిబంధన కాల భక్తుల పునరుత్థానము, తీర్పు, బహుమానములు పొందుట గొర్రెపిల్ల వివాహము తరువాత ప్రభువు భూమిమీదకు వచ్చినప్పుడు వేయి ఏండ్లకాల ప్రారంభమున జరుగును. కొందరు నింద పాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు. ప్రక 11:18లో గొప్ప వారేమి కొద్దివారేమి భూమిని నశింపజేయువారిని నశింపజేయుటకును సమయము వచ్చియున్నదని చెప్పిరి. వేయిఏండ్లపాలన తరువాత ధవళ సింహాసన తీర్పులో ఇది జరుగును. (ప్రక 20:11-15).

7) వేయి ఏండ్ల పాలన - శ్రమలకాల మృతుల పునరుత్థానము:- ప్రక 20:4-10 - అంతట సింహాసనములను చూచితిని; వాటిమీద ఆసీనులైయుండువారికి విమర్శ చేయుటకు అధికారము ఇయ్యబడెను. శ్రమల కాలములో మిగిలిన ఇశ్రాయేలీయులు, వారికి సహాయము చేసిన అన్యులు జనాంగములతీర్పు ద్వారా వేయిఏండ్లపాలనలో ప్రవేశింతురు. మరియు క్రూరమృగమునకైనను దాని ప్రతిమకైనను నమస్కారముచేయక, యేసు విషయమై తామిచ్చిన సాక్షము నిమిత్తము శిరచ్ఛేదనము చేయబడినవారు బ్రతికినవారై, వేయి సంవత్సరములు క్రీస్తుతో రాజ్యముచేసిరి. వెయ్యి సంవత్సరాలు గడచువరకు కడమ మృతులు బ్రదుక లేదు; ఇదియే మొదటి పునరుత్థానము. ఈ మొదటి పునరుత్థానములో పాలుగలవారు ధన్యులును పరిశుద్ధులునై యుందురు. వీరు దేవునికిని క్రీస్తుకును యాజకులై క్రీస్తుతో కూడ వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు.

8) అపవాది, పాపులు అగ్ని గుండములో వేయబడుట:- వెయ్యి సంవత్సరముల తరువాత కీర్త 18:44 ప్రకారము దేవుని పిల్లలెవరో అపవాది పిల్లలెవరో తేటపడు నిమిత్తము సాతాను తానున్న చెరలోనుండి విడిపింపబడును. గోగు మాగోగు అనువారిని పరలోకములో నుండి అగ్ని దిగివచ్చి దహించెను. వారిని మోసపరచిన అపవాది అగ్ని గంధకములుగల

గుండములో పడవేయబడును. మృతులైన పాపులందరు తీర్పు తీర్చబడి అగ్ని గుండములో వేయబడుదురు. (ప్రక 20అ.).

9) నూతన ఆకాశము, నూతన భూమి. నూతన యెరూషలేము (యెష 65:17):- క్రొత్త అకాశమును క్రొత్త భూమిని చూచితిని. మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించి పోయెను. సముద్రము ఇకను లేదు. మరియు నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధ పట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లి కుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని. (ప్రక 21అ.).

10) నిత్యకాలములో దేవుడు సర్వములో సర్వమగుట:- ప్రక 22:1-5లో మరియు స్పటికమువలె మెరయునట్టి జీవజలములనది దేవుని యొక్కయు గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము నొద్దనుండి ప్రవహించుట చూచితిని. (తండ్రి, కుమారుడు ఇద్దరు ఒకే సింహాసనము పై నుండుట). ఆ నది యొక్క ఈవలను ఆవలను జీవవృక్షముండెను; అది నెల నెలకు ఫలించుచు పండ్రెండు కాపులు కాయును. ఆ వృక్షముయొక్క ఆకులు జనములను స్వస్థపరచుటకై వినియోగించును. ఇకమీదట శాపగ్రస్తమైన దేదియు దానిలో ఉండదు, దేవుని యొక్కయు గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో ఉండును. ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖదర్శనము చేయుచుందురు; ఆయన నామము వారి నొసళ్లయందుండును. రాత్రి యికనెన్నడు ఉండదు; దీపకాంతియైనను సూర్యకాంతియైనను వారికక్కరలేదు; దేవుడైన ప్రభువే వారిమీద ప్రకాశించును. వారు యుగయుగములు రాజ్యము చేయుదురు (ప్రక 22అ.).

పాత నిబంధనలోని ప్రవక్తల గ్రంథములలోనున్న యూదుల విమోచనను గూర్చిన ప్రవచనములో సమీప నెరవేర్పుగా బబులోనుచెర నుండి విమోచన, తదుపరి నెరవేర్పుగా క్రీస్తు మరణము ద్వారా పాపము నుండి విమోచన, అంత్యకాల నెరవేర్పుగా శ్రమల కాలములో క్రీస్తు విరోధి నుండి క్రీస్తు ద్వారా కలుగు విమోచన చూతుము. వేయి ఏండ్ల పాలన తరువాత భూమ్యాకాశములు సమస్తము నూతనముగా చేయబడి దేవుని నిత్యకాల పరిపాలన యుండును.

యెషయా గ్రంథమునందు 1) బబులోను చెరనుండి కలిగిన శరీర విమోచన అనగా మొదటి విమోచన, ప్రవచనము యొక్క సమీప నెరవేర్పు యెష 40-48అ. లోను, 2) పాపము నుండి క్రీస్తు ద్వారా కలిగిన ఆత్మీయ విమోచన అనగా రెండవ విమోచన ప్రవచనము యొక్క తదుపరి నెరవేర్పు యెష 49-57అ. లోను, 3) అంత్యకాలములో క్రీస్తు విరోధి కలిగించు శ్రమలనుండి కలుగు విమోచన అంత్యకాల విమోచన

యెష 58-66అ.లోను చూతుము. ఈ మూడవ విమోచనలోనే సృష్టి యొక్క విమోచన సార్వత్రిక విమోచన ఇమిడియున్నవి.

## యెషయాను గూర్చిన పరిచయము

యెషయా అను పేరుకు యెహోవా రక్షణ అని అర్థము. ప్రవక్తయైన యెషయా 66 అధ్యాయములుగల గ్రంథము వ్రాసినందున రచయితలైన ప్రవక్తలలో అగ్రగణ్యుడుగాను, ప్రవక్తల చక్రవర్తిగాను తలంచవచ్చును. యెరూషలేము నివాసి (7:1,3). తండ్రి ఆమోజు (1:1). యెషయా భార్య ప్రవక్తి (8:3). వారికి ఇద్దరు కుమారులు. మొదటివాడు షెయర్యాషూబు (7:3) అనగా శేషము తిరిగి వచ్చును. బబులోను చెరకు వెళ్ళిన యూదా ప్రజలలో శేషము తిరిగి వచ్చునని భావము. రెండవ కుమారుని పేరు మహేరు షాలాల్ హాష్ బజ్ (8:3). ఇది బైబిలు గ్రంథమంతటిలో పెద్ద పేరు. దీని భావము త్వరగా దోపుడవును, ఆతురముగా కొల్లపెట్టబడును. పది గోత్రముల ఇశ్రాయేలువారు చెరకు వెళ్ళి తిరిగి అంతము వరకు రారని దీని భావము. కనుక 8:18లో చెప్పబడినట్లు ఆయన భార్య, ఇద్దరు కుమారులు ఒకరు యూదాకు, మరొకరు ఇశ్రాయేలుకు యెహోవా వలని సూచనలని గమనించగలము. రాజైన హిజ్కియా తరువాత పాలన చేసిన అతని కుమారుడైన మనష్షే రాజు ద్వారా యెషయా రంపము చేత కోయబడి క్రీ.పూ. 693లో చంపబడ్డాడు.

యెషయా గ్రంథమును బైబిలులోని పాత, క్రొత్త నిబంధనలవలె 1-39, 40-66 అను రెండు భాగములుగా విడగొట్టి ధ్యానించుట సహాయకరముగా నుండును. 40-66 అధ్యాయములను యెషయా కాక మరొకరు వ్రాసిరని తలంచువారు కలరు. కాని క్రింద కనపరచిన క్రొత్త నిబంధనలోని ఇరువది లేఖన భాగములలో యెషయా గ్రంథములోని 1-65 అధ్యాయముల భాగములు చెప్పబడి యెషయా వ్రాసాడని చెప్పబడినది. కనుక గ్రంథమంతటిని యెషయా ఒక్కడే వ్రాసాడని అంగీకరించాలి.

1) యెష 1:9 (రోమా 9:29). 2) యెష 6:9,10 (అపొ 28:25), 3) యెష 6:10 (యోహా 12:39). 4) యెష 6:9,10 (మత 13:14). 5) యెష 9:1,2 (మత్త 4:14). 6) యెష 10:22 (రోమా 9:27). 7) యెష 11:10 (రోమా 15:12). 8) యెష 29:13 (మత్త 15:17). 9. యెష 29:13 (మార్కు 7:6). 10) యెష 40:3 (మత్త 3:3) 11) యెష 40:3-4 (లూకా 3:4), 12) యెష 40:3 (యోహా 1:23), 13) యెష 42:1-4(మత్త 12:17-21) 14) యెష 53:1; (యోహా 12:38-41). 15) యెష 53:1 (రోమా 10:16). 16) యెష 53:4 (మత్త 8:17). 17) యెష

53:7,8 (అపొ 8:28). 18) యెష 53:7,8 (అపొ 8:30). 19) యెష 61:1,2 (లూకా 4:17). 20) యెష 65:1,2 (రోమా 10:20).

ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడని ఈ గ్రంథమునందు 26 పర్యాయములు కలదు. ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడని ఈ గ్రంథమునందు 26 పర్యాయములు పలికినందున 1) యూదాలో పరిశుద్ధత లోపించినదని గుర్తించాలి. 2) అంత్య కాలములో వేయి ఏండ్ల పాలనలో శాంతి భద్రతలుండునని (11:6-9)లో చెప్పబడినది. దావీదు వంశమునకు చెందిన రాజు నీతి పాలన చేయునని, 3) ప్రపంచ మందలి రాజ్యములు అన్ని యెరూషలేము పరిశుద్ధ పర్వతమునకు వరదవలె వత్తురని (9:7; 32:1 11:14; 45:14) చెప్పబడినది. 4) అంత్య కాలములో యెరూషలేము అన్యులచే ఏ మాత్రము పాలించబడక యేసు ప్రభువుచే పాలించబడునని 60:14లో చెప్పబడినది.

రాజుల పాలన:- ఉజ్జియా, యోతాము, ఆహాజు, హిజ్కియా అను యూదారాజుల దినములలో యూదానుగూర్చి యెరూషలేమును గూర్చి ఆమోజు కుమారుడగు యెషయాకు క్రీ.పూ. 755-695 కలిగిన దర్శనము. రాజుల పాలన కాల వివరాలు పట్టికలో కలవు.

# ముఖ్యమైన సంఘటనల వివరాల కాలపట్టిక

1). క్రీ.పూ. 1050-1010 సౌలు రాజు పాలన.

2) క్రీ.పూ. 1010 - 970 దావీదు రాజు పాలన.

3) క్రీ.పూ. 970-930 సొలొమోను రాజు పాలన.

4) క్రీ.పూ. 960 సొలొమోను రాజుచే మందిర నిర్మాణము.

5) క్రీ.పూ. 930 రాజ్యము ఉత్తర దక్షిణ రాజ్యములుగా విభజించబడుట.

6) క్రీ.పూ. 970-721, 19 మంది ఇశ్రాయేలు రాజులచే ఉత్తర రాజ్యముగా పాలన.

7). క్రీ.పూ. 970- 721, ఇశ్రాయేలు రాజులు, ప్రజలు అందరు విగ్రహారాధికులు.

8) క్రీ.పూ. 732, 721.ఇశ్రాయేలు ప్రజలు రెండు విడతలుగా అష్షూరు చెరకు వెళ్ళుట

9) క్రీ.పూ. 930-586, 20 మంది యూదా రాజులచే దక్షిణ రాజ్యముగా పాలన.

10) క్రీ.పూ. 960-516 విశ్రాంతి దినములు పాటించక పోవుట (2 దిన 36:21వ).

11) క్రీ.పూ. 755-695 యెషయా ప్రవచించిన కాలము.

క్రీ.పూ. 787-736 ఉజ్జియా రాజు కాలమునకు చెందిన ప్రవచనము. 1-5అ.

క్రీ.పూ. 749-734 యోతాము రాజు కాలమునకు చెందిన ప్రవచనము. 6అ.

క్రీ.పూ. 737-722ఆహాజు రాజు-కాలానికి చెందిన ప్రవచనము. 7అ. నుండి 14:27వ.

క్రీ.పూ. 722-694 హిజ్కియా రాజు కాలానికి చెందిన ప్రవచనము. 14:27వ. 39అ.

12) క్రీ.పూ. 626-586. యిర్మీయా ప్రవచించిన కాలము.

13) క్రీ.పూ. 692 -672. యెహెజ్కేలు ప్రవచించిన కాలము.

14) క్రీ.పూ. 606, 597, 586 యూదా ప్రజలు మూడు విడతలుగా చెరకు వెళ్ళుట.

15) క్రీ.పూ. 586 యెరూషలేము మందిర నాశనము.

16) క్రీ.పూ. 606-536, వరకు 70 సంవత్సరములు బబులోనులో చెరగా నుండుట.

17) క్రీ.పూ. 536 యూదా ప్రజలు చెర నుండి తిరిగి వచ్చుట.

18) క్రీ.పూ. 536-515 యెరూషలేము మందిర నిర్మాణము.

19) క్రీ.పూ. 458 ఎజ్రాచే యెరూషలేము మందిర అలంకరణ.

20) క్రీ.పూ. 445 నెహెమ్యాచే యెరూషలేము పట్టణ ప్రాకార నిర్మాణము.

21) క్రీ.పూ. 536-397 ఎజ్రా, నెహెమ్యా, హగ్గయి జెకర్యా, మలాకీ గ్రంథాల చరిత్ర.

22) క్రీ.పూ. 4 యేసు జననము.

23) క్రీ.శ. 30 యేసు మరణము - సంఘ స్థాపన.

# యెషయా గ్రంథ పరిచయము

వివాదము

రండి మన వివాదము తీర్చుకొందము 1:18వ.

12+11+12+4+9+9+9=66అ.

యూదా, యెరూషలేమును గూర్చిన దేవోక్తి 1-12అ.

చుట్టున్న పది శత్రు దేశములకు తీర్పును గూర్చిన దేవోక్తి 13-23అ.

శ్రమలు, ఆశీర్వాదాల చిన్న గ్రంథము 24-27అ.

శ్రమలు, ఆశీర్వాదాల పెద్ద గ్రంథము 28-35అ.

హిజ్కియా రాజుచరిత్ర 36-39అ.

విమోచన గ్రంథము 40-66అ.

శరీర విమోచన 40-48అ.

ఆత్మీయ విమోచన 49-57అ.

సార్వత్రిక విమోచన 58-66అ.

శాశ్వత కాల పాలన.

మీ రెవరిని సేవింపకోరెదరో నేడు నేను నా యింటివారును యెహోవాను సేవించెదము. యెహోషువ 24:15వ.

# యెషయా గ్రంథ పరిచయము

## 12+11+12+4+9+9+9=66అ.

ముందుగా ప్రవక్తల పెద్ద గ్రంథముల పరిచయము చదవండి. యూదా వారి పాపమును గూర్చి, రానున్న శిక్షను గూర్చి, పశ్చాత్తాపపడమని సెలవిచ్చుచూ యెషయా క్రీ.పూ. 760 నుండి 700 వరకు ఉజ్జియా (779-729), యోతాము (743-728), ఆహాజు (728-714), హిజ్కియా (714-687) అను నలుగురు యూదా రాజుల కాలములో ప్రవచించాడు. వీరిలో ఆహాజు చెడ్డరాజు. మిగిలిన ముగ్గురు యెహోవా దృష్టికి మంచివారు. యెషయా గ్రంథములోని 66 అధ్యాయాలను పరిశుద్ధ గ్రంథమందలి 66 పుస్తకాలతో పోల్చనగును. పాతనిబంధన గ్రంథమునకు పోలికగానున్న 39 అధ్యాయాలలో పాపమును గూర్చి, రానున్న శిక్షను గూర్చి పశ్చాత్తాపపడిన కలుగు విమోచన లేని యెడల కలుగు శిక్షల వివరములు కలవు. క్రొత్త నిబంధనకు పోలికగా నున్న 40 నుండి 66 అధ్యాయాలలో విడుదల వివరము, విమోచకుడైన క్రీస్తు ప్రాముఖ్య అంశములు. మొదటి 39 అధ్యాయాలను 4 భాగాలుగా I. 1-12 అధ్యా. II. 13-23 అధ్యా III. 24-35 IV. 36-39 అధ్యాయాలుగా విభజింపనగును. యెషయా గ్రంథములోని 40-66 అధ్యాయాలు కలుగబోవు శరీర, ఆత్మీయ, సార్వత్రిక విమోచన వివరించబడినది. కనుక ఈ భాగము యెషయా గ్రంథమంతటికి కిరీటము. ఇందులో మూడు భాగములు కలవు. 40-48అ, 49-57అ, 58-66అ ఈ మూడు భాగముల చివరి వచనాలు గమనించండి. 48:22. దుష్టులకు నెమ్మదియుండదని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 57:21. దుష్టులకు నెమ్మదియుండదని నా దేవుడు సెలవిచ్చుచున్నాడు. 66:24. వాటి పురుగు చావదు, వాటి అగ్ని ఆరిపోదు అవి సమస్త శరీరులకు హేయముగా ఉండును.

ఈ భాగము యొక్క ప్రారంభములో 40:3-5 వచనాలను గమనించిన ప్రభువు వచ్చునని, ఆయన రాకడద్వారా యెహోవా మహిమ బయలుపరచబడునని యూదా వారికి విడుదల మొదలగు మేలులు కలుగునని చెప్పబడినది.

40-48అ. బబులోను చెర నుండి విమోచనను (శరీర విమోచన). 49-57అ. పాపపు శిక్ష నుండి రక్షణను (ఆత్మీయ విమోచన). 58-66అ. ఇశ్రాయేలీయుల పాపమునకు తీర్పు - సమకూర్పును (సార్వత్రిక విమోచన) చూపించుచున్నవి.

In this portion we find Physical redemption in chapters 40-48, Spiritual redemption in chapters 49-57, and Universal redemption in chapters 58-66.

V. 40-48అ. బబులోను చెర నుండి విమోచన (శరీర విమోచన Physical )

40-42అ. విమోచన కర్త. 43-45అ. విమోచన క్రియ. 46-48అ. విమోచన వివరము.

VI 49-57అ. పాపపు శిక్ష నుండి రక్షణ (ఆత్మీయ విమోచన - Spiritual)

49-51అ. విమోచనకర్త. 52-54అ. విమోచన క్రియ. 55-57అ. విమోచన వివరము.

VII58-66అ. ఇశ్రాయేలీయుల పాపమునకు తీర్పు- సమకూర్పు (సార్వత్రిక విమోచన - Universal)

58-50అ. విమోచన కర్త. 61-63అ. విమోచన క్రియ. 64-66అ. విమోచన వివరము.

మరొక విభజన ప్రకారము 40-48అ. విమోచన వాగ్దానమును (Promise of redemption) 49-57అ. విమోచన ప్రణాళిక (Plan of redemption)

58-66అ. విమోచన నెరవేర్పును (perfomance of redemption) చూపించుచున్నవి.

I. **1-12 అధ్యా. యూదాను గూర్చి యెరూషలేమును గూర్చిన దేవోక్తి:-** ఇందులో యూదా ప్రజల పాపములు, రానున్న తీర్పులు కలవు. యూదా రాజ్యముపై దండెత్తి వచ్చిన ఇశ్రాయేలు రాజుల చరిత్ర, సిరియా రాజుల చరిత్ర కూడ కలదు. ఇశ్రాయేలు వారిని చెరలో బాధించిన అష్హూరు రాజ్యపతన వివరములు కూడా కలవు.

**ఎ. 1-6 అధ్యాయాలు యూదా ప్రజలను గూర్చిన దేవోక్తులు**

1-4 అధ్యా. యూదా ప్రజల పాపములు రానున్న తీర్పులు

5 అధ్యా. ఇశ్రాయేలీయులపై దేవుని తీర్పును గూర్చిన ఉపమానము - యూదా వారి పాపమును బట్టి రానున్న తీర్పులు.

6 అధ్యా. యెషయా పరిచర్య కొరకు పిలువబడుట, నియమించబడుటను గూర్చిన వివరములు కలవు. ప్రవచనముగా 8-13వ వచనములలో యేసు ప్రభువు పిలువబడుట - పంపబడుట కూడా చూడగలము.

**బి. 7-12 అధ్యా. యూదావాడైన మెస్సీయాను గూర్చిన దేవోక్తులు**

7 నుండి 12 అధ్యాయాలలో దాదాపు అన్ని అధ్యాయములలో మెస్సీయాను గూర్చిన భాగము గలదు. అందుచేత 7-12 అధ్యాయాలను మెస్సీయా / ఇమ్మానుయేలు గ్రంథము అందురు. 7-10 అధ్యాయాలలో యూదా వారిని పాలించిన చెడ్డరాజైన ఆహాజు కాలములో ఇశ్రాయేలు రాజైన పెకహు సిరియా రాజైన రెజీను కలిసి యూదా పైకి దండెత్తివచ్చిరి. కాని వారిరువురు యూదాపై జయింపలేక ఓడిపోయి పాడైపోవుదురను విషయమును దేవుడు ముందుగానే 7వ అధ్యాయములో సెలవిచ్చాడు. చివరకు ఇశ్రాయేలు రాజ్యము మరియు సిరియా రాజ్యము అష్హూరు ద్వారా పాడగునని, ఇశ్రాయేలువారు అష్హూరు చెరకు

వెళ్ళుదురని యెషయాకు రెండవ వాడుగా జన్మించిన కుమారునికి పెట్టిన పేరునుబట్టి 8 అధ్యా. ప్రారంభములో దేవుడు సెలవిచ్చాడు. యెషయా రెండవ కుమారుని పేరు మహేరుషాలాల్‌హాష్‌బజ్. దాని అర్థము త్వరితముగా దోపుడగును. ఆతురముగ కొల్లపెట్టబడును.

తదుపరి అష్షూరు రాజు యూదాపైకి దండెత్తి వచ్చెను గాని యూదాపై జయమును పొందలేదని యూదావారు అష్షూరు రాజుకు భయపడక యెహోవా దేవునికే భయపడవలెనని యెహోవా కొరకు దిగులుపడవలెనని దేవుని కొరకే కనిపెట్టుకొనవలెనని 8వ అధ్యాయములో సెలవిచ్చాడు. 7వ అధ్యాయములో క్రీస్తు పుట్టుక (7,4, 9:6), 8-10 అధ్యాయములో యేసుసేవా వివరములు కలవు. 11-12 అధ్యాయాలలో క్రీస్తు రెండవ రాకడ వేయిఏండ్ల పాలన వివరములు కలవు. 9,10 అధ్యాయాలలో మెస్సియా భాగముతో పాటు, ఇశ్రాయేలు వారి నాలుగు పాపాలు వారిని అష్షూరుకు పంపి విధించిన నాలుగు శిక్షలు కలవు. అష్షూరీయులు దండమై ఇశ్రాయేలీయులను అధికముగా శిక్షించినందున దేవుడు అష్షూరుకు విధించిన శిక్షల వివరములు 10 అధ్యాయములో కలవు. 11 అధ్యా. మెస్సియా రాబోవు వేయి ఏండ్ల రాజ్య వివరాలు కలవు. 12 అధ్యాయములో వేయి ఏండ్లకాల ఆనంద స్తుతిగానము.

**II 13-23 అధ్యాయాలలో ఇశ్రాయేలీయులకు కీడు చేసిన శత్రువులైన ఇతర దేశాలపై తగిన సమయమందు దేవుడు జరిగించిన తీర్పుల వివరములు కలవు.**

III 24-35 అధ్యాయాలు శ్రమలు ఆశీర్వాదముల గ్రంథములు. ఇశ్రాయేలీయులపై అంత్యకాలమందు దేవుడు ఏడేండ్లు జరిగించు తీర్పులు తదుపరి వేయి ఏండ్ల కాలములో ఇచ్చు ఆశీర్వాద వివరములు కలవు. దీనిని మరలా 24-27 అధ్యా. శ్రమల - ఆశీర్వాదాల చిన్న గ్రంథముగాను, 28-33 అధ్యా. శ్రమల- ఆశీర్వాదాల పెద్ద గ్రంథముగాను 34-35అ. శ్రమల ఆశీర్వాదాల అతి చిన్న గ్రంథముగా విభజించగలము.

IV 36-39 అధ్యా. హిజ్కియా రాజు కాలచరిత్ర వివరములు గ్రంథ విభజనలో కలవు. క్రీ.పూ. 606, 597, 586లో మూడు విడతలుగా యూదులు బబులోను చెరకు వెళ్ళిరి.

V 40-48 అధ్యా. బబులోను చెరనుండి విమోచన (శరీర విమోచన)

VI 49-57 అధ్యా. పాపపు చెరనుండి విమోచన ( ఆత్మీయ విమోచన)

VII 58-66 అధ్యా. ఇశ్రాయేలు విమోచన- సృష్టి విమోచన (సార్వత్రిక విమోచన - క్రీస్తు నిత్యపాలన). గమనిక:- ఈ గ్రంథమందు ఇశ్రాయేలు అనుపేరు 10 గోత్రముల

ఇశ్రాయేలు ఉత్తర రాజ్యమును సూచించును కాని కొన్ని పర్యాయాలు 12 గోత్రముల వారిని కూడా సూచించును. యూదా బెన్యామీనువారు యూదారాజ్యమని దక్షిణ రాజ్యమనబడిరి. ఎఫ్రాయిాము యోసేపు అను పేరులు పది గోత్రముల ఇశ్రాయేలు వారిని సూచించును. షోమ్రోను/తిర్సా ఇశ్రాయేలు ఉత్తర దేశ రాజధానులు. హెబ్రోను, యెరూషలేము యూదా వారి దక్షిణ దేశ రాజధానులు. దమస్కు సిరియాకు రాజధాని. నీనెవె అష్షూరుకు రాజధాని. బబులోను పట్టణము బబులోను సామ్రాజ్యమునకు రాజధాని.

## యెషయా గ్రంథ విభజన

ఈ గ్రంథము పేరు హెబ్రీభాషలో Yeshayahu యెహోవా రక్షించును అని అర్థము. అధ్యాయాల విభజన: 12+11+12+4=39 అధ్యా. 9+9+9=27. 39+27=66 అధ్యాయాలు.

| | |
|---|---|
| **I 1-12 అధ్యా.** | **యూదాను గూర్చి యెరూషలేము గూర్చిన దేవోక్తి** |
| A 1-6 అధ్యా. | **యూదా ప్రజలను గూర్చిన దేవోక్తి.** |
| 1. అధ్యా. | యూదా ప్రస్తుత కాల స్థితిని గూర్చిన దేవోక్తి. |
| 2. అధ్యా. | యూదా అంత్యకాలస్థితిని గూర్చిన దేవోక్తి. |
| 3. అధ్యా. | యూదాకు కలుగబోవు ప్రస్తుత కాల ఫలితమును గూర్చిన దేవోక్తి |
| 4. అధ్యా. | యూదాకు కలుగబోవు అంత్యకాల ఫలితమును గూర్చి దేవోక్తి. |
| 5. అధ్యా. | ఇశ్రాయేలీయుల స్థితిని గూర్చిన ఉపమానము - యూదాకు కలుగబోవు శ్రమలు తీర్పులను గూర్చిన ఉపమానము. |
| 6. అధ్యా. | యెషయా పిలుపు - పంపబడుట - (యేసు పిలుపు - పంపబడుట). |
| **B 7-12 అధ్యా.** | **యూదావాడైన క్రీస్తును గూర్చిన దేవోక్తి (ఇమ్మానుయేలు గ్రంథము).** |
| 7 అధ్యా. | ఇశ్రాయేలు సిరియాలు పాడగుట. యూదా స్థిరపరచబడుటను గూర్చిన దేవోక్తి - ఇమ్మానుయేలు పుట్టుకను గూర్చిన దేవోక్తి. |
| 8 అధ్యా. | ఇశ్రాయేలు - సిరియాల పతనము - ఇమ్మానుయేలు దేశపు ప్రస్తుత కాలస్థితిని గూర్చిన దేవోక్తి |
| 9. అధ్యా. | మెస్సీయా వివరములు - ఇశ్రాయేలు వారి 4 పాపాలు, శిక్షలు. |
| 10. అధ్యా. | అష్షూరు రాజ్య పతనము |
| 11. అధ్యా. | ఇమ్మానుయేలు గుణములు - రాబోవు రాజ్యం - వెయ్యియేండ్ల రాజ్య కాలస్థితిని గూర్చిన దేవోక్తి. |

12\. అధ్యా. యూదాకు విమోచన బట్టి ఆనంద స్తుతి కీర్తన.

**II 13-23** అధ్యా. పొరుగు శత్రుదేశాలపై తీర్పును గూర్చిన దేవోక్తి.

1\. 13-14 అధ్యా. బబులోను అష్షూరు, ఫిలిష్తీయా గూర్చిన దేవోక్తి.

2\. **15-16** అధ్యా. మోయాబును గూర్చిన దేవోక్తి.

3\. 17 అధ్యా. దమస్కును గూర్చిన దేవోక్తి.

4\. 18 అధ్యా. కూషును గూర్చిన (ఇతియోపియా) దేవోక్తి.

5\. 19-20 అధ్యా. ఐగుప్తును గూర్చిన దేవోక్తి.

6\. 21 అధ్యా. అడవి దేశము - బబులోనును గూర్చిన దేవోక్తి (21:1-10).

7\. దూమాను గూర్చిన దేవోక్తి (21:11-12వ)

8\. అరేబియాను గూర్చిన దేవోక్తి (21:13-17వ)

9\. 22 అధ్యా. యెహోషాపాతు లోయ (యూదా)ను గూర్చిన దేవోక్తి.

10\. 23 అధ్యా. తూరును గూర్చిన దేవోక్తి

**III 24-35** అధ్యా. అంత్యకాలములో ఏడేండ్ల శ్రమలు- వెయ్యియేండ్ల ఆశీర్వాదమును గూర్చిన దేవోక్తి.

A 24-27 అధ్యా. శ్రమలు - ఆశీర్వాదాల చిన్న గ్రంథము

24 అధ్యా. లోకమంతటికి తీర్పు. ఇశ్రాయేలీయులు శ్రమల కాలపుస్థితి

25 అధ్యా. ఆశ్రయుడై రక్షించు దేవుని హెచ్చించి స్తుతించు కీర్తన.

26 అధ్యా. విమోచించబడి దేవుని స్తుతించిన కీర్తన.

27 అధ్యా. సమకూర్చి కాపాడే దేవుని స్తుతించిన కీర్తన.

B 28-33 అధ్యా. శ్రమలు -ఆశీర్వాదాల పెద్ద గ్రంథం

28\. అధ్యా. ఇశ్రాయేలు పాపమును బట్టి శ్రమలు

29\. అధ్యా. యెరూషలేము పట్టణమునకు యూదా వారికి పాపమునుబట్టి శ్రమ - తదుపరి రక్షణ

30\. అధ్యా. యూదా పాపమునుబట్టి శ్రమ - సమకూర్పు.

31\. అధ్యా. యూదా వారి పాపమునుబట్టి శ్రమ - దేవుని వైపు తిరిగి కాపాడబడుట

32\. అధ్యా. యూదా వారి పాపానికి శ్రమ - తదుపరి ఆశీర్వాదం.

33\. అధ్యా. యూదా ఇశ్రాయేలు వారి విమోచన - శత్రువుకు శిక్ష.

C 34-35 అధ్యా. శ్రమలు - ఆశీర్వాదాల అతిచిన్న గ్రంథము.

34. అధ్యా. లోకమంతటికి శ్రమ.

35. అధ్యా. వెయ్యియేండ్ల కాల కనాను దేశ ఆశీర్వాదము.

IV **36-39. అధ్యా. హిజ్కియా రాజు కాల చరిత్ర**

A 36-37 అధ్యా. వెనుకటి అష్షూరు చెరను చూపుట.

36 అధ్యా. హిజ్కియా రాజు యొక్క రాజ్య అవసరత.

37 అధ్యా. హిజ్కియా రాజ్య అవసరతలకై ప్రార్థన - జవాబు

B 38-39 అధ్యా. ముందున్న బబులోను చెరను చూపుట

38 అధ్యా. హిజ్కియా వ్యక్తిగత అవసరతలు ఆరోగ్యం కొరకైన ప్రార్థన - జవాబు -స్తుతి.

39 అధ్యా. గర్వించి ప్రార్థించక బబులోనీయులతో సంధి కుదుర్చుకొన్న హిజ్కియాకు రానున్న శిక్ష

**V 40-48 అధ్యా. బబులోను చెర నుండి విమోచన (శరీర విమోచన)**

**VI 49-57 అధ్యా. పాపపు శిక్ష నుండి రక్షణ. (ఆత్మీయ విమోచన)**

**VII 58-66 అధ్యా. ఇశ్రాయేలీయుల పాపమునకు తీర్పు - సమకూర్పు (సార్వత్రిక విమోచన)**
**వీటి వివరములు 40వ అధ్యాయ ప్రారంభములో కలవు.**

ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడు అని ఈ గ్రంథమందు 25 పర్యాయములు కలదు.

1) 1:4 2) 5:19 3) 5:24 4) 10:20 5) 12:6 6) 17:8 7) 29:19
8) 49:7 9) 30:11 10) 30:12 11) 30:15 12) 31:1 13) 37:23
14) 41:14 15) 41:16 16) 41:18 17) 43:3 18) 43:14 19) 43:15
20) 45:11 21) 47:4 22) 48:17 23) 49:7 24) 54:5 25) 60:9
26) 60:14.

## 1వ. అధ్యాయము

**యూదా, యెరూషలేము అప్పటి కాల స్థితిని గూర్చిన దేవోక్తి**

**(15+16=31వ). (3+3+3+3+4+4+4+4=31వ)**

**1-15వ. పాపము 16-31వ. పశ్చాత్తాపము.**

**1-15వ పాపము-వివరము+16-31వ. (పశ్చాత్తాపవివరము(16-23వ)+ఫలితము (24-31వ))**

**1-3వ కృతజ్ఞత లేనివారు:-** దేవుడు యూదావారిని పెంచి గొప్పవారినిగా చేయగా వారు దేవుని మీద తిరుగబడిరి. పవిత్ర జంతువైన ఎద్దు తన కామందు నెరుగును, అపవిత్రమైన జంతువు గాడిద సొంతవాని దొడ్డి తెలిసికొనును. కాని పవిత్రులైన ఇశ్రాయేలు ప్రజలు దేవునికి చెందినవారైనను పవిత్ర జంతువైన ఎద్దువలెనైనను, అపవిత్రమైన జంతువు గాడిదవలెనైనను కాక తెలివిలేనివారై యోచింపలేని వారుగా నున్నారు. యూదా అనగా స్తుతి. స్తుతించువారు అనగా రక్షించబడిన మనకు వీరు సాదృశ్యముగా నున్నారు. ఇట్టిది విశ్వాసుల కృతజ్ఞతలేని స్థితిని చూపుచున్నది.

**4-6వ. పూర్తిగా చెడిపోయినవారు:-** పాపము. దోషము, దుష్టత్వము, కలిగి చెరుపు చేయు పిల్లలుగా నున్నారు. వారు పరిశుద్ధ దేవుని విసర్జించి, దూషించి, విడిచి, మార్గము తొలగిపోయి యున్నారు. నిత్యము తిరుగుబాటు చేయుచు, దేవునిచే కొట్టబడుచు, నడినెత్తిని వ్యాధి కలిగి గుండె బలహీనమై, అరికాలు మొదలుకొని తలవరకు స్వస్థత కొంచెమైనను లేక గాయములు దెబ్బలు, పచ్చిపుండ్లు కలవారై యున్నారు. ఇట్టిది విశ్వాసుల పూర్తిగా చెడిపోయిన స్థితిని చూచుచున్నది.

**7-9వ. పాడై చెడిపోయిన దేశము. పాడైన పట్టణము:-** పాపములో నిలిచినవారు దేశము పాడై, పట్టణము కాల్చబడి, తోటలు పాడైన, ప్రజలవలె ఉందురని విడువబడిన సొదొమ గొమొఱ్ఱా ప్రజలవలె ఉందురని చెప్పుచున్నాడు.

10-12వ. ప్రజలు అధిపతులు - దేవునికి అయిష్టమైన బలులు:- న్యాయాధిపతులు, జనులు, దేవుని ఉపదేశమునకు చెవి యొగ్గుట లేదు. కాని విస్తారమైన దహనబలులుగా పొట్టేళ్లను బాగుగా మేపిన దూడల క్రొవ్వును, కోడెల గొఱ్ఱెపిల్లలు మేకపోతుల రక్తమును అర్పించుచున్నారు. జీవితము సరిగా లేక బల్యర్పణ చేయుట దేవునికి ఇష్టము లేదని నేర్చుకొందము. దేవుని సన్నిధికి రావద్దని ఆయన ఆవరణమైనను త్రొక్కకూడదని దేవుడు చెప్పుచున్నాడు.

**13-15వ. అసహ్యమైన అర్పణలు- కారణమైన పాపము (కీర్త 50:13-14):-** చేతులు రక్తముతో అనగా పాపముతో నిండి నైవేద్యము అనగా స్తుతి, చేయుట దేవునికి అసహ్యమని చెప్పుచున్నాడు. కీర్త 141:2 ప్రకారము ధూపము అనగా ప్రార్థన తేకుడి అంటున్నాడు. సమాజ కూట ప్రకటనము నియామకకాల కూటములును దేవునికి హేయమని, బాధకరమని వాటితో విసికియున్నానని చెప్పుచున్నాడు. చేతులు రక్తముతో అనగా పాపముతో నిండియున్నందున, చేతులు చాపి ప్రార్థన చేసినను చూడనని, కన్నులు కప్పుకొందునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**16-19వ. పశ్చాత్తాపమునకై పిలుపు-సమ్మతించి మాట వినినయెడల భూమి యొక్క మంచి పదార్థములను అనుభవించుట:-** మన పాపములను యేసు రక్తములో కడుగుకొని శుద్ధి చేసికొనాలి. దుష్క్రియలు కనబడకుండ వాటిని తొలగించుకొని, కీడుచేయుట మాని, మేలు చేయ నేర్చుకొనాలి. న్యాయము జాగ్రత్తగా విచారించి, హింసించబడు వానిని విడిపించాలి.

రక్తమువలె ఎఱ్ఱనివైన పాపములను క్రీస్తు రక్తములో కడుగుకొని హిమమువలె గొఱ్ఱెబొచ్చువలె తెల్లనిగా చేసికొనాలి. ఈ విషయమై సమ్మతించి దేవుని మాట వినిన యెడల భూమి యొక్క మంచి పదార్థములను అనుభవింతురు అని సెలవిచ్చుచున్నాడు

**20-23వ. పాప వివరము - సమ్మతింపక తిరుగుబడిన ఖడ్గము పాలగుట:-** విశ్వాసులు నమ్మకమైన నగరముగా, న్యాయముతో నిండి, నీతి నివసించిన నగరముగా నుండాలి. కాని విశ్వాసులు పాపముతో చెడిపోవుట నరహంతకులుగా నివసించుటయే -నమ్మకమైన నగరము వేశ్య అగుట విగ్రహారాధనతో నిండి యుండుటయే. వెండి మష్టగుట అనగా విశ్వాసి యొక్క విమోచించబడిన స్థితి పాపము కనబడుటయే. ద్రాక్షారసము నీళ్లతో కలిసి చెడిపోవుట అనగా ఆరాధన బలహీనమగుటకు గుర్తు. అధికారులు ద్రోహులు దొంగలై అందరు లంచము, బహుమానముల కొరకు కనిపెట్టుదురు. తండ్రిలేని వారి పక్షమున న్యాయము తీర్చరు, విధవ రాండ్ర వ్యాజ్యెము విచారించరు. ఇదంతయు పరిశుద్ధత లోపించిన జీవితమునకు గుర్తు.

**24-27వ. పశ్చాత్తాపపడిన విమోచన:-** క్షారము వేసి మష్టును నిర్మలము చేయుట, కలిసిన తగరమంతయు తీసివేయుట ప్రభువు మనలను పవిత్రపరచుటయే. ప్రభువు పశ్చాత్తాపపబడిన వారికి మొదటి స్థితిని అనుగ్రహించి నీతిగల పట్టణమనియు నమ్మకమైన నగరమనియు పేరు పెట్టును, కనుక ప్రభువు యొద్దకు తిరిగి వచ్చిన వారికి విమోచనము కలుగును.

28-31వ. పాపమందు నిలిచిన లయము:- యెహోవాను విసర్జించువారు అతిక్రమము చేయువారును పాపములో నిలిచియుండు వారు నిశ్శేషముగా నాశనమగుదురు. ఎంతటి బలవంతులైనను నారపీచువలె నుందురు. వారి పని అనగా వారి క్రియలు బొత్తిగా కాలిపోయి బహుమానము లేక నష్టమును పొందుదురు. 1 కొరి 3:15 ప్రకారము ఒకని పని కాల్చివేయబడిన యెడల వానికి నష్టము కలుగును; అతడు తనమట్టుకు రక్షింపబడును గాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్టు రక్షింపబడును.

# 2వ. అధ్యాయము (4+6+6+6=22వ)

**అంశము:- యూదా, యెరూషలేము యొక్క అంత్యకాల స్థితిని గూర్చిన దేవోక్తి:-**

**1-4వ. అంత్యదినములో యెరూషలేము ఔన్నత్యము (క్రీస్తు వేయేండ్ల పాలన):-**

1-2వ. అంత్యదినములలో అను పదమునుబట్టి ఈ భాగము వేయిఏండ్ల పాలన కాలమును సూచించును. యెరూషలేము అన్ని కొండలకంటే ఎత్తుగా ఎత్తబడి ప్రపంచ దేశములకు కేంద్రమగునని భావము. ప్రవాహము వచ్చినట్లు అన్యజనులందరు దానిలోనికి వచ్చుట సమస్త ప్రజలకు, దేశములకు కేంద్రమైన యెరూషలేమునకు వచ్చుటను సూచించును.

3-4వ. ఆ కాలములో యెరూషలేములోనున్న దేవాలయము నుండి దేవుని వాక్కులు ప్రకటింపబడును. జనులందరు దేవుని మందిరమునకు వచ్చెదరు. దేవుని మార్గములో దేవుని త్రోవలో నడుతురు (యెష 56:6-7). యేసుక్రీస్తు జరిగించు నీతి న్యాయ పాలనను బట్టి ఈటెలను అనగా ఆయుధములను వాడువారు ఇకను ఉండరు. అణుబాంబులు, హైడ్రోజను బాంబులు వాడరు. కత్తులన్నిటిని అనగా ఆయుధములన్నిటిని వ్యవసాయమునకు వాడు నాగటి నక్కులుగా చేయుదురు. అణుబాంబుల శక్తిని, హైడ్రోజను బాంబుల శక్తిని ప్రజా ప్రయోగమునకు వాడుదురు. కనుక ప్రజలు క్షేమకరమైన జీవితము జీవించుదురు. ఆ దినములలో ప్రజల ఆయుష్షు పెరుగునని మృగములు సాధుజంతువులుగా ఉండునని, పాములు హాని చేయవని యెష 65:20-25లో చదువగలము.

**5-10వ. యూదావారి పాపములు - శిక్ష:-**

5-6వ. యూదావారు తూర్పు దేశపు జనులైన అష్షూరు, బబులోను వారి సాంప్రదాయములతో నిండి ఉన్నారు. 1. లేవి 19:25 ప్రకారము మంత్ర ప్రయోగములు చేయకూడదు. కాని ఫిలిష్తీయులవలె మంత్రప్రయోగము చేయుచున్నారు. 2. 2కొరింథీ 6:14 ప్రకారము అన్యులతో జోడుగా ఉండకూడదు. కాని అన్యులతో సహవాసము చేస్తున్నారు. ఇందునుబట్టి దేవుడు వారిని విసర్జించియున్నాడు. 3. 7వ. కీర్తన 73:12 ప్రకారము నిశ్చింత గలవారై ధనవృద్ధి చేసుకొనువారు భక్తిహీనులు అలాగున యూదావారి ఆస్తి సంపాద్యమునకు మితిలేదు. 4. ద్వితీ 17:16 ప్రకారము గుర్రములు రథముల కొరకు ఐగుప్తుకు వెళ్ళకూడదు. కాని వాటిని అపరిమితముగా సంపాదించిరి. యెష 31:1. ప్రకారము అట్టివారికి శ్రమ, శిక్ష అన్నాడు. 5. 8వ. ద్వితీయ 5:8 ప్రకారము విగ్రహములను చేసికొనకూడదు. వాటికి సాగిలపడకూడదు. కాని యూదావారి దేశము విగ్రహములతో నిండినది. 6. విగ్రహములకు నమస్కరించుచున్నారు.

9-10వ. ఈ పాపములను బట్టి... యూదావారిని క్షమింపవద్దు శిక్షించుమని ప్రవక్త

ప్రార్థిస్తున్నాడు. శిక్షావివరములు యెష. 2:11-16లోను ప్రకటన 6:17లోను చెప్పబడినవి.

**11-16వ. విమర్శ దినపు వివరములు- ఏడేండ్ల శ్రమల కాల వివరములు:-**

11-12వ. విమర్శ దినము దేవునిచే నియమించబడినది. యూదులకు 7 ఏండ్లలో కలుగు శ్రమల కాలమే ఈ విమర్శదినము. శ్రమలలో నరుల గర్వము, అహంకారము అణగద్రొక్కబడును. దేవుడైన యెహోవా మాత్రమే ఘనతనొందును.

13-16వ. వృక్షములకు దేవదారు వృక్షము రాజు. కనుక యూదావారి రాజులు విమర్శింపబడుదురు. దాని 4:22 ప్రకారము వృక్షములు మనుష్యులను సూచించును. దాని 2:35,44 ప్రకారము ఉన్నత పర్వతములు ప్రభుత్వములను సూచించును. బురుజులు గల కోటలు సైన్యములను సూచించును. కనుక యూదా రాజులకు, ప్రజలకు, ప్రభుత్వములకు సైన్యములకు, వ్యాపారస్తులకు ఏడేండ్ల శ్రమల కాలమందు విమర్శ జరిగి శిక్షగా శ్రమలు పొందుదురు.

**17-22వ. విమర్శదినము - విగ్రహాల నాశన దినము:-**

శ్రమల కాలమందు ప్రక 6:17, 8:15, 11:13, 16:8 ప్రకారము మెరుపులు, ఉరుములు, భూకంపములు, రకరకాలశ్రమలు జరిగినప్పుడు ఇశ్రాయేలు ప్రజలు భయపడి కొండల గుహలలోను, బండ సందులలోను దాగుకొందురు. వారి విగ్రహములన్నింటిని పారవేయుదురు. ప్రవచనములకు అంత్యకాల నెరవేర్పుకాక సమీప నెరవేర్పు కూడా ఉండును. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా యూదులు 70 ఏండ్లు బబులోను చెర కాలమందు శ్రమలు పడి విడుదల పొందిన తరువాత వారి మధ్య నుండి విగ్రహారాదన పూర్తిగా తొలగిపోయినది.

## 3వ. అధ్యాయము (11+4+11=26వ)

అంశము:- యూదాకు యెషయా జీవించిననాటి కాలస్థితినిబట్టి కలుగబోవు ఫలితమునుగూర్చిన దేవోక్తి

**1-11వ. యూదా ప్రజలలో నుండి సమస్తము తీసివేయబడుట - యూదా ప్రజలు పాప ఫలితముగా నాశనమగుట:-**

1-3వ. యూదావారి పాపమును బట్టి పోషణములను, పోషణాధారములను అనగా ఆహారమును, నీటిని దేవుడు తీసివేయబోవుచున్నాడు. 2 సమూ. 21:1లో కరువుశిక్షగా

కలుగును అని ఉన్నది (యిర్మీ 14:1-12, యెహె 14:1 కూడా చూడండి). యూదా అధిపతులను మంత్రులను, పెద్దలను తీసివేయుదునని దేవుడు చెప్పుచున్నాడు. యూదా నాశనమాయెను అని 8వ.లో చెప్పుచున్నాడు. అలాగే క్రీ.పూ. 586లో బబులోను రాజు యెరూషలేము దేవాలయమును పడగొట్టి పట్టణమును నాశనము చేసెను. అలాగే యూదా రాజరికము బబులోను చెర తరువాత తీసివేయబడినది. యూదులు అన్యరాజులచే పాలింపబడిరి. కనుక యూదానుండి సమస్తమును తీసివేయబడును అను ప్రవచనము నెరవేరినట్లు గమనించగలము. అలాగే విశ్వాసులు తమ జీవితములలో పాపానికి తావిచ్చిన సమస్త, ఆశీర్వాదములు తీసివేయబడునని నేర్చుకొనవలెను.

4-7వ. బాలకులను అధిపతులుగా నియమించుట, వారు బాల చేష్టలు చేయుట. ఒకడిట్లు, మరొకడట్లు అనుట పెద్దవానిపై బాలుడు గర్వించుట నెరవేరినవి. 2దిన 33:1లో మనష్షే 12 ఏండ్లకే రాజుగా చేయబడి యెహోవా దృష్టికి బహు చెడు నడత నడిచెను. 33:9లో జనములను మోసపుచ్చెనని ఉన్నది. మనష్షే రాజు ప్రవక్తయైన యెషయాను రంపముచే కోయించి చంపెనని చరిత్ర తెలుపుచున్నది. 2 దిన 34:1లో యోషీయా 8 ఏండ్లకే రాజయ్యాడు. యెహోవా దృష్టికి చెడునడత నడచి ప్రజలకు బాధ కలిగించాడు. బబులోను రాజు క్రీ.పూ. 606, 597, 586లో దండెత్తి యూదాపై రాగా ఆహారలేమి, వస్త్రలేమి ప్రజలకు కలిగెను. బబులోనులో 70 ఏండ్ల చెరలో ఎంతో లేమిని అనుభవించాలి.

8-11వ. మహిమ గల దేవునికి యూదా వారు తిరుగుబాటు చేయుటయే గాక వారి మాటలు, క్రియలు ప్రతికూలముగా ఉన్నవి. యూదావారిలో నీతిగా జీవించువారికి వారి క్రియలను బట్టి మేలు కలుగునని దుష్టులుగా జీవించిన వారికి వారి క్రియలను బట్టి శ్రమ కలుగునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. అలాగే 2కొరిం. 5:10 క్రియలను బట్టి మనలో ప్రతివాడు ఫలము పొందుటకు క్రీస్తు న్యాయపీఠము దగ్గర నిలువవలెననియు నేర్చుకొనుచున్నాము.

**12-15వ. యూదా నాయకుల పాపఫలితముగా నాయకులలోనుండి సమస్తము తీసివేయబడుట:-**

12వ. ఏలికలు, నాయకులు సరియైన పాలన చేయలేదు. 2దిన. 33 అధ్యాయములో చెప్పబడినట్లు మనష్షే 12 ఏండ్ల బాలుడుగానే రాజై అతిచెడ్డవాడై యెషయాను సుమారు క్రీ.పూ. 700 సం.లో రంపము చేత కోయించాడు. అంతకుముందు అహాజు

క్రీ.పూ. 728-714లో చెడ్డవాడై పరిపాలించాడు. వీరు ప్రజలను విగ్రహారాధనయను తప్పు త్రోవలో నడిపించిరి. 2 దిన 23 అధ్యాయంలో చెడ్డరాణి అయిన అతల్యా చెడ్డ పాలన కలదు. నాయకులైన బాలురు, ఏలికలు, స్త్రీలు, ప్రజలను బోధించి తప్పుదారి పట్టించిరి.

13-15వ. పై కారణములనుబట్టి దేవుడు ఏలికలగు రాజులను శిక్షించబోదునని సెలవిచ్చుచున్నాడు. అదియే 70 ఏండ్ల బబులోను శిక్ష. ద్రాక్షతోట ఇశ్రాయేలు జనాంగమే. ఇశ్రాయేలీయులు దేవునికి చెందినవారు. దేవుడు తనకు బదులుగా ఏలికలను, రాజులను నియమించాడు. అది గుర్తించని రాజులు దేవుని ప్రజలను బాధించి తప్పుదారి పట్టించారు. యెష 1:23లో ఉన్నట్లు దొంగలై, లంచములు పుచ్చుకొనుచు ప్రజలను నలుగగొట్టిరి.

**16-26వ. సీయోను కుమార్తెల యొక్క పాపము-ఫలము:-**

16వ. సీయోను కుమార్తెల పాపములు 1. గర్విష్టురాండ్రు. ఎ. 1రాజులు 21:1-16 యెజెబెలు గర్విష్టురాలై నాబోతును అన్యాయముగా చంపించి, అతని ద్రాక్ష తోటను వశపరచుకొనెను. బి. 1రాజు 15:13 రాజైన ఆసా అవ్వయైన మయకా అసహ్యమైన విగ్రహము చేయించినదని వ్రాయబడినది. ఆసా అవ్వ అనగా రాజైన రెహబాము భార్య. రెహబాము రాజైన సొలొమోను కుమారుడు. సొలొమోనును దేవుడు ఎంతో ఆశీర్వదించాడు. కాని సొలొమోను కుమారుడగు రెహబాము భార్యయైన మయకా అసహ్యమైన విగ్రహాలు చేయించి పూజింపబడునట్లు చేయుట ఆమె గర్వమును తెలుపుచున్నది. సి. 2 రాజులు 11 అధ్యాయములో అతల్యా తనను తానే రాణిగా చేసుకొని పాలించినది. బహు గర్వముగా ప్రవర్తించినది. మెడలు చాచుట, ఓర చూపులు చూచుట, కులుకుచు నడుచుట, కాళ్ళ గజ్జెలు మ్రోగించుట స్త్రీలకు తగినవి కావు.

17వ. పైన చెప్పబడిన వాటికి శిక్షగా దేవుడు అట్టి స్త్రీల నడినెత్తిని బోడి చేయుదునని వారి మానమును తీయుదునని చెప్పుచున్నాడు.

18-23వ. సీయోను కుమార్తెలనుండి 21 అలంకార వస్తువులను తీసివేతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఈ అలంకార వస్తువులు తలనుండి కాళ్ళవరకు వారు ధరించినవి. 1తిమో. 2:9, 1 పేతు 3:3-5 ప్రకారము వెలుపటి అలంకారము స్త్రీలకు నిజమైన అలంకారము కాదు. హృదయ సంబంధమైన అంతరంగ స్వభావమే నిజమైన అక్షయ

అలంకారము. అందుకే వెలుపటి అలంకారమును దేవుడు తీసివేతునని సెలవిచ్చుచున్నాడు.

24వ. వారు ప్రేమించిన 21 వస్తువులను తీసివేయుటయే కాక 5 రకములైన అవమానపుస్థితిని వారికిచ్చుచున్నాడు.

1. పరిమళ ద్రవ్యమునకు ప్రతిగ మురుగుడు. 2. నడికట్టుకు ప్రతిగ త్రాడు 3. అల్లిన జడకు ప్రతిగ బోడితల 4. ప్రశస్త వస్త్రమునకు ప్రతిగ గోనెపట్ట 5. అందమునకు ప్రతిగ వాత ఉంటాయని చెప్పుచున్నాడు.

బానిసల తలలను బోడి చేయుదురు. పని సరిగా చేయని వారికి వాతలు పెట్టుదురు. కనుక యూదా స్త్రీలు సహితము బానిసలగుదురని దీని భావము. ఈ 5 రకముల అవమానము వారి ఆత్మీయ స్థితిని చూపించుచున్నవి.

25-26వ.+4:1వ. బలాఢ్యులు మిగిలిన పురుషులలో అనేకులు కూలుట చేత 7మంది స్త్రీలకైనను ఒక పురుషుడు దొరకని స్థితి ఏర్పడును. స్త్రీలకు భద్రత లేక ఏదో ఒక పురుషుని పేరైనను కలిగియుండిన క్షేమమనుకొందురు. అట్టి స్థితి కొరకై ప్రయాసపడుదురు. సమాజములో స్త్రీలు ఒంటరిగా ఉండుట ఏమాత్రము క్షేమము కాదు కనుక యూదా స్త్రీలు భద్రత లేక ఉందురని దీని భావము.

## 4వ. అధ్యాయము (2+2+2=6వ)

**అంశము:- యూదాకు అంత్యకాలమందు కలుగు ఫలితమును గూర్చి దేవోక్తి**

**1-2వ. సీయోను కడిగివేయబడుట ప్రభువు రాకడ ద్వారా యూదావారికి ఆశీర్వాదము:-**

1వ. మూడవ అధ్యాయం చివరిలో ధ్యానించితిమి.

2వ. యెహోవా చిగురు చింతచిగురు చింతచెట్టు గుణము కలిగి ఉండును. చింతచిగురు పెరిగినప్పుడు చింతకొమ్మ చింతచెట్టు అని పిలువబడును. కనుక యెహోవా చిగురు యెహోవాయే కాని వేరు కాదు. చిగురు అను పేరు యేసుకు బైబిల్‌లో 11 పర్యాయములు కలదు. ఈ చిగురు ప్రభువైన యేసే. రాజైన చిగురుగాను, సేవకుడైన చిగురుగాను, మానవుడైన చిగురుగాను, దేవుడైన చిగురుగాను ఆయనను చూడగలము. నూతన నిబంధనలో ఈ విషయములను వరుసగా మత్తయి, మార్కు లూకా, యోహాను సువార్తలలో చూడగలము.

యేసుక్రీస్తే చిగురు అను బైబిలు నందున్న 11 ప్రవచనములు ప్రక 22:16లో యేసు అను నేను దావీదు వేరు చిగురును, సంతానమును అనగా అన్యజనుల నేలుటకు పుట్టినవాడను అని అన్నాడు.

| వ.సం. | ప్రవచనము | వివరము | సువార్త వివరము |
|---|---|---|---|
| 1. | దావీదుకు నీతి చిగురు, వేరుచిగురు (యిర్మీ 23:5, 33:15) (ప్రక 5:5, 22:16) | దావీదు రాజు గనుక దావీదుకు చిగురు అనగా సంతానమగు క్రీస్తు రాజే, మరియు నీతి చిగురు కనుక నీతిగల న్యాయాధిపతియే | **మత్తయి సువార్తలో** క్రీస్తు రాజరికము ఆధిపత్యము, కలవు. |
| 2. | చిగురు అను సేవకుడు ఆలయము కట్టువాడు (జెక 3:8, 6:12) | ఆలయములో యాజకత్వము చేయు క్రీస్తు సేవకుడే | **మార్కు సువార్తలో** క్రీస్తు సేవకత్వము, యాజకత్వము |
| 3. | యూదా యెష్షయిల మొద్దు చిగురు, వేరు చిగురు (ప్రక 5:5) (యెష6:13, 11:1,10) (రోమా 15:12) | యెష్షయి యూదా గోత్రపు మానవుడు. తన పేరు, మ్రాను, చిగురును క్రీస్తు మానవుడే. (క్రీస్తు అబ్రాహాము, దావీదుల కుమారుడే మత్త 1:1) | **లూకా సువార్తలో** క్రీస్తు మానవత్వము కలదు. |
| 4. | యెహోవా చిగురు (యెష 4:2) | యెహోవా దేవుడు కనుక దేవుని చిగురైన క్రీస్తు దేవుడే | **యోహాను సువార్తలో** క్రీస్తు దైవత్వము కలదు. |

**3-4వ. పరిశుద్ధుడని పిలువబడుట, (3వ) శుద్ధిపరచుట (4వ) పరిశుద్ధులుగా చేయుట:-**

భూమి పంట అనగా 53:1వ ప్రకారము ఎండిన భూమిలో మొలిచిన మొక్క క్రీస్తు యేసే. ఆయన పంట అనగా ఆయన సిలువ వేయబడుట ద్వారా కలిగిన పాప

క్షమాపణ/రక్షణ అను పంట అన్యులు యూదులు అందరికి అతిశయాస్పదముగను, అలంకారముగాను ఉండును. ప్రత్యేకముగా సీయోనులో శేషించినవారు అనగా ఇశ్రాయేలీయుల పాపములు కడుగబడి పరిశుద్ధులుగా తీర్చబడుదురు. యెరూషలేము నివాసులు క్రీస్తును సిలువవేసి ఆ రక్త అపరాధము చేత వారు ప్రపంచమంతటికి చెదరగొట్టబడిరి. ఆ అపరాధము నుండి ఇప్పుడు కడుగబడుదురు.

**5-6వ ప్రకారము కలుగచేయుట- పర్ణశాలగా నుండుట:-**

యేసుక్రీస్తు ఇశ్రాయేలీయుల మధ్య ప్రకాశించి ఐగుప్తు నుండి బయలుదేరివచ్చినప్పుడు పగలు మేఘ స్తంభముగా రాత్రి అగ్ని స్తంభముగా నుండి కాపాడినట్లు (నిర్గ 13:21) వేయి ఏండ్ల పాలనలో కాపాడును. పగలు ఎండనుండి, గాలివాన నుండి కాపాడుచు ఒక పర్ణశాలను ఇశ్రాయేలుకు ఏర్పాటు చేయును.

## 5వ. అధ్యాయము (7+3+7+2+1+1+4+5=30వ)

**అంశము:- ఇశ్రాయేలును గూర్చిన ఉపమానము యూదా స్థితినిబట్టి కలుగబోవు శ్రమల తీర్పు (7-30వ)**

**1-7వ. ద్రాక్షా తోటయైన ఇశ్రాయేలు వనమైన యూదాను గూర్చిన ఉపమానము:-**

1-2వ. ఇశ్రాయేలుకు ఏమి చేసాడు?

3-4వ. ఏమి కావలెనని కనిపెట్టాడు?

5-6వ. ఏమి చేయుదునని అంటున్నాడు?

7వ వనమైన యూదా.

**1**-2వ. ఇష్టుడైన ప్రియుడగు ప్రభువు అతని ద్రాక్షా తోటయైన ఇశ్రాయేలును గూర్చిన దుఃఖ పాట. ప్రభువైన యేసు యూదులను గూర్చి ఇదే రీతిగా క్రొత్త నిబంధనలో యోహాను 15 అధ్యా.లో ఫలించాలని చెప్పాడు. ఇశ్రాయేలుకు ఏమి చేసాడు?

1) కొండమీద భూమిని ఎన్నుకొన్నాడు. 2) బాగుగా త్రవ్వాడు (దున్నాడు). 3) రాళ్ళను ఏరి పారవేసాడు. 4) శ్రేష్ఠమైన ద్రాక్షాతీగలను నాటాడు. 5) బురుజు వేయించాడు. (ఫలములను, తోటను దొంగలు, పశువులు పాడుచేయకుండ కావలివాడు కాపుకాయుటకు). 6) ద్రాక్షా తొట్టి తొలిపించాడు - ఫలములు రాగా రసమును తయారు చేయుటకు

3-4వ. 5-6వ ఫలముల కొరకై ప్రభువు ఎదురుచూచాడు కాని మంచి ఫలములకు బదులు కారు ద్రాక్షలు కాచినవి. కనుక కంచెను కొట్టివేసి గోడను పడగొట్టి మేఘము

వర్థిల్లపకుండచేసి, తోటను పాడుచేయుదునన్నాడు. ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి తెచ్చి శ్రేష్ఠమైన ఇశ్రాయేలు దేశములో నాటి, ధర్మశాస్త్రమిచ్చి యాజకులైన అహరోను అతని కుమారుల ద్వారా బలులు అర్పించు విధమును తెలియపరచి వాటి ద్వారా దేవునికి ఇంపైన సువాసననిచ్చు ఆరాధన, స్తుతి, సేవ అను ఫలముల కొరకై దేవుడు ఎదురుచూచాడు. కానివారు విగ్రహములను చేసికొని వాటికి బలులర్పించి నిజదేవుని తృణీకరించిరి. కనుక దేవుడు పది గోత్రముల ఇశ్రాయేలు వారిని అష్షూరుకు, యూదావారిని బబులోను చెరకు పంపాడు. క్రొత్త నిబంధనలో మత్త 21:33, మార్కు 12:1, లూకా 20:9లో ద్రాక్షాతోటను గూర్చిన ఉపమానములో ఫలములకొరకు యజమాని పంపిన తన కుమారుని కాపులు చంపిరని చెప్పాడు. యూదా జనాంగము నిజదేవుడైన యేసును ఆరాధించక క్రీ.శ. 30లో చంపి ఆయన రక్త అపరాధ దోషముచే ప్రపంచమంతటికి చెదరగొట్టబడిరి.

నూతన నిబంధన కాలమందలి విశ్వాసులమైన మనలను దేవుడు అనేక రీతులుగా హెచ్చించి, ఆశీర్వదించి గలతీ 5:22లో చెప్పబడిన ఆత్మ ఫలములు, ఎఫెసీ 5:9లో చెప్పబడిన వెలుగుఫలములు, ఫిలిప్పీ 1:11లో చెప్పబడిన నీతిఫలము, కొలొస్స. 1:6లో చెప్పబడిన సువార్త ఫలము, హెబ్రీ 13:15లో చెప్పబడిన జిహ్వా ఫలములకొరకై ఎదురుచూచుచున్నాడు. ఫలించుచున్నామా? అని పరీక్షించుకొందము.

8-25వ నీతి న్యాయములు లేక జీవించు ఇశ్రాయేలు వారికి కలుగు ఆరు శ్రమలను గూర్చి 8-25వచనములలో చెప్పుచున్నాడు. 1) 8-10వ. 2) 11-17వ. 3) 18-19వ. 4) 20వ. 5) 21వ 6) 22-25వ

**8-10వ మొదటి శ్రమ:-** లేవీ 27:24 ప్రకారము ఎవడైనను తన భూమిని అమ్మిన యెడల కొనినవాడు 50వ సంవత్సరమున సునాద సంవత్సరమున ఆ భూమిని సొంతదారునికి ఇవ్వాలి. కాని ఆలాగు చేయక భూమికి భూమిని, ఇంటికి ఇంటిని కలుపుకొనుచు విలాసవంతముగా జీవించుచున్న యూదా వారికి వారి ఇండ్లు నివాసులు లేక పాడైపోవునని, ద్రాక్షాతోటలు తక్కువ ఫలమిచ్చుట అను శ్రమ కలుగునని చెప్పుచున్నాడు.

**11-17వ రెండవ శ్రమ:-** శరీర సుఖసంతోషములు కోరుకొనువారికి శ్రమ అని చెప్పుచున్నాడు. కీర్తన 108:2 ప్రకారము ప్రతి ఉదయమున స్వరమండలము, సితారతో దేవుని స్తుతించాలి. కాని యూదావారు ప్రొద్దుట నుండి సాయంత్రము వరకు ద్రాక్షారసముతో మత్తులై పాటలు విందులతో కాలము గడుపుచు దేవుని నిర్లక్షపెట్టినందున శిక్షించి శ్రమ పెట్టుదునంటున్నాడు. 13-17వచనాలలో దేవుడు పంపబోవు శిక్షను చెప్పుచున్నాడు. దేవునిమాట విననందున కరువుపంపి ఆకలి, దప్పికచే బాధింతునని చెప్పుచున్నాడు. శత్రువు

ద్వారా కొద్దిమంది చంపబడుదురని, చెరగా కొనిపోబడుదురని చెప్పుచున్నాడు. దేశము పాడై బీడు భూమిగాను, గొర్రెలకు మేయు భూమిగా చేయబడును. ఈలాగు చేయుట ద్వారా పరిశుద్ధుడైన దేవుడు తన నీతి ద్వారా తన్ను తాను పరిశుద్ధ పరచుకొనును.

**18-19వ.** మూడవ శ్రమ:- భక్తిహీనత అను త్రాళ్ళు, బండి మోకాలిచే దోషమును, పాపమును లాగుకొనుచున్నారు. దీనిభావము యూదావారిలో భక్తి తగ్గినది. అదియే పాపమని దోషమని చెప్పుచున్నాడు. దేవుడు చేయబోవు శిక్షను తృణీకరించుచు 1. ఆయన త్వరగా చేయనిమ్ము, 2. వెంటనే చేయనిమ్ము, 3) పరిశుద్ధ దేవుని ఆలోచన మా యెదుట కనబడనిమ్ము అని హేళనగా పలుకుచున్నారు. అందుచేత దేవుడు వారిని శ్రమ పెట్టనైయున్నాడు.

**20వ.** నాల్గవ శ్రమ:- మేలును కీడని, కీడును మేలని చెప్పు వారికి శ్రమ అని చెప్పుచున్నాడు. యెహెజ్కేలు 13:22లోను ప్రవక్తలు కీడును మేలుగా పొట్టకూటికై చెప్పుచున్నారు. పాపము తీపిగా ఎంచువారుందురని సొలమోను సామె 9:17 లోను హిజ్కియా సామె 20:17లోను, చెప్పుచున్నారు. ఆలాగు ఎంచువారికి శ్రమ అని దేవుడు చెప్పుచున్నారు. దేవుడు ఆయన మాటలు నిజమని రోమా 3:4 ప్రకారము తెలిసికొందుము గాక.

**21వ.** ఐదవ శ్రమ:- గర్విష్టులు తమ జ్ఞానమును బట్టి గర్వమను పాపములో పడుదురు. ఇది తప్పని సొలొమోను సామె 3:7లో, హిజ్కియా సామె 26:12లోను చెప్పిరి. ఈలాటి వారికి శ్రమ అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**22-25వ.** ఆరవ శ్రమ:- 22-23వ ద్రాక్షారసము త్రాగుటలోను, కలుపుటలోను తెగువ గలవారమని తలంచువారు కలరు. ఇతరులు తమవలె కలపలేరని భావింతురు. రెండవ శ్రమతో దీనిని కలుపవచ్చును. ఈలాటి వారు దుష్టులను నీతిమంతులని, నీతిమంతులను దుష్టులని తీర్పు తీర్చుదురు. వీరు దేవుని ధర్మశాస్త్రమును నిర్లక్ష్యపెట్టి, దేవుని వాక్కులను తృణీకరింతురు. వీరిని దేవుడు కొట్టగా వీరి కళేబరములు పెంటగా వీధులలో పడును. దీని నెరవేర్పు నెబుకద్నెజరు యెరూషలేముపై దండెత్తినప్పుడు రెండవ దిన 36:15-19వచనములలో నెరవేరును. ఈలాగు జరిగినను దేవుని కోపము చల్లారక యూదా వారిని డెబ్బది ఏండ్ల చెరకు దేవుడు పంపెను.

**26-30వ చెర తరువాత సమకూర్పు:-**

70 ఏండ్ల చెర తరువాత దేవుడు వారిని సమకూర్చునని చెప్పుచున్నాడు. ఈ ప్రవచన అంత్యకాలనెరవేర్పుగా దేవుడు ఈ దినములలో ఇశ్రాయేలు 12 గోత్రములవారిని ఇశ్రాయేలు దేశమునకు రప్పించుకొనుటను చూడగలము.

# 6వ. అధ్యాయము (4+4+5=18వ)

**అంశము:- యెషయా యొక్క పిలుపు - పంపబడుట - యేసు పిలుపు- పంపుట**

**1-4వ.** పరిశుద్ధుడైన ప్రభువు ప్రత్యక్షత:-

1వ. ఉజ్జియా మృతిపొందగా ఆయన కుమారుడు యోతాము సింహాసనాలంకృతుడై ఉంటాడు. ఉజ్జియా రాజుగా అభిషేకించబడి సింహాసనము మీద కూర్చున్న దానికంటే యోతాము రాజు అయిన సందర్భము గొప్పదని ప్రజలు అనుకొని ఉంటారు. ఉజ్జియా, యోతాము సింహాసనముల కంటే మరియొక సింహాసనము మీద కూర్చొని ఉన్న, ఒకరు యెషయా దృష్టిలో పడ్డారు. ఆయనే ప్రభువు అత్యున్నతమైన సింహాసనమందు ప్రభువు ఆసీనుడై ఉండగా చూచితిని అంటున్నాడు. ప్రభువు సింహాసనము అత్యున్నతమైనది ప్రభువును గురించిన మాటలన్ని అత్యున్నతమైనవిగా ఉంటాయి. ఉన్నతిలో మహోన్నతుడు సర్వోన్నతుడు; పరిశుద్ధతలో మహా పరిశుద్ధుడు. మహిమలో మహిమోన్నతుడు శక్తిలో సర్వశక్తి సంపన్నుడు. ప్రభువు సింహాసనం అత్యున్నతమైన స్థానంలో ఉంది. దానికంటే ఉన్నతమైన స్థానం ఇకలేదు. యెష్షయి ఆయనను చూచాడు. యెహెజ్కేలు కూడా చూచాడు (యెహె 1:26)

ఆయన చొక్కాయి అంచులు దేవాలయము నిండుకొన్నాయి. ఆయన పరిశుద్ధడు అని పిలువబడడాన్ని బట్టి ఆయన అతి పరిశుద్ధమైన చొక్కాయి కలిగినవాడు. సంపూర్ణమైన తెలుపు వస్త్రములు కలిగినవాడు. పేతురు, యాకోబు, యోహాను చూచినది వెలుగుమయమైన ఈ చొక్కాయినే (మత్త 17:1-2). లోకమందు ఏ చాకలియు అంత తెల్లగా చలువలేని ఈ చొక్కాయినే వారు చూచారు. (మార్కు 9:3) అటువంటి చొక్కాయి అంచులు దేవాలయము నిండుకొన్నాయి. ఆయన చొక్కాయి తప్ప దేవాలయం కనిపించడం లేదు. అనగా అయన పవిత్రత, పరిశుద్ధత మాత్రమే కనిపిస్తున్నది. అందుకే ఆయన ఆలయం పరిశుద్ధాలయం ఆ ఆలయమును పాడుచేస్తే దేవుడు వానిని పాడుచేస్తాడు. (1 కొరి 3:17).

ఆయన దేవాలయమైన మనలను కూడా ఆయన పరిశుద్ధ చొక్కాయి అంచులు నిండుకున్నాయి. ఆయన పరిశుద్ధతనుబట్టి మనము పరిశుద్ధులమని పిలువబడుచున్నాము. అనలు మనలో పరిశుద్ధత లేదు. మనలో పాపపు స్వభావము, పాపపు బీజము ఉన్నాయి. పాపములోనే పుట్టాము. పాపములోనే మూలుగుచున్నాము. పాపములోనే జీవితయాత్రను కొనసాగిస్తున్నాము. పాపములోనే మరణించవలసి ఉంది. కాని ప్రభువైన యేసుక్రీస్తు జరిగించిన బలియాగము ద్వారా పరిశుద్ధులుగా చేయబడ్డాము. నీతిమంతులుగా

తీర్చబడ్డాము. స్వాభావికముగా పరిశుద్ధులము, నీతిమంతులము కాదు. ఆయన చొక్కాయి అంచులు దేవాలయమును నిండుకున్నాయి. కాబట్టి బయట కన్పించేది ఆయన చొక్కాయి మాత్రమే. మనలో ఎన్ని మచ్చలున్నా బయటివారికి కనిపించేది మన చొక్కాయి మాత్రమే. మరి మన సంఘాలమధ్య, మనలో మనలను కప్పిన ప్రభువు కనబడుతున్నాడా. ప్రభువును ప్రక్కన ఉంచి మనమే కనబడుచున్నామా? నేను బాప్తిస్మమిచ్చాను. నేను ఆరాధన ప్రారంభించాను. నేను మీకు తండ్రిలాంటి వాడిని.. ఇలా అంటూ ఉంటారు. ప్రభువును కనబడనీయండి. మన మచ్చలు కనబడవు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మనము క్రీస్తును ధరించుకొనియున్నాము (గల 3:27). క్రీస్తును ధరించుకుందాము.

2వ. ఆయనకు పైగా సెరాపులు నిలిచియుండిరి. సెరాపులు అనగా మహాదూతలు అని క్రింద వ్రాయబడి ఉంది కాబట్టి దేవుడు ఎక్కడ ఉన్నా ఆయనతోపాటు దూతగణము ఉంటారు. వారు ఆయనతోపాటు ఆయన కార్యాలు జరిగిస్తారు. సెరాపులు మనకు మాదిరిగా ఉన్నారు. వారిలో పాపము లేదు. పాపము చేసిన దూతలను ఆయన అగాధములో బంధించాడు. (యూదా 6) మిగిలిన దూతలు పాపము చేయనివారు పరిశుద్ధులు. వీరు పరిశుద్ధులైనను రెండు రెక్కలతో ముఖము కప్పుకుంటున్నారు. రెండు రెక్కలతో కాళ్ళు అంటే మిగిలిన శరీరభాగాలను కప్పుకుంటున్నారు. రెండు రెక్కలతో ఎగురుతున్నారు. ముఖాన్ని శరీరాన్ని కప్పుకున్నారు. అంటే దూతలు ఇతరులకు కనిపించకుండా కప్పుకుంటున్నారు. అలాగే నేను అనేవాడు కనిపించకూడదు. రెండు రెక్కలతో ఎగురుతూ సెరాపులలో ఒకడు బలిపీఠము నుండి కారుతో తీసిన నిప్పును తెచ్చి యెషయాకు తగిలించాడు. యెషయాకు పవిత్రతను ఆపాదించారు. దేవుని పనిలో ఎగురుతూ పనిచేస్తూ తమ్మును తాము కనిపించకుండా చూసుకుంటున్నారు. అది మనకెంతమాదిరి. ఆయన పనిలో ఉంటూ మనము ఎవరికి కనబడకుండా జాగ్రత్త పడుదుము గాక. 3వ. వారు సైన్యములకధిపతియగు యెహోవా పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు సర్వలోకము ఆయన మహిమతో నిండి ఉన్నది అని గొప్ప స్వరముతో గానము చేయుచున్నారు. ముమ్మారు చెప్పుట త్రిత్వమునకు గుర్తు. ప్రకటన 4:8లో కూడా ముమ్మారు పరిశుద్ధుడు అని చెప్పబడింది. త్రిత్వమును గురించి నమ్ముటకు మరియొక సాక్ష్యము. అయితే ఆశీనుడైనవాడు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలలో ఎవరు? ఎవడును ఎప్పుడును దేవుని చూడలేదు. తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను. (యోహాను 1:18). కాబట్టి కుమారుడైన ప్రభువునే యెషయా చూచాడు. ఆదికాండము నుండి ప్రకటన వరకు దేవుని ఎవరైనా చూచినారు అంటే కుమారుడైన యేసు ప్రభువునే గాని తండ్రిని కాదని గుర్తించుకోవాలి. పరలోకంలో తండ్రిని, కుమారుని, పరిశుద్ధాత్మను చూడగలం.

(ప్రకటన 4:3). కాని భూలోకములో ఎవరు చూచినా కుమారుడైన దేవున్నే అని గుర్తించాలి. (యోహాను 5:37, 14:6-11).

తండ్రియైన దేవుడు పరిశుద్ధుడు, కుమారుడైన దేవుడు పరిశుద్ధుడు, పరిశుద్ధాత్మ దేవుడు పరిశుద్ధుడు. కుమారుడైన దేవునిలో పాపము ఉన్నట్లు చూపాలని ప్రయత్నించారు. నిరూపించలేకపోయారు. సెరాపులు దైవ త్రిత్వాన్ని గుర్తించి ఘనపరుస్తూ గాన ప్రతి గానములు చేయుచున్నారు.

4వ. వారి కంఠస్వరము వలన గడప కమ్ముల పునాదులు కదలుచు మందిరము ధూపము చేత నిండెను. గడప కమ్ముల పునాదులు కదలుచున్నవి. ఎవరైన ప్రభువును దర్శించినప్పుడు భూకంపము కలిగినట్లు మనము చూడగలము. నిర్గమ. 19:18లో పర్వతము కంపిస్తున్నది. ఆయన స్వరూప దర్శనము చూడడము భూమికి కూడా కష్టమే. ఆయన ఎంత ప్రభావము గలవాడో! ఎంత రమ్యమైనవాడో! ఎంత పరిశుద్ధుడో ఈ మాటలవల్ల మనము తెలుసుకోవచ్చు.

**5-8వ. పరిశుద్ధ పరిచర్యకై పిలుపు:-**

5వ. అయ్యో నేను అపవిత్రమైన పెదవులు గలవాడను... నేను నశించితిని. ఇక్కడ యెషయా ప్రవక్త తన పాపాన్ని ఒప్పుకుంటున్నాడు. ఇది యెషయా రక్షణను గురించి కాదు. 6 అధ్యాయములో రక్షణ పొంది మొదట 5 అధ్యాయాలు రక్షణ లేకుండా ప్రకటించాడా? కానే కాదు. ముందుగానే రక్షింపబడ్డాడు. ఉజ్జియా కాలమంతటిలో ప్రవచించాడు. ఉజ్జియా చనిపోయిన తర్వాత పెదవుల అపవిత్రతను ఒప్పుకుంటున్నాడు. దేవుని పనికొరకై పనిచేస్తున్న వ్యక్తినే నియమిస్తాడు. ప్రభువును సేవిస్తున్న బర్నబాను, పౌలును తన పనికొరకై నియమించాడు. అలాగే ప్రభువు కొరకై పనిచేయుచుండిన యెషయాను పిలిచి నియమిస్తున్నాడు. నేను ఎవరిని పంపగలను అని దేవుడు అడుగగా నేను ఉన్నాను పంపుము అంటున్నాడు. నేను అపవిత్రమైన పెదవులుగలవాడను అంటున్నాడు. సేవకు పిలువబడినవారు ఈ విషయాన్ని గుర్తించాలి. సేవకులకు పెదవుల పని ఎక్కువగా ఉన్నది. సువార్త, బోధ, హెచ్చరికలు పెదవుల ద్వారానే జరుగుతాయి. యెషయా మొదటి 5 అధ్యాయాలు అపవిత్రమైన పెదవులతో ప్రకటించి ఇప్పుడు పవిత్రపరచుకుంటున్నాడా? కానేకాదు. అనునిత్యము మన పెదవులను పవిత్రపరచుకుంటూ ఉండాలి. ప్రతి ఉదయము, సాయంకాలము దహనబలిని అర్పించమన్నాడు. (సంఖ్యా 28:3-4వ) బలి అంటే ఇప్పుడు మనకు రోమ 12:1 లోనిది నెరవేర్చాలి. కాబట్టి సహోదరులారా పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బ్రతిమాలుచున్నాను. అంటే మీ పెదవులు సమర్పించాలి.

మీ కన్నులు, మీ చేతులను... శరీరమంతా సమర్పించాలి. దహనబలిలో చనిపోయిన వాటిని కాలుస్తారు. కాని మీరు బ్రతికే మిమ్మును మీరు కాల్చి సమర్పించుకోవాలి. ఎప్పుడూ సజీవయాగముగా సమర్పిస్తూ ఉండాలి. అంటే మన పెదవులు ఒకసారి కాల్చబడితే చాలదు. నిత్యము మన శరీరావయవములు కాల్చబడుతూ ఉండాలి. అదే సజీవయాగము. ఇప్పుడు నా పెదవులు కాల్చబడ్డాయి. ఇక సర్వకాలము పరిశుద్ధుడనై ఉన్నాను అని యెషయా అనకోకూడదు. నిత్యదహనబలి అంటే నిత్యము మన పెదవులు కాల్చబడుతూ ఉండాలి. ప్రవచించేవారు, ప్రవక్తలు, ఉపదేశకులు, సంఘకాపరులు, సంఘసేవలో పెదవులను వాడేవారందరు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. మన మాట ఎదుటివారికి క్షేమము కలిగిస్తున్నదా, కీడును కలిగిస్తున్నదా పరీక్షించుకోవాలి. పెదవులపై కాపుపెట్టుకోవాలి.

శిష్యులు తిరిగి చేపలు పట్టడానికి వెళ్ళినప్పుడు ప్రభువు వారిని ఏమైనా అనవచ్చు. కాని పిల్లలారా అని సంబోధించాడు. ఎంతరమ్యమైన మాదిరి. మన పెదవులు అపవిత్రమైనవి అని ఎప్పుడు గుర్తింపు కలిగి ఉండాలి. యెషయా యథార్థముగా ఒప్పుకున్నాడు. 2700 సంవత్సరాల నుండి ఆయన మాటలను చదువుచున్నారు. ఆయనను తృణీకరిస్తున్నామా? లేదు గొప్పగా చెప్పుకుంటున్నాము. అపవిత్రమైన పెదవులుగల జనుల మధ్య నివసిస్తున్నాడు. అందరి గురించి చెప్పలేదు. నేను అపవిత్రమైన పెదవులు గలవాడను నేను నశించితిని అన్నాడు. వెంటనే సెరాపులలో ఒకడు అతని పెదవులకు నిప్పు తగిలించాడు. యెషయా దోషము తొలిగిపోయింది. మనము ఎలా ఉన్నాము. పెదవులకు ప్రాయశ్చిత్తమైనదా? లేదా?

రాజును సైన్యములకధిపతియునగు యెహోవాను నేను కన్నులారా చూచితిని. రాజు అని యెషయా గ్రంథములో 7సార్లు ఉన్నది. 6:5, 32:1, 33:17, 33:22, 41:21, 43:15, 44:6. రాబోయేరాజు ఈయనే అని యెషయా గ్రంథము ప్రభువును గురించి మనకు చెబుతున్నది. సైన్యములకధిపతియగు యెహోవా అని 62సార్లు ఉంది. ఇశ్రాయేలీయుల సైన్యాలకు ఈయన అధిపతి అని 62సార్లు చెప్పినా వారి రాజులు ఆ విషయము మరచిపోయి ఇతర రాజులను ఆశ్రయించారు.

6-7వ. అప్పుడు సెరాపులలో ఒకడు తాను బలిపీఠము మీద నుండి కారుతో తీసిన నిప్పును చేతపట్టుకొని నా యొద్దకు ఎగిరివచ్చి నానోటికి దాని తగిలించి ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ దోషము తొలగిపోయెను అనెను. అపవిత్రమైన పెదవులు ఉంటే పాపము, దోషము అంటున్నాడు. పెదవులలో అపవిత్రత కనిపిస్తే, పాపము, దోషము చేసినట్లే. అందుకే మీలో అనేకులు బోధకులు కాకుండుడి అని యాకోబు 3:1లో చెప్పుచున్నాడు. బోధించేవారి జీవిత విధానములో దోషము ఉండకపోవచ్చు కాని వారి

మాటలలో ఉండవచ్చు. విస్తరించి మాట్లాడుటలో దోషముందని బైబిల్లో చూడగలము. గనుక మన పెదవులు జాగ్రత్త.

8వ. అప్పుడు నేను ఎవని పంపెదను. మా నిమిత్తము ఎవడు పోవును అని ప్రభువు సెలవిచ్చాడు. మొదట నేను అన్నాడు. తర్వాత మా నిమిత్తము అన్నాడు. నేను అంటే తండ్రి మా అంటే దైవత్రిత్వమైన తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు. తండ్రిచేత, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల నిమిత్తమై వెళ్ళాలి. వారి పనుల కొరకై వెళ్ళాలి. మనము వెళ్ళేది తండ్రి కార్యములకొరకై, కుమారుని కార్యముల కొరకై, పరిశుద్ధాత్మని కార్యముల కొరకై అనునది గుర్తుంచుకోవాలి. చిత్తగించుము నేను ఉన్నాను. నన్ను పంపుమని యెషయా అన్నాడు. చిత్తగించుము అనేమాట విధేయతను నేర్పిస్తుంది. బైబిల్లో చిత్తము అన్నవారు చాలామంది ఉన్నారు. అబ్రాహాము, సమూయేలు, యిర్మీయాలాంటి వారున్నారు. అందరికంటే ఎక్కువగా మనకు మాదిరి మన ప్రభువైన యేసుక్రీస్తు తండ్రీ, నా చిత్తము కాదు నీ చిత్తమే నెరవేరాలని విధేయత చూపాడు. నా నిమిత్తము ఎవరు పోయెదరు. ఇది వ్యక్తిగతమైనది. ఒక్కొవ్యక్తిని ఆయన పిలిచే విధానము. మనుష్యులు పిలిస్తే వెళ్ళడం సరికాదు. ఆయన పిలిస్తే వచ్చాను. తర్వాత ఆయన పట్టించుకోలేదు. ఫలనా సంఘం పిలిస్తే వచ్చాను. వాళ్ళు పట్టించుకోలేదు అని నెపాలు వేయడం సరికాదు. ప్రభువు పిలుపు విని రా. మనలను పిలిచిన వాడు నమ్మదగినవాడు. (1థెస్స 5:24వ) ప్రభువు పిలుపు విన్న యెషయా చిత్తగించుము నన్ను పంపుము అన్నాడు.

**9-13వ. పంపబడుట - ప్రకటించుట:-**

9వ. నీవు పోయి ఈ జనులతో ఇట్లనుము. నిన్ను పిలిచిన ప్రభువు నీవు ఎక్కడికి వెళ్ళాలో చెబుతాడు. ఏమి చెప్పాలో చెబుతాడు. (అపొ. 13:2). మీరు నిత్యము వినుచుందురు గాని గ్రహింపకుందురు. నిత్యము చూచుచుందురు గాని తెలిసికొనకుందురు. నిత్యము విన్నా గ్రహింపని వారు ఎంతోమంది. లోకములో ఎన్నో విషయాలు గ్రహిస్తున్నారు. కాని పాపము విషయము పరలోకము, నరకము విషయమును గ్రహించుట లేదు. హృదయము అన్నిటికంటే మోసకరమైనది. అది ఘోరమైన వ్యాధిగలది దాని గ్రహింపగలవాడు ఎవడు. (యిర్మీ. 17:9). ఎన్నో వ్యాధులను గ్రహించి వాటి నివారణకు ఎంతో ప్రయాసపడుతున్నాడు. తలనొప్పివస్తే గ్రహిస్తాము. కడుపునొప్పి వస్తే గ్రహిస్తాము. షుగరు, బి.పి., గుండెపోటు, కేన్సర్.. ఇలాంటి వ్యాధులు రాగానే గ్రహిస్తున్నాము. హృదయములోని ఘోరమైన పాపపు వ్యాధిని ఎంతమంది గ్రహిస్తున్నారు. పెదవుల వ్యాధిని, హృదయపు వ్యాధిని గ్రహించి స్వస్థత కోరుచున్నారా?

10వ. కన్నులతో చూచినా, చెవులతో విన్నా, హృదయము గ్రహించినా మనస్సు మార్చుకొని స్వస్థత పొందడం లేదు. ఎందుకంటే వారి హృదయము క్రొవ్వినది. అందుకే వారి కన్నులు మూయించుమని చెబుతున్నాడు. (అపొ 28:26-27). మన హృదయము ఎలా ఉన్నది? కన్నులు మూయించిన సందర్భాలు ఉన్నవి. తెరిపించిన సందర్భాలు ఉన్నవి. 11-13వ. ప్రభువా ఎన్నాళ్ళ వరకు? నివాసములు లేక పట్టణములు, మనుష్యులు లేక ఇండ్లు పాడగువరకు దేశము బొత్తిగా బీడగువరకు ఎక్కడకు వెళ్ళాలో చెబుతాడు. ఏమి చెప్పాలో చెబుతాడు. ఎంతవరకు ఉండాలో చెబుతాడు. సువార్తకు వెళ్ళాలి. ఎక్కడకు వెళ్ళాలి? ఎన్నాళ్లుండాలి? ప్రభువును అడిగి నిర్ణయించుకో. అబ్రాహాము 75 ఏండ్లవాడై పిలువబడ్డాడు. ఎక్కడి నుండి వచ్చాడో మరచిపోయాడు. ఎక్కడకు వెళ్ళాలో తెలియదు. ఎంతకాలము ఉండాలో తెలియదు. పరాయి దేశములో తను, తన కుమారులు చనిపోవలసి వచ్చింది. అయినా ప్రభువు పిలుపుకు లోబడ్డాడు. (హెబ్రీ 11:8-10).

ఎన్నాళ్ళ వరకు అని యెషయా అడుగగా నివాసులు లేక పట్టణములు మనుష్యులు లేక ఇండ్లును పాడగుపరకు దేశము బొత్తిగా బీడగువరకు అని చెప్పబడినది. బబులోను రాజు దండెత్తి వచ్చాడు. మనుష్యులందరిని చెరగొని పోయాడు. దేశము బీడుగా విడువబడినది. దేశంలో బీదలను వ్యవసాయ కూలీలను మ త్రమే వదలి వెళ్ళాడు. ఐగుప్తునకు వెళ్ళినవారు తిరిగివచ్చారా? లేదు అందరు నాశనమయ్యారు. ఎవ్వరు మిగుల లేదు. పదియవ భాగము బలహీనులు మిగిలిపోయారు. వృక్షములు అన్ని నరకబడ్డాయి. దేశము బీడుగా మోడుగా మొద్దుబారిపోయింది. ఆ మొద్దునుండి చిగురు పుడుతుంది. దేవుని మాట ఎంత ఖచ్చితంగా నెరవేరింది. బబులోనుకు కొనిపోబడి నరకబడిన మొద్దులనుండి పుట్టిన చిగురులు 70 ఏండ్ల తర్వాత తిరిగి యూదా దేశానికి వచ్చాయి. బబులోనుకు వెళ్ళిన రాజులు 70 ఏండ్లలో చనిపోయారు. ఈ మొద్దుల నుండే చిగురులు వచ్చాయి. జరుబ్బబెలును బబులోను చిగురు అంటారు. ఈ చిన్న చిగురు యేసుక్రీస్తు వారికి సాదృశ్యముగా ఉన్నది. యెషయాకు దేవుడు ఎన్ని విషయాలు చెప్పాడో గమనించండి. ఎక్కడికి వెళ్ళాలో, ఏమి చేయాలో, ఎన్నాళ్ళుండాలో చెప్పాడు, బబులోను వెళ్తారని, అక్కడ నరకబడతారని, అందరు అక్కడ చనిపోతారని చెరనుండి వేరు చిగురు మాత్రమే వస్తారని యూదుల చరిత్ర చెప్పాడు. వీటన్నిటిని ఆలోచించి మన జీవితాలకు అన్వయించుకుందాము. ప్రభువు దగ్గర పరీక్షించుకొని పిలుపు విషయములోను, పంపబడే విషయములోను, తర్వాత ఏమి చేయాలి, ఎన్నాళ్ళుండాలి అనే విషయాలలోను ఆయన సంపూర్ణ చిత్తమును ఎరుగవలసినవారమై ఉన్నాము. ఆయన సంపూర్ణ చిత్తమును తెలుసుకొనుటకు దేవుని కృప మన యెడల విస్తరించును గాక.

# 7వ. అధ్యాయము (9+8+8=25వ)

అంశము:- ఇమ్మానుయేలు పుట్టుక, ఇశ్రాయేలు, సిరియా వారి విఫలయత్నం

**1-9వ. ఇశ్రాయేలు వారు సిరియనులు కలసినను యూదులకు కీడు చేయలేరని హెచ్చరిక:-**

1-2వ. యూదావారి మీదికి ఇశ్రాయేలు వారు, సిరియావారు యుద్ధానికి బయలుదేరి వస్తున్నారు. రెండు రాజ్యాలు బయలు దేరివస్తే యూదావారికి భయమవుతుంది. అంతేకాదు, యూదా రాజైన అహాజు యెహోవా యందు నమ్మకము లేనివాడు కాబట్టి మరీ భయపడుచున్నాడు. ప్రవక్తయైన యెషయాను పంపించి ధైర్యపరచడానికి దేవుడు ప్రయత్నించాడు. 3వ. చాకిరేవు మార్గమున కోనేటి కాలువ కడకు పోయి అహాజుతో మాట్లాడమన్నాడు. పాతకాలంలో యుద్ధము జరుగు విధానమేమంటే మొదట రాజ్యాన్ని చుట్టుముడుతారు. లోపల నీరు ఆహారు అయిపోవునంత వరకు ఊరకనే ఉంటారు. ఆహారము నీరు అందనప్పుడు ప్రజలు బయటికి వస్తారు. ఒక్కొక్కరిని చంపవచ్చు. ఇశ్రాయేలు రాజు సిరియా రాజు యూదావారిని చుట్టుముట్టారు. ఆహారము నీరు అయిపోతే ఎలాగు అనే భయము యూదారాజుకు పట్టుకుంది. చాకిరేవు మార్గమున ఉన్న కోనేటిలో నీళ్ళు ఉన్నాయని వర్తమానము వచ్చింది. వాటిని చూద్దామని అహాజు వెళ్ళుచున్నాడు. దేవుడు యెషయాతో అహాజు రాజు కోనేటి దగ్గరకు వస్తున్నాడు. కనుక నీవును వెళ్ళి రాజుకు చెప్పుమన్నాడు.

4-5వ. యెహోవా సెలవిచ్చునది ఏమనగా 'భద్రము సుమీ నిమ్మళించుము. పొగ రాజుచున్న ఈ రెండు కొరకంచు కొనలకు, అనగా రెజీనును, సిరియనులు, రెమల్యా కుమారుడును అను వారి కోపాగ్నికి జడియకుము. నీ గుండె అవియనీకుము' అని చెప్పుమన్నాడు. ఎంత చక్కని వర్తమానము. నీ గుండె అవియనీకుము. వారు కొరకంచు కొనలు మాత్రమే. కాలుచున్నారు గాని కొనలు మాత్రమే కాలుచున్నాయి. మంట కొనల దాకా వచ్చేసింది. కాసేపటికి ఆరిపోతాయి. అంటే వారి రాజ్యాలు పతనమైపోతాయి అన్నారు. 7:3కు కొంత వివరణ ఇక్కడ అవసరము. నీవును నీ కుమారుడైన షెయర్యాషూబును వెళ్ళాలి అన్నాడు. యెషయా ఒకడేపోతే సరిపోదు. ఆయన కుమారుని కూడా వెంటబెట్టుకొని వెళ్ళాలి. యెషయాకు షెయర్యాషూబు అనే కుమారుడు ఉన్నాడు. అతని వయస్సు తెలియదు. కాని ఈ పేరు అర్థము ఏమంటే శేషము తిరిగి వచ్చును అని. దేవుడే ఈ పేరు పెట్టమన్నాడు. ఏమి శేషము, ఏమి తిరిగి వస్తుంది. యెషయాకు అప్పుడు అర్థము కాలేదు. ఇప్పుడు అర్థమవుతుంది. యూదావారిలో శేషము ఉన్నారే వారు యుద్ధములో చనిపోకుండా మిగిలి ఉంటారు. వారు తిరిగి వస్తారు అనే సంగతి తెలుపుటకై యెషయా కుమారునికి ఆ పేరు

పెట్టమన్నాడు. ఆ కుమారున్ని వెంట తీసుకుపొమ్మన్నాడు. ఎంత చిత్రమో చూడండి. దేవుని కార్యక్రమాలు కంటికి కనిపించేవిధంగా (Practical Demonstration) కూడా ఉంటాయి అన్నమాట.

ఆహాజు రాజుకు ప్రవక్త ఆయన కుమారునితో కనించమన్నాడు. ఇద్దరు కనిపిస్తే ఈ బాబు నీ కుమారుడా? పేరేమి? ఏమి చదువుచున్నాడు లాంటి ప్రశ్నలు సాధారణముగా వేస్తాము. కనీసం పేరైనా అడుగుతాము. శేషము తిరిగి వచ్చును అనే పేరు విన్నప్పుడు ఈ కొరకంచు కొనలకు భయపడవలసిన పనిలేదు. గుండె అవియవలసిన పనిలేదు. శేషము తిరిగివస్తారు. కనుక భయపడవలసిన పనిలేదు. ఇంత చక్కని వర్తమానము దేవుడు పంపినా అహాజు నమ్మలేదు.

6-7వ. మనము యూదా దేశము మీదికి పోయి దాని జనులను భయపెట్టి దాని ప్రాకారములను పడగొట్టి టాబెయేలను వాని కుమారుని దానికి రాజుగా నియమించుదము రండని చెప్పుకొనిరి. అయితే ప్రభువైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. ఆ మాట నిలువదు జరుగదు.

ఇక్కడ 7:16 యొక్క వివరణ వినాలి. కీడును విసర్జించుటకు మేలును కోరుకొనుటకు ఆ బాలునికి తెలివి రాకమునుపు నిన్ను భయపెట్టు ఆ ఇద్దరు రాజుల దేశము పాడుచేయబడును. ఈ బాలుడు ఎవరు? 7:14లో కాబట్టి ప్రభువు తానే ఒక సూచన చూపును. ఆలకించుడి కన్యక గర్భవతియై కుమారుని కనును. అతనికి ఇమ్మానుయేలు అను పేరు పెట్టును. ఈ ప్రవచనము నిశ్చయముగా యేసుక్రీస్తుదే. కాని అహాజునకు అన్వయించుటకు ఆ కన్యకను మూలభాషలోని పవిత్రురాలు, యవ్వనస్త్రీ, అనే అర్థములో తీసుకోవాలి. యవ్వన స్త్రీ గర్భము ధరిస్తుంది అంటే యెషయా భార్య గర్భము ధరిస్తుందని అన్వయించుకోవాలి. 8:3 ఆమె గర్భము ధరించి ఒక కుమారుని కంటుంది. ఆయన పేరే మహేరు షాలాల్ హష్‌బజ్. ఆ చిన్నవానికి తెలివి రావడం అంటే $2^1/_2$ నుండి 3 ఏండ్ల కాలానికి ఈ ఇద్దరు రాజుల రాజ్యాలు, దేశాలు పాడైపోతాయి. (7:16). ఎంత స్పష్టముగా చెప్పాడో చూడండి.

ఇంక రెండు ఏండ్లకు షోమ్రోను ముఖ్య పట్టణముగా కలిసిన ఇశ్రాయేలు రాజ్యము దెబ్బతింటుంది. సిరియా రాజ్యము పాడవుతుంది. ఇది అహాజు చూస్తాడు. ఈ రీతిగా చెబితే అహాజు మనస్సు మారుతుందేమో అని దేవుడు చెప్పించాడు. కాని ఆ మాటలు అహాజు నమ్మినవాడు కాదు. నమ్మక అష్షూరు రాజులను సహాయానికి పిలిచాడు. అష్షూరు రాజు మేలు చేయక కీడు చేసి వెళ్లాడు.

8-9వ. దేవుడు నియమించిన రాజును వారు లేకుండా చేస్తామనుకున్నారు. అయితే ప్రభువగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. ఆ మాట నిలువదు, జరుగదు. దమస్కు సిరియాకు రాజధాని. దమస్కునకు రెజీను రాజు. షోమ్రోను ఎఫ్రాయిముకు రాజధాని. దానికి రెమల్యా కుమారుడు రాజు అరువదియయిదు సంవత్సరములు కాకమునుపు ఎఫ్రాయిము జనము కాకుండా నాశనమగును. ఇప్పుడు నీకు పుట్టబోవు కుమారుడు నాయనా, అమ్మా అననేరక మునుపు అనగా రెండేండ్లకు ఇశ్రాయేలు రాజ్యము పతనమవుతుంది. అయితే 65 ఏండ్లకు సంపూర్తిగా నాశనమవుతుంది. సరిగ్గా 2 ఏండ్లకు అష్షూరు రాజు సగము పతనము చేశాడు. ఆ తర్వాత 9 ఏండ్లకు ఇంకా పతనము చేశాడు. 65 ఏండ్లకు ఇశ్రాయేలు వారిని పూర్తిగా చెరకు తీసుకొని పోయాడు. వారికి ఒక రాజ్యము లేకుండా పోయింది. ఇంతవరకు వారు తిరిగి రాలేదు. ఎంత స్పష్టముగా చెప్పాడో చూడండి. ఈ మాటలను అహాజు నమ్మలేదు.

మీరు నమ్మకుండిన యెడల స్థిరపడకయుందురు. యెషయా అహాజు కొరకే కనిపెట్టుకొని ఉన్నాడు. ఆయన నమ్మలేదు. చదివే మీరు నమ్ముతారా? నమ్మితే స్థిరపడతారు. నమ్మకపోతే అస్థిరులవుతారు.

**10-17వ. ఇశ్రాయేలు, సిరియాలు పాడగుట:-**

10వ. నీ దేవుడైన యెహోవా వలన సూచన అడుగుము. అది పాతాళమంత లోతైనను సరే, ఊర్ధ్వలోకమంత ఎత్తయిన సరే అన్నాడు. యెషయా గ్రంథములో విచిత్రమైన సూచనలు ఉన్నాయి. అహాజు గడియారము మీద సూర్యుని కాంతిచేత దిగిన నీడ మరల పదిమెట్లు ఎక్కజేసెనని (38:38) అనగా సూర్యుడు వెనుకకు వచ్చాడు. ఎంత సూచనైనా అడగమన్నాడు.

11-14వ. కాని అహాజు నేను అడుగను. యెహోవాను శోధింపను అన్నాడు. అందుకు దేవుడు దావీదు వంశస్థులారా, వినుడి. మనుష్యులను విసిగించుట చాలదనుకొని దేవుని కూడా విసిగింతురా. కాబట్టి ప్రభువు తానే ఒక సూచన మీకు చూపును. ఆలకించుడి. కన్యక గర్భవతియై కుమారుని కనును. అతనికి ఇమ్మానుయేలని పేరు పెట్టుదురు. ఇది దీర్ఘకాలములో నెరవేరిన ప్రభువు యొక్క ప్రవచనము. అప్పటికప్పుడు యెషయా భార్యకు జన్మించిన కుమారునిలో నెరవేరిన ప్రవచనము (8:3).

15-16వ. ఈ వచనాల వివరణ 6-7 వచనాల ధ్యానంలో ఉంది గమనించండి.

17వ. అష్షూరు రాజును రప్పిస్తానని చెప్పాడు. అలాగే జరిగించాడు.

**18-25వ. యూదా ఇశ్రాయేలు స్థితి:-**

అహాజు యూదా దేశమును దిగంబరినిగా చేసి యెహోవాకు ద్రోహము చేసి ఉండెను గనుక యెహోవా ఇశ్రాయేలు రాజైన అహాజు చేసిన దానినిబట్టి యూదా వారిని

హీనపరచెను. అష్షూరు రాజైన తిగ్లత్పిలేసరు అతని యొద్దకు వచ్చి అతని గాయపరచెనే గాని అతని బలపరచలేదు. (2దిన 28:19,20). కాళ్ళ వెంట్రుకలు, చేతుల వెంట్రుకలను క్షౌరము చేయించి గడ్డము కూడా గీచివేయును. అంటే నిలువున గొరిగినాడు. అంటే అవమానపరచినాడు. దేశమంత దిగంబరత్వానికి వచ్చేసింది. రాజైన అహాజు కూడా అవమానపరచబడ్డాడు. సరిగ్గానే జరిగింది. ప్రవక్త చెప్పినది జరిగినది.

21-22వ ఆ దినమున ఒకడు ఒక చిన్న ఆవును రెండు గొఱ్ఱెలను పెంచుకొనగా అవి సమృద్ధిగా పాలిచ్చినందున పెరుగు తినును విడువబడిన వారందరు పెరుగు తేనెను తిందురు. ఆ దినములలో యూదావారిలో ఒకడు ఒక చిన్న ఆవును, రెండు గొఱ్ఱెలను పెంచుకుంటాడట. గొఱ్ఱెలను పెంచుకునేవారు కనీసం 100 గొఱ్ఱెలనైనా పెంచుకుంటారు. రెండింటినే పెంచుకునేవాళ్ళు ఉంటారా? అంటే దేశమంతా దిగంబరత్వానికి వచ్చినదన్నమాట. దేశములో బహు కొద్దిమంది కూడా బహు పేదలుగా ఉన్నారు. సమృద్ధిగా పాలు ఇస్తాయి. ఎందుకంటే జనమంతా తగ్గిపోయారు. దేశమంత పచ్చి బీడులాగా ఉన్నది. పచ్చిక దండిగా ఉన్నది. అందుకే దండిగా తిని దండిగా పాలు ఇస్తున్నాయి. మనుష్యులు తగ్గిపోయారు. అందుకే చిన్న ఆవును పెంచుకొనే స్థితికి వచ్చారు.

23-25వ. వెయ్యి వెండి నాణెములు విలువగల వెయ్యి ద్రాక్ష చెట్లుండు ప్రతి స్థలమున గచ్చ పొదలును, బలురక్కసి చెట్లును పెరుగును. ఇది ఆశీర్వాదమా? శాపమా? శాపమే! ఎవరైన దేవునికి దూరమైతే ఆశీర్వాదము పోయి శాపము వస్తుంది. ద్రాక్షారసము గచ్చపొద అయినది. జనులు బాణములను విండ్లను చేత పట్టుకొని అక్కడికి పోవుదురు. అంటే ఏ పొదలో ఏ పామున్నదో, ఏ మృగమున్నదో అని భయముతో బాణములను విండ్లను చేతపట్టుకొని పోవాలి. యూదా దేశము ఎంత భయంకరముగా పతనమైపోతుందో దేవుడు బహు స్పష్టముగా చెప్పుచున్నాడు. అహాజు రాజు కాలములో దేశమంత దిగంబరత్వాన్ని అనుభవించినది. ఎడ్లను తోలుటకు గొర్రెలను త్రొక్కుటకు ఉపయోగపడినది.

## 8వ. అధ్యాయము (4+6+3+3+2+4=22వ)

అంశము:- సిరియా, ఇశ్రాయేలు వారితో యూదాకు కలయికను గూర్చినది.

**1-4వ. యెషయాకు పుట్టిన రెండవ కుమారుని గూర్చిన హెచ్చరిక:-**

1-4వ. యెషయాకు పుట్టిన కుమారుడు నాయనా అమ్మ అననేరక మునుపు అష్షూరు రాజును అతని వారును షోమ్రోను దోపుడు సొమ్మును ఎత్తికొని పోవుదురనెను. 7:17 కూడా చదువుకోండి. రాజైన అహాజు తనకు సహాయము చేయమని అష్షూరు రాజుల

యొద్దకు వర్తమానము పంపుతాడు. 2 దిన. 28:17. అష్షూరు రాజైన తిగ్లత్పిలేసరు అతని యొద్దకు వచ్చి అతని బాధపరచెనే గాని బలపరచలేదు. 2 దిన 28:20. కాళ్ళ వెంట్రుకలు, చేతుల వెంట్రుకలు, తల వెంట్రుకలు గొరిగివేశాడు. అంటే నిలువునా గొరిగినాడు. అవమానపరచాడు. (7:20).

**5-10వ. యూదా వారికి సిరియా, ఇశ్రాయేలు వారితో సంధివద్దు - యూదా కాపాడబడుట:-**

5-8వ. మెల్లగా పారు షిలోహు నీళ్ళు వద్దనుకున్నారు. అనగా సైన్యములకు అధిపతి జీవజలముల ఊట అయిన యెహోవా మీదికి వారి మనస్సు పోయినది కాదు. రెజీను, రెమాల్యాలను బట్టి సంతోషించుచున్నారు. మహోన్నతునిపైన నమ్మకం వీడారు. మానవులపైన నమ్మకముంచారు. కీర్త 118:8 మరచారు.

యూఫ్రటీసు నది విస్తార జలములను అనగా అష్షూరు రాజదండమంతటని వారిమీదికి రప్పించును... దాని రెక్కల వ్యాపకము నీ దేశవైశాల్యమంతటిని వ్యాపించును. అష్షూరు రాజు సంపూర్తిగా వారిని వశపరచుకుంటాడు అని చెప్పుచున్నాడు. వీరు అష్షూరు రాజు యొద్దకు వెళ్ళాలనుకున్నారు. కాని దేవుడు అష్షూరు రాజు నీ మీదికి వస్తాడు అష్షూరు రాజు నీళ్ళు నీ కుతికల వరకు వస్తాయి. నిన్ను ముంచివేయడు కాని ఇశ్రాయేలు వారిని ముంచివేస్తాడని చెప్పాడు. సిరియా వారిని ముంచివేస్తాడని చెప్పాడు.

అహాజు నీవు భయపడనక్కరలేదు. ఇశ్రాయేలు వారు పతనమైపోతారు. సిరియావారు పతనమైపోతారు. కాగా అష్షూరీయులకు మీరు భయపడవలసిన పనిలేదు అని చెప్పినప్పటికీ ఆయన తన జీవిత కాలమంతయు దేవుని వైపునకు తిరిగినవాడు కాదు. 9-10వ. జనులారా రేగుడి. మీరు ఓడిపోవుదురు... అష్షూరీయులు రేగారు. అష్షూరీయులు యూదావారి మీదికి వచ్చి రబ్షాకే పలికిన మాటలు వింటే రేగినట్లే ఉంటాయి. కాని దేవుడు చెప్పుచున్నాడు రేగిన మీరు ఓడిపోతారు. దేవుడు యూదా వారితో ఉన్నాడు. అదే జరిగింది. అష్షూరు రాజు ఇశ్రాయేలు వారిని సంపూర్తిగా ఓడించిన తరువాత సన్హెరీబు అనేరాజు యూదా వారిమీదికి దండెత్తి వచ్చాడు. (యెష 36:1). హిజ్కియా భయపడిపోతాడు. ప్రార్థన చేస్తాడు. సన్హెరీబు చంపబడతాడు. (యెష 37:37).

**11-13వ. యూదాకు గద్దింపు:-**

1. ఈ జనుల మార్గమున నడువకూడదు. వారు భయపడుదానికి భయపడకండి. 2. మీరు భయపడవలసిన వాడు ఆయనే. 3. మీరు దిగులు పడవలసిన వాడు ఆయనే అనే 3 గద్దింపులను ఇస్తున్నాడు. అయన కోసము భయపడుడి. ఆయన కోసమే దిగులుపడుడి కాని ఆ జనుల మార్గములో నడవకండి అని హెచ్చరిస్తున్నాడు.

**14-16వ. మెస్సీయాను గూర్చిన భాగము:-**

ప్రభువును గురించి స్పష్టముగా చెప్పబడినది. ఆయన అడ్డురాయి. అడ్డుబండ 1 పేతు 2:7; మత్త 11:6.

**17-18వ. యెషయాను గూర్చిన భాగము:-**

17వ. ఇక్కడ యెషయా తనను గూర్చి చెప్పుకుంటున్నాడు. యాకోబు వంశమునకు తన ముఖమును మరుగుచేసికొను యెహోవాను నమ్ముకొన్నాను అన్నాడు. ఎవరిని నమ్ముకోవాలి? యెహోవానే నమ్ముకోవాలి. ఎవరికై ఎదురు చూడాలి? ఆయన కొరకే ఎదురుచూడాలి. ఎవరికై కనిపెట్టుకోవాలి? ఆయన కొరకే కనిపెట్టుకోవాలి. ప్రవక్త యూదావారికి 3 గద్దింపులు ఇచ్చాడు. తన జీవితంలో 3 తీర్మానాలు చేసుకుంటున్నాడు.

18వ. ఇదిగో నేనును యెహోవా నాకిచ్చిన పిల్లలును సూచనలుగాను, మహాత్కార్యములుగాను ఇశ్రాయేలుమధ్య ఉన్నాము. మనము, మన జీవితాలు, మన కుటుంబాలు ఇశ్రాయేలీయుల మధ్య అనగా దేవుని బిడ్డల మధ్య సూచనలుగా ఉండగల్గితే ఎంత బాగుంటుంది. మన జీవితాలు వ్యక్తిగతంగా, కుటుంబంగా ఒక సూచనలుగా ఉండాలి. యెషయా ఎంత చక్కగా చెబుతున్నాడు.

**19-22వ. దేవుని వాక్యము నొద్ద విచారించుట:-**

19-20వ. వారు కర్ణపిశాచముల వద్ద విచారణ చేయుచున్నారు... కాని ధర్మశాస్త్ర ప్రకారము బాధించని యెడల వారికి అరుణోదయము కలుగదు. ఎక్కడ విచారించాలి? దేవుని యొద్ద విచారణ చేయాలి. ధర్మశాస్త్రము యొద్ద విచారణ చేయాలి. చాలా సమయాలలో దేవుని విషయాలు నాకు ఎలా తెలుస్తాయి అంటారు. అలా అడిగేవాళ్ళు ఉన్నారు. ఏవిధంగా తెలుస్తాయి? గ్రంథము లోనే మనకు తెలుస్తుంది. దేవుని వాక్యము చదువుచుండగా దేవుడు బయలుపరుస్తాడు. లేదా తెలియజేస్తాడు. నీవు అది నెరవేర్చేవరకు నిన్ను వదిలిపెట్టడు. కాబట్టి దేవుని చిత్తాన్ని దేవుని యొద్ద విచారణ చేయాలి. ధర్మశాస్త్రము వద్ద విచారించాలి. తర్వాత ఈ వాక్య ప్రకారము బోధించిన యెడల అరుణోదయము కలుగుతుంది. అనగా చీకటి తొలగిపోతుంది. దేవుని మార్గము స్పష్టముగా కనబడుతుంది. బోధకులు జాగ్రత్తగా ఉండాలి అలాగు బోధించకపోతే దేశ సంచారులవుతారు.

21-22వ. అట్టివారు ఇబ్బందిపడుచు ఆకలిగొని దేశ సంచారులవుదురు. వారు గాఢాంధకారములోనికి తోలివేయబడుదురు. కనుక బోధకులు జాగ్రత్త, అరుణోదయము కలుగునట్లు బోధించుదుము గాక.

# 9వ. అధ్యాయము (5+2+5+5+4=21వ)

సమాధానకర్తను గూర్చిన ప్రవచనము - ఇశ్రాయేలు రాజ్య పతనము.

అంశము:- మెస్సియా వివరములు - ఇశ్రాయేలువారి 4 పాపాలు శిక్షలు.

**1-5వ. ఇమ్మానుయేలు దేశమును గూర్చిన వివరము:-** 1-5వ. అష్షూరు రాజు పది గోత్రముల ఇశ్రాయేలు వారిని చెరగొని పోగా వారికి వేదన కలిగెను. వేదన పొందిన దేశము మీద మబ్బు నిలువది. బేతేలులో, దానులో నున్న విగ్రహాలను పది గోత్రాల ఇశ్రాయేలు వారు పూజించి చీకటిలో నడచిరి. ఈ జనులు క్రీస్తు జననములో గొప్ప వెలుగును చూచిరి. మరణచ్ఛాయగల దేశనివాసుల మీద వెలుగు ప్రకాశించును అను మాట క్రీస్తు ప్రభువు జననము ద్వారా నెరవేరినదని గమనించాలి.

**6-7వ. మెస్సియాను గూర్చిన వివరము:-** మెస్సియా ఆశ్చర్యకరుడు. ఆశ్చర్యకరమైన వెలుగును జనులు చూచిరి. (1-2వ), ఆలోచనకర్త - ఇశ్రాయేలు ప్రజలను గూర్చి ఆలోచించినకర్త (3వ.) బలవంతుడైన దేవుడు - బరువు కాడిని, మెడను కట్టుకట్లను, తోలువాని కొరడాలను విరిచిన బలవంతుడు.- (4వ.), సమాధానకర్త - యుద్ధపుసందడి చేయు యోధుల వస్త్రములును అగ్నిలోవేసి దహించిన సమాధానకర్త. (5వ). నిత్యుడగు తండ్రి - వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము సింహాసనాసీనుడై రాజ్యపాలన చేయువాడు. (7వ.).

ఈలాగు జరిగినను ఆయన కోపము చల్లారలేదు. ఆయన బాహువు ఇంకను చాపబడియున్నది. అని 12,17,21,10:4 వచనాలలో ఉన్నది. కనుక 8-12వ. 13-17వ. 18-21వ. 10:1-4వ. వేరువేరుగా ధ్యానింతుము.

**8-12వ.** అష్షూరు రాజైన తిగ్లత్పిలేసర్ ద్వారా క్రీ.పూ. **732లో** గర్వము అను **పాపమును బట్టి ఇశ్రాయేలీయులను మొదటిగా శిక్షించుట 10వ:-** ఇశ్రాయేలీయులు వారి గర్వమును బట్టి ఆత్మీయ జీవితాలు చెడిపోయినను దిద్దుకొనలేదు. వారు లెక్కచేయక, అతిశయపడి మాటలాడుచున్నందున యెహోవా వాని మీదికి విరోధులైన వారిని హెచ్చించుచు వాని శత్రువులను రేపుచున్నాడు. తూర్పుననున్న సిరియా పడమటనున్న ఫిలిష్తీయులు నోరు తెరచి ఇశ్రాయేలును మింగివేయవలెనని యున్నారు. ఈలాగు జరిగినను ఆయన కోపము చల్లారలేదు. ఆయన బాహువు ఇంకను చాపబడియున్నది.

**13-17వ. అష్షూరు రాజైన షల్మనేసరుచే క్రీ.పూ 7216 పది గోత్రాలను, అబద్ధములాడుట అను పాపమునుబట్టి సంపూర్ణ నిర్మూలముచేయుట 15వ:-** ఇశ్రాయేలు జనులు తమ్ము శిక్షించిన దేవునితట్టు తిరుగుట లేదు. వారి పెద్దలును ఘనులును తలగా, ప్రవక్తలు

తోకగా కల్లలాడు అలవాటు కలవారు. ప్రజలను నాయకులు త్రోవ తప్పించువారు. వారందరును భక్తిహీనులును, దుర్మార్గులును, దుర్భాషలాడువారు. కనుక దేవుడు వారి యవనస్థులను, తలిదండ్రులు లేనివారిని, విధవరాండ్రయందైనను జాలిపడక వారందరిని కఠినముగా శిక్షించును. ఈలాగు జరిగినను ఆయన కోపము చల్లారలేదు. ఆయన బాహువు ఇంకను చాపబడియున్నది.

**18-21వ. రెండు పెద్ద గోత్రములైన మనష్షే - ఎఫ్రాయీములకు భక్తిహీనత అను పాపమునుబట్టి శిక్ష. (18వ).:-** యెహోవా ఉగ్రత అను అగ్నికి జనులు కట్టెలవలె కాల్చబడుచు తృప్తి లేక ఒకని నొకడు భక్షించుకొనుచు నశింతురు. ఈలాగు జరిగినను ఆయన కోపము చల్లారలేదు. ఆయన బాహువు ఇంకను చాపబడియున్నది.

# 10వ. అధ్యాయము
# (3+4+4+4+4+4+4+4+3=34వ)

**అంశము:- అష్షూరు రాజ్య పతనము**

**1-3వ. ఇశ్రాయేలీయుల న్యాయాధిపతులకు అన్యాయము అను పాపమునుబట్టి శిక్ష 2వ:-** విధవరాండ్రకు, తల్లిదండ్రులులేనివారికి, న్యాయవిమర్శ జరిగింపకుండ దరిద్రులకు, ప్రజలలోని బీదలకు, న్యాయమును తప్పించి అన్యాయపు విధులను విధించి, బాధకరమైన శాసనములను వ్రాయించు ఇశ్రాయేలీయుల న్యాయాధిపతులకు శ్రమ. దర్శనదినమున దేవుడు దూరమునుండి శత్రువు ద్వారా ప్రళయమును పంపి శ్రమ పెట్టుదునని చెప్పుచున్నాడు. సహాయము నొందుటకు ఎవరి యొద్దకు పారిపోయినను సహాయము దొరకదు. వారి ఐశ్వర్యమును కూడా పోవునని దేవుడు చెప్పుచున్నాడు. ఐశ్వర్యమును ఎక్కడ దాచుకొందురని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఈలాగు జరిగినను ఆయన కోపము చల్లారలేదు. ఆయన బాహువు ఇంకను చాపబడియున్నది.

**4-7వ. 8-11వ. ఇశ్రాయేలును శిక్షించిన దండమైన అష్షూరు - తన బలమునుబట్టి జయించితినని తలంచిన అష్షూరు:-** దేవుని సెలవుతో ఇశ్రాయేలును అష్షూరు జయించెను. కాని ఆలాగు అనుకొనక తన బలముతో జయించితినని యెరూషలేముపైకి దండెత్తుదునని తలంచును. కనుక అష్షూరు రాజుయొక్క హృదయ గర్వము వలన ఫలమునుబట్టియు అతని కన్నుల అహంకారపు చూపులనుబట్టియు అతని శిక్షింతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**12-15,16-19వ. అష్షూరీయుల గర్వము - అష్షూరీయులకు శిక్ష:-** గొడ్డలి తనతో నరుకు వాని చూచి అతిశయపడునా? రంపము తనతో కోయువాని మీద పొగడుకొనునా?

అష్షూరీయులు తాము దేవునిచేత వాడబడు గొడ్డలి, రంపము, కోల అని తలంచలేదు. కనుక ప్రభువు సైన్యములకధిపతియునగు యెహోవా బలిసిన అష్షూరీయులమీదికి క్షయరోగుము పంపును. వారిక్రింద అగ్నిజ్వాలలుగల కొరవికట్టె రాజును అనగా శిక్షించును.

**20-23, 24-27వ. శేషము దేవుని వైపు తిరుగుట - అష్షూరీయులను నాశనము చేయుట ద్వారా దేవుని కోపము చల్లారుట:-** శ్రమలు, మహా శ్రమల కాలములో ఇశ్రాయేలు శేషము దేవుని వైపు తిరుగును, యాకోబు శేషము బలవంతుడగు దేవునివైపు తిరుగును. సమూల నాశనము నిర్ణయింపబడెను. నీతి ప్రవాహమువలె వచ్చును. ఏలయనగా తాను నిర్ణయించిన సమూల నాశనము ప్రభువును సైన్యములకధిపతియునగు యెహోవా సర్వలోకమునకు కలుగజేయును. ఇకను కొద్ది కాలమైన తరువాత నా కోపము చల్లారును. వారిని నాశనము చేయుటకు నా ఉగ్రత తిరుగును.

**28-31, 32-34వ. అష్షూరీయులు యెరూషలేము వైపు వచ్చు వివరము - యెహోవా అష్షూరీయులను సంహరించు వివరము:-** ఈ దినమే దండు నోబులో దిగును. ఈ దినమే సీయోను కుమారి పర్వతమును యెరూషలేము కొండమీద వారు తమ చెయ్యి ఆడించుదురు. చూడుడి ప్రభువును సైన్యములకధిపతియునగు యెహోవా భీకరముగా కొమ్మలను తెగ గొట్టగా మిక్కిలి యెత్తుగల చెట్లు నరకబడును. ఉన్నతమైనవి పడిపోవును. ఇది శ్రమలు, మహాశ్రమల కాల చివరలో జరుగు హర్మెగెద్దోను యుద్ధము.

## 11వ. అధ్యాయము (5+4+7=16వ)

అంశము:- ఇమ్మానుయేలు గుణములు - రాబోవు రాజ్యము - వెయ్యి ఏండ్ల రాజ్య పరిస్థితి

**1-5వ. మెస్సియా గుణములు వేయి ఏండ్ల కాలము (రాజు):-**

11:1 <u>యెష్షయి మొద్దునుండి చిగురు</u> పుట్టును. 11:10 ఆ దినమున ప్రజలకు ధ్వజముగా నిలుచు చుండు <u>యెష్షయి వేరు చిగురు</u>నొద్ద జనములు విచారణ చేయును.

క్రీస్తు చిగురుఅను 11 లేఖనములు బైబిలులో కలవు:- 1) యెష 4:2 ఆ దినమున యెహోవా చిగురు మహిమయు భూషణమునగును. 2) యెష 6:13 దానిలో పదియవ భాగము మాత్రము విడువబడినను అదియును నాశనమగును. సింధూర మస్తకి వృక్షములు నరకబడిన తరువాత అది మిగిలియుండు మొద్దువలె నుండును; అట్టి (యూదా) మొద్దునుండి పరిశుద్ధమైన చిగురు పుట్టును. 3) యెష 11:1 యెష్షయి మొద్దునుండి చిగురు పుట్టును. 4) యెష 11:10 యెష్షయి వేరు చిగురు నొద్ద జనములు విచారణ చేయును. 5) జెక 3:8 ఏదనగా చిగురు అను నా సేవకుని నేను రప్పింపబోవుచున్నాను. 6) జెక 6:12

యెహోవా సెలవిచ్చునదేమనగా చిగురు అను ఒకడు కలడు; అతడు తన స్థలములో నుండి చిగుర్చును యెహోవా ఆలయము కట్టును. 7) యిర్మీయ 23:5 రాబోవు దినములలో నేను దావీదునకు నీతి చిగురును పుట్టించెదను; 8) యిర్మీ 33:15 ఆ దినములలో ఆ కాల మందే నేను దావీదునకు నీతిచిగురును మొలిపించెదను. అతడు భూమిమీద నీతి న్యాయములను అనుసరించి జరిగించును. 9) రోమా 15:12 యెషయా యీలాగు చెప్పుచున్నాడు - యెష్షయిలోనుండి వేరు చిగురు, అనగా అన్యజనుల నేలుటకు పుట్టువాడు వచ్చును; ఆయన యందు అన్యజనులు నిరీక్షణ యుంచుదురు. 10)ప్రక 5:5 ఆ పెద్దలలో ఒకడు - ఏడవకుము; ఇదిగో దావీదుకు చిగురైన యూదా గోత్రపు సింహము ఏడు ముద్రలను తీసి ఆ గ్రంథమును విప్పుటకై జయము పొందెనని చెప్పెను. 11) ప్రక 22:16 సంఘముల కొరకు ఈ సంగతులను గూర్చి మీకు సాక్ష్యమిచ్చుటకు యేసు అను నేను నా దూతను పంపియున్నాను. నేను దావీదు వేరు చిగురును సంతానమునైయున్నాను.

**చిగురును గూర్చిన పైన చెప్పిన 11 లేఖనముల వివరము:-**

1) ప్రక 22:16లో యేసు అను నేను దావీదు వేరు చిగురును సంతానము అనగా అన్యజనుల నేలుటకు పుట్టినవాడును, ప్రకాశమానమైన వేకువ చుక్కయునైయున్నాను. సంఘముల కొరకు ఈ సంగతులను గూర్చి మీకు సాక్ష్యమిచ్చుటకు యేసు అను నేను... పంపియున్నాను.

2) యెషయాలో 6:13లో అట్టి (యూదా) మొద్దు నుండి పుట్టిన పరిశుద్ధమైన చిగురుగాను, 11:1లో యెష్షయి మొద్దు చిగురుగాను, 11:10లో యెష్షయి వేరు చిగురుగాను, 4:2లో యెహోవా చిగురు గాను, 3) జకర్యాలో 3:8లో చిగురు అను సేవకుని గాను, 6:12లో చిగురు అను ఒకడు గాను, 6:12లో తన స్థలములో నుండి చిగుర్చు వానిగాను, 6:12లో యెహోవా ఆలయము కట్టు సేవకునిగాను ఉన్నాడు.

4) యిర్మీయాలో 23:5, 33:15లో దావీదునకు నీతి చిగురుగాను,

5) రోమాలో 15:12లో యెష్షయిలో నుండి పుట్టిన వేరుచిగురుగాను,

6) ప్రకటనలో 22:16 దావీదుకు వేరు చిగురుగాను ఉన్నాడు.

2వ. యెహోవా ఆత్మ 1) జ్ఞానము 2) వివేకములకు ఆధారమగు ఆత్మ. 3) ఆలోచన 4) బలములకు ఆధారమగు ఆత్మ. 5) తెలివిని యెహోవా యెడల భయము.

7) భక్తి పుట్టించు ఆత్మ అతని మీద నిలుచును - మత్త 3:16లో యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలో నుండి ఒడ్డునకు వచ్చెను. ఇదిగో ఆకాశము తెరువబడెను, దేవుని ఆత్మ పావురము వలె దిగి తన మీదికి వచ్చుట చూచెను.

3-4వ. యెహోవా భయము అతనికి ఇంపైన సువాసనగా ఉండును - మత్త 3:17 మరియు ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించు చున్నాని (ఇంపైన సువాసనగా) యొక శబ్దము అకాశము నుండి వచ్చెను.

1) కంటి చూపునుబట్టి అతడు తీర్పు తీర్చడు - యోహా 5:22 తండ్రి యెవనికిని తీర్పుతీర్చడు గాని, తండ్రిని ఘనపరచునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించి యున్నాడు. కుమారుని ఘనపరచనివాడు ఆయనను పంపిన తండ్రిని ఘనపరచడు.

2) తాను విను దానినిబట్టి విమర్శచేయడు - యోహా 12:47 ఎవడైనను నా మాటలు వినియు వాటిని గైకొనకుండిన యెడల నేనతనికి తీర్పు తీర్చను. నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదు గాని లోకమును రక్షించుటకే వచ్చితిని.

3) విశ్వాసుల తీర్పు:- నీతినిబట్టి బీదలకు తీర్పు తీర్చును. భూనివాసులలో దీనులైన వారికి యథార్థముగా విమర్శ చేయును.

4) అవిశ్వాసుల తీర్పు:- తన వాగ్దండము చేత లోకమును కొట్టును - తన పెదవుల ఊపిరిచేత దుష్టులను చంపును - ప్రక 20:13. సముద్రము తనలో ఉన్న మృతులను అప్పగించెను. మరణమును పాతాళ లోకమును వాటి వశమునన్నున్న మృతుల నప్పగించెను. వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పుపొందెను. ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్ని గుండములో పడవేయబడెను. ప్రక 19:21. కడమవారు గుఱ్ఱముమీద కూర్చున్న వాని నోటనుండి వచ్చిన ఖడ్గముచేత వధింపబడిరి.

5వ. నడుమునకు నీతని, నడికట్టుగా సత్యమును కలిగినవాడు యేసే. యెష 53:11 ప్రకారము నీతిమంతుడైన సేవకుడుగా జనులను నిర్దోషులుగా చేశాడు. యోహా 14:6 యేసు నేనే మార్గమును, సత్యమును అన్నాడు.

రాజ్య పాలనలోని వివరములను క్రింది వచనాలలో చూడగలము.

**1) మందిర మహిమ:-** అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును ప్రవాహము వచ్చినట్లు సమస్త జనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము యెరూషలేములోనుండి యెహోవా వాక్కు బయలు వెళ్ళును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు వచ్చెదరు. (వేయి ఏండ్ల కాలములో వుండు ఈ మందిర వివరములు, ఆరాధన వివరములు యెహె 43-44అ.లో చెప్పబడినవి.)

**2) ప్రజల ప్రవర్తన:-** యెహోవా పర్వతమునకు మనము వెళ్ళుదము రండి. ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును. మనము అయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు. ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును, అనేక జనములకు తీర్పు తీర్చును, వారు తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను తమ యీటెలను మచ్చుకత్తులుగాను సాగగొట్టుదురు, జనము మీదికి జనము ఖడ్గమెత్తక యుండును. యుద్ధము చేయ నేర్చుకొనుట ఇక మానివేయును. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము యెరూషలేములోనుండి యెహోవా వాక్కు బయలువెళ్లును కనుక యెరూషలేము కేంద్రముగా ఈ పాలన జరుగునని గమనించాలి.

**3) జంతువులలో మార్పు:-** యెషయా 11:6-9వ. గమనించండి. తోడేలు గొఱ్ఱెపిల్ల యొద్ద వాసము చేయును. చిరుతపులి మేకపిల్ల యొద్ద పండుకొనును. దూడయు కొదమ సింహమును పెంచబడిన కోడెయు కూడుకొనగా బాలుడు వాటిని తోలును. ఆవులు, ఎలుగులు కూడి మేయును వాటి పిల్లలు ఒక్కచోటనే పండుకొనును. ఎద్దు మేయునట్లు సింహము గడ్డి మేయును. పాలుకుడుచు పిల్ల నాగుపాము పుట్టయొద్ద అట్లాడును. మిడినాగు పుట్టమీద పాలు విడిచిన పిల్ల తన చెయ్యి చాచును. నా పరిశుద్ధ పర్వత మందంతటను ఏ మృగమును హాని చేయదు. నాశనము చేయదు. సముద్రము జలముతో నిండియున్నట్లు లోకము యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియుండును. యెష 65:23-25వ. గమనించండి. తోడేళ్ళును గొఱ్ఱెపిల్లలును కలిసి మేయును. సింహము ఎద్దువలె గడ్డి తినును. సర్పమునకు మన్ను ఆహారమగును. నా పరిశుద్ధ పర్వతములో అవి హానియైనను చేయకుండును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**4) ఆయుష్కాలము పెరుగుట:-** యెషయా 65:20 గమనించండి. అక్కడ ఇకను కొద్ది దినములే బ్రదుకు శిశువులుండరు. కాలము నిండని ముసలివారుండరు. బాలురు నూరు సంవత్సరముల వయస్సుగలవారై చనిపోవుదురు. పాపాత్ముడై శాపగ్రస్తుడగువాడు సహితము నూరు సంవత్సరములు బ్రదుకును అని చెప్పబడినది.

యెష 65:23-25వ. వారు వృథాగా ప్రయాసపడరు ఆకస్మికముగా కలుగు అపాయము నొందుటకై పిల్లలను కనరు. వారు ఆశీర్వదింపబడిన వారగుదురు. వారి సంతానపు వారు వారి యొద్దనే యుందురు. వారు వేడుకొనక మునుపు నేను ఉత్తరమిచ్చెదను.

**5) రాజ్య పాలన చేయు వారెవరు?:-** వీరు వెయ్యి సంవత్సరములు రాజ్యము చేయుదురు. (6వ). విశ్వాసులు తాము చేసిన పనినిబట్టి ఈ రాజ్య పాలనలో అధికారము గలవారై యుందురు. ఈ క్రింది లేకనములను గమనించండి. అతని యజమానుడు భళా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటి

మీద నియమించెదను. (మత్త 25:21). అతడు భళా, మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి గనుక పది పట్టణముల మీద అధికారివై యుండుమని వానితో చెప్పెను (లూకా 19:17). 9వ. సముద్రము జలముతో నిండియున్నట్టు లోకము యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియుండును. లోకము యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియుండు రాజ్యము ఎంత రమ్యముగా నుండునో గమనించండి.

**10-16వ. ఇశ్రాయేలు సమకూర్పు (10-12వ.) - శత్రు నాశనము (13-14వ) - ఇశ్రాయేలు సమకూర్చబడిన విధానము (15-16వ).:-** 10-12వ. జనములను పిలుచుటకు ఆయన యొక ధ్వజము నిలువబెట్టును భ్రష్టులైపోయిన ఇశ్రాయేలీయులను పోగుచేయును. భూమి యొక్క నాలుగు దిగంతములనుండి చెదరిపోయిన యూదా వారిని సమకూర్చును.

13-14వ. ఎఫ్రాయిమునకున్న మత్సరము పోవును యూదా విరోధులు నిర్మూలమగుదురు. ఎఫ్రాయిమును బాధింపడు.

15-15వ. మరియు యెహోవా ఐగుప్తు సముద్రము యొక్క అఖాతమును నిర్మూలము చేయును 'వేడిమిగల తన ఊపిరిని ఊదును' యూఫ్రటీసు నది మీద తన చెయ్యి ఆడించును. ఏడు కాలువలుగా దాని చీలగొట్టును పాదరక్షలు తడువకుండ మనుష్యులు దాటునట్లు దాని చేయును. ఐగుప్తుదేశమునుండి ఇశ్రాయేలు వచ్చిన దినమున వారికి దారి కలిగినట్లు అష్షూరు నుండి వచ్చు ఆయన ప్రజల శేషమునకు రాజమార్గముండును.

గమనిక:- యెషయా 35అ.లో దేశ, దేహ, ప్రకృతిలోని మార్పులు గమనించండి.

## 12వ. అధ్యాయము

### యూదా విమోచననుబట్టి రక్షణ ఆనంద స్తుతికీర్తన (6వ)

**1వ. పరిశుద్ధ దేవుని ఆదరణను బట్టి స్తుతించుట:-** ఆ దినమున మీరీలాగందురు యెహోవా, నీవు నా మీద కోపపడితివి. నీ కోపము చల్లారెను నిన్ను స్తుతించుచున్నాను. నీవు నన్ను ఆదరించి యున్నావు. దీని భావము శ్రమలు, మహా శ్రమల కాలములో యూదావారు దేవుని కోపమునకు గురియైరి. తరువాత వేయి ఏండ్ల పాలనలోని మేలులనుబట్టి ఆదరించబడి దేవుని స్తుతించిరి.

**2వ. ఆయన రక్షణ బలమే కీర్తనకు ఆస్పదము:-** ఇదిగో నా రక్షణకు కారణభూతుడగు దేవుడు నేను భయపడక ఆయనను నమ్ముకొనుచున్నాను. యెహోవా యెహోవాయే నాకు బలము. ఆయనే నా కీర్తనకాస్పదము ఆయన నాకు రక్షణాధారమాయెను - మన

పాపములను పరిహరించినందున రక్షణకు కారణభూతుడు ఆయనే. ఈ మేలులనుబట్టి కీర్తనకు ఆస్పద భూతుడు ఆయనే.

**3వ. ఆనందించుట - బావులలో నీళ్ళు చేదుకొనుట:-** కావున మీరు ఆనందపడి రక్షణాధారములైన బావులలోనుండి నీళ్ళు చేదుకొందురు. ఆ దినమున మీరీలాగందురు - ఈ లోకములోని ఏ బావులు రక్షణ నివ్వలేవు. రక్షణాధారమైన బావి యేసుక్రీస్తే. ఆయనలోనే ఆనందము.

**4వ. ఆయన నామ ఘనతను, క్రియలను స్తుతించుట:-** యెహోవాను స్తుతించుడి ఆయన నామమును ప్రకటించుడి. జనములలో ఆయన క్రియలు ప్రచురము చేయుడి - ఆయన నామము ఘనమైనదని ప్రకటించాలి, ప్రచురము చేయాలి, స్తుతించాలి అనగా జ్ఞాపకమునకు తెచ్చుకోనాలి.

**5-6వ. ఆయన మహాత్మ్యమును కీర్తించుట:-** ఘనతను ఉత్సాహధ్వని చేయుట:-

యెహోవాను గూర్చి కీర్తన పాడుడి. ఆయన తన మహాత్మ్యమును వెల్లడి పరచెను. భూమియందంతటను ఇది తెలియబడును - ఈయన మహాత్మ్యమును, ఘనతను భూమియందంతటను గల దేవుడు, కనుక ఉత్సాహ ధ్వని బిగ్గరగా చేయుచు ఆయనను కీర్తించాలి.

## 13-23 అధ్యాయములు - పొరుగు శత్రు దేశాలపై దేవుని తీర్పులు

ఈ రెండవ భాగములో ప్రభువైన యెహోవా యెషయా దృష్టిని ఇశ్రాయేలుకు చుట్టుగా నున్న పది దేశాలకు చెందిన జనుల మీదకు మళ్లించుచున్నాడు. అవసరమైనప్పుడు ఈ పది దేశముల ద్వారా ఇశ్రాయేలును క్రమశిక్షణకు తెచ్చుటకు దేవుడు వీరిని వాడుకుంటాడు. క్రమశిక్షణకు బదులు ఈ దేశముల ప్రజలు ఇశ్రాయేలును బహుగా శిక్షించి, గాయపరచినందున దేవుడు ఈ పది దేశముల వారిని శిక్షింతునని చెప్పిన దేవోక్తులు ఈ భాగమందు కలవు.

| | |
|---|---|
| 1. 13:1-14:27వ..... | 1) బబులోనుకు, 2) అష్షూరుకు దేవోక్తులు. |
| 2. 14:28-32అ..... | 3) ఫిలిష్తీయులకు దేవోక్తి |
| 3. 15-16అ .... | 4) మోయాబుకు దేవోక్తి |
| 4. 17-18అ.... | 5) దమస్కుకు, 6) కూషుకు దేవోక్తి |
| 5. 19-20అ.... | 7) ఐగుప్తుకు దేవోక్తి |
| 6. 21:1-10వ.... | అడవి దేశమునకు (బబులోనుకు) దేవోక్తి |

7. 21:11-12వ.... 8) ఎదోముకు దేవోక్తి

8. 21:13-17వ... 9) అరేబియాకు దేవోక్తి

9. 22 అ... దర్శనపు లోయకు (యూదా) దేవోక్తి

10. 23 అ..... 10) తూరుకు దేవోక్తి

ఇశ్రాయేలు దేశమునకు చుట్టు పై దేశముల స్థానము బైబిల్ చివరి పేజిలో నున్న పటము చూపించును.

## 13వ. అధ్యాయము (4+4+5+5+4=22వ)

### అంశము:- బబులోనును గూర్చి దేవోక్తి

**1-4వ. బబులోను పైకి సైన్యమును పిలుచుట:-**

1వ. బబులోను పట్టణము బలమైన పట్టణము. చూద ముచ్చటైనది నెబుకద్నెజరు రాజు తన భార్య కొండల ప్రాంతమునకు చెందినదైనందున పట్టణము గుండా ప్రవహించు యూఫ్రటీసు నదికి ఆనకట్టలను కట్టి నీటిని రాజ భవనపు పైకి పారునట్లు చేసి పైనుండి క్రిందికి వ్రేలాడు ఉద్యానవనములు కట్టించాడు. పట్టణము చుట్టు రెండు ప్రాకారములు. ఒక్కొక్కటి 396 అడుగుల ఎత్తు, 85 అడుగుల వెడల్పుగలవి. దీని చుట్టు యూఫ్రటీసు నది పారును. ఇత్తడి తలుపులు ఇనుపగడియలు ప్రాకారములో నుండెను. మాదీయులను వారిపైకి రేపెదనని 17వ వచనములో చెప్పుచున్నాడు. మాదీయులు పారశీకులు సుమారు 25/50 లక్షల సైన్యము గలవారు.

2-3వ. కొండలపై ధ్వజము నిలువబెటి, ఎలుగెత్తి సంజ్ఞ చేసి మాదీయుల సైన్యములను సమకూర్చుదునని చెప్పుచున్నాడు. 4వ. వారి సైన్యము 25/50 లక్షలు కనుక కొండలలో బహుజనుల ఘోష, జన సమూహముల శబ్దము, జనముల అల్లరి వినబడునని చెప్పుచున్నాడు. ప్రభువు తానే మాదీయుల సైన్యమును క్రమముగా ఏర్పరచుదునని చెప్పుచున్నాడు.

**5-8వ. బబులోనీయులు భయపడుట:-**

ఈ భాగములో బబులోను పైకి వచ్చు మాదీయ రాజులను గూర్చి మాత్రమేకాక అంత్యకాల బబులోను పతనమును గూర్చియు చెప్పుచున్నాడు. ప్రభువు దినము వచ్చుచున్నదని 6వ. వనములో నున్నందున ఈ భాగములోని ప్రవచనము అంత్య కాలములో

నెరవేరుటను సూచించును. ఏడేండ్ల శ్రమల, మహా శ్రమలకాలమందు చివరలో కలుగు ఏడు నాశనములలో ప్రకటన 18 అధ్యాయములో బబులోను పట్టణ నాశనము చెప్పబడినది. 1. ఆ నాశనము ప్రళయము వలె సర్వశక్తిగల దేవుని యొద్ద నుండి వచ్చును. 2. అందరి బాహువులు దుర్బలమగును. 3. ప్రతి వాని గుండె కరిగిపోవును. 4. జనులు విభ్రాంతి నొందుదురు. 5. వేదనలు దుఃఖములు కలుగును. 6. ప్రసవవేదన పడువారివలె ఒకరి నొకరు తేరి చూతురు. 7. వారి ముఖములు ఎఱ్ఱబారును.

**9-13వ. శ్రమలు మహా శ్రమల కాలములో దేవుడు జరిగించు కార్యములు:-**

9వ. ఆ దినములలో దేశములు పూర్తిగా పాడగును. పాపము చేసినవారినందరిని దేవుని ఉగ్రతా పాత్రల కుమ్మరింపు ద్వారా (ప్రకటన 16:2-8) నాశనము చేయును. 10వ. అకాశ నక్షత్రములు సూర్యుడు, చంద్రుడు వెలుగివ్వవు. (ప్రక 6:12-13, 8:12, మత్త 24:29). 11-12వ. బబులోను బంగారు వెండిచే నిండినదని నరులు అనేకులు చనిపోయినందున బంగారు కంటే నరులు అరుదుగా నుందురని చెప్పుచున్నాడు. (ప్రక 13:6). 13వ. భూమ్యాకాశములు స్థానము తప్పుట, వణకుట ప్రకటన 6:12-14వచనాలలోనున్న భూకంపములు, కొండలు, ద్వీపములు స్థానము తప్పుటను, ఆకాశము చుట్టబడి తొలగిపోవుటను సూచించును.

**14-18వ. మాదీయుల ద్వారా బబులోనీయులు కూలుట:-**

14వ. మాదీయులు తరుమగా బబులోనులో నివసించు ఇతర దేశస్తులు వారి వారి దేశములకు పారిపోవుదురు. 15వ. బెల్షస్సరు అతని పరివారము కత్తివాత కూలుదురు. (దానియేలు 5:30). 16వ. వారి భార్యలు చెరపబడి, పిల్లలు చంపబడి యిండ్లు దోచుకొనబడెను. 17వ. మాదీయులు దయచూపక వెండి బంగారములు పుచ్చుకొను యెవరినైనను విడువక యుందురు. 18వ. ఎవరిని కరుణింపక యౌవనులును పిల్లలు అందరిని చంపివేయుదురు.

**19-22వ. బబులోను సంపూర్ణముగ నాశనము:-**

బబులోనులో ఎవరును నివసింపకుండా యుందురు. కనీసము సంచార జాతియైన అరబీయులు కూడా తమ గుడారములను వేసికొనరు. గురుపోతులు, నక్కలు, నిప్పుకోళ్ళు, అడవికుక్కలు కొండ మేకలు నివసించునందున, గొర్రెల కాపరులు అక్కడ మందలను నివసింపనివ్వరు. ఆ ప్రాంతము ఎన్నటికి పాడుగానుండును. దీని నెరవేర్పుగా బబులోను పట్టణ ప్రాంతము నేటికిని పాడుగా నున్నది.

# 14వ. అధ్యాయము (4+4+3+6+5+5+5=32వ)

**అంశము:- బబులోను, అష్షూరు, ఫిలిష్తీయను గూర్చిన దేవోక్తి**

**1-4వ. స్వదేశమునకు తిరిగివచ్చిన ఇశ్రాయేలు:-**

యెహోవా ఇశ్రాయేలుకు ఏడేండ్ల మహా శ్రమలకాలమున కలిగిన శ్రమలనుబట్టి జాలిపడి యెరూషలేములోని ఒలీవల కొండపైకి దిగివచ్చి వారిని విమోచించి వేయిఏండ్ల పాలనలోనికి ప్రవేశపెట్టును. ఇశ్రాయేలీయులు శ్రమల కాలమున చెదిరిపోగా దేవుడు వారిని స్వదేశమునకు తీసుకొనివచ్చి ప్రవేశపెట్టును. ఒకప్పుడు ఇశ్రాయేలును దాసులుగా చెరగొనిపోయిన అన్యులు ఇప్పుడు ఇశ్రాయేలుకు దాసులుగా నుందురు. వేయి ఏండ్ల పాలనలో యూదావారు క్రీస్తుతో కలసి పాలించు వారుగానుందురు. మత్తయి 19:28. ప్రకారము ఒకప్పుడు ఇశ్రాయేలును పాలించిన అన్యులు ఇప్పుడు ఇశ్రాయేలుచే పాలించబడుదురు.

**5-8వ. బబులోను నాశనమును బట్టి ఇశ్రాయేలీయులు బబులోను రాజును అపహసించుట:-**

తమ్మును బాధించిన బబులోనువారు, నాశనమైరి. బబులోను అనగా ఇప్పటి ఇరాక్, ప్రజలు నిత్యము రేగుచుండినవారుగానే యున్నారు. అటువంటి పట్టణము నాశనము కాగా ఇశ్రాయేలువారు అపహసించుచున్నారు. బబులోను ఏలికలు అనేకులను హత్యచేసినవారు. అటువంటి వారిని యెహోవా ప్రకటన: 18వ అధ్యాయములో ఏడేండ్ల శ్రమల కాలములో విరుగగొట్టినందున భూలోకమంతయు వేయి ఏండ్ల పాలనలో నెమ్మదిగా నుండును. యుద్ధ సమయములందు ముట్టడి దిబ్బలు వేయుటకు చెట్లను నరుకుదురు. ప్రాకారములను పడగొట్టుటకు పెద్దవైన మ్రానులను వాడుదురు. వేయి ఏండ్ల పాలనలో యుద్ధములు లేనందున తమ్మును నరుకువారు లేరని వృక్షాలకు రాజగు దేవదారు వృక్షములు రాణియగు తమాల వృక్షములు హర్షించును.

**9-11వ. పాతాళమందలివారు బబులోను రాజు నశనమునుబట్టి అపహసించుట:-** బబులోను రాజుచే అంతకుముందుగా సంహరించబడిన రాజులు పాతాళమందున్నారు. బబులోను రాజు కూడా సంహరించబడి పాతాళమునకు వెళ్ళుచున్నందున పాతాళములో ఉన్న తానింతకముందు సంహరించిన రాజులు కలవరపడుదురు. బబులోను రాజ్యము స్థిరమైనదని గతములో తలంచినందున "నీవు కూడా బలహీనుడవైతివా" అని బబులోను రాజును ప్రశ్నించుదురు.

బబులోను రాజు యొక్క స్వరమండలములు వాయిద్యములన్నియు పాతాళములో పడవేయబడును. మార్కు9:48 ప్రకారము నరకములో "అగ్ని ఆరదు. వారి పురుగు

చావదు" అన్నట్లు పాతాళమందు బబులోను రాజు తన క్రింద పురుగులు వ్యాపించినవాడై కీటకములచే కప్పబడియుండును.

**12-17వ. తేజో నక్షత్రము - వేకువ చుక్కయగు సాతాను పతనము:-**

బబులోను రాజులు విగ్రహములను పూజించిరి. విగ్రహములకు అర్పించు బలులు దయ్యములకని 1కొరింథీ 10:20లో ఉన్నది. కనుక విగ్రహముల వెనుక దయ్యములు కలవు. బబలోను రాజు వెనుక దయ్యముల అధిపతిగా సాతానును ఈ భాగమందు చూతము. కనుక యోహాను 14:30లో లోకాధికారియని 2 కొరింథీ 4:4 యుగసంబంధమైన అధిపతియని పిలువబడుచున్నాడు. సాతాను దేవునిచేత సృజించబడినప్పుడు తేజో నక్షత్రమని, వేకువ చుక్కయని పేరులు పెట్టెను. పాపములో పడకముందు పరలోకములో ఉన్నత స్థలమును కలిగియుండెను. (యెహె 28:16). ప్రస్తుతము కూడా యోబు 1:8లోనున్నట్లు దేవదూతలతో కలసి పరలోకమందున్న దేవుని యొద్దకు వెళ్ళుచున్నాడు. ప్రకటన 12:9లో భూమిపై పడవేయబడెను. భూమిపై మానవులను శోధించువాడుగాను (లూకా 22:31) బలహీనపరచువాడుగాను (లూకా 13:11,16) పాపములో పడవేయబడుగాను చూతుము. దేవునిచేత ప్రకటన 20:9-10వచనాలతో తీర్పు తీర్చబడి నరకములో ఒక మూలకు త్రోసివేయబడును.

13-14వచనములో అపవాది పాపములో పడుటకు కారణము తన మనస్సులో తన్ను తాను దేవునితో సమానముగా చేసికొందునని హెచ్చించుకొనుటయే. దేవుని నక్షత్రముకంటె పైగా తన సింహాసనమును హెచ్చించుకొనవలెనని తలంచుటయే. ఐదు రకములైన హెచ్చింపులను కోరెను. 1. నేను ఆకాశమునకు ఎక్కి పోయెదను. (12వ). 2) దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చింతును (13వ.) 3) దూతల సభా పర్వతముపై కూర్చుందును. (13వ). 14) మేఘ మండలము మీదికెక్కుదును. (14వ). 5) మహోన్నతునితో నన్ను నేను సమానునిగా చేసికొందును. (14వ). దేవుని సృష్టిలో ఇదియే మొదటి పాపము (1 యోహాను 3:8లో అపవాది మొదటినుండి పాపము చేయుచున్నదని ఉన్నది.) దూతలలో మూడవ భాగము తనను వెంబడించునట్లు చేయగా వారు ఇప్పుడు చెడిపోయిన దూతలుగాను దయ్యములుగానున్నారు. అలాగే మనష్యులను సైతము మోసపుచ్చువాడుగాను, 2 థెస్స. 2:4 మరియు ప్రకటన 13:2,8 ప్రకారము తానే దేవుడనని తన్ను తాను కనపరచుకొనును. చివరకు ప్రకటన 20:10 ప్రకారము అగ్ని గుండములో పాల్గొనును. ప్రస్తుతమైతే భూమిలో నున్న మానవులను కంపింపచేసి లోకమును అడవిగా చేయుచు, పట్టణములను పాడుచేయుచున్నాడు. మానవులను చెరపట్టి దేవుడు

మానవులకు సిద్ధపరచిన పరలోకమునకు పోనియ్యక సాతానుకు సిద్ధపరచిన (మత్తయి 25:38) అగ్ని గుండమునకు నడిపించుచున్నాడు.

**18-23వ. బబులోను రాజును గూర్చి మరిన్ని వివరాలు:-** 18-19వచనముల ప్రకారము బబులోను చివరి రాజైన బెల్షస్సరు ఖడ్గము చేత చంపబడి సమాధికి రాక పారవేయబడెను 19-22 వచనముల ప్రకారము బబులోనువారి దుష్టత్వమును బట్టి వారి సంతతి వ్యాపింపబడకుండ అందరు నశించిరి. 22 వచనమందు రాజును, కుమారుని, మనవడిని కొట్టివేయుట నెబుకద్నెజరు, కుమారుడు ఎవీల్మెరోదకు అతని కుమారుడు అనగా నెబుకద్నెజరు మనుమడగు బెల్షస్సరు దేవునిచేత కొట్టివేయబడిరి. 23వ వచనమందున్నట్లు చీపురుకట్టతో తుడిచివేయుట మాదీయుడగు దర్యావేషు బబులోను పట్టణమందు ప్రవేశించి నాశనము చేసి చీపురుతో తుడిచివేసినట్లు మరెన్నడు కట్టబడవీలులేనట్లు చేసెను.

**24-27వ. అష్షూరు పట్ల దేవుని ఉద్దేశ్యము:-** 24-25వ. ఇశ్రాయేలు ప్రజలు విశ్రాంతి సంవత్సరములను పాటించక దేవుని మాట వినక, పది గోత్రముల ఇశ్రాయేలు రాజ్యము విగ్రహారాధనతో నిండియుండగా అహాజు రాజు యూదాను పాలించునప్పుడు పదిగోత్రముల ఇశ్రాయేలు రాజ్య ప్రజలను క్రీ.పూ 732, 721లో అష్షూరీయులు దండెత్తి వచ్చి ఇశ్రాయేలు ప్రజలను చెరగొనిపోయిరి. అష్షూరీయులును విగ్రహారాధికులే. దేవుడు అష్షూరు రాజ్యమును పతనము చేయుటకే బబులోను వారికి క్రీ.పూ. 606లో ప్రపంచ అధికారమిచ్చాడు. వరుసగా అన్యులకు ప్రపంచ అధికారమిచ్చినను అటు అష్షూరీయులుకాని, బబులోనీయులుకాని విగ్రహారాధన మానినవారు కారు. కనుక బబులోనుకంటె ముందుగా అష్షూరీయులను సంహరింతునని యూదాపై అష్షూరు కాడి తొలగిపోవునని చెప్పుచున్నాడు.

26-27వ. ప్రపంచమందలి ఏ దేశముపైనకాని అన్ని దేశముల ప్రజలపై యెహోవా తన బాహువును చాపియున్నాడు. ఆయన ఆలోచనను ఎవరు రద్దుపరచజాలరు. ఎవరు త్రిప్పివేయలేరు. ఆయన సర్వాధికారి, అధిపతులను, నియమించువాడు.

**28-32వ. ఫిలిష్తియపై దేవోక్తి:-** 28-29వ. రాజులైన ఉజ్జియా (క్రీ.పూ 779-729) అతని కుమారుడు యోతాము (క్రీ.పూ 749-734), అతని కుమారుడైన ఆహాజు (క్రీ.పూ 728-714), అతని కుమారుడైన హిజ్కియా (క్రీ.పూ. 714-687) యూదా వారిని పాలించిరి. ఉజ్జియా కాలమందు 2 దిన 26:6-7వలో ఫిలిష్తీయులను జయించి యుండెను. కాని 2 దిన 28:18వ.లలో ఫిలిష్తీయులు ఉజ్జియా మనుమడైన ఆహాజును ఓడించియుండిరి. ఫిలిష్తీయులు తమ్మును ఓడించిన ఉజ్జియా, అతని కుమారుడైన యోతాము, మనుమడైన ఆహాజు ఇప్పుడు మరణించినందున ఫిలిష్తీయులు సంతోషించుచున్నారు. కాని దేవుడు సర్పము, అనగా ఉజ్జియా దానికి పుట్టిన మిడునాగు యోతాము మరణించినను, వారి

గర్భమున పుట్టిన ఎగురు సర్పము అనగా హిజ్కియా కాలమందు దేశములో క్షేమము కలుగునని చెప్పుచున్నాడు. 30వ అతిబీదలు సహా హిజ్కియా కాలమందు భోజనము చేసి సురక్షితముగా నుండి తమ విస్తార పంటనుండి మందిరముకు పదియవవంతు విస్తారముగా తెచ్చిరి. (2 దిన. 31:5) యెహోవా అందరి చేతిలోనుండి (ఫిలిష్తీయులనుండి కూడా) కాపాడెనని 2 దిన 33:22లో చూచుచున్నాము. యెషయా 11:14లో ఫిలిష్తీయులు యూదావారి నుండి పడమటివైపునకు పారిపోవుదురని చెప్పబడినది.

31-32వ. ఫిలిష్తీయులు బొత్తిగా నాశనమగుదురని వారి గుమ్మములు పట్టణములు అంగలార్చవలెనని యెహోవా సీయోనును స్థాపించియున్నాడని ప్రవచించబడినది. క్రీ.శ. ఆరవ శతాబ్దములో మహమ్మదీయులు ఫిలిష్తీయులను జయించి దేశమంతటిని మహమ్మదీయులుగా మార్చిరి. వారే ఇప్పటి జోర్డానీయనులు. నేడు జోర్డాన్ ఒక రాజ్యముగా లేక పూర్తిగా ఇశ్రాయేలు దేశములో కలిసిపోయినది. వారి నాయకుడగు అరాఫత్ క్రీ.శ. 2004లో మరణించాడు. ఫిలిష్తీయుల దేశములో యెహోవా సీయోనును స్థాపించుట అనగా ఆ దేశమును ఇశ్రాయేలీయులకప్పగించుట నేడు చూచుచున్నాము.

## 15-16వ. అధ్యాయములు (9+14= 4+5+5+5+4=23వ)

### అంశము:- మోయాబును గూర్చిన దేవోక్తి

**1-4వ. పాడైన పట్టణముల కొరకు మోయాబీయుల ప్రలాపము:-**

1-2వ. యెహోషువ 13:9 అరోయేరు, దీబోను, మేదెబా అను పట్టణములు రూబేను గోత్రమునకు స్వాస్థ్యముగా ఇవ్వబడినవి. సంఖ్యా 32:3లో నెబో కూడ రూబేను స్వాస్థ్యమే. మోయాబీయులు వాటిని ఆక్రమించి అర్మోయాయాబు, దీబోను, నెబో, మేదెబాలో నివసించిరి. దేవుడు వాటిని నిశింపచేతునని సెలవిచ్చుచున్నాడు. మోయాబీయులు ప్రలాపింతురు. తలలు బోడిచేయుట గడ్డము గొరిగింపబడుట మోయాబీయులు బానిసలగుదురని భావము. 3-4వ. హెష్బోను, యాహసులు రూబేనీయుల స్వాస్థ్యములే మోయాబీయులు వశపరచుకొని నివసించిరి. పైన చెప్పబడిన పట్టణములందుండు యోధులందరు పట్టణ నాశనమునుబట్టి కేకలు వేయుచు వణకుచున్నారు.

**5-9వ. పారిపోవుచున్న మోయాబీయులు:-** యుద్ధమందు ఓడి కేకలు వేయుచు రోదించుచు మోయాబీయులు వారి పట్టణములను విడిచి పారిపోవుదురు. యుద్ధమునకు తోడు కరువు కలిగినందున చెట్లు ఎండిపోవును. గడ్డిలేక ఆహార లేమినిబట్టి మిగిలిన జనులు వేరు ప్రాంతములకు వెళ్ళుదురు. 9వలో ఆ దేశములో శేషించినవారి మీదికి సింహము వచ్చును

అనగా ప్రవచన అంత్యకాలనెరవేర్పులో యూదాగోత్ర సింహమైన క్రీస్తు శేషించిన జనులపైకి వచ్చి యుద్ధమాడును.

**16:1-5వ. అంత్యకాలమందలి క్రీస్తు పాలన (మోయాబు ప్రాంతములో కూడా ప్రభువు పాలన):-** 1-3వ రాజులు రెండవ గ్రంథము 3:4లో మోయాబు రాజగు మేషా 20 లక్షల గొర్రెలను ఇశ్రాయేలు రాజులు పన్నుగా నిచ్చెను. అలాగే శ్రమల కాలము అంతమైన తరువాత వేయి ఏండ్ల పాలనలో మోయాబీయులు సీయోను కుమార్తె పర్వతముపై ఏలువానికి గొర్రెపిల్లలను పంపుట మోయాబీయులందరు క్రీస్తు పాలనలో యూదావారిచేత పాలించబడుదురని దీని భావము. 4వ. క్రీ.పూ. 606 నుండి 586 వరకు యూదులను బబులోను రాజు చెరగొను సమయమున యిర్మీయా 40:11-12వచనముల ప్రకారము కొద్దిమంది యూదులు మోయాబు ప్రాంతమందు, తలదాచుకొనిరి. అలాగే అంత్యకాలములోను శ్రమలు మహాశ్రమల కాలమున యూదులు ప్రకటన 13లో చెప్పబడిన క్రీస్తు విరోధినుండి తప్పించుకొనుటకై మోయాబును ఆశ్రయింతురు. 5వ. యూదులను శ్రమపరచిన క్రీస్తు విరోధి ప్రకటన 19:20-21వచనాలలో నశించెను. శ్రమల కాలమందు కాపాడిన అన్యులను (ఇక్కడ మోయాబీయులను) మత్తయి 25:31-40 వచనముల ప్రకారము వేయి ఏండ్ల పాలనలో ప్రవేశపెట్టి ప్రభువు కాపాడును. దేవుని కృప వలన స్థాపించబడిన సింహాసనము కృపామయుడైన యేసుదే. సత్యమని యోహాను 14:7లో చెప్పబడిన సత్య సంపన్నుడైన యేసే సింహాసనాసీనుడై న్యాయము జరిగించును.

**6-10వ. మోయాబీయుల పాపము - పరితాపము:-** పరిశుద్ధాత్మ మోయాబీయుల గత కాల పాపమైన గర్వమును గూర్చి ప్రస్థావించుచున్నాడు. యిర్మీయా 48:29-30లో చెప్పబడినట్లు మోయాబీయులు తమ గర్వమను పాపమును వీడుటకు బదులు వ్యర్థముగా వదరుచున్నారని ప్రవక్త సెలవిచ్చుచున్నాడు. అందుచేత శిక్షగా మోయాబీయులు అంగలార్చుదురు.

**11-14వ. మోయాబీయుల పాపమునకు దేవుని న్యాయమైన శిక్ష:-** 11వ. యెషయా మోయాబీయులకు కలుగు శిక్షను గూర్చి దుఃఖించుచున్నాడు. ప్రవక్త తన గుండె కొట్టుకొన్నట్లు అంతర్యము సితారవలె వాగినట్లు చెప్పుచున్నాడు. 12వ వచనమందు మోయాబీయులు తమ గుడిలో సంఖ్యా 21:29లో కెమోషుకు ప్రార్థించిరి. యెహోవా వైపు తిరుగులేదు. కనుక వారికి విడుదల అనుగ్రహించబడలేదు. 13-14వచనములందు మూడు సంవత్సరములలో మోయాబీయులు అవమానపరచబడుదురని ప్రవచనము చెప్పబడినది. పాపము చేయు ప్రజలను ప్రభువు శిక్షించునను పాఠమును నేర్చుకొనగలము.

# 17వ. అధ్యాయము (3+3+2+3+3=14వ)

అంశము:- దమస్కు (పది గోత్రముల ఇశ్రాయేలు)ను గూర్చిన దేవోక్తి

**1-3వ. దమస్కు 1ది గోత్రముల ఇశ్రాయేలువారు:-**

పట్టణముగా కాక దిబ్బగా దేవుడు నాశనము చేయునని, ఇశ్రాయేలీయులు కూడా దుర్గము లేనివారుగా పతనమగుదురని సెలవిచ్చుచున్నాడు. దీని నెరవేర్పే క్రీ.పూ 732 జరిగి ఇశ్రాయేలువారు అష్షూరు దేశమునకు చెరకు వెళ్ళిరి.

**4-6వ. ఇశ్రాయేలీయుల పతనమునకు కారణములు:-** ఇశ్రాయేలు దమస్కు వారైన సిరియనులతో సంధి కుదుర్చుకున్నందున దేవుని ఆశ్రయించలేదు గనుక దేవుడు ఆ సంధిని చెదరగొట్టునని సిరియాను నాశనము చేతునని యెషయా 7:6-9వచనములలో చెప్పాడు. తదుపరి ఇశ్రాయేలువారిని అష్షూరుకు చెరకు పంపాడు. ఇది ప్రవచన తాత్కాలిక నెరవేర్పే. నాల్గవ వచనమందు ఆ దినమున అన్నందున ఈ ప్రవచన నెరవేర్పు అంత్యకాలమున జరుగునని తలంచుదుము. ఇశ్రాయేలీయులు సంపూర్తిగా కాక ఒలీవ చెట్లు దులుపబడిన తరువాత చెట్లమీద పరిగెగా మూడు, నాలుగు పండ్లు మిగిలినట్లు ఇశ్రాయేలు వారు కొద్దిగా అంత్యకాలము వరకు మిగులుదురు.

**7-8వ. అంత్యకాలమున ఇశ్రాయేలులో విగ్రహారాధన యుండదు:-**

ఇశ్రాయేలు యెహోవాయే నిజదేవుడని గుర్తించి విగ్రహములను చేయము అనుదురు. విగ్రహారాధన వారి యందుండదు. ప్రవచన తాత్కాలిక నెరవేర్పుగా బబులోను చెరనుండి ఇశ్రాయేలీయులు తిరిగి వచ్చిన నాటినుండి నేటివరకు వారిమధ్య విగ్రహారాధనలేదు అంత్యకాలమందు క్రీస్తును ఇశ్రాయేలు మెస్సీయగా గుర్తించి ఆరాధింతురు. కనుక విగ్రహారాధనకు అవకాశమే లేదు.

**9-11వ. ఇశ్రాయేలీయుల పతనము:-** ఆ దినమున అన్నందున అంత్యకాలమందు శ్రమలు, మహాశ్రమల కాలమున క్రీస్తును రక్షకుడుగా గుర్తించనంతకాలము శ్రమలపాలై పతనము కాగా పట్టణములు నిర్జనమగును. ప్రవచన తాత్కాలిక నెరవేర్పుగా క్రీ.పూ 732, 721లోను ఇశ్రాయేలువారు అష్షూరు చెరకు వెళ్ళిరి. అన్యులు ఇశ్రాయేలీయుల పట్టణములో నివసించిరి. 10వచనమందు ఇశ్రాయేలువారు రక్షణకర్తను మరచిరి. 11వలో విగ్రహములకు పూలతోటలు వేసిరి. అందుచేత అష్షూరు వారితో ఓడిపోయి, గాయములు పొంది కుప్పకూలిరి.

**12-14వ. అంత్యకాలమందు దమస్కువారి పతనము:-** ప్రస్తుతకాలమందు జనులు అల్లరిగా గుంపుకూడి ప్రభుత్వములపై తిరుగుబాటు చేసి అల్లకల్లోలమును సృష్టించినట్లు శ్రమలు

మహాశ్రమల అంత్యమందు అన్యరాజ్యములన్ని క్రీస్తు విరోధి ఆదినమున ఏకమై యూదుల మీదికి యుద్ధమునకు రాగా క్రీస్తు యేసు దిగివచ్చి వారిని అందరిని నాశనము చేయుట, ఈ అన్యజనుల కూటమిని సూచించుచున్నది.

## 18-20 అధ్యా ఐగుప్తు, మరియు ఐతియోపియాను గూర్చిన దేవోక్తి

## 18వ. అధ్యాయము (3+4=7వ)

**అంశము:- ఇతియోపియాను గూర్చియు వారితో సంధి చేసికొనిన ఇశ్రాయేలును గూర్చిన దేవోక్తి:-**

యిర్మీయా 13:23లో తెలుగు బైబిల్‌లో కూషు దేశస్థుడని ఇంగ్లీషు బైబిల్‌లో ఇతియోపియ అని వ్రాయబడినది. కనుక యెషయా 18:1, 20:5లో వ్రాయబడిన కూషు ప్రస్తుతపు ఇతియోపియా దేశమని నేర్చుకొనుచున్నాము. కూషు, ఐగుప్తులు ఇశ్రాయేలు దేశమునకు పడమర, దక్షిణములయందు కలవు.

**1-3వ. కూషు దేశస్తులు తనకు సహాయము చేయుమని ఇశ్రాయేలుకు రాయబారులను పంపుట:-** కూషునదులకు అవతల తటతట కొట్టుకొను రెక్కలు గల దేశము అనగా (కూషీయులు) అనేక పర్యాయములు కీటకముల తెగులుచేత బాధపడుటను చరిత్రలో గమనింతుము. ఎత్తయినవారు అనగా క్రీ.పూ 714లో కూషీయులు ఐగుప్తును పాలించిరి. 2 రాజులు 17:4లో సో అను ఐగుప్తు రాజు ఇశ్రాయేలు రాజగు హోషేయతో కలసి అష్షూరీయులతో యుద్ధమాడి ఓడిపోయిరి. ఈ దినములలో దేవుడు అష్షూరీయులకు ప్రపంచ అధికారమిచ్చినందున కూషువారు, 10 గోత్రముల ఇశ్రాయేలువారు ఓడిపోవుదురని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**4-7వ. దేవుడు తన ప్రజలను కాపాడు విధము:-** 4వ వచనమందు దేవుడు నిమ్మళించి తన నివాసస్థలమును కనిపెట్టుచుండుట యెరూషలేమును దేవుడు కాపాడుటగా చూడగలము. కూషు దేశస్తులు దేవుని నామమునకు నివాసస్థలముగానున్న యెరూషలేముకు తేబడుట. అపొ 8:26-40లో ఐతీయోపీయుడైన నపుంసకుడు ఆరాధనకు యెరూషలేముకు వెళ్లుటను ప్రస్తుకాలమందు ఇతియోపియా క్రైస్తవ దేశముగానుండుటగాను చూతుము. (మన దేశమునకు జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా నున్నప్పుడు ఇతియోపియా ప్రధానమంత్రి హైలీసలాస్ గారు భారతదేశమునకు ఆహ్వానింపబడిరి. ఇండియాలో విమానము దిగునప్పుడు తన చేతిలో బైబిల్ పట్టుకొని ఇతియోపియా ప్రధాని దిగుటను పాత్రికేయులు ఫోటో తీసి పత్రికలో ప్రచురించిరి.).

ఇది 18:7 యొక్క తాత్కాలిక నెరవేర్పుగా చూతుము. అంత్యకాల నెరవేర్పుగా వేయిఏండ్ల పాలనలో సకల దేశస్థులు పాలనా కేంద్రమైన యెరూషలేముకు వచ్చుటను ప్రకటన 21:23-24 వచనములలో నూతన యెరూషలేము పట్టణము దేవుని మహిమ ప్రకాశము కలిగి పరలోకము నుండి భూమిమీదికి రాగా భూరాజులు తమ మహిమ దానిలోనికి తీసుకొని వచ్చుట ప్రవచన అంత్యకాల నెరవేర్పుగా చూతుము.

## 19వ. అధ్యాయము (9+8+8=25వ)

### అంశము:- ఐగుప్తు పై దేవుని తీర్పులను గూర్చిన దేవోక్తి

**1-9వ. దేవుడు ఐగుప్తు పైకి దిగివచ్చుట కలిగిన నష్టములు:-**

1-4వ యెహోవా మేఘముల మీద ఐగుప్తుకు వచ్చినప్పుడు, ప్రజలు, వారి విగ్రహములకు కలవరము కలుగును. ప్రజలలో అంతర్యుద్ధములు చెలరేగి పట్టణము మీద పట్టణము, రాజ్యము మీద రాజ్యము యుద్ధములు జరిగి బలముగల జనమంతయు నాశనముగాను దీని నెరవేర్పుగా చరిత్రలో ఐగుప్తు 12 భాగములుగా విభాగింపబడెను. కర్ణ పిశాచములు సోదెగాండ్ర యొద్ద వారు విచారించినను జవాబు రాదు. నాల్గవ వచనమందలి బలత్కారుడైన రాజు అష్షూరు రాజే. ఐగుప్తు రాజ్యము ముక్కలైన కారణమును సులభముగా వారిని జయించి ఐగుప్తు వారిని అష్షూరురాజు పాలించువాడుగా నుండును. పై ప్రవచనము తాత్కాలిక నెరవేర్పుగా అష్షూరువారికి దేవుడు ప్రపంచ అధికారమిచ్చిన కాలమంతయు అనగా క్రీ.పూ 606 వరకు జరిగెను. 5-9వచనములందు ప్రకృతిలో కూడా కరువులు కలిగి నీరు లేక (5,6వ) పంటలు చేతికి రాకపోవుట (7వ) నైలునదిలో గాలము వేయు జాలరులు కృషించి నశించి పోవుట జరుగును. (8వ). జనుపనారపని చేయువారు తెల్లబట్టలపని చేయువారు సిగ్గుపడుట, బట్టలు కూడా దొరుకని పరిస్థితి ఏర్పడును (9వ).

**10-17వ. ఐగుప్తువారు నిరీక్షణను కోల్పోవుట:-** 10-11వ. ఫరోయొక్క జ్ఞానులకు అధిపతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడును. 12-13వ. అధిపతులు అవివేకులై మోసపోయి ప్రజలను తప్పు మార్గములందు నడుపుట జరుగును. 14-15వ దేవుడు మూర్ఖత గల ఆత్మను వారి మీద కుమ్మరించినందున కొద్దికాని గొప్పగాని ఏ పనులైనను జరుగక నిలిచిపోవును. 16-17వ. ఐగుప్తు పురుషులు స్త్రీలవలె ప్రతి విషయములో భయపడుచు వణకుచుందురు. దేవుడైన యెహోవా వారిమీద తన చేయి ఆడించినందున ఈలాగు జరుగుచున్నది.

**18-25వ. ఐగుప్తు అంత్యకాలమందు పొందబోవు ఆశీర్వాదము:-** ఆ దినమున అనుమాట 18,19,21,23,24 వచనములలో కనిపించుచున్నందున ఈ భాగము అంత్యకాల నెరవేర్పుగా చూతుము.

18-21వ. ఐగుప్తులో ప్రాముఖ్యమైన ఐదు పట్టణముల వారు దేవుని వైపు తిరిగి ఆ పట్టణములను యెహోవాను ఆరాధించు కేంద్రములుగా చేయుదురు.యెహోవాకు బలులు అర్పించు వారుగానుందురు. దీని తాత్కాలిక నెరవేర్పుగా క్రీస్తు శక ప్రారంభమందు ఒక ప్రధాన యాజకుడు ఐగుప్తుకు పారిపోయి అక్కడ యెహోవాకు బలిపీఠము కట్టెనని చరిత్రకారులు చెప్పుచున్నారు. దీని సంపూర్ణ నెరవేర్పు వేయి ఏండ్ల పాలనలో చూతుము. అలాగే ప్రకటన 21:23-24వచనములలో నూతన యెరూషలేము భూమిమీదకు రాగా రాజులు అనగా ఐగుప్తు అధికారులు సైతము తమ మహిమను యెరూషలేములోనికి తెత్తురు. 22-25వచనములలో చెప్పబడినట్లు నిజ దేవుని ఐగుప్తీయులు ఆరాధింతురు. ఐగుప్తునుండి అష్షూరు నుండి యెరూషలేముకు గొప్ప మార్గములేర్పడును. ఐగుప్తు ఇశ్రాయేలు వారితో సంధి కలిగియుండును. ఇది అంతయు వేయి ఏండ్ల కాలము తదుపరి ఉండబోవు నిత్యకాలమందును జరుగును.

## 20వ. అధ్యాయము (3+3=6వ)

**అంశము:- ఫిలిష్తీయులు, ఐగుప్తువారు, కూషువారు అష్షూరుకు లొంగిపోవుట**

1-3వ. దేవుడు ప్రవక్తయైన యెషయాను 3 సంవత్సరముల కాలము దిగంబరిగా పాదములకు జోడు లేక నడుచుచూ ఐగుప్తు, కూషుల పతనమును సూచనగా చూపమని చెప్పెను. 4-6వ. ఐగుప్తువారు సహాయమునకై కూషు వారిని తరచుగా ఆశ్రయించెడివారు. కాని అష్షూరు రాజు అటు కూషువారిని, ఐగుప్తువారిని బంధించి బానిసలుగా చెప్పులు లేక, బట్టలు తీసివేసి నడిపించుకొని తన దేశమునకు కొనిపోవునని దీని భావము. అలాగే క్రీ.పూ. 732, 721లో అష్షూరు రాజు 10 గోత్రముల ఇశ్రాయేలువారిని, ఐగుప్తు, కూషు, ఫిలిష్తీయులను చెరగొనిపోయెను. దీని నెరవేర్పును రాజులు రెండవ గ్రంథము 17:1-8వచనములలో చూతుము.

## 21వ. అధ్యాయము (5+5+2+5=17వ)

**అంశము:- బబులోను, ఎదోము, అరేబియాను గూర్చిన దేవోక్తి**

1-10 వచనములలో అడవి దేశమును గూర్చిన దేవోక్తి. బబులోను కూలుటను గూర్చియని (9వ) చెప్పబడినది. 11,12 వచనములు దూమా శేయీరును గూర్చి అనగా

ఎదోమీయులను గూర్చి చెప్పబడినవి. అలాగే 13-17వచనములలో అరేబియాను గూర్చి పలుకు కేదారు ప్రభావము నశించును అని 16వ వచనమందు పలికినందున 'అరేబియా నాశనము గూర్చిన ప్రవచనములు ఇందు కలవు.

**1-5వ. అడవి దేశమైన బబులోను పైకి శత్రువు వచ్చుట:** మాదీయుడగు దర్యావేషు దానియేలు ఐదవ అధ్యాయమందు బబులోను రాజగు బెల్షస్సరును చంపుటను గూర్చిన ప్రవచనము క్రీ.పూ. 536లో జరిగినది. మాదీయులు దానియేలు 7వ అధ్యా క్రూరజంతువు ఎలుగుబంటితో పోల్చబడినందున మొదటి రెండు వచనములందు భీకర జనముగా చెప్పబడుచున్నారు. 4-5 వచన ప్రకారము బెల్షస్సరు ఇష్టపూర్వకముగా ఒక సాయంకాలమున విందు ఆరగించు సమయమున శత్రువురాగా 3వ వచనమందు వ్రాయబడినట్లు బబులోనుకు ప్రసవించు స్త్రీవంటి వేదన పట్టెను. దాని 5:6లో రాజైన బెల్షస్సరు నడుము కీళ్ళు వడలి మోకాళ్ళు గడగడ కొట్టుకొనుటను సూచించుచున్నది.

**6-10వ. బబులోను కూలిపోవుట:-** బబులోను పట్టణము దిట్టమైన బురుజులు కలిగిన పట్టణము. ఈ రాజ్యము సింహము వంటిదని దానియేలు 7వ అధ్యాయమందు చెప్పబడినది. కావలి వారున్నను మాదీయుల సైన్యము దండెత్తి వచ్చు విధము 6,7 వచనములలో చెప్పబడినది. 9వ వచనమందు బబులోను దేవతలు ముక్కచెక్కలగుట బబులోను కూలిపోవుట చెప్పబడినది. 10వ వచనమందు బబులోను ప్రజలు నూర్చబడుట అనగా హతులగుట చెప్పబడినది.

**11-12వ. దూమాను అనగా ఎదోమీయులను గూర్చిన దేవోక్తి:-** ఆది 36:9లో శేయీరు ఎదోమీయుల నివాసమని చెప్పబడినది. కనుక శేయీరు నుండి కేకలు వేయువారు ఎదోమీయులు. యెషయా 62:5. యెరూషలేము 11వ. పైనున్న కావలివారు మౌనముగా నుండరు అనగా మాటలాడువారు, ప్రవచించు ప్రవక్తలే. కనుక ఈ కావలివాడు ప్రవక్తయైన యెషయా. అష్షూరీయులు ఎదోమీయుల మీదికి దండెత్తి వచ్చినప్పుడు వారి మధ్య ప్రవక్తలు లేనందున యెషయాను వారు విచారించుటను గమనించగలము. రాత్రి యెంతవేళైనది అని రెండుమారులు ప్రశ్నించిరి. రాత్రి యందలి చీకటిలో అష్షూరీయులు దండెత్తి వచ్చిన సమయమున దిక్కుతోచని స్థితిఅని రెండు మారులు అడుగుట వారి ఆతురతను సూచించుచున్నది. 12వ. ఉదయమునగును, రాత్రియునగును. దేవుడు మానవులను తీర్పు తీర్చగోరుచున్నాడు. రాత్రి తరువాత పగలు, తదుపరి రాత్రియు వచ్చుచుండును. దీని ఆత్మీయ భావము పగలగుట మలాకీ 4:2 ప్రకారము నీతి సూర్యుడు ఉదయించుటను అనగా ప్రభువు రెండవ రాకడను సూచించుచున్నది. తెల్లవారకముందు వేకువ చుక్క రాత్రియందు వెలుగిచ్చును కనుక చీకటికాలమందు ప్రభువు రాకడ యుండును. విశ్వాసులకు

వేకువ చుక్కగా క్రీస్తును చూడగలము. కనుక విశ్వాసులు ఎట్టి స్థితిలోనైన ఆనందించుదురు. 12వ వచనము విశ్వాసులకు సంతోషదాయకమే. ప్రపంచములో కొన్ని ప్రాంతములో పగలుండగా మరికొన్ని ప్రాంతములందు చీకటి ఉన్నట్లు ప్రభువు రాకడ విశ్వాసులకు ఆనందదాయకమే కాని ఇతరులకు క్రీస్తును ఎరుగని వారికి బహుకష్ట సమయము. ఆయన రాకడలో అవిశ్వాసులు తీర్పు తీర్చబడి శిక్షపొలగుదురు. ఆయన రాకడను గూర్చి 2 పేతురు 1:19; 3:10; 1థెస్స 5:4 దొంగవలెవచ్చునని ఆ దినము భయంకరమని చెప్పబడినది. కనుక యెషయా 1:18,10:21, 44:22, 55:1,7 మరియు క్రొత్త నిబంధన మత్తయి 11:28లో ప్రభువు యొద్దకు వచ్చి పాప క్షమాపణ పొందమని ఆహ్వానించుచున్నాడు.

**13-17వ. అరేబియాను గూర్చిన దేవోక్తి:-** 13-14వ. తేమా అబ్రాహాము యొక్క భార్య కెతూర ద్వారా కలిగిన సంతానమని ఆది 25:15 వలన తెలిసికొనుచున్నాము. దెదానీయులు అరేబియా ఎడారిలో దిగువారు. అష్షూరీయులు దండెత్తి రాగా అరేబియావారు పారిపోవుట వారి బలఢ్యులు ప్రభావమును కోల్పోయి నశించుదురని చెప్పుచున్నారు. 16-17వ. ఆది 25:13 ప్రకారము కేదారు ఇష్మాయేలు యొక్క కుమారుడు వీరి సంతానము ఉత్తర ప్రాంతమందు నివసించిరి. ఒక సం॥లో వారు మహిమను కోల్పోవుదురని దేవుడు సెలవిచ్చెను. వారు బాణమును విల్లును వాడు నేర్పరులైనను వారి సైన్యములో అనేకులు నశింతురని అష్షూరీయుల ఎదుట నిలువనేరరని సెలవిచ్చెను. దేవుడు కాలములను తన ఆధీనమున కలిగియున్నాడు. (మత్త 24:36).

## 22వ. అధ్యాయము (7+7+5+6=25వ)

### అంశము:- దర్శనపులోయ అనబడిన యెరూషలేమును గూర్చిన దేవోక్తి

4వ వచనములో నా ప్రజలు, 8వలో యూదా, 9వలో దావీదు పట్టణము 10వలో యెరూషలేము అన్నందున ఈ దేవోక్తి యెరూషలేమును గూర్చినదే. ఇంతవరకు యెరూషలేమునకు చుట్టు ఉన్న వారికి కలుగబోవు స్థితిని గూర్చిన ప్రవచనములు చెప్పబడగా సంతోషముగా వినిరి. ఇప్పుడు యెరూషలేముకు జరుగుట గూర్చి అక్కడ ప్రజలను గూర్చి 2వ ప్రవచనము చెప్పబడుచున్నది.

**1-7వ. యూదా మీదికి శత్రువు దండెత్తి వచ్చుట:-**

1-3వ. కీర్తన 125:2 ప్రకారము యెరూషలేము చుట్టు పర్వతములున్నవి. అది కొండల ప్రాంతము. అనేకమంది ప్రవచనములు చెప్పిన ప్రవక్తలు అక్కడ ఉన్నారు. ప్రవక్తల మాటలకు విధేయత చూపిన దేవుని ఆశీర్వాదము పొందియుందురు. కాని విధేయత చూపనందున

అక్షరీయముగా పర్వతముపైకాక అనగా ఉన్నతస్థితి యందు కాక తక్కువ స్థితిలో ఉన్నారని దీని భావము. శత్రువు తమపైకి రాగా ప్రార్థన కేకలు వినబడుటకు బదులు జనులు మేడలమీదికెక్కి ఉల్లసించి అల్లరి కేకలు వేసిరి. శత్రువు అధిపతులందరిని పట్టుకొని దూర దేశమునకు కొనిపోయిరి. క్రీ.పూ. 606లో బబులోను రాజు యెరూషలేముపై దండెత్తి వచ్చి రాజును రాజవంశమునకు చెందిన దానియేలు షద్రకు, మెషాకు, అబెద్నెగోలను కొనిపోవుట దానియేలు 1:1-4 వచనములలో చూతుము. 4-5వ. ప్రవక్తలు ముఖ్యముగా యిర్మీయా దీనిని చూచి విలపించి విలాప గీతములు వ్రాసెను. 2 ది. 36:19 చెప్పడినట్లు పట్టణ ప్రాకారములు పడగొట్టబడెను. 6-7వచనములోనున్నట్లు హిజ్కియా రాజు కాలమందు అష్షూరు సైన్యము, రథములు, రౌతులు యెరూషలేమును చుట్టుముట్టిరి. యెషయా 37:12,13లో అష్షూరు రాజు బెదిరింపుమాటలు కలవు. యెషయా 36:8లో యూదావారికి గుఱ్ఱపురౌతులు లేరని వ్రాయబడినది. కనుక శత్రువుల రౌతులు వ్యూహమేర్పరచుకొనుచున్నారు. పై ఏడు వచనముల వివరములు అష్షూరువారు, బబులోనువారు యూదాను ముట్టడించినప్పుడు జరిగినవి.

**8-14వ. శత్రువును ఎదుర్కొనుటకు యూదా వారు సిద్ధపడుట:-** 8-11వ. యూదావారు దేవుని ప్రార్థించి దేవుని సహాయముతో శత్రువును ఎదుర్కొనాలి. యెరూషలేము బలమైన ప్రాకారము గల పట్టణమే. హిజ్కియా లోపల మరొక ప్రాకారమును కూడా కట్టించి యుండెను. అష్షూరీయులను ప్రభువుపై ఆధారపడుటకు బదులు రాజులు రెండవ గ్రంథము 18:13-16వ చెప్పబడినట్లు ధనమును దేవుని మందిరమందలి బంగారమును ఇచ్చి యుద్ధము నుండి తప్పించుకొన ప్రయత్నించెను. 12-14వ ప్రజలు కూడా రేపు చనిపోదుము కనుక తిని త్రాగుదుమని తలంచిరి కాని సృష్టికర్తవైపు తిరిగినవారు కారు. పాపమునకు పశ్చాత్తాపపడక ప్రజలు మరణించుదురని ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

మన స్వంతబలమును ఆశ్రయించక దేవుని మీద ఆనుకొనవలెనను పాఠమును నేర్చుకోవాలి.

**15-19వ. గృహనిర్వాహకుడైన షెబ్నా ఉద్యోగము నుండి తొలగించబడుట:-**

రాజైన హిజ్కియా దేవుని యందు విశ్వాసము కలవాడు కాని గృహనిర్వాహకుడైన షెబ్నా అలాంటివాడు కాదు. ఒకవేళ ఈ గృహనిర్వాహకుడే అష్షూరు రాజుకు ధనమును మందిర బంగారమును పంపు ఏర్పాట్లు చేసియుండవచ్చును. 15వ వచనమందు ఈ విచారణకర్తయనుటలో దేవుడు షెబ్నా విషయము సంతోషించుటలేదు. దేవునియందు విశ్వాసముంచని షెబ్నా తన్ను తాను హెచ్చించుకొనుచూ తన కొరకు ఎత్తైన శిలలో తన కొరకు సమాధిని తొలిపించుకొనెను. అష్షూరు రాజు యూదాపైకి దండెత్తి వచ్చినప్పుడు

ఈ షెబ్నా శాస్త్రిగా నుండెను. ఈ షెబ్నా ఘనమైన రథములు కలిగియుండెను. ఒకవేళ రాజువలె పట్టణములో రథముపై తిరుగునంతగా తన్నుతాను హెచ్చించుకొనెను. 8వ. రాజు కాకపోయినను రాజువలె ప్రవర్తించు ఇటువంటి దేవుని యందు నమ్మకము లేక, యజమానికి అవమానము తెచ్చిన గృహనిర్వాహకులుగా శాస్త్రులుగా హిజ్కియా కలిగియుండుట మంచిదికాదు. కనుక దేవుడు అతనిని ఉద్యోగము నుండి త్రోసివేసి దూరదేశమైన బబులోనుకు చెరకు పంపుదునని అక్కడనే మృతి పొందునని సెలవిచ్చెను.

**20-24వ. ఎల్యాకీము గృహనిర్వాహకుడగుట:-** రాజైన హిజ్కియా కాలమున షెబ్నా శాస్త్రిగా నుండగా ఎల్యాకీము గృహనిర్వాహకుడుగా నున్నాడని యెషయా 36:3లో చూచుచున్నాము. ఎల్యాకీమను పేరుకు దేవుడు హెచ్చించును అని అర్థము. 21-24వచనములలో ఎల్యాకీములో క్రీస్తు యేసును చూతుము. 22వ వచనములో దావీదు ఇంటి తాళపు అధికార భారము భుజములపై నుండుట యెషయా 9:6 చెప్పబడిన అతని భుజముల రాజ్య భారముండును అనుటకు సమానము. 23-24వచనాలలో అతని సంతానము పైకెత్తబడుట యూదావారి ఔన్నత్యమును సూచించును.

25వ వచనమందున్న దిట్టమైన చోట స్థిరపరచబడిన మేకు ఊడదీయబడి తెగవేయబడుటను గూర్చి జాగ్రత్తగా ఆలోచించవలెను. 23వ వచనమందున్న దిట్టమైన మేకును క్రీస్తుగా తలంచితిమి. కాని అటువంటి మాటయే చెప్పబడినను 25వచనమందున్న ఈ దిట్టమైన మేకు క్రీస్తును కాక షెబ్నాను సూచించుచున్నది. ఊడదీయబడి తెగవేయబడుట దానిమీదనున్న భారము తీసివేయబడుట షెబ్నా తన ఉద్యోగము కోల్పోయి చెరకు వెళ్ళి అక్కడే మరణించుటను సూచించును.

## 23వ. అధ్యాయము (7+7+4=18వ)

**అంశము:- వ్యాపార కేంద్రమైన తూరు పట్టణము పాడగుటను గూర్చిన దేవోక్తి**

తూరుపట్టణము వ్యాపార సంబంధమైన ప్రాముఖ్య పట్టణము. గతములో బబులోను, అష్షూరు వంటి సైనిక బలము గలవారిపై దేవుడు తీర్పు తీర్చినట్లు వ్యాపార సంబంధముగా బలముగల తూరు, తర్షీషు పట్టణములవారిపై కూడా తన తీర్పులను ప్రకటించుచున్నాడు. తర్షీషు, (1,6,10,14వ), తూరు (1,3,5,15వ), సీదోను (2,4,12వ) పట్టణములు ప్రస్తావించబడినవి. ఆది. 10:4 ప్రకారము తర్షీషు నోవహు మునిమనుమడు. ఆది 10:15 ప్రకారము సీదోను నోవహుకు కుమారుడు. తూరు సీదోనుకు నలువది కి.మీ. దూరముగల జంట పట్టణములు. 12వ వచనములో తూరు సీదోను కన్యక అని

పిలువబడినందున తూరు సీదోను కుమార్తెగా అనగా నోవహు మునిమనువరాలిగా తలంచగలము.

**1-7వ తూరు అంగలార్పు:-** 1వ తర్షీషు వ్యాపార కేంద్రము దాని ఓడలు ఖండాతర ప్రయాణముచేయునవి. వ్యాపారము చేయుచు తూరు పట్టణమునకును వచ్చును. ఈ వచనమందలి ప్రవచనముబట్టి తూరు పట్టణము పాడైనది. నివాసయోగ్యమైన ఇండ్లన్నియు నాశనమైనవి. పట్టణ ప్రవేశ మార్గములును (ఓడరేవు) నాశనమైనవి. కిత్తీయులు అనగా కుప్ర ద్వీపవాసులకు ఈ సంగతి తెలిసి తర్షీషు నుండి వచ్చు ఓడ వ్యాపారులకు తెలియపరచిరి. 2-3వ. సీదోను తూరుకు తల్లివలె ఉండి తమ సరుకులతో తూరును నింపియుండిరి. ఆలాగే ఐగుప్తు నైలు నదీ తీరమున పండిన ధాన్యము చేత తూరు నిండియుండెను. 4-5వ. ఇప్పుడు తూరుకు కలిగిన నష్టమునుబట్టి సీదోను దుఃఖించి తాను పిల్లలను కనలేనిదానినని, పోషింపలేనిదానినని, పెంచలేని దానినని మాటలాడుచున్నది. ఈ వర్తమానముచేత ఐగుప్తీయులు తమ ధాన్యము నష్టమాయెనని దుఃఖింతురు. 6-7వ తూరు ప్రాచీన కాలమునుండి ఉండిన పట్టణము. దూరదేశము నుండి వర్తకులు వచ్చి సంతోషించిన పట్టణము. కనుక సముద్ర తీరప్రాంత నివాసులందరు తర్షీషునకు వచ్చి తూరును గూర్చి అంగలార్చుదురు.

**8-14వ. తూరుపట్ల దేవుని ఉద్దేశ్యము:-** 8-9వ. తూరు వర్తకులు భూనివాసులలో ఘనులై రాజులుగానున్నారు. వారు ఇతర వ్యాపారులను ధనికులుగా చేసి కిరీటధారులుగా అనగా రాజులుగా చేయగలశక్తి గలవారు. సర్వ సౌందర్యము కలిగి గర్వించి అతిశయించుచున్నారు. అతిశయించువాడు ప్రభువునందే అతిశయించవలెను. (1కొరి 1:31, 2కొరింథీ 10:17) యిర్మీయా 9:24లో అతిశయించువాడు దేనిని బట్టి అతిశయింపవలెను. అనగా; భూమి మీద కృపచూపుచు, నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనే అని గ్రహించి నన్ను పరిశీలనగా తెలిసికొనుటను బట్టియే అతిశయింపవలెను; అట్టివారిలో నేను ఆనందించువాడనని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

10-11వ. తూరు కృపచూపు యెహోవాయందు కాక సౌందర్యము, ఘనతనుబట్టి అతిశయించినందున తూరు విషయమై దేవుడు, ఆనందించక తూరు మారుమనస్సు పొందు నిమిత్తము యెహోవాయే శిక్షించుచున్నాడు.

12వ. సీదోను తూరుకు సహాయము చేయగా తూరు ఎంతో సంతోషించెను. (7వ). కాని దేవుడు శిక్షను ఆజ్ఞాపించగా తూరుకు సంతోషము, నెమ్మది లేకపోయినది. 13వ. అష్షూరీయులు, బబులోనువారు తూరును పాడు చేతురని క్రీ.పూ. 700 ముందు ఇక్కడ చెప్పిన ప్రకారమే అష్షూరు రాజు తూరు ప్రజలను తరిమివేయగా దేశము అడవి మృగముల

పాలాయెనని తరువాత బబులోను రాజు పట్టణములను పాడు చేసెనని చరిత్రనుబట్టి గమనించుచున్నాము. బబులోను పాలన తరువాత ప్రపంచమును పాలించిన గ్రీకుల రాజైన అలెగ్జాండర్ ఈ పట్టణమును సంపూర్ణముగా నాశనము చేసెను. 14వ. వ్యాపారము చేయు తర్షీషు ఓడలు తమ వ్యాపారములో సహకరించిన వ్యాపారసంబంధమైన దుర్గము వంటి దేశమైన తూరు పతనమునుబట్టి అంగలార్చుదురు.

**15-18వ. తూరు పట్టణము పునరుద్ధరించబడుట:-** 15-16వ. దేవుడు కృపామయుడు కనుక తాను ఏ రాజ్యములను శిక్షించి పాడు చేయునో తన కృపనుబట్టి కొద్దికాలము తరువాత బాగుచేయును. హెబ్రీ. 12:10 ప్రకారము మనము తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని మన మేలు కొరకే ఆయన శిక్షించుచున్నాడు. పై వచనమునుబట్టి ఆయన తూరుకు మేలు కలుగచేయునని నేర్చుకొనుచున్నాము. తూరుకు శిక్ష 70 సంవత్సరములని తరువాత తూరు సితార తీసుకొని ఇంపుగా వాయించుచు అనేక కీర్తనలు పాడుట, 12వలో కోల్పోయిన సంతోషమును మరలా పొందును. యాకోబు 5:13లో మీలో ఎవనికైనను సంతోషము కలిగెనా వాడు కీర్తన పాడవలెను అను వచన ప్రకారము ఇది నెరవేరును.

17-18వ. దేవుడు కలిగించిన సంతోషమునుబట్టి తూరు కృప చూపిన దేవునిబట్టి అతిశయించి ఆయనను పరిశీలనగా తెలిసికొనుటకు బదులు, మరల భూమి మీదనున్న ఇతర రాజ్యములతో వ్యాపారముచేసి లాభము సంపాదించి ఇతర దేశములవలె ధనాపేక్ష కలవారుగానుందురు అంటున్నాడు. దీనిని వేశ్య జీవితముగా పోల్చుచున్నాడు. అంత్యకాలములో తూరు కూడా ఇతర దేశములతో కలసి ఇశ్రాయేలీయులు తమ దేశమునకు తిరిగి వచ్చుటలో సహకరింతురని దీని భావము.

## 24-35వ. అధ్యాయములు (4+6+2=12అ)-శ్రమలు, ఆశీర్వాదముల చిన్న గ్రంథము

ఈ మూడవ భాగమందు అంత్యదినములలో ఏడేండ్ల శ్రమలు - వేయి ఏండ్ల ఆశీర్వాదములను గూర్చిన దేవోక్తులు కలవు. ఈ భాగమును 4+6+2 అధ్యాయములుగల మూడు భాగాలుగా విడగొట్టవచ్చును. 1) 24-27అ. శ్రమలు ఆశీర్వాదముల చిన్న గ్రంథము. 2) 28-33అ. శ్రమలు ఆశీర్వాదాల పెద్ద గ్రంథము. 3) 34-35 శ్రమల ఆశీర్వాదాల అతిచిన్న గ్రంథము.

## 24-27వ. అధ్యాయములు - శ్రమలు, ఆశీర్వాదముల చిన్న గ్రంథము

ఈ భాగమును శ్రమలు (24అ), ఆశీర్వాదపు స్తుతుల (25-27అ) చిన్న గ్రంథముగా ధ్యానించవచ్చును ఇశ్రాయేలీయులకు లోకమంతటికి ఏడేండ్ల శ్రమలకాలమందు

కలుగబోవు శ్రమలు 24 అధ్యా.లో వివరించబడినవి. 25:9, 26:1, 27:1లో ఆ దినమున అనుమాట రాబోవు దినము అనబడు వేయి ఏండ్ల కాలమును సూచించును. శ్రమల నుండి విమోచించబడి, సమకూర్చబడి, వేయి ఏండ్ల కాలములో ప్రవేశించిన యూదుల శేషము ఆశీర్వదించబడు విషయములు అందునుబట్టి ఇశ్రాయేలు చేయు స్తుతులు (25:1, 39-26:8-27:13) పాటల రూపమున వివరించబడినవి. (25:9, 26:1, 27:2) క్రొత్త నిబంధనలో యాకోబు 5:13లో మీలో ఎవనికైనను సంతోషము కలిగెనా వాడు కీర్తన పాడాలి అని ఉన్నది. ఇశ్రాయేలీయులు ఈ మూడు కీర్తనలు పాడుట వేయి ఏండ్ల పాలన ముందు కలిగిన శ్రమలు ముగిసినందున ఇప్పుడు సంతోషింతురని గమనించాలి.

## 28-33వ. అధ్యాయములు - శ్రమలు, ఆశీర్వాదముల పెద్ద గ్రంథము

యూదావారికి పాపమునుబట్టి ఏడేండ్ల శ్రమల కాలమందు కలుగు శ్రమలు తదుపరి కలుగు రక్షణ ఆశీర్వాదము వివరించబడినది. దేవుని యొద్ద ఆలోచన చేయక, దేవుని మీద ఆధారపడక ఆత్మ నియమించని సంధి లోకముతో చేసుకొనువారికి ఏడేండ్ల శ్రమల కాలమందు కలుగు ఎనిమిది విధములైన శ్రమలు, తదుపరి దేవుని కృపనుబట్టి వేయి ఏండ్ల పాలనలో కలుగు ఆశీర్వాదము ఈ భాగమందు విపరించబడినది. కాని దేవుడు తన ప్రేమ, కృప, దయనుబట్టి వారిని సమకూర్చుట, రక్షించుట దీవించుట ప్రత్యేకముగా గమనించాలి.

## 34-35వ. అధ్యాయములు - శ్రమలు, ఆశీర్వాదముల అతి చిన్న గ్రంథము

ఏడేండ్ల శ్రమల కాలములో లోకమంతటికి కలుగు శ్రమలు 34వ అధ్యాయములోను తరువాత వేయి ఏండ్ల కాలములో కలుగబోవు ఆశీర్వాదములు 35వ అధ్యాయములో వివరించబడినది. 28-33 అధ్యాయములలోని శ్రమల సారాంశమంతయు 34వ అధ్యాయములో చూపబడినది. అలాగే కనాను ప్రాంతము అనగా ఇశ్రాయేలు దేశమంతటికి వేయి ఏండ్ల పాలనలో కలుగబోవు దేశ, దేహ విమోచన రమ్యత, ఆశీర్వాదము 35వ అధ్యాయములో కలదు.

గమనిక:- ఆత్మీయముగా 34వ అధ్యాయము లోకమంతటిలో రక్షణ లేనివారు నాశనమగు స్థితిని, 35వ అధ్యాయము రక్షించబడినవారికి కలుగు ఆశీర్వాద స్థితి తెలుపబడినదని గమనించగలము.

# 24వ. అధ్యాయము (3+3+3+3+4+4+3=23వ)

అంశము:- లోకమంతటికి తీర్పు - ఇశ్రాయేలీయుల శ్రమల కాల దుస్థితి

**1-3వ. ఇశ్రాయేలీయుల దుస్థితి:-** ఆది 9:1 మీరు ఫలించి అభివృద్ధి నొంది భూమిని నింపవలెనని నియమించాడు కాని 1,3 వచనములలో భూమి కేవలము వట్టిదిగాను పాడై, కల్లోలపడి కొల్లపోవుట గమనించగలము. శ్రమలు మహాశ్రమల కాలములో కలుగు భయంకరమైన భూకంపములనుబట్టి 2,19,21 వచనములలో చెప్పబడినట్లు భూమి బద్దలై అనేకులు మృతిపొంది నాశనమగుదురు. రెండవ వచనములోనున్నట్లు ప్రజలు మాత్రమేకాక 1) మతపరముగా యాజకులుకూడా నశింతురు. 2) దాసులకు కలిగినట్లు యజమానులకు కలుగుట సామాజిక, రాజకీయ నష్టముగాను, 3) కొనువారికి కలిగినట్లు అమ్మువారికి కలుగుట వ్యాపారస్తులతో పొందు నష్టముగాను 4) అప్పిచ్చువారికి వడ్డికిచ్చు వారికి నష్టము కలుగుట ఆర్థిక/బ్యాంకుల వ్యవస్థ నష్టపోవుటను సూచించును. మతపరముగాను, సామాజిక, రాజకీయ, వ్యాపార, ఆర్థిక, బ్యాంకుల వ్యవస్థ నష్టపడుట ద్వారా దేశము పూర్తిగా వట్టిదై పాడగును.

**4-6వ. లోకమంతయు పాపమునుబట్టి శిక్షకు పాత్రులు:-** ప్రజలు ధర్మశాస్త్రమును అనగా అందలి ఆజ్ఞలు, కట్టడలు, నిబంధనలు మీరుట అను పాపమునుబట్టి ప్రజలు శిక్షకు పాత్రులగుదురు. పాపమునుబట్టి దేశము పాడగును.

"ఏ భేధమును లేదు అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు." రోమా 3:23. పాపమునుబట్టియే నోవహు కాలములో ప్రపంచము పాడైనది. అలాగే అంత్యకాలములోను జరుగును. దీని వివరములు ప్రకటన 6:8 వధించబడిన గొర్రెపిల్ల గ్రంథపు ముద్రలు విప్పు సమయములో జరుగుట చూడగలము. అలాగే దూతలు బూరలు ఊదునప్పుడు ప్రకటన 9:18లోను, ఉగ్రత పాత్రలు కుమ్మరించునప్పుడు ప్రకటన 16:9లోను జరుగుట చూడగలము.

**7-9వ. లోకమంతటిలోను, ఇశ్రాయేలీయులలోను లోపించిన సంతోషము:-** 7వ. మొదటి ఆరు వచనములలో చెప్పబడిన తీర్పులనుబట్టి లోకపు జనులలోను ఇశ్రాయేలీయులలోను సంతోషము లోపించినది. 8వ. మనుష్యులు ద్రాక్షారసముతో ఉల్లసించి సంగీత ధ్వనులలో సంతోషించ కోరుదురు. కాని విధి విక్రయించినందున పాటల ధ్వనులు వారి మధ్య ఉండవు. ద్రాక్షా పానపు తాత్కాలిక సంతోషములు వారి మధ్య ఉండవు.

**10-12వ. ఇశ్రాయేలీయులలో లోపించిన సంతోషము:-**

10వ. పట్టణములు, గృహములు నిర్మూలము చేయబడును. ద్రాక్షారసము లేదని

పొలములోని ప్రజలు కేకలు వేయుదురు. కీర్తన 104:15 మరియు న్యాయాధి 9:13 ప్రకారము ద్రాక్షారసము సంతోషమునకు గుర్తు. ఇశ్రాయేలు దేశములో ఆనందము లేకపోవుటను 1-12 వచనముల ద్వారా గమనించగలము.

**13-16వ. ప్రజలందరికి తీర్పు - రక్షించబడు శేషము:-** 13వ ఒలీవ చెట్లు దులపబడినట్లు ద్రాక్షాచెట్లు ఫలములు కోయబడినట్లు భూలోకమంతటిలో శ్రమలు, మహాశ్రమలవలన జనులు నశించినను, చేనిలో పరిగె మిగిలి ఏరుకొనబడినట్లు భూమి మధ్య జనములలో జరుగును. బైబిలు గ్రంథములో అనేక పర్యాయములు శేషము మిగులును అని వ్రాయబడుట గమనించగలము. (రోమా 11:4-5, ప్రకటన 13:17) ప్రకటన 7:9,14వ ప్రకారము శేషించిన ఈ ఇశ్రాయేలు జనము అన్యులు బిగ్గరగా శ్రమల కాలముననే ఉత్సాహధ్వని చేయుదురు. (ప్రకటన 7:10). శ్రమల కాలములోను కొద్దిమంది రక్షించబడి, ఉత్సాహధ్వని చేయుట ఆశ్చర్యకరము. మనకెంతో ఆనందమును కలిగించును. 15వ. తూర్పు దిశనున్నవారు అనగా ఇశ్రాయేలు దేశము తూర్పుననున్న ఇతర అన్యజనులు, సముద్ర ద్వీపవాసులు అనగా ఇశ్రాయేలుకు పశ్చిమముగానున్న అన్ని దేశములలో దేవుని నమ్మినవారు ప్రకటన 7:11-12లో నున్నట్లు దేవుని నామమునకు ఘనత, మహిమ, ప్రభావము కలుగునని కీర్తన పాడిరి. 16వ. నీతిమంతుడైన ప్రభువుకు విమోచించబడిన వారు క్రొత్త గీతము పాడుచుండగా శ్రమలలో బాధపడువారు చెడిపోతిమని వాపోవుదురు. అనేక మోసములు భూలోకములో జరుగును.

**17-20వ. భూమికి తీర్పు:-** భూమి అటు ఇటు ఊగి, కంపించి, దద్దరిల్లి బద్దలగుట పేతురు రెండవ పత్రిక 3:10లోను ప్రకటన 8:17,16:18లో చెప్పబడినట్లు భూకంపములు ఎన్నడు జరుగని రీతిగా జరుగును. దీనంతటికి భూమిపై నివసించు జనుల పాపమే కారణము. భూమి యొక్క తూములు తీయబడుట సముద్రములు పొంగుటను అగాధ జలముల ఊటలు నోవహు దినములలో పారిన సంగతిని జ్ఞాపకము చేయును.

**21-23వ. రాజులకు, ప్రజలకు, సూర్యచంద్రులకు తీర్పు:-**

21-22వ. ఉన్నత స్థల సమూహములు, భూరాజులు అనగా సాతాను, దురాత్మల సమూహములు ప్రక 12:8లో ఓడిపోయి బంధించబడుటను సూచించును. దురాత్మల రాజగు సాతాను ప్రకటన 20:1-3లో అగాధములలో బంధించబడుటను సూచించును. బహు దినములైన తరువాత వారు దర్శించబడుట వేయి ఏండ్లు గడచిన పిదప సాతాను కొంతకాలము విడిచిపెట్టబడుటను సూచించును.

23వ. వేయి ఏండ్ల పాలన తదుపరి జరుగు నిత్యపాలనను సూచించుచున్నది. నిత్యపాలనలో సూర్య చంద్రుల అవసరముండదు కనుక వెలవెలపోవుదురు.

# 25వ. అధ్యాయము (5+4+3=12వ)

అంశము:- ఆశ్రయుడై రక్షించబోవు దేవుని హెచ్చిస్తూ స్తుతించిన కీర్తన

**1-5వ. తనవారిని ఆశీర్వదించిన దేవుని నామమును హెచ్చించి స్తుతించుట:-**

1వ. యెహోవా నీవే నా దేవుడవు. యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు అని కీర్తన 144:15లో చెప్పబడినది. యూదావారు శ్రమలకాలమందలి చివరలో యేసును రక్షకుడుగాను, మెస్సియాగాను అనగా రాబోవు రారాజుగాను గుర్తించి రక్షకుడుగా (దేవుడుగా) స్వీకరించుదురు. అది ధన్యత. యెహోవా నీవే అనగా నీవు తప్ప మరెవరు లేరని దాని భావము. ఒకప్పుడు విగ్రహములను పూజించిన వారిప్పుడు యెహోవాయే (మరెవ్వరు కారు) నా దేవుడని గుర్తించిరి. రక్షణ (నా) వ్యక్తిగతమైనదని గుర్తించుదుము గాక. దేవుడు తన స్వభావమైన సత్యమునుబట్టి రెండవదిగా తాను చేసిన అద్భుతములనుబట్టి, మూడవదిగా మన విషయమై తన ఆలోచననుబట్టి దేవుని హెచ్చించి స్తుతులు చెల్లించుట జరుగును. స్వభావము, ఆలోచనలు అంతరంగమైనవి. కాని చేయుట అనగా క్రియ బాహ్యమైనది మొదటిదిగా చెప్పబడుచున్నది ఆయన అద్భుతములు చేయువాడు. ఆయన పేరే ఆశ్చర్యకరుడు (యెష 9:6). కనుక ఆయన బిడ్డలపట్ల అద్భుతములు చేయును. అందునుబట్టి ఆయనను హెచ్చించి స్తుతించాలి. ఇశ్రాయేలీయుల జీవితములోను అలాగే మన జీవితములోను అనేక అద్భుతములు చేసాడని గుర్తించుదుము గాక. ఆయన స్వభావము సత్యమైనది. యోహాను 14:6లో నేనే... సత్యము అన్నాడు. తన స్వభావము సత్యమైనది కనుక తన స్వభావమునకు విరోధముగా ఏమియు చేయడు (2 తిమో 2:13). యెషయా 9:6 ప్రకారము ఆలోచనకర్త కనుక పూర్వకాలముననే ఎఫె. 1:5 ప్రకారము జగత్తుకు పునాది వేయకముందే ప్రేమచేత మనలను, ఇశ్రాయేలును ఏర్పరచుకొనాలని ఆలోచించాడు. ఇశ్రాయేలుపట్ల, ఆలోచనను శ్రమలకాలము తరువాత నెరవేర్చును. 2వచనమందు అన్యుల పట్టణము, ప్రాకారము ఉండకుండ పడగొట్టబడుట ప్రకటన 18వ అధ్యాయమందు 19:16-21 వచనములందు వివరించబడిన బబులోను పట్టణ నాశనము అనగా దేవునికి శత్రువులైన సాతాను, అబద్ధ ప్రవక్త, క్రీస్తు విరోధిల నాశనములను సూచించుచున్నది. ప్రక 18:23లో ఏ శిల్పియు ఎంతమాత్రము నీలో కనబడడు అనుట మరెన్నడు శత్రువులు కనబడరని భావము. 3వ వచనమందలి బీదలు, దరిద్రులు యూదావారైనను కీర్తన 113:8 ప్రకారము మన పూర్వపు స్థితిని జ్ఞాపకము చేయుచున్నది. దేవుడు 1) శ్రమలలో శరణ్యుడు 2) మనమీదకి వచ్చు తుఫానులలో గాలివాన తగులకుండ కాపాడువాడు.( గలిలయ సముద్ర పడవ ప్రయాణము మార్కు 4:41-48వ). 3) వెట్ట తగులకుండ మనకు నీడగనుండువాడు

– ఇశ్రాయేలీయులను అరణ్య ప్రయాణమందు మేఘ స్తంభములో నుండి కాపాడెను. నిర్గ13:22, 14:19. కీర్తన 46:1 ప్రకారము దేవుడు ఆశ్రయము దుర్గమై ఆపత్కాలమందు నమ్ముకొనదగిన సహాయమైయున్నాడు. 4వ. వచనమందు ఒకప్పటి బలిష్ఠులైన జనముగా మనలను చేసాడు – ఇశ్రాయేలు శ్రమలకాల తదుపరి బలమైన జనముగా నుందురు. అందులకై దేవుని హెచ్చించి, ఘనపరచి స్తుతించుచున్నారు.

5వ. వచనమందలి బలత్కారులు ప్రస్తుతము మనకున్న శత్రువులగు అపవాది శరీరము లోకములు. ప్రస్తుకాలమందు వారి జయ కీర్తనలు వినబడుచున్నవి. ఇవన్నియు శ్రమల కాల చివరలో అణపబడినందున సంఘము, ఇశ్రాయేలు బలిష్టులై దేవుని ఘనపరచుదురు.

**6–9వ. వేయిఏండ్ల పాలనలోని ఆశీర్వాదమునుబట్టి సంతోషము:–**

6వ సీయోను కొండపై అనగా యెరూషలేము వేయి ఏండ్ల పాలనలో కేంద్రముగా నుండునని భావము. సమస్త జనములు అనగా శ్రమల కాలము నుండి వేయి ఏండ్ల పాలనలో ప్రవేశించినవారందరు అని భావము. విందు అనగా సంతోషము, సంతృప్తి ఉండునని భావము. కీర్తన 104:15 ప్రకారము ద్రాక్షారసము నరులకు సంతోషము కలిగించునది. ఇది పులిసినది కాదు. పులుపులేని పండ్లు పిండబడి అప్పుడే చేయబడిన ద్రాక్షారసము. జబ్బురసము కొన్ని పర్యాయములు సంతోషమునకు కాక అసభ్యతను తొందరను కలిగించును. ఈ వచనమందలి ఆహారము, ద్రాక్షారసము హృదయమును బలపరచి సంతోషపెట్టి తృప్తినిచ్చుచున్నది. వేయిఏండ్ల పాలన తృప్తిగా నుండునని దీని భావము.

7వ వచసమందలి సమస్త జనముల ముఖము పైనున్న ముసుగు తీసివేయుట ప్రస్తుతము ఇశ్రాయేలు క్రీస్తును గుర్తించుట లేదు కాని అప్పుడు వారికి జ్ఞానోదయము కలిగి క్రీస్తును గుర్తించి రక్షకుడిగా స్వీకరించుటను సూచించుచున్నది.

**8వ వచనమందు మరణము మ్రింగివేయుట:–** శ్రమల కాలమందు మరణించిన పరిశుద్ధులను జ్ఞాపకము చేయుచున్నది. మరణము పరిశుద్ధులను శ్రమలకాలమందు మ్రింగివేసినది. వారు వేయిఏండ్ల పాలన ప్రారంభమందు ప్రక 20:4 ప్రకారము పునరుత్థానులైన హతసాక్షులు క్రీస్తుకు యాజకులై ముందుగా వేయిఏండ్ల రాజ్యము చేసి తదుపరి సదాకాలము ఆయనతో ఉందురు కనుక మరణమును మరెన్నడు ఉండకుండ ఆయన మ్రింగివేసెనని చెప్పబడినది. 1 కొరింథీ 15:54లో మరణపు ముల్లు విరువబడినదని వ్రాయబడినది. దుఃఖము లేనందున ప్రకటన 21:4 ప్రకారము భాష్పబిందువులు తుడిచివేయబడి సదాకాలము సంతోషింతురు. 9వ. ఇశ్రాయేలు వారు జెకర్యా 13:1, 12:16 ప్రకారము కనిపెట్టుకొనిన వారి రక్షకుడైన క్రీస్తు వారికి ప్రత్యక్షపరచుకొనగా వారు

దుఃఖించి క్రీస్తును రక్షకుడుగా స్వీకరించినందున కీర్తన 118:15 ప్రకారము రక్షణనుబట్టి సంతోషించి ఉత్సహించి గానము చేతురు.

**10-12వ. ఇశ్రాయేలీయుల శత్రువులు సంహరించబడినందున సంతోషగానము, స్తుతి:-**

పై వచనములందు 1) మోయాబీయులను పెంట కుప్పలో వరి గడ్డివలె త్రొక్కుట, 2) ఈతగాండ్ర గర్వమును అణిచివేయుట, 3) మోయాబీయుల ప్రాకారములు క్రుంగగొట్టబడి ధూళిపాలగుట మొదలగునవి ఇశ్రాయేలీయుల అందరి శత్రువుల నాశనమును సూచించుచున్నది. ఆది 13:12లో లోతు లోకమును ప్రేమించి సొదొమకు వెళ్ళాడు. శరీర పాపమునుబట్టి లోతుకు మోయాబు జన్మించాడు. (ఆది 19:30-38వ). కనుక మోయాబీయులు లోకము, శరీరమును శత్రువులకు సాదృశ్యము. వేయి ఏండ్ల పాలనలో సాతాను ప్రకటన 20:1వ వచన ప్రకారము బంధించబడినాడు. మిగిలిన శత్రువులగు లోకము, శరీరము (లోకము శరీరమునకు సాదృశ్యమగు మోయాబీయుల నాశనమైనందున) వేయి ఏండ్ల పాలనలో ఇక శత్రువులుండరు. కనుక శత్రువులపై సంపూర్ణ విజయము దొరికినదను సంగతి స్తుతి కీర్తన చివరలో చెప్పబడినది.

10వ వచన ప్రకారము యెహోవా హస్తము ఈ కార్యము జరిగించును అనుట వేయి ఏండ్ల పాలన అనగా క్రీస్తు రాజ్యమును సంపాదించి పాలించుటను సూచించును.

## 26వ. అధ్యాయము (3+4+4+4+4+2=21వ)

**అంశము:- విమోచన పునరుత్థానములను బట్టి దేవునికి స్తుతి**

ఈ అధ్యాయమందు యెహోవా, అని 8, 12, 16, 20వ వచనముల ప్రారంభమునందున్నందున 1-7, 8-11, 12-15, 16-19, 20-21 అను ఐదు భాగములుగా ఈ అధ్యాయము విడగొట్టబడినది. మొదటి ఏడు వచనములు 1-3, 4-7గా విడగొట్టి ధ్యానించుచున్నాము. 1-3వచనములు ఈ అధ్యాయమునకు పీఠికగాను, 20-21 వచనములు ముగింపుగాను చూతుము.

**1-3వ. వేయి ఏండ్ల పాలన వివరము:-** వేయి ఏండ్ల పాలనకు కేంద్రమైన యెరూషలేము 1వ. ప్రాకారములు, బురుజులు గల బలమైన పట్టణముగా నున్నది. వేయి ఏండ్ల పాలన ఏ అపాయములు కీడులు లేక భద్రముగా నుండునని దీని భావము. ప్రకటన 20:1 ప్రకారము కీడుకు కారణమైన సాతాను బంధించబడినందున వేయిఏండ్ల పానలో ఏ తొందరయుండదు. 2వ. అబద్ధమునకు జనకుడైన సాతాను (యోహాను 8:44) బంధించబడినందున జనులు సత్యము నాచరించు నీతిగల జనముగానున్నారు.

కీర్తన 24:7-9వచనములలో గుమ్మములారా మీ తలపు తీయుడి. మహిమగల రాజు ప్రవేశించును అని వ్రాయబడినది. కనుక వేయిఏండ్ల పాలనలో క్రీస్తు రాజుగాను తన మహిమతోను ఉండును. (మత్తయి 25:31) శ్రమలగుండా వెళ్ళిన ఇశ్రాయేలీయులు శేషము నీతిగల జనముగా నుండగా వారు వేయిఏండ్ల పాలనలో ప్రవేశించునట్లు ద్వారములు తీయబడుచున్నవి. 3వ. హృదయములో క్రీస్తును విశ్వసించి మనస్సు క్రీస్తుమీద ఆనుకొనినవారు పూర్ణశాంతి కలవారుగా నుందురు. నేటి దినములలో నివసించు మనకును ఈ వాగ్దానము వర్తించును. మనము విశ్వాసము నుండి మరలక ప్రభువు మీదనే ప్రతిదినము ప్రతిగంట, ప్రతి క్షణము మనస్సుంచిన యెడల ఫిలిప్పీ 4:7 ప్రకారము దేవుని సమాధానము మన హృదయములకు, తలంపులకు కావలియుండును.

**4-7వ. శత్రువును ఓడించి బీదలైన తన ప్రజలకు మార్గము సరాళము చేయబడుట:-**

5వ. ఈ ప్రవచనము ప్రస్తుతకాల నెరవేర్పుగా నీనెవె పట్టణము, బబులోను పట్టణము అనగా అష్షూరు, బబులోను సామ్రాజ్యములు పతనమైనవి. అంత్యకాల నెరవేర్పుగా వేయిఏండ్ల పాలనలో చూతుము. శత్రువులైన సాతాను, క్రీస్తు విరోధి ఏడేండ్ల శ్రమకాలమందు పాలించినందున ఉన్నత స్థలములో నివసించువారుగా చూచుచున్నాము. దేవుని ప్రజలు దీనులు మరియు బీదలు. క్రీస్తు విరోధి అబద్ధ ప్రవక్తలు ప్రకటన 19:20 ప్రకారము అగ్నిగుండములో వేయబడిరి. ప్రకటన 20:1 ప్రకారము అపవాది అగాధములో బంధింపబడినందున శత్రువులు ఓడించబడిరి. 6వ. దేవుని ప్రజలు ఒకప్పుడు ఆత్మీయముగా బీదలు, దీనులుకాని క్రీస్తును ఆశ్రయించినందున జయశాలురుగా శత్రువుల నివాసమైన ఉన్నత స్థలములను త్రొక్కువారుగానున్నారు. 7వ. నీతిమంతులుగా తీర్చబడిన తన ప్రజల కొరకు మార్గము సరాళము చేయబడినది. లూకా 6:20లో బీదలైన మీరు ధన్యులు దేవుని రాజ్యము మీది అని వ్రాయబడినది. ఈ దేవుని రాజ్యము వేయి ఏండ్ల పాలనయే.

**8-11వ. వేయి ఏండ్ల పాలనలో నీతిమంతులు - దుష్టులు:-**

8వ. శ్రమల కాలమును దాటి వచ్చిన నీతిమంతులు దేవుడు చేయు తీర్పులకై కనిపెట్టుకొని వేయిఏండ్ల కాలమందు దేవుని నామస్మరణకై ఆశించుదురు. ప్రస్తుకాలమందు మనమును అలాగుండవలెనని ఫిలదెల్ఫియా సంఘముతో సెలవిచ్చుచున్నాము. నా నామమును ఎరుగను అనలేదు ప్రకటన 3:8. 9వ. ప్రవక్త తన ప్రాణము, ఆత్మతో ప్రభువునే అన్నిటికంటె ఎక్కువగా ఆశించినట్లు చూచుచున్నాము. లోక ప్రజలు నీతి అనగా ఏమియో నేర్చుకుంటున్నారు. అలాగే ప్రస్తుత కాలమందు మనము ప్రాణాత్మలలో ప్రభువునే అన్నిటికంటె ఎక్కువగా ఆశించుచూ నీతిని నేర్చుకొనువారముగా నుందుము గాక.

10,11వ. వేయి ఏండ్ల పాలన ధర్మక్షేత్రము వంటిదైనను దుష్టులగువారు నీతిని నేర్చుకొనక

చాపబడిన క్రీస్తు హస్తములనుచూడక, వేయి ఏండ్ల అంతమందు అగాధమునుండి విడిపించబడిన సాతానునే వెంబడింతురు. నిత్యనాశనమైన నరకాగ్నికి వెళ్ళుదురు. వివరములు ప్రకటన 20:5-10, 11-15 వచనములందు చూతుము.

**12-15వ. దేవుని ప్రజలకు కలిగిన విమోచనమునుబట్టి, శత్రువుకు కలిగిన శిక్షనుబట్టి దేవుని స్తుతించుట:-** 12వ. యెషయా 9:6 ప్రకారము ప్రభువు సమాధానకర్త గనుక సమాధానమును స్థిరపరచువాడుగాను పనులన్నిటిని సఫలపరచువాడుగాను ప్రభువును చూతుము. 13వచనములో ఇతర ప్రభువులు ఏలినను (విగ్రహారాధన చేసినను) ప్రభువు సమాధానమిచ్చి, సఫలపరచినందున ఆయన నామమును స్మరించుచున్నారు. ప్రస్తుత కాలమందు ప్రపంచము సాతాను పాలనలోనున్నను ఆయన బిడ్డలమైన మనకు ప్రభువు సమాధానమును, స్థిరపరచుచున్నందున, పనులన్నింటిలోను సఫలపరచుచున్నందున ఎల్లప్పుడు ఆయన నామస్మరణ చేయాలి.

14-15వ. మరెన్నడు లేవకుండ శత్రువులు ప్రభువుచేత సంహరించబడినందునను ప్రభువును స్తుతించాలి. ఇశ్రాయేలుకు సొలమోను కాల రాజ్య విస్తీర్ణతకంటె ఎక్కువైన రాజ్యమిచ్చినందున (ప్రస్తుతము శాపము క్రింద ఉన్నను) ప్రపంచమందలి అన్ని దేశములలో ఉన్నారు. అంత్యకాలమందు సమకూర్చబడి వేయిఏండ్ల కాలములో ప్రవేశించి ప్రపంచమంత ఏలుదురు. విశ్వాసులు కూడా ప్రభువుతో వేయి ఏండ్లు పాలించుటయు ఈ ప్రవచన నెరవేర్పే.

**16-19వ. శ్రమలనుండి పునరుద్ధరించబడినందున స్తుతించుట:-**

16-18వ. శ్రమలు దేవునికి ప్రార్థన చేయుటకు నడిపిస్తాయి. అన్ని చక్కగానున్నప్పుడు ప్రార్థన తగ్గుతుంది. శిక్ష సంబంధమైన శ్రమలో ప్రార్థించినను దేవుడు జవాబిచ్చును. శ్రమలనుండి విడిపించును. ఇశ్రాయేలుకు గర్భవేదనవంటి శ్రమలు కలిగినను దేవుడు విడిపించాడు. ప్రసవించిన స్త్రీ సంతోషించినట్లు సంతోషముచేతవారు నింపబడిరి.

19వ. దానియేలు 12:2 ప్రకారము మృతులందరు బ్రతుకుదురు. విమోచించబడినవారు చనిపోయినను మరల బ్రతికి (మేల్కొని) ఉత్సహింతురు. అనగా దేవుని స్తుతింతురు.

**20-21వ. పాపులకు శిక్ష:-** అంత్యకాల నెరవేర్పుగా పాపములకు పశ్చాత్తాపపడక చనిపోయినవారు దేవుని ఉగ్రతయైన నరకశిక్షలో పాల్గొందురు. వెంటనే జరుగు ప్రవచన నెరవేర్పుగా పాపులైన ఇశ్రాయేలును శ్రమలకాలములో శిక్షించాడు, కాని కొద్దిమంది ప్రకటన 7:4, 14:1 ప్రకారము శిక్షనుండి తప్పించబడిరి. మిగిలిన వారందరు శ్రమల పాలగుదురు. మత్తయి 27:25 ప్రకారము ప్రభువును సిలువవేసినందున ప్రపంచమంతటికి తరుమబడి శిక్షకు పాత్రులైరి.

# 27వ. అధ్యాయము (3+3+3+4=13వ)

**అంశము:- వేయి ఏండ్ల కాలములో సమకూర్చి కాపాడిన దేవునికి స్తుతి కీర్తన**

27:1,2,2,13లో ఆ దినము, 6వలో రాబోవు దినము వేయిఏండ్ల పాలనను సూచించును.

ప్రవచనమునకు తాత్కాలిక నెరవేర్పు అంత్యకాల నెరవేర్పు రెండును గమనించుట మంచిది. మొదటి వచనమందు 1) తీవ్ర సర్పమైన మకరము 2) వంకర సర్పమైనను మకరము 3) సముద్రమీదనున్న మకరము అను ముగ్గురు శత్రువులను గూర్చి ప్రస్తావించినందున ఇశ్రాయేలీయుల శత్రువులైన 1) అష్షూరు 2) బబులోను 3) ఐగుప్తులను నాశనము చేసి తన వాక్యమందు సెలవిచ్చినట్లు దేవుడు ఇశ్రాయేలును విడిపించుట ప్రవచనము యొక్క తాత్కాలిక నెరవేర్పుగా చూడగలము. అష్షూరీయులను క్రీ.పూ 606లోను, బబులోనీయులను క్రీ.పూ 536లోను, అదే సమయములో ఐగుప్తును నాశనము చేసి ఇశ్రాయేలు వంశమును దేవుడు కాపాడాడు. ఈ అధ్యాయమందు ప్రవచన తాత్కాలిక నెరవేర్పు కంటే అంత్యకాల నెరవేర్పు ప్రాముఖ్యమైనది.

**1-6వ. వేయి ఏండ్ల కాలమందు ఇశ్రాయేలు కాపడబడురీతి:-** 1వ. ఇశ్రాయేలును కాపాడుట, సాతాను త్రిత్వము లయపరచుట ముఖ్యాంశములు. ప్రకటన 12:9, 20:1-2 వచనాలలో సర్పము అపవాదిగా చెప్పబడుట యెషయా 27:1లో నున్న తీవ్ర సర్పము, వంకరసర్పము సముద్రము మీదనున్న మకరమును అపవాది త్రిత్వములైన 1)సాతాను, 2) క్రీస్తు విరోధి 3) అబద్ధ ప్రవక్తలుగా చూడగలము. ఈ ముగ్గురిని క్రీస్తు అంత్యకాలములో ప్రకటన 19:20,21లోను 20:14-15లోను నాశనము చేయుట గమనింతుము. ప్రకటన 19:20-21లో మృగమైన క్రీస్తు విరోధి, అబద్ధ ప్రవక్త, కడమవారు దేవుని వాక్యమను నామము గలవాడు (19:13) గుర్రము మీద కూర్చున్నవాని నోట నుండు వచ్చు ఖడ్గముతో వధించబడిరి. యెషయా 27:1లో చెప్పబడిన గట్టిది, గొప్పది, బలమైనది, దేవుని ఖడ్గమైన (ఎఫెసీ 6:17) వాక్యముచేత సాతాను త్రిత్వము సంహరించబడుదురని ముందుగా ప్రవచనము చెప్పబడినది.

2వ. ఆ దినమున అనగా వేయి ఏండ్ల పాలనలో మనోహరమైన ద్రాక్షావనము యెషయా 5 అధ్యాయములో చెప్పబడిన ఇశ్రాయేలు వంశమే. ఇశ్రాయేలీయుల ముఖ్య పట్టణమైన యెరూషలేమును కేంద్రముగా కలిగి క్రీస్తుయేసు ప్రపంచపాలన చేయుచుండగా ఇశ్రాయేలీయులు మనోహరమైన వారుగాను కీర్తన 104:15లో ద్రాక్షారసము నరుల హృదయమును సంతోషపెట్టునది కనుక ఇశ్రాయేలీయుల ద్వారా క్రీస్తు పాలన ప్రపంచ

ప్రజలను సంతోషపెట్టునదిగా నుండును. 3-4వ. క్రీస్తుయేసు 1) కాపు చేయువాడు 2) ప్రతి నిమిషము దానికి నీరు కట్టువాడు 3) ఎవడును దాని మీదకు రాకుండ దివారాత్రులు దాని కాపాడువాడు 4) గచ్చపొదలు బలు రక్కసి చెట్లు ఉన్న యెడల అటువంటి వారిని కాల్చివేయువాడు.

5వ. జనులు దేవుని ఆశ్రయించాలని, సమాధానపడాలని దేవుడు సెలవిచ్చుట వేయిఏండ్ల పాలనలో ప్రవేశించినవారిలో క్రీస్తుతో సమాధానపడని వారుందురని నేర్చుకొనుచున్నాము. మత్తయి 25:31లో వేయి ఏండ్ల పాలనలో ప్రవేశించినవారు ముందటి శ్రమలకాలములో యూదులకు సహాయము చేసినవారే గాని అందరు క్రీస్తును నమ్మినవారు కారు. క్రీస్తును నమ్మని వీరు క్రీస్తుతో సమాధానపడాలని క్రీస్తును ఆశ్రయించి రక్షణ పొందాలని దేవుని ఆశ. చివరకు వేయి ఏండ్ల పాలనలో కూడా రక్షణకై అవకాశమిచ్చుట దేవుని కృప, ప్రేమకు తార్కాణములు. 4వ వచన ప్రకారము ఇశ్రాయేలు పట్ల బలురక్కసి చెట్లవలె నుండు వారును రక్షణ పొందుటకు ఆహ్వానించుచున్నారు. 6వ. మరల ఇశ్రాయేలీయుల అభివృద్ధి, వృష్పించుట ప్రస్తావించబడుచున్నది. దీని వివరములు 35వ అధ్యాయములో గమనించగలము.

**7-9వ. ఆశీర్వాదమునకు ముందుగా ఇశ్రాయేలు పొందిన శిక్ష:-** 7వ. దేవుని ఎరుగని అన్యులను లేదా తనకు శత్రువులను శిక్షించిన రీతిగా తన వారిని శిక్షించదు. తన ప్రజలను శిక్షించుటకు ఎవరిచేతికైనా అప్పగించిననూ తను సెలవిచ్చినమట్టుకే శిక్షింప అనుమతించును. శిక్ష ముగిసిన తర్వాత కఠినమైన తుపానుచేత శిక్షను ఆపివేయును. తన పిల్లలను శిక్షించు విధమునకు శత్రువులను శిక్షించు విధమునకు తేడా కలదని గమనించాలి. తన పిల్లల శిక్ష క్రమశిక్షయే (హెబ్రీ 12:7-11వ. క్రమశిక్షకు లోబడని యెడల 2 కొరింథీ 5:10 ప్రకారము ప్రతిఫలము పొందుటకు క్రీస్తు న్యాయపీఠము ముందు తీర్పు తీర్చబడి బహుమానమును కోల్పోవుదురు. 9వ ఇశ్రాయేలీయుల పాపమైన విగ్రహారాధనలో వారు వాడిన విగ్రహములన్నిటిని పగులగొట్టి వారి పాపమునకు ప్రాయశ్చిత్తము చేయును. ప్రభువు పిల్లలమైన మనము ప్రభువుకంటే ఎక్కువగా ప్రేమించునదేదైనను విగ్రహమే కనుక అది మనలో నుండి పగులగొట్టబడి తీసివేయబడువరకు మనలను క్రమశిక్షలో నుంచును.

**10-13వ. ఇశ్రాయేలుకు శ్రమల తరువాత ఆశీర్వాదము:-** 10-11వ. ఇశ్రాయేలును క్రమపరచునవి పై భాగములో చూచితిమి క్రమశిక్ష విధమిక్కడ వివరించబడినది. ఇశ్రాయేలును కాపాడువాడు ప్రాకారమువంటి ప్రభువు. కాని క్రమశిక్షలో ప్రాకారము గల పట్టణము నిర్జనమైన అడవివలె విడిచిపెట్టబడును. దేవుడు కాపుదల నాపివేయగా ఇశ్రాయేలు అడవివలె నాయెను. కొమ్మలు ఎండి తగులబెట్టబడును. దేవుడు వారియందు జాలిపడడు.

అలాగుననే ఇశ్రాయేలీయులు విగ్రహారాధికులు కాగా బబులోనుకు శిక్షకు పంపునప్పుడు యెరూషలేము పట్టణ ప్రాకారము పడగొట్టబడెను. దాని గుమ్మములు కాల్చబడెను. కాని దేవుడు వారిపై జాలిపడలేదు. క్రీస్తును యూదులు సిలువవేసిన కారణమున రోమా చక్రవర్తి తీతు ద్వారా క్రీ.శ. 70లో యూదులు యెరూషలేము నుండి పారిపోగా పట్టణము సమూలనాశనము చేయబడి ఒలీవ చెట్లన్నియు నరికివేయబడి సుమారు 30 సంవత్సరములు పట్టణము అడవి వలె నుండెను.

12-13వచనములలో ఇశ్రాయేలు వారిని ఆశీర్వాదమును గూర్చి చెప్పబడినది. 12వ. క్రమశిక్షణలోనున్న ఇశ్రాయేలు పశ్చాత్తాపపడిన యెడల దేవుడు వారిని గొప్పగా ఆశీర్వదించును. పంటకాలములో పొలమంతటి నుండి పంట సమకూర్చినటుల ప్రభువు యూఫ్రటీసు అనగా అష్షూరు, బబులోను, దేశములు ఐగుప్తు నది అనగా ఐగుప్తు దేశము మొదలగు అన్ని ప్రాంతముల నుండి ఇశ్రాయేలీయులను సమకూర్చి విశ్వాసము గలవారినందరిని రక్షించును. 13వ. పెద్ద బూర ఊదబడుట. లేవీ 25:8లో చెప్పబడిన బూరల పండుగ ప్రాయశ్చిత్తదినమున బూరలు ఊదగా ఇశ్రాయేలీయులందరు పునరుద్ధరించబడి జూబిలీ సంవత్సరమందు తమ తమ స్వాస్థ్యములను పొందినట్లు మత్తయి 24:31 ప్రకారము క్రీస్తును గుర్తించి క్రీస్తునందు విశ్వాసముంచిన వారందరు తిరిగి వచ్చి క్రీస్తుయేసుకు నమస్కారము చేయుదురు.

## 28వ. అధ్యాయము (7+8+7+7=29వ)

### అంశము:- (1:15వ) లోకమునకు సాదృశ్యముగానున్న పది గోత్రముల ఇశ్రాయేలీయుల పాపముబట్టి శ్రమలు

**1-7వ. ఇశ్రాయేలీయుల ఏలికల పాపము:-** 1వ. పది గోత్రముల ఇశ్రాయేలులో ఎఫ్రాయిామీయుల సంఖ్యయే ఎక్కువ. వారి ముఖ్య పట్టణమైన షోమ్రోను చుట్టు అనేక రమ్యమైన ద్రాక్షా తోటలు కలవు. ఈ భాగములో కిరీటము అను పదము 1,3,5వ వచనములలోనున్నందున కిరీటధారులగు ఇశ్రాయేలు రాజులను గూర్చి చెప్పబడిన భాగముగా ధ్యానింతుము. వారు త్రాగుబోతులని, కూలిపోయిరని, వాడిపోవుచున్న పుష్పమువంటివారి సౌందర్యమునకు శ్రమ అన్నందున వారి రాజులకు రాబోవు శిక్షను గూర్చి వ్రాయబడుచున్నది 2వ. బలవంతుడైన అష్షూరు రాజు దేవుని సెలవుతో వచ్చి యుద్ధమాడును. వడగండ్లు, జల ప్రవాహము వరద యెషయా 57:20, ప్రకటన 17:15 ప్రకారము జలమును జనములను సూచించును. 3-4వ. అష్షూరు రాజు సైన్యము జల ప్రవాహము వలె వచ్చి మొదటి అంజూరపు పండును మ్రింగివేసినట్లు ఇశ్రాయేలు వారిలో

మొదటి వాడైన రాజు మ్రింగివేయబడును. ఈ ప్రవచన అంత్యకాల నెరవేర్పుగా ప్రచండమైన వరద ద్వారా ప్రకటన 12:15లో నష్టము, ప్రచండమైన వడగండ్ల ద్వారా నష్టము ప్రకటన 16:15లో జరుగుట చూతుము. 5-7వ. ఆ దినమున శేషించిన తన ప్రజలు అనగా అంత్యకాలములో ప్రకటన 7:3-4 వచనాలలో 1,44,000 వేల మందిని నొసట ముద్రించి ప్రభువు కాపాడుటను ప్రవచనముగా చూతుము.

6వ. ఆయన న్యాయపీఠము మీద కూర్చుండు వారికి తీర్పు తీర్చనేర్పు ఆత్మగాను, యుద్ధమును పారగొట్టు వారికి పరాక్రమము పుట్టించువారుగా నుండుట యూదా రాజ్యమునకు ప్రవచనముగా తలంచగలము. అష్షూరు రాజైన సన్హెరీబు యూదారాజైన హిజ్కియా మీదకు రాగా ఆయన అనగా దేవుడే శత్రువును తరిమివేసెను.

7వ. అయితే వీరును ద్రాక్షరసము వలన సొక్కిసోలుట, హిజ్కియా రాజు తరువాత వచ్చిన రాజుల భక్తిహీనత ముఖ్యముగా యూదాలో చివరి రాజులైన యెహోయాహాజు, యెహోయాకీము, యెహోయాకీను, సిద్కియాలు భక్తిహీనులైనందున యూదా రాజ్యము సోలిపోయెను. అనగా యూదా ప్రజలు, రాజులు బబులోను చెరలోనికి క్రీ.పూ 606, 597, 586లో పోయిరి.

**8-15వ. యూదాలోనున్న యాజకుల ప్రవక్తల పాపము:-** 7-8వ. యాజకులు దేవుని మందిరములో కార్యములను జరిగించాలి. ప్రవక్తలు దర్శనముల ద్వారా దేవుని వర్తమానము పొంది ప్రజలకు ప్రకటించాలి. కాని యాజకులు ప్రవక్తలు ద్రాక్షారసముతో అనగా లోక సంతోషములతో మత్తులైయున్నారు. దేవుని దర్శనములను గుర్తించలేనంత మత్తులుగా సోలుచున్నారు. మత్తులైనందున వారి భోజనపు బల్లలన్నియు వాంతితోను కల్మషముతోను నిండియున్నవి. 9-12వ. యూదా ప్రజలు కూడా యాజకులు ప్రవక్తలు బోధించు విధమును అంగీకరింపకున్నారు. ఒక్కొక్క ఆజ్ఞను నిదానముగా చిన్న పిల్లలకు వలె బోధించుచున్నాడని మాటలాడుచున్నారే కాని దేవుని ఆజ్ఞలను స్వీకరించకున్నారు. దేవుని మాటలు నెమ్మదిని విశ్రాంతిని ఇచ్చునని గుర్తించక విననొల్లక యున్నారు కనుక శత్రువుల ద్వారా శిక్షించనైయున్నాడు.

13-15వ. మరి కొంత కాలమునకు దేవుడు తన ఆజ్ఞలను ఒక్కొక్కటిగా వారికి బోధించి ప్రజలు విననొల్లని కారణమున అష్షూరు రాజుకు అప్పగింపబడుదురు. ఐగుప్తు సహాయముతో అష్షూరీయులను జయించగలమని తలంచుటయే మరియు మరణముతో నిబంధన చేసికొనుటయే అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**16-22వ. దేవుని పిలుపు - తీర్పు:-** 16వ. రాజులు, ప్రవక్తలు, యాజకులు మత్తులై దేవుని మాట వినలేని స్థితిలో నుండగా ప్రభువైన యెహోవా సీయోనులో పునాదిగా వేయబడిన రాయియైన ప్రభువైన యేసునందు విశ్వసించువాడు కలవరపడడని చెప్పుచున్నాడు. ప్రభువైన యేసును గూర్చిన ప్రవచన వివరము.

1) సీయోనులో వేయబడిన పునాది రాయి, మూలకు తలరాయి:- పాపక్షమాపణకు యేసు తప్ప వేరే ఏ మార్గము లేనందున ఆయనే మూలరాయి స్థిరమైన పునాది రాయియైయున్నాడు. ఆయన స్థిరుడు కనుక ఆయనయందు విశ్వసించువారు కలవరపడనవసరము లేదు.

2) అమూల్యమైన రాయి:- 1 పేతు 1:19లో పాపక్షమాపణకై చిందించిన యేసురక్తము అమూల్యమైనందున, రాయి అనగా మంటి శరీరములో అమూల్యమైన రక్తము కలిగిన మాంసదేహమందు ఈ లోకములో ప్రత్యక్షమైనందున ఆయన అమూల్యమైన రాయియే.

3) పరిశోధింపబడిన రాయి:- మత్తయి 4:1-10 వచనములలో సాతానుచేత పరీక్షగా శోధించబడి 1) శరీరాశ 2) నేత్రాశ 3) జీవపు డంబమను మూడు రకములైన శోధనలను జయించెను.

4) స్థిరమైన పునాది రాయి:- క్రీస్తు స్థిరమైన పునాది రాయియైయుండగా సంఘము ఆ రాయి మీద కట్టబడి స్థిరమైనదిగా నున్నది. ప్రభువు మీద మరియు ఆయన సంఘము మీద కట్టబడువాడు స్థిరముగా నుండును.

17-18వ. దేవుడు నీతిన్యాయములను కొలనూలుగా పెట్టి మాయా శరణ్యమును కొట్టివేయగా ప్రభువుపైన ఆనుకొనువారు సంతోషింతురు. కాని ప్రభువులో లేనివారు అష్షూరు రాజు వరదవచ్చినట్లు వచ్చి ఇశ్రాయేలు వారిని నాశనము చేయును.

19-22 ఈ ప్రవచన నెరవేర్పుగా అంత్యకాలములో శ్రమలు మహాశ్రమల కాలములోను వరదవలె శ్రమలచేత ఇశ్రాయేలీయులు బాధపెట్టబడెదరు.

**23-29వ. ఇశ్రాయేలుకు దేవుని వాగ్దానము:-** చెవియొగ్గి నా మాట వినమని దేవుడు సెలవిచ్చుచున్నాడు. సేద్యగాడు భూమి చదును అగువరకే భూమిని దున్నును కాని తరువాత దున్నడు. అలాగే దేవుడు తన ప్రజలను అవసరమైనంతవరకే శిక్షించును. ఆ తరువాత శిక్ష మానివేయును. సేద్యగాడు విత్తనములు విత్తిన తరువాత భూమి ఫలించగా సేద్యగాడు దానిని దుళ్ళగొట్టి గాలించును. మరెన్నడు వాటిని నలుపడు. అలాగే దేవుడు ఇశ్రాయేలు వారిని ఫలింపచేయునుగాని నలుపడు నాశనము చేయడు అని నేర్చుకొందము.

# 29వ. అధ్యాయము (4+4+4+4+4+4=24వ)

అంశము:- యూదావారికి, యెరూషలేము పట్టణమునకు పాపమునుబట్టి శ్రమ-తదుపరి రక్షణ

**1-4వ. యూదా వారికి వారి పట్టణమైన యెరూషలేముకు దేవుని తీర్పు:-**

1వ. అరీయేలు అను పేరుకు దేవుని సింహము లేదా బలిపీఠము అని అర్థము. దేవుని సింహము యూదా గోత్రమే, బలిపీఠము యెరూషలేమే. కనుక యూదా వారికి యెరూషలేముకు కలుగబోవు శ్రమలను గూర్చి దేవుడు సెలవిచ్చుచున్నాడు. ప్రవచనమునకు సమీప నెరవేర్పు, అంత్యకాల నెరవేర్పు ఉండును. 2వ. సమీప నెరవేర్పుగా బబులోను రాజు క్రీ.పూ. 606 నుండి క్రీ.పూ 536 వరకు 70 ఏండ్ల యూదులను చెరగొని శ్రమలపాలు చేసెను. యెరూషలేము పట్టణము కాల్చబడి యవనులందరు 2 దిన 36 ప్రకారము చంపబడిరి. 3వ. యెహె 4:1-4వ. ప్రకారము నెబుకద్నెజరు యెరూషలేము చుట్టు ముట్టడి దిబ్బలు వేయించెను. అంత్యకాలములో ఏండేండ్ల శ్రమలు మహాశ్రమలలో యూదులు శ్రమ పెట్టబడుదురు. యెరూషలేము దేవాలయములో మహాశ్రమల కాలమగు చివర మూడన్నర ఏండ్లలో క్రీస్తు విరోధిచే బల్యర్పణ ఆటంకపరచబడును. 4వ ఈ శ్రమలలో శత్రుభయము వలన ఇశ్రాయేలీయులు గట్టిగా మాటలాడక గుసగుసలు మాటలాడుట జరుగును.

**5-8వ. యెరూషలేము పట్టణమునకు, ప్రజలకు కలుగబోవు రక్షణ:-** 6-7వ. ప్రవచన సమీప నెరవేర్పుగా 70 ఏండ్ల చెర చివర బబులోను రాజగు బెల్షస్సరు ఆయన సైన్యమును ఎగిరిపోవు పొట్టువలె సంహరించాడు. ఇదంత హఠాత్తుగా ఒక రాత్రి రాజు పరివారము ద్రాక్షారసముతో మత్తులై యుండగా దానియేలు గ్రంథము 5వ అధ్యాయములో చెప్పబడినట్లు జరిగినది. ఈ ప్రవచన అంత్యకాల నెరవేర్పుగా ఏడేండ్ల శ్రమల కాలము చివర హార్‌మెగిద్దోను యుద్ధములో క్రీస్తు విరోధి అతని అనుచరులు ఎగిరిపోవు పొట్టు వలె నశింతురు. వివరములు ప్రక 19:11-21వ.లో కలవు. 7-8వ. సీయోను కొండమీద యుద్ధము చేయుట, అనగా సీయోను పట్టణమని పిలువబడు యెరూషలేముకు తూర్పుననున్న ఒలీవల కొండమీదకు ప్రభువు తన రెండవ రాకడలో దిగివచ్చినప్పుడు క్రీస్తు విరోధికిని, తనను వెంబడించిన వారికిని సంభవించును.

**9-12వ. యూదా వారి గ్రుడ్డితనమను పాపమునుబట్టియే శ్రమ కలుగుట:-**

9-10వ. యూదా ప్రజలు ద్రాక్షారసము లేకపోయినను మత్తులై, తూలుచున్న వారివలె, గాఢనిద్రాత్మ కలవారివలె ఆత్మీయ గ్రుడ్డితనము కలవారై యున్నారు.

11-12వ. వారి ప్రవక్తలు ప్రజలకు కన్నులుగా నుండాలి. కాని వారి దీర్ఘదర్శులు ముసుకులోనున్నట్లు సంగతులు అర్థము చేసికొనక చెడిపోయి యూదా ప్రజలను సరియైన రీతిగా నడిపించలేకున్నారు.

**13-16వ. యూదావారి పైపై భక్తి అను పాపము:-** 13-14వ ప్రజలు నిజమైన భక్తిలేక నోటి మాటలతోనే వారి మధ్యకు వచ్చుచున్నారు. పెదవులతో దేవుని ఘనపరచుచున్నారు కాని హృదయము దూరముగా ఉన్నది. ముందుగా యెష 1:12లో ఈ విషయము చెప్పబడినది. నూతన నిబంధనలో మార్కు 7:6లో ఈ విషయము చెప్పబడినది. ఈ దినములలో విశ్వాసులలో పైపై భక్తియే కనబడుచున్నది కాని హృదయములో నిజమైన భక్తి కనిపించదు. ప్రజలు కన్నులారా చూచి, మనసారా గ్రహించి, స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వి ఉన్నదని అపొ. 28:27లో చెప్పబడినది. 15-16వ. కుమ్మరికిని మంటికిని బేధము లేదని సృష్టికర్తయైన దేవుడు సృజించబడిన మన్నయిన మానవులకు బేధము లేనట్లు దేవుని నిర్లక్ష్యపెట్టుచున్నారు. నిజమైన భక్తిని దేవునిపట్ల యూదావారు చూపుట లేదు.

**17-20వ. యూదాకు విమోచన, ఆనందము:-** 17-18వ. యూదావారు కన్నులు తెరువబడి, చెవులు విప్పబడి గ్రంథవాక్యములకు విధేయత చూపుదురు. యూదా దేశము విమోచించబడి ఫలవంతమైన దేశమగును.

19-20వ. దేశములోని దీనులు యెహోవాయందు ఆనందింతురు. బీదలు పరిశుద్ధ దేవునియందు సంతోషింతురు. దేశములో బలత్కారులు పరిహాసకులు లేకపోవుదురు.

**21-24వ. దేవునికి భయపడువారికి ఆశీర్వాదము:-** విమోచించబడి దేవునికి భయపడు అబ్రాహాము సంతానమైన యూదావారు ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా బబులోను చెరనుండి విడిపించబడి పడిపోయిన దేవాలయమును కట్టుట ద్వారా దేవునికి జెరుబ్బాబేలు, ఎజ్రా, నెహెమ్యాల కాలములో మహిమ కలిగినది. అంత్యకాల నెరవేర్పుగా వేయి ఏండ్ల పాలనలో యూదావారు యెరూషలేములో దేవుడు చేయు కార్యములు చూచి దేవుని నామమును మహిమపరచుదురు. వివేకవంతులై దేవుని ఉపదేశమునకు లోబడుదురు.

## 30వ. అధ్యాయము (8+9+8+8=33వ)

**అంశము:- యూదా పాపమునుబట్టి శ్రమ - సమకూర్పు, దేవుని ఆత్మ నియమించిన సంధి**

**1-8వ. యూదావారి పాపము:-** 1-5వ. ప్రవచన సమీప నెరవేర్పుగా యూదావారు అష్షూరీయుల నుండి తప్పించుకొనుటకు సోయను, హానేసను ఐగుప్తు దేశ

ముఖ్యపట్టణమునకు వెళ్ళిరి. దేవుని అడుగక పలుమారులు సహాయమునకై ఐగుప్తు రాజును శరణుజొచ్చి సిగ్గుపడిరి. 30, 31 అధ్యాయములలో అష్షూరు రెండు పర్యాయములు, ఐగుప్తు నాలుగు పర్యాయములు ప్రస్తావించబడినది. అంత్యకాలములో దేవుని యొద్ద విచారణ చేయకయే శ్రమల కాల ప్రారంభములో క్రీస్తు విరోధితో నిబంధన చేసికొనిరి. చివరకు సిగ్గుపడిరి. 6-8వ. సింహమగు అపవాది, తాపకరమైన మిడునాగులు అనగా క్రీస్తు విరోధితో మిక్కిలి శ్రమ అనగా మహాశ్రమలను అనుభవించుదురు. సహాయముకై ఎక్కడికి వెళ్ళినను శ్రమల కాలమంత గడిచిన తరువాత విడుదల కలుగునని దేవుడు చెప్పుచున్నాడు.

**9-17వ నిబంధనకు భంగము (9-11వ) - శిక్ష పొందుట (12-17వ):-** 9-11వ యూదావారు దేవుని మీద తిరుగబడి, అబద్ధములాడుచు దేవుని యొద్ద విచారణ చేయక, దేవుని మాటలు చెప్పవద్దనుచున్నారు. ప్రవక్తలు యుక్తమైన మాటలే పలుకాలని కోరుకొనుచున్నారు. పరిశుద్ధ దేవుని పేరు ఎత్తకూడదని దేవునితో చేసిన నిబంధన భంగము చేయుచున్నారు. ఈ దినములలోను రక్షణలేని నామకార్థ క్రైస్తవులు గద్దింపును దిద్దుబాటును ప్రేమించక ఆశీర్వాద ప్రసంగములనే కోరుచున్నారు. 12-17వ. కుమ్మరి కుండను పగులగొట్టినట్లు దేవుడు యూదావారిని పగులగొట్టి శిక్షించునని, తప్పించుటకు ప్రయత్నించినను తప్పించుకొనలేరని దేవుడు చెప్పుచున్నాడు. 15వ.లో వారు 1) ప్రభువు వైపు మరలి రావాలని, 2) ఊరకుండి విధేయులు కావాలని, 3) రక్షణ పొందెదరని, 4) ఊరకుండి దేవునియందు నమ్మిక యుంచాలని, 5) బలము, పొందెదరని చెప్పుచున్నాడు. ఈ హెచ్చరికలు నేటి క్రైస్తవులు పాటించాలి. యెషయా కాలమందు యూదులు పాటించలేదు.

16-17వ. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా 2 దిన 36:17-21లో యూదా ప్రజలు మరియు యెరూషలేము పట్టణము శిక్షించబడెను. అంత్యకాల నెరవేర్పుగా ఏడేండ్ల శ్రమల మహాశ్రమల కాలములో సంఘము ఎత్తబడగా నామకార్థులు దేవుని దూషించిరి అని ప్రకటన 16:9,11,21లో చెప్పబడినది.

**18-25వ. యూదావారి విమోచన సమకూర్పు, ఆశీర్వాదము:-**

18-19వ. దేవుడు తన ప్రజలకు దయచూపుటకై ముందుగా శత్రువును శిక్షించాలి. కనుక తన ప్రజలు దేవుని నిమిత్తమై కనిపెట్టుకొని యుండాలని చెప్పుచున్నాడు. అంత్యకాలములో యెరూషలేములో వేయి ఏండ్ల పాలనలో ఇశ్రాయేలీయులు 1) కన్నీరు విడువక 2) కరుణించబడి 3) దేవుని చేత జవాబు పొందుదురు. 20-21వ. 4) దేవుడు క్లేశాన్నపానములనిచ్చును. 5) బోధకులు దాగి యుండక బోధించెదరు. 6) నడువుడి ఇదే త్రోవయను శబ్దము స్పష్టముగా చెవులకు వినబడును. 22-23వ. 7) సకాలములో వర్షము కురియును 8) భూమి విస్తారమైన ఫలమిచ్చును 9) భూమి సారవంతముగా నుండును.

10) పశువులకు విస్తారమైన గడ్డిబీడులుండును. 24-25వ. 11) ఎద్దులు, గాడిదలకు జల్లెడతో జల్లించిన గింజలతో ఉప్పు కలిపిన ఆహారము పెట్టుదురు. 12) గోపురములమీద, పర్వతములు కొండలమీద, వాగులు నదులు పారును.

**26-33వ. యూదులకు విజయము (26-29వ) - శత్రువుకు శిక్ష (30-33):-**

26-28వ. శ్రమలలోనున్న తన ప్రజల గాయములు కట్టి వారిని ప్రకాశింపచేయుటకై శత్రువును శిక్షించును. సమీప నెరవేర్పుగా అష్షూరీయులు శిక్షింపబడిరి. అంత్యకాల నెరవేర్పుగా ప్రక 19:15లో క్రీస్తు విరోధిని వెంబడించిన వారిని శిక్షించు విధము ఇక్కడ ప్రవచనగా చెప్పబడినది.

29-31వ. శత్రువు శిక్షించబడగా యూదావారు సంగీతములతోను, పిల్లనగ్రోవులతోను సంతోషింతురు. సమీప నెరవేర్పుగా దేవుడు ప్రచండ కోపముతో అష్షూరును కొట్టును. 32-33వ. దేవుని బాహువు అనగా మహిమ శరీరము ధరించిన క్రీస్తు హార్మెగిద్దోను యుద్ధములో క్రీస్తు విరోధిని అగ్ని గంధకముతో మండుగుండములో పడవేతురు.

## 31వ. అధ్యాయము (1+2+2+2+2=9వ)

**అంశము:- యూదావారి పాపము - దేవుని వైపు తిరిగి కాపాడబడుట శత్రువుకు శిక్ష**

**1వ. పరిశుద్ధ దేవుని లక్ష్యపెట్టకుండుట:-** దేవుని యొద్ద విచారణ చేయక లక్ష్యపెట్టక, సహాయమునకై ఐగుప్తుకు వెళ్ళుచు, గుర్రములను ఆధారము చేసికొను యూదావారికి శ్రమ అని సెలవిచ్చుచున్నాడు. ఇది ఐదవ శ్రమగా చూడగలము. మొదటి శ్రమ 28వ అధ్యాయములోను, రెండు మూడవ శ్రమ 29వ అధ్యాయములోను, నాల్గవ శ్రమ 30వ. అధ్యాయములోను కలవు.

**2-3వ. యూదావారి పాపము:-** ఐగుప్తీయులు మనుష్యులే, వారి గుర్రములు మాంసములే. నిజదేవుడు మనిషి కాదు, ఆయన బలము మాంసయుక్తమైనది కాక ఆత్మ సంబంధమైనది. ఆయనకు విరోధముగా ఐగుప్తువారు సహాయము చేయుటకు వచ్చినను తన చెయ్యి చాపి వారు జోగునట్లు చేసి సహాయము పొందబోవు యూదా వారు పడిపోవునట్లు చేయును. యూదావారు 2 దిన 36:21 ప్రకారము భూమికి విశ్రాంతినివ్వక చేసిన పాపమును దిద్దుకొనక దేవునివైపు తిరుగక బబులోను రాజు దండెత్తి వారిమీదికి రాగా, ఐగుప్తును ఆశ్రయించిరి. ఈ ప్రవచన నెరవేర్పుగా దేవుడు యూదావారు ఓడిపోయి బబులోను వారికి 70 ఏండ్లు దాసులగునట్లు చేశాడు.

**4-5వ. యూదాను కాపాడు దేవుడు:-** కీర్తన 91:4లో పక్షిరాజు పిల్లలపై ఎగిరి తన

పిల్లలను కాపాడినట్లు కాపాడుదునని చెప్పుచున్నాడు. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా బబులోను చెర తరువాత దేవుడు కోరేషు ద్వారా విడుదలనిచ్చి ప్రజలు యెరూషలేముకు తిరిగివెళ్ళి హగ్గయి జకర్యాలు ప్రోత్సహించగా, జెరుబ్బాబేలు, యెహోషువలు మందిరమును నిర్మించునట్లు చేశాడు. ప్రవచన అంత్యకాల నెరవేర్పుగా ప్రభువు యుద్ధము చేయుటకు సీయోను కొండమీదికి (ఒలీవల కొండమీదికి) అపొ 1:11 ప్రకారము దిగి వచ్చును. యెష 46:4 ప్రకారము ఇశ్రాయేలును ఎత్తుకొని, చంక బెట్టుకొని రక్షింతునని సెలవిచ్చుచున్నాడు.

**6-7వ. దేవుని వైపు తిరిగిన యూదా:-** ఇశ్రాయేలీయులు దేవునివైపు తిరుగవలెనని ఆత్మద్వారా దేవుడు యెషయా ప్రవచనము ద్వారా ప్రజలకు తెలియపరచాడు. యూదావారు వెండి బంగారు విగ్రహములను పారవేసిరి. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా బబులోను చెర తరువాత యూదావారు విగ్రహారాధనను పూర్తిగా మానివేసిరి. అంత్యకాల నెరవేర్పుగా ఆ దినమున అనగా శ్రమలు మహా శ్రమల ఏడేండ్ల కాలములో ప్రక 13:14-18లో క్రీస్తు విరోధి అబద్ధ ప్రవక్తలు చేయించిన ప్రతిమకు నమస్కరించక శ్రమలు పొందుదురు.

**8-9వ. అష్షూరీయులకు శిక్ష:-** 8వ. నరులది కాని ఖడ్గము వలన అష్షూరీయులు కూలుదురు. ఈ ప్రవచన నెరవేర్పుగా నహూము గ్రంథ ప్రవచన ప్రకారము అష్షూరీయులను దేవుడు శిక్షించెను. అంత్యకాల నెరవేర్పుగా అష్షూరు, బబులోను గ్రీకు, రోమా ప్రభుత్వ గుణములు కలిగి యుండు క్రీస్తు విరోధిని క్రీస్తు తన నోట ఊపిరి చేత (2థెస్స 2:8) నోటనుండి వచ్చు ఖడ్గముచేత ప్రక 19:21 ప్రకారము మండుచున్న అగ్ని గుండముతో ప్రాణముతో వేయబడి సంహరించబడును. 9వ. సీయోనులో నున్న ఆయన అగ్ని యెరూషలేములో ఉన్న కొలిమి అనగా క్రీస్తు విరోధి మండుచున్న అగ్ని గుండములో వేయబడుటయే.

## 32వ. అధ్యాయము (4+4+6+6=20వ)

**అంశము:- యూదా వారి పాపమునకు శ్రమ - తదుపరి ఆశీర్వాదము**

**1-4వ. క్రీస్తు వేయి ఏండ్ల పాలన:-** 1-2వ. రాజునీతినిబట్టి చేయు రాజ్య పాలన మత్తయి 19:28 ప్రకారము వేయి ఏండ్ల క్రీస్తు పాలనయే. గొప్ప బండయైన క్రీస్తు వేయి ఏండ్ల కాలములో నీడవలె ప్రజలను కాపాడును.

3-4వ. ముందుగా యెష 29:18,24 వచనాలలో చెప్పబడినది చదవండి.

చెవిటివారు గ్రంథ వాక్యములు విందురు. యెష 29:18.

చంచల బుద్ధిగలవారు వివేకవంతులగుదురు. యెష 29:24.

వేయి ఏండ్ల పాలనలో బైబిలు యొక్క ప్రాముఖ్యత ప్రజలందరు వివేకవంతులగుట చూతము.

**5-8వ. యూదావారి పాపము:-** 5-6 యూదావారు 1) మూఢత్వము, 2) భక్తిహీనత 3) దేవుని గూర్చి కాని మాటలు పలుకుట, 4) ఆకలిగొనినవారి జీవనాధారము తీసికొనుట 5) దప్పిగొనిన వారికి పానీయము లేకుండ చేయుట మొదలగు పాపములు కలిగియున్నారని చెప్పబడినది. 7-8వ. నిరుపేదలను దీనులను అబద్ధములతో నాశనము చేయుటకు దురాలోచనలు చేయుదురు.

**9-14వ. యూదాకు పాపమునుబట్టి హెచ్చరిక - కలుగబోవు శ్రమ:-** 9-10వ. యూదా స్త్రీలు సుఖాసక్తి కలిగి, నిశ్చింతగానున్నారే కాని దేవుని మాట వినుట లేదు. వారి పంటలు పాడై వారికి వణకు కలుగునని ఒక సంవత్సరములో తొందర కలుగునని చెప్పుచున్నాడు. 11-12వ. వారు బట్టలు లేనివారై గోనెపట్టలు కట్టుకొనవలసి వచ్చునని, పంట ఫలముల విషయము రొమ్ముకొట్టుకొందురని చెప్పుచున్నాడు.

13-14వ. ఆనందపురమని పిలువబడు యెరూషలేము పట్టణము ముండ్ల తుప్పలచేత నిండియుండును. దేవుడు కార్యము చేయువరకు పట్టణము, ప్రజలు విడువబడుదురు. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా 70 ఏండ్ల బబులోను చెరను అంత్యకాల నెరవేర్పుగా ఏడేండ్ల శ్రమల మహా శ్రమల కాలమును తలంచగలము.

**15-20వ. వేయి ఏండ్లకాల ఆశీర్వాదము:-** 15-17వ. 1) అరణ్యముగానున్న యూదా దేశము ఫలభరితముగాను 2) నీతిన్యాయముల పాలన క్రీస్తు ద్వారా దేశములో కలుగును. 3) దేశములో నిమ్మళము, నిబ్బరము ఉండును. 4) ప్రజలు సుఖకరమైన నివాసములందు నివసింతురు.

18-20వ. వేయి ఏండ్ల కాలములో నెమ్మది నిచ్చుటకై ముందుగా ఏడేండ్ల శ్రమల మహాశ్రమల కాల అంతమున ప్రక 16వ అధ్యాయములో నాశనమగుట జరుగును. వేయిఏండ్ల కాలములో సమస్త జనముల ఎదుట ఎద్దులు తిరుగుట అనగా సువార్తసేవ జరుగును. గాడిదలు తిరుగుట అనగా సంఘ సహవాసము వర్ధిల్లును.

## 33వ. అధ్యాయము (4+4+4+4+4+4=24వ)

**అంశము:- యూదా ఇశ్రాయేలు వారికి శత్రువుల నుండి రక్షణ -యూదా ఇశ్రాయేలుకు విమోచన**

**1-4వ. శత్రువు నుండి రక్షించుమని ప్రార్థన:-** యూదా ఇశ్రాయేలు ప్రజలు అన్యాయముగా ఇతరులను వంచించి దోచుకొనిరి. ఇప్పుడు అష్షూరీయులు వచ్చి అన్యాయముగానే దేవుని

ప్రజలను వంచించుచున్నారు. ఇశ్రాయేలు ప్రజలను క్రీ.పూ 732, 721లో చెరగొనిపోయిరి. దేవుని రక్షణ కొరకు ఇట్టి పరిస్థితులలో కనిపెట్టుకొని యూదా వారు ప్రార్థించుచున్నారు. ప్రార్థనకు జవాబుగా ఒక దూతను పంపగా దేవుడు అష్షూరీయుల సైన్యమును సంహరించి యూదావారికి జయమిచ్చాడు.

ఈ ప్రవచనము యొక్క అంత్యకాల నెరవేర్పు:-

అంత్యకాలములో కూడా క్రీస్తు విరోధి ద్వారా ఇశ్రాయేలువారికి శ్రమలు కలుగగా దేవునికి పెట్టిన మొరనుబట్టి ఏడేండ్ల శ్రమల కాలము చివర ప్రభువైన యేసు దిగివచ్చి ఇశ్రాయేలీయులను విమోచించును.

**5-8వ. యూదాకు ఆశీర్వాదము (5-6వ) - శత్రువుకు శ్రమలు (5-6వ):-** మహా ఘనత నొందిన దేవుడు మహా విజయమిచ్చి తన బిడ్డలకు మహా విడుదల దయచేసెను. ఆయన ఉన్నత స్థల నివాసియై నీతి, న్యాయము, బుద్ధి, జ్ఞానము, రక్షణ బాహుళ్యము, ఐశ్వర్యముతో సీయోనును నింపును. 7-8వ. శూరులు బయట రోదనము చేయుట...రాజైన హిజ్కియా వెండి, బంగారములనిచ్చి అష్షూరు రాజుతో సమాధానపడాలని ప్రయత్నించగా విఫలమగును. ప్రజలు భయపడి ప్రయాణము చేయలేదు. కనుక రాజ మార్గములు పాడై త్రోవను నడుచువారు లేకుందురు.

**9-12వ. ప్రభువు రాకడ:-** ఇశ్రాయేలు దేశము దుఃఖించి, సిగ్గుపడి వాడిపోయి క్షీణించి ఎడారియైన కారణమున దేవుడు లేచి శత్రువును ఓడించి తనను గొప్పచేసుకొని, ఘనత తెచ్చుకొనును. ఈ ప్రవచన నెరవేర్పుగా అష్షూరురాజు భయముచేత రాజైన హిజ్కియా దినములలో ఇశ్రాయేలు దేశము క్షీణించగా దేవుడు తన దూత ద్వారా అష్షూరు సైన్యమును సంహరించుట చరిత్రలో చూడగలము. అలాగే అంత్యదినములలో క్రీస్తు విరోధి ఇశ్రాయేలీయులను శ్రమపెట్టునప్పుడు యేసు ప్రభువు ఒలీవల కొండపైకి దిగివచ్చి శత్రువులను సంహరించి ఇశ్రాయేలీయులను రక్షించును. దీనిని హార్మెగిద్దోను యుద్ధముగా ప్రవచనము యొక్క అంత్యకాల నెరవేర్పుగా చూతుము. క్రీస్తును రక్షకుడుగా ఎరుగక క్రీస్తు విరోధిని వెంబడించినవారు నశించి నరకములో కాలుటను సూచించును.

**13-16వ. సీయోనులోని పాపుల శ్రమలస్థితి:-** 13-14వ. దూరస్థులారా సమీపస్థులారా అనుటను బట్టి దేవుడు అందరిపట్ల తాను చేయబోవు కార్యములను తెలియపరచుచున్నాడు. అష్షూరు సైన్యము సంహరించబడినప్పుడు దేవుడు దూత ద్వారా జరిగించిన కార్యమును చూచిన అన్యులేమి, యూదులేమి యెహోవా దేవుని యెదుట ఎవరు నిలువగలరని తలంచుదురు. దానికి 15వచనములో దేవుని జవాబును గమనించగలము. 1) నీతిని

అనుసరించి 2) యథార్థముగా మాటలాడుచు 3) లంచము పుచ్చుకొననివాడు 4) హత్యలకు దూరముగా ఉండువాడు 5) చెడుతనము చూడనివాడు. పైనున్న అంశములు ఇశ్రాయేలుకు శత్రువగు అష్షూరు రాజు దండెత్తి వచ్చినప్పుడు కలిగిన భయమునుండి ఎవరు తప్పించబడగలరు అను ప్రశ్నకు జవాబుగానున్నను అంత్యకాలములో కలుగు ఏడేండ్ల శ్రమలకాలములో ఎవరు తప్పించుకొనగలరో అను ప్రశ్నకు జవాబు అని తలంచగలము.

**17-20వ. విశ్వసించువారికి ఆశీర్వాదము:-**

ప్రభువైన యేసు తన మహిమ ప్రభావముతో సింహాసనాసీనుడై మత్తయి 24:13లో భూమి మీదికి దిగి రాగా విశ్వాసులైన శ్రమలలోనున్న యూదులు ఆయనను చూతురు. ఆయన ప్రపంచమంతటిని పాలించుటను చూతురు. సంఘమైతే శ్రమలకాలమునకు ముందే ఆకాశమండలమునకు 1 థెస్స 4:17 ప్రకారము రాగా ఎత్తబడి ప్రభువును ముఖాముఖిగా చూతుము. యోహాను 17:24 పరమగీతము 5:9-16లో నున్న ఆయన మహిమను కన్నులారా చూచుట ఎంతో ఆనందదాయకము. అటు తరువాత 20వ. ప్రకటన 21:10-27లో చెప్పబడిన నూతన యెరూషలేము మహిమయు చూడముచ్చటగా నుండును.

**21-24వ. నెమ్మదికరమైన స్థితి:-** 21-22వ. ప్రభువైన యేసు రాజై చేయు మహిమ గల పరిపాలనలో యూదా నెమ్మదిగా ప్రవహించు నదివలెను, యుద్ధ ఓడలేవి వుండక నెమ్మదిగల వాతావరణముండును. క్రీస్తు నీతిగల న్యాయాధిపతియై తాను రక్షించిన ప్రజలచేత మహిమపరచబడుచు నిత్యపాలన చేయును. 23-24వ. శ్రమల కాలములో యుద్ధపు ఓడలవలె క్రీస్తు విరోధిపాలన యున్నను నిలువక నాశనమైరి. దేవుని ప్రజలే గెలుపొందిరి. ఆలాగే వేయిఏండ్ల పాలనలోను శరీర అనారోగ్యము లేమి లేక నెమ్మదిగా నివసింతురు.

## 34-35 అధ్యాయములు

ఈ రెండు అధ్యాయములు దేవుడు ఏడేండ్ల శ్రమల కాలములో లోకమంతటికి ప్రాముఖ్యముగా కనాను ప్రాంతమునకు చేయబోవు నాశనము యొక్క తీవ్రతను 34వ అధ్యాయములో చూపబడుచున్నది. 28-33 అధ్యాయములలో నున్న శ్రమల అంతటి సారాంశము ఈ ఒక్క అధ్యాయములో చెప్పబడినది. కనాను ప్రాంతముతో సహా లోకమంతటికి వేయిఏండ్ల పాలనలో కలుగబోవు విమోచన రమ్యతను 35వ అధ్యాయములో తెలియచేయుచున్నాడు. ఆత్మీయముగా 34వ అధ్యాయములో రక్షణ లేనివారు నాశనమగు స్థితి, 35వ అధ్యాయములో రక్షించబడినవారు విమోచించబడిన విధము తెలుపబడినదని గమనించగలము.

# 34వ. అధ్యాయము (4+4+4+5=17వ)

**అంశము:- లోకమంతటికి కలుగబోవు తీర్పు - శ్రమల తీవ్రత**

1-4వచనములలో రాష్ట్రములు, జనములు, లోకము దానిలో పుట్టినదంతయు (1వ) అనుటలో లోకమంతటికి జరుగు తీర్పును గూర్చి మాటలాడుచున్నాడని తలంచగలము. 5-17 వచనములలో ఎదోమునుగూర్చి చెప్పుచున్నాడు. ఎదోము అనగా ఎఱ్ఱనివాడు. ఆదాము అను పదమునకు కూడా ఎఱ్ఱనివాడని అర్థము. ఎదోము ఏ రీతిగా యాకోబు సంతానమైన ఇశ్రాయేలుకు శత్రువుగానున్నాడో, ఆలాగే ఆదాము సంతానమగు లోకమంతయు దేవుని పిల్లలకు శత్రువులు. కనుక 5-17 వచనములు కూడా లోకమునకు కలుగు శ్రమల తీవ్రతను గూర్చియే వ్రాయబడినది.

1-4వ. భూలోకమంతటికి కలుగు తీర్పు.

5-8వ. లోకమందలి (శత్రు రాజ్యముల) మనుష్యుల నాశనము

9-12వ. లోకమంతటి (ఎదోము దేశము) నాశనము

13-17వ. నాశన వివరము -ముగింపు.

**1-4వ. భూలోకమంతటికి కలుగు తీర్పులు:-** 1వ. రాష్ట్రములు, జనములు, భూమి, దానిలో ఉన్న దంతయు అనుట భూలోకమంతటికి కలుగు తీర్పును సూచించును. దేవుని కోపము లోకమంతటి మీదికి కలుగు సమయమిది. ఏడేండ్ల శ్రమల కాలపు చివరలో అన్యజనులందరు క్రీస్తు విరోధి నాయకత్వమున ఇశ్రాయేలుమీదికి వచ్చినప్పుడు క్రీస్తుతానే గొఱ్ఱెపిల్ల వివాహము తరువాత భూమిపైకి దిగివచ్చి ప్రకటన 19:21 ప్రకారము జనులందరిని తన నోటనుండి వచ్చు ఖడ్గముచేత సంహరించుటను సూచించును. 2-4వ లోనున్న సర్వసైన్యములు. ముఖ్యముగా ఆకాశ సైన్యమంత అనగా ఆకాశమండలమందున్న దురాత్మల సమూహమును సూచించును. యెష 14:15 ప్రకటన 12:4. తేజో నక్షత్రమైన అపవాది తనతోపాటు త్రోసివేయబడిన దూతలు ఎఫె 6:12 ప్రకారము ఆకాశమండలమందలి దురాత్మల సమూహముగానున్నారు. ఎఫె 2:2 ప్రకారము వాయుమండలమందలి అధిపతులుగా నున్నారు. 4వ వచన ప్రకారము వారు ద్రాక్షావల్లి, అంజూరపు చెట్టునుండి వాడినది రాలినట్లు రాలిపోవుట అనగా అపవాది వాడి దూతలు వాయుమండల సంబంధమైన ఆధిపత్యమును కోల్పోవుట. ప్రక 20:1-3 ప్రకారము అపవాది అగాధములో బంధించబడుటను సూచించును.

**5-8వ. లోకమందలి మనుష్యుల నాశనము:-** ఆది 12:3లో నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెదను నిన్ను శపించు వారిని శపింతును అను వాగ్దాన నెరవేర్పును. ఈ భాగమందు

చూతుము. దేవుని ఖడ్గము, యెహోవా ఖడ్గము, రెండంచుల వాడియైన దేవుని వాక్యమను ఖడ్గమే (హెబ్రీ 4:12).

"యెహోవా దినము అన్యజనులందరి మీదికి వచ్చుచున్నది". ఓబద్యా 1:15. అబ్రాహాము కుమారుడగు ఇస్సాకు సంతానమైన యాకోబు కుమారులు ఇశ్రాయేలీయులు. ఏశావు సంతానము అన్యులగు ఎదోమీయులు. ఇశ్రాయేలీయులను హింసించిన వైరులు అనగా యేసుక్రీస్తును సంహరించుటకు ఎదోమీయుడగు హేరోదు ప్రయత్నించుటను సూచించును. క్రీ.శ. 70లో యెరూషలేము నాశనములోను ఎదోమీయులు పాల్గొనిరి. కనుక పైనున్న ప్రవచన వచనములు నెరవేరవలసియున్నది. ప్రవచనమునకు 1) వెనువెంట నెరవేర్పు 2) తరువాత కాల నెరవేర్పు 3) అంత్యకాల నెరవేర్పు అను మూడు నెరవేర్పులు ఉండును. క్రీస్తును, క్రైస్తవులను హింసించిన హేరోదు రాజులు అనేకులు అకాల మరణము చెందిరి. ఇది ప్రవచన వెనువెంట నెరవేర్పుగా చూతుము. క్రీ.శ. 1000 సం॥ అరబీయులు ఎదోమును పట్టుకొని తమ ప్రాంతములో కలుపుకొని ఎదోమీయులందరిని బలవంతముగా మహమ్మదీయులుగా మార్చి వేయగా ఎదోమీయుల వంశమంతయు నాశనమాయెను. ఇప్పుడు వారు జోర్డాన్ మహమ్మదీయులుగా పిలువబడుచున్నారు. ఇది ప్రవచనము యొక్క తరువాత కాల నెరవేర్పుగా చూతుము. అంత్యకాలములో ఏడేండ్ల శ్రమల మహాశ్రమల కాల ముగింపులో క్రీస్తు విరోధి అన్యులందరిని యెహోషాపాతు లోయలో ఇశ్రాయేలీయులకు విరోధముగా సమకూర్చగా ప్రకటన 19:21 ప్రకారము కడమవారు అనగా అన్యులు గుఱ్ఱము మీద కూర్చున్న వాని నోట నుండి వచ్చు ఖడ్గముతో సంహరింపబడిరి. ఇది ప్రవచనము యొక్క అంత్యకాల నెరవేర్పు. ప్రకటన 20:8-9 వచనాలలో వేయిఏండ్ల పాలన ముగింపుతో భూమి నలుదిశల నుండి జనములను ప్రోగు చేయబడి.. పరలోకము నుండి దిగివచ్చు అగ్నిచే దహించబడిరి. ఇదియు ప్రవచనము యొక్క అంత్యకాల నెరవేర్పే.

**9-12వ. ఎదోము దేశ నాశనము:-** యిర్మీ 49:13లో బొస్రాపాడుగాను... ఎడారిగాను, శాపముగాను, పట్టణములన్ని పాడుగానుండునని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 9-10వ. ఎదోము గంధకము కాగా, భూమి దహించు గంధకము కాగా, దాని పొగ నిత్యము లేచుచు రేయింబగళ్ళు ఆరక యుండునని చెప్పబడినది. యిర్మీయా 49:13లో చెప్పబడినట్లు వేయి ఏండ్ల కాలమంతయు మిగిలిన దేశములన్ని ఆశీర్వాదములోనుండగా ఎదోము దేశము ఎడారిలాగాను, శాపముగాను, పట్టణములు పాడుగాను ఉండును.

11-12వ. అపవిత్ర పక్షులగు 1) గూడబాతు 2) ఏదు పందులు 3) గుడ్లగూబ 4) కాకులు ఆ దేశమందు నివసించగా దేశము పాడుగాను అపవిత్రముగాను ఉండును.

ఏదోమును తిరిగి ఒక రాజ్యముగా ప్రకటించుటకు ఒక్క అధిపతియు, ప్రధానియు అక్కడ లేకుండును.

**13-17వ. నాశన వివరము (13-15వ) - ముగింపు (16-17వ):-**

13-15వ. ఒకప్పుడు అధిపతులు నివసించిన ఎదోము పట్టణములు ఇప్పుడు అనగా వేయి ఏండ్ల పాలనలో ముండ్లు, దురదలు, గచ్చపొదలచేత నిండియుండును. అపవిత్రమైన పక్షులు, పశువులకు అది నివాసస్థలముగా నుండును.

16-17వ. ముగింపు :- ఈ భాగమును 35 అధ్యాయములోని వేయి ఏండ్ల పాలనకు పీఠికగా చూడగలము. జంతువులు, పక్షులు జతలు జతలుగా నుండును. దేవుడు నోటి ఊపిరితో అందరిని సమకూర్చును. కొలనూలుతో 12 గోత్రముల వారికి పంచిపెట్టబడును. వేయి ఏండ్ల పాలన తరువాత యుగయుగముల నిత్యపాలనలోను అలాగే ఉండును.

## 35వ. అధ్యాయము (2+2+2+1+1+1=9వ)

**అంశము:- వేయి ఏండ్ల కాలములో (1-2వ) కనాను ప్రాంత అభివృద్ధి (3-4, 5-6వ) దేహములోని బలహీనతలు (7వ) భూమి యొక్క బలహీనతలు తీసి వేయబడుట, (8వ) సమస్త మార్గములు, (9వ) జంతువులలో మార్పులు కలుగుట - ఆనందముండుట.**

మహాశ్రమల కాలమందు యెషయా 27:10లో చెప్పబడి పాడైన అడవిగా మారిన పట్టణములు, 32:15లో చెప్పబడినట్లు పుష్పించి ఫలములతో నిండిన చెట్లవలె నుండును. రోమా 8:19-22లో దాస్యమునకు లోనైన సృష్టి దేవుని పిల్లలు పొందబోవు విమోచన పొందుదునన్న నిరీక్షణతో ప్రస్తుతము మూల్గుచున్నది. కనుక సృష్టి యావత్తు విమోచించబడి మార్పు చెందును.

**1-2వ. కనాను ప్రాంత అభివృద్ధి :-** ప్రభువైన యేసు మహాశ్రమల కాలము తరువాత భూమిమీదికి దిగిరాగా దేవుని మహిమ ఆయన తేజస్సు భూమిని నింపించును. ఎండిన ఎడారులు, అడవులు, అరణ్యములు పుష్పించి ఫలించి ఆనందించును. ప్రస్తుతము భూలోకమందు కరువు కాటకములతో అనేక దేశములు అలమటించుట చూడగలము. భూమి ఫలించు అట్టి దినములకై మానవులు ఎదురు చూచుచున్నారు. దేవుని మహిమ ఆయన తేజస్సును చూచుట కొరకు మనమును ఎదురు చూతుము. ఇక్కడ చెప్పబడిన కస్తూరి పుష్పము, పరమగీతము 2:1లో చెప్పబడిన శారోను పొలములో పూయబడు పుష్పము రెండును మూలభాషలో రోజా పువ్వులుగా చెప్పబడినవి. బైబిలు అంతటిలో ఈ రెండు చోట్లనే రోజాపువ్వు ప్రస్తావన కనిపించును. ఈ రెండు ఒకే అర్థము కలిగిన భాగములు.

సంఘము ఎండిన భూలోకములో పూయబడిన పుష్పము. అలాగే వేయిఏండ్ల పాలనలో ఇశ్రాయేలీయులు, వారి దేశము ఉల్లసించి పుష్పించిన రోజాపువ్వు వలె నుండును.

**3-4, 5-6వ. దేహములోని బలహీనతలు తీసివేయబడుట:-**

ప్రస్తుతము చేతులు సడలి, మోకాళ్ళు తొట్రిల్లి, హృదయములు తత్తరిల్లి మానవులు ఆరోగ్యము చెడిపోయి భయము చేతనిండియున్నారు. ప్రభువు ప్రతికారము చేయుటకు రక్షించుటకు రెండవ రాకడలో వచ్చును కనుక శరీర బలహీనతలన్ని తొలగిపోవును. ఈ ప్రవచనముల నెరవేర్పు ప్రభువు తన మొదటి రాకడలో లూకా 4:18లో తెలియపరచి మత్తయి 11:5, మార్కు 7:37లూకా 7:22లో వెనువెంట నెరవేరుట చూపించాడు. ఈలాగు తన దైవత్వమును బయలుపరచాడు. 5వ. గ్రుడ్డివారి కన్నులు తెరువబడుట యొక్క నెరవేర్పును (మత్తయి 12:22, 15:30, 21:14 యోహాను 9:7) చూతుము. చెవిటివారి చెవులు విప్పబడుట నెరవేర్పును (మత్త 11:5, మార్కు 9:25)లో చూతుము.

సడలిన చేతులు బలపరచబడుట (3వ) తొట్రిల్లిన మోకాలు బలపరచబడుట (6వ) యోహాను 5:4లో ఊచకాలు, చేతులు గల అనేకులలో 38 ఏండ్లనుండి వ్యాధిగ్రస్తుడైన వానిని ప్రభువు స్వస్థపరచెను. అటువంటి కార్యములు మత్తయి 9:8, మార్కు 2:2, 3:3, లూకా 6:8లోను కలవు. కుంటివాడు దుప్పి వలె గంతులు వేయుట (6వ) నెరవేర్పును మత్త 9:37, 12:22, 15:30, అపొ. 3:8లో చూతుము.

శ్రమలు మహాశ్రమల కాలములో అనేకులు గాయపడి అంగహీనులై హృదయములో ధైర్యమును కోల్పోవుదురు. వేయిఏండ్ల పాలనలో 1) గ్రుడ్డివారి కన్నులు తెరువబడుట 2) చెవిటి వారి చెవులు విప్పబడుట 3) మూగవారి నాలుక పాడుట 4) తొట్రిల్లిన వారి కాళ్ళు బలపరచబడుట 5) సడలిన చేతులు బలపరచబడుట 6) కుంటివాడు నడచుట 7) భయముతో తత్తరిల్లిన వారి హృదయములు ధైర్యముగానుండుట మొదలగు కార్యముల నెరవేర్పును చూడగలము.

**7వ. భూమి యొక్క బలహీనతలు తీసివేయబడుట:-**

ఎండిన నేలనుండి నీటి ఊటలు ఉబుకును. దుష్ట మృగములు తిరిగిన స్థలములలో గడ్డి మొలచును. మృగములు క్రూరత్వమును కోల్పోవును.

**8వ. సమస్త మార్గములో మార్పులు కలుగుట:-** యెషయా 33:8లో శ్రమల కాలములో మార్గములు పాడై, సంచరించుటకు జనములు లేక యుండగా, వేయి ఏండ్ల పాలనలో మార్పు చెంది రాజమార్గములు పరిశుద్ధ మార్గములగును. ఎట్టివారు ఆ మార్గములలో నడచినను మార్గము తప్పరు.

**9వ. జంతువులలో మార్పుండుట - దేశములో ఆనందముండుట:-**

సింహములు క్రూర మృగములు తమ క్రూరత్వమును మాని సాధు జంతువుల వలె గడ్డి మేయునని 11:6-8వచనములలో చూచితిమి. విమోచించబడినవారు, విమోచన పాటలు పాడుచు ఆనంద సంతోషములుగలవారై తలల మీద నిత్యానందముతో నిండియుందురు.

## 36-39 అధ్యాయములు

ఈ నాల్గవ భాగమందలి నాలుగు అధ్యాయములను యెషయా గ్రంథమందలి హిజ్కియాను గూర్చిన గ్రంథముగా పిలువవచ్చును ప్రవక్తయైన యెషయా 1:1 ప్రకారము ఉజ్జియా, యోతాము, ఆహాజు, హిజ్కియాయను యూదా రాజుల కాలమందు ప్రవచించెను.

**1-5 అధ్యా - రాజైన ఉజ్జియా కాలము.**

**6 అధ్యా - రాజైన యోతాము కాలము.**

**7-14 అధ్యా - రాజైన ఆహాజు కాలము.**

**14-39 అధ్యా - రాజైన హిజ్కియా కాలము.**

(మిగిలన అధ్యాయములను గూర్చి ఖచ్చితముగా చెప్పలేము)

36-39 అధ్యాయములలోని హిజ్కియా రాజు కాల చరిత్రను 2 రాజులు 17:24, 20:19లోను మరియు 2 దిన 32:1-33లోను చూతుము. క్లుప్త గ్రంథమైన బైబిల్‌లో ఒకేసారి చెప్పబడిన విషయాలు ఎంతో ప్రాముఖ్యమైనవి. కాని పై విషయములు ముమ్మారు పలుకబడినందున మరి ప్రాముఖ్యమైనవిగా చూతుము. అష్షూరు రాజు రాజైన హిజ్కియా కాలములో దేవుని ప్రజలపై యుద్ధమాడగోరి అనేక పలుకులు పలికిరి. కాని ప్రభువు పిల్లలు ప్రార్థించి జయమును పొందుట మొదటి రెండు అధ్యాయముల 36-37అ. సారాంశము. 38వ అధ్యాయమందు రోగము నుండి ప్రార్థించి స్వస్థత పొందిన రాజైన హిజ్కియా వివరములు 39వ అధ్యాయమందు గర్వించి పాపము చేసిన హిజ్కియా రాజు వివరములు కలవు.

ఆత్మీయ పాఠము:- విశ్వాసికి విరోధులగు సాతాను లోకస్థులు అబద్ధముగా చెడ్డమాటలు పలుకుట విశ్వాసులు ప్రార్థించి ప్రభువువైపు చూచుట ద్వారా జయమును పొందగలరు. మూడవ విరోధియగు శరీరమును విశ్వాసి ప్రభువు సహాయముతో జయించిన పిమ్మట హిజ్కియా మనస్సులో గర్వించి (2 దిన 32:25) నష్టమును పొందగలము. జాగ్రత్తగా నుందుము గాక. హిజ్కియా రాజు పాలన ప్రారంభదినములలోనే క్రీ.పూ. 721లో పది గోత్రముల ఇశ్రాయేలువారు అష్షూరుకు రెండవ చెరగా వెళ్ళినందున 36-37

అధ్యాయములు జరిగిపోయిన అష్షూరు చెరను 38-39 అధ్యాయమును రానున్న బబులోను చెరను చూపును.

## 36వ. అధ్యాయము (2+9+9+2=22వ)

అంశము:- హిజ్కియా యొక్క రాజ్య అవసరత (హిజ్కియాను బెదరించిన అష్షూరీయుల మాటలు)

**1-4వ. అష్షూరు రాజు పంపిన రబ్షాకే రాజైన హిజ్కియాతో కలియుట:-** కాలము, స్థలము. గతకాలమందు యూదారాజగు ఆహాజు యెహోవాను ఆశ్రయించక అష్షూరు రాజును ఆశ్రయించినప్పుడు వారిద్దరు 7వ అధ్యాయము వచనమందు చాకిరేవు మార్గమందున్న కొలను దగ్గర కలిసికొనిరి. ఇప్పుడు అష్షూరు రాజు యెహోవాను నమ్ముకొనక తనకు లొంగిపోవలెనని అదే స్థలమునకు వచ్చి చెప్పుచున్నాడు. హిజ్కియారాజు పాలించిన 29 సంవత్సరాలలో ఇది 14వ సంవత్సరము. అనగా పాలనా కాలమందలి మధ్య భాగము. మన విశ్వాస జీవిత మధ్య కాలములో ప్రభువు మనలను పరీక్షించును. అది 23వ అధ్యాయములో శారా మృతి చెందినది 25వ అధ్యాయములో అబ్రాహాము మృతి చెందెను. 24వ అధ్యాయములో ఇస్సాకు వివాహము. 22వ అధ్యాయములో అబ్రాహాము శారాలు పరీక్షించబడిరి. కనుక పరిక్షలు జీవిత కాలమంతయు ఉండును.

**3-11వ. ప్రాకారము మీద నున్న ప్రజలతో అష్షూరు రాజు పరివారమునకు చెందిన రబ్షాకే పలికిన పొగరు మాటలు:** ప్రజలందరు వినుచుండగా అష్షూరు రాజు తాను 2000 గుఱ్ఱములనిచ్చినను హిజ్కియా రాజు 2000 మంది రౌతులను సమకూర్చుకొనలేడని ఆలాగైతే ఏ రీతిగా జయించలేడు కనుక లొంగిపొమ్మని ప్రాకారమందలి ప్రజలు వినునట్లుగా అష్షూరు రాజుచే పంపబడిన రాజు పరివారమునకు చెందిన రబ్షాకే పలికెను.

**12-20వ. అష్షూరు రాజు ప్రజలతో పలికిన మాటలు:-** యెహోవానుబట్టి మిమ్మును నమ్మించి యెహోవా మనలను విడిపించునని హిజ్కియా రాజు పలుకు మాటలను నమ్మవద్దనియు, హిజ్కియా రాజును విడిచి అష్షూరు రాజుతో సంధి చేసుకొనుడని తన చేతి నుండి విడిపించ దేవుడు లేడని పొగరు మాటలు ప్రజలతో అష్షూరు రాజు పలికెను.

**21-22వ. ప్రజలు అష్షూరు రాజుకు జవాబివ్వకుండుట:-**

ప్రజలైతే తమ రాజైన హిజ్కియా ఆజ్ఞ ప్రకారము అష్షూరు రాజుతో సంధికి అంగీకరించలేదు. అతని మాటలకు జవాబివ్వలేదు.

# 37వ. అధ్యాయము (7+6+7+6+6+6=38వ)

అంశము:- రాజైన హిజ్కియా రాజ్య అవసరతకై ప్రార్థన -జవాబు

**1-7వ ప్రార్థన కోరిన హిజ్కియా:-** రాజు గోనెపట్ట కట్టుకొని మందిరమునకు వెళ్ళి శాస్త్రులను, యాజకులను, పెద్దలను ప్రవక్తయగు యెషయా యొద్దకు పంపి ప్రార్థించమని కోరెను. యెషయా ప్రార్థించగా దేవుడు అష్షూరు రాజు ఒక వదంతి విని తన దేశమునకు వెళ్ళి చంపబడునని సెలవిచ్చెను.

**8-13వ. అష్షూరు రాజు హిజ్కియా రాజుకు పంపిన ఉత్తరము:-** 2 రాజులు 18:10 ప్రకారము హిజ్కియా రాజు ఏలుబడిలో ఆరవ సంవత్సరమందు అనగా ఇప్పటికి 8 సంవత్సరములందు పది గోత్రముల ఇశ్రాయేలు వారిని అష్షూరు రాజు చెరదీసి కొనిపోయెను. ఇది అష్షూరీయులకు దేవుడు ప్రపంచ అధికారమిచ్చిన దినములు కనుక అష్షూరు రాజు ఇతర అనేక దేశములను కూడా జయించెను. 10 గోత్రముల ఇశ్రాయేలును చెరగొని పోయినప్పుడు యెహోవా ఏమి ఆటంకపరచనందున ఇప్పుడు అలాగే జరుగునని తలంచి ఏ రాజులు కూడా తమ దేవతల సహాయము వలన తప్పించుకొనలేకపోయిరని కనుక యెహోవా దేవునిచేత రాజైన హిజ్కియా మోసపోకూడదని అష్షూరు రాజు ఉత్తరము వ్రాసి హిజ్కియా రాజుకు పంపెను.

**14-20వ. మందిరమందు అష్షూరు రాజు ప్రార్థన చేయుట:-**

రాజైన హిజ్కియా ఆ ఉత్తరమును పరచి యెహోవా నీవే అద్వితీయ దేవుడవని సమస్త జనులు తెలిసికొనునట్లు అష్షూరీయులచేతి నుండి తమ్మును రక్షించుమని ప్రార్థించెను.

21-26వ, 27-32వ. ప్రవక్తయైన యెషయా హిజ్కియా రాజు నొద్దకు పంపిన వర్తమానము:- అష్షూరు రాజు యెహోవాను దూషించెనని తిరస్కరించెనని, (23వ) అష్షూరు రాజుకు సమస్త దేశములపై జయమిచ్చినవాడు యెహోవాయేనని (26వ), యెహోవా ఇప్పుడు అష్షూరు రాజు నోటికి కళ్ళెము పెట్టించి ముక్కుకు గాలమువేసి వెనుకకు పంపునని యెహోవా సెలవిచ్చుచున్నాడని వర్తమానము పంపెను. ఒకటి, రెండు, మూడు సంవత్సరములు పంటలు పండు విధానమును రాబోవు దినములలో యూదా ప్రజలు ఫలించి ఎదుగు రీతికి సూచనగా తెలిపెను.

**33-38వ. అష్షూరు రాజు మరణించుట:-**

అష్షూరు రాజు యెరూషలేముపై యుద్ధము చేయక తిరిగి వెళ్ళునని యెహోవా సెలవిచ్చాడు. ఆలాగుననే అష్షూరు రాజు సైన్యములోనికి దేవుడు ఒక దూతను పంపగా ఆ దూత ఒక

లక్ష యెనుబదియైదు వేల మందిని ఒకేసారి మొత్తగా ఉదయానికి అందరు మరణించిరి. అష్షూరు రాజు యెరూషలేముపై దండెత్తక తన రాజ్యమునకు తిరిగి వెళ్ళి తన దేవతకు మందిరములో మ్రొక్కుచుండగ తన కుమారులే వచ్చి ఖడ్గముచేత చంపిరి. దేవుడు యూదావారిని ఈ రీతిగా కాపాడెను.

## 38వ. అధ్యాయము (8+7+7=22వ)

అంశము:- వ్యక్తిగత అవసరములకైన ప్రార్థన - జవాబు, స్తుతి.

1-8వ. హిజ్కియా రోగము కొరకు ప్రార్థించుట - దేవుడిచ్చిన జవాబు సూచన:-

ప్రభువు ప్రవక్తయగు యెషయా ద్వారా హిజ్కియా నీవు మరణమగుదువు గనుక నీ ఇల్లు చక్కబెట్టుకొనుమని సెలవియ్యగా హిజ్కియా కన్నీళ్ళు విడిచి ప్రార్థించెను. దేవుడా ప్రార్థన విని 15 సంవత్సరములు ఆయువునిచ్చి సూచనగా గడియారము పైన సూర్యకాంతిచేత పది మెట్లు దిగిన నీడ పైకెక్కెను.

**9-15వ. హిజ్కియా రోగము పోయి ఆరోగ్యము పొందిన తరువాత రచించిన కీర్తన:-**

తన దినముల మధ్యాహ్నకాలమున పాతాళ ద్వారము గుండ పోవలసి వచ్చినప్పుడు (10వ) దేవుడు కృపచూపి ఆయువును పొడిగించినందున నా సంవత్సరములన్నియు మెల్లగా నడుచు కొందునని రచించెను.

16-22వ. నెమ్మదిబట్టి దేవుని స్తుతించుట:- దేవుడిచ్చిన నెమ్మదినిబట్టి 1) దేవుని స్తుతింతునని 2) దేవుని సత్యమును తెలియజేతునని 3) జీవిత దినములన్ని దేవుని మందిరములో తంతి వాయిద్యములు వాయింతునని కీర్తించెను. అంజూరపు పండ్ల ముద్ద పుండుకు కట్టగా హిజ్కియా స్వస్థపడెను.

## 39వ. అధ్యాయము (4+4=8వ)

అంశము:- గర్వించి ప్రార్థించక ప్రభువు చిత్తమెరుగక బబులోనీయులతో సంధి కుదర్చుకున్న హిజ్కియా - రానున్న శిక్ష

**1-4వ. గర్వించిన హిజ్కియా:-** బబులోను రాజు యుక్తిగా హిజ్కియా రాజుకు కానుకలు దూతల ద్వారా పంపగా వారు శత్రువులని గుర్తించక ప్రభువును అడుగకుండ వారితో సంధి చేసుకొనెను. తన రాజ్యమందు ఇంటిలో కలిగిన సమస్తమును మరుగుచేయక వారికి చూపించెను. యెషయా వచ్చి హిజ్కియాను శత్రువులైన బబులోనీయులకు ఏమి చూపితివని అడుగగా సమస్తము చూపితినని చెప్పెను.

**5-8వ. శిక్షగా బబులోనీయులు సమస్తము కొనిపోవుట - హిజ్కియా తగ్గింపు:-** దేవుని సెలవు లేక సమస్తము చూపబడినందున బబులోను రాజు రాబోవు దినములలో (అనగా హిజ్కియా దినములలో కాక) సమస్తము కొనిపోవునని పుత్రసంతులను కూడా నపుంసకులుగా చేయునని సెలవిచ్చెను. హిజ్కియా తన దినములలో సమాధానముండునని గుర్తించెను.

రాజైన హిజ్కియా జీవితము నుండి మనము నేర్చుకొనవలసిన పాఠము:

రాజైన హిజ్కియా దేవుని ప్రజలైన యూదావారి క్షేమమును విచారించి మంచిపాలన జరిపించాడు దేవుడు తనకు ఆరోగ్యమిచ్చాడు. చివరలో గర్వించి దేవుని చిత్తమెరుగక దేవునికి అయిష్టమైన సంధి ద్వారా తన సంతానమునకు నష్టము కలిగినది. మన దేవుడు 1) రాజ్య అవసరతలలోను అనగా మన ఉద్యోగ అవసరతలలోను 2) వ్యక్తిగత శరీర అవసరతలలోను అనగా మన ఆరోగ్య విషయములలోను తన పిల్లలకు జవాబిచ్చువాడని నేర్చుకొనుచున్నాము. జీవిత చివరలో హిజ్కియావలె గర్వించగలము. గర్వించక వినయులమై ముందుకు సాగాలని నేర్చుకొందము.

## విమోచన గ్రంథము 40-66 అధ్యాయాలు

యెషయా గ్రంథములోని 40-66 అధ్యాయాలలో కలుగబోవు శరీర (40-48అ). ఆత్మీయ (49-57అ.), సార్వత్రిక (58-66అ.) విమోచన వివరించబడినది. ప్రతి భాగములోని అధ్యాయాలను మూడు భాగములుగా విడగొట్టిన మొదటి భాగమందలి మూడు అధ్యాయాలలో విమోచనకర్తను, రెండవ భాగమందలి మూడు అధ్యాయాలలో విమోచన క్రియను, మూడవ భాగమందలి మూడు అధ్యాయాలలో విమోచన వివరమును చూతుము.

మొదటి భాగమందు శరీర విమోచనతోపాటు, ఆత్మీయ విమోచన కూడా కొద్దిగా కలదు. రెండవ భాగమందు ఆత్మీయ విమోచనతోపాటు, శరీర విమోచన కూడా కొద్దిగా కలదు. మూడవ భాగమందు సార్వత్రిక విమోచనతోపాటు శరీర, ఆత్మీయ విమోచనలు కూడా కొద్దిగా కలవు.

V. 40-48అ. బబులోను చెర నుండి విమోచన (శరీర విమోచన - Physical Redemption)

40-42అ. విమోచనకర్త. 43-45అ. విమోచన క్రియ. 46-48అ. విమోచన వివరము.

VI. 49-57అ. పాపపు శిక్ష నుండి రక్షణ (ఆత్మీయ విమోచన - Spiritual Redemption)

49-51అ. విమోచన కర్త. 52-54అ. విమోచన క్రియ 55-57అ. విమోచన వివరము.

VII. 58-66అ. పాపమునకు తీర్పు - సమకూర్పు (సార్వత్రిక విమోచన - Universal Redemption )

58-66అ. విమోచన కర్త. 61-63అ. విమోచన క్రియ. 64-66అ. విమోచన వివరము.

## 40-48అ. బబులోను చెర నుండి విమోచన (శరీర విమోచన).

40అ. సాటిలేని విమోచకుడు. 41అ. సహాయకుడైన విమోచకుడు. 42అ. సేవకుడైన విమోచకుడు. 43అ. విమోచన, 44అ. విమోచించలేని విగ్రహాలు-విమోచన క్రియ. (కోరేషు 28వ, క్రీస్తు 22వ ద్వారా) 45అ. బబులోను పాపమునకు ఐదు శిక్షలు. 48అ. విమోచన వివరము. (కొలొ. 1:14 – ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపములకు క్షమాపణ కలుగుచున్నది అను వాక్య ప్రకారము ఈ భాగములో ఆత్మీయ పాపము నుండి విడుదలను కూడా చూడగలము).

## 49-57అ. పాపపు శిక్ష నుండి రక్షణ. (ఆత్మీయ విమోచన)

49అ. రక్షకుని నియామకము, 50అ. రక్షకుని విధేయత 51అ. రక్షకుడు పిలుచుట, 52అ. రక్షణ క్రియకై సిద్ధపాటు, 53అ. రక్షణ క్రియ, (క్రీస్తు ద్వారా 10వ) 54అ. రక్షణ క్రియ ఫలము, 55అ. రక్షకుని ఆహ్వానము, 56అ. రక్షకుని ఆశీర్వాదము, 57అ. రక్షణ వివరము.

## 58-66అ. ఇశ్రాయేలీయుల తీర్పు, సమకూర్పు (సార్వత్రిక విమోచన)

58అ. ప్రీతికరమైన ఉపవాస ప్రార్థన. 59అ. పాపము, పశ్చాత్తాపము- ప్రార్థన, పరిహారము, 60అ. వేయి ఏండ్ల రాజ్యము-మహిమ. 61అ. రెండు రాకడలలో విమోచన. 62అ. యెరూషలేముకు విమోచన క్రియ. (క్రీస్తు ద్వారా 1, 11వ) 63అ. శత్రువుకు శిక్ష - ప్రభువుకు స్తుతి. 64అ. ఇశ్రాయేలీయుల విమోచనకై ప్రార్థన. 65-66అ. ఇశ్రాయేలీయుల విమోచన, సృష్టి విమోచన.

**గమనిక:-** మూడు భాగములలోని మధ్య అధ్యాయములలో విమోచకులను చూతుము. 1) శరీర విమోచకుడు (కోరేషు) 44:28వ. 2) ఆత్మీయ విమోచకుడు (క్రీస్తు) 53:10వ. 3) సార్వత్రిక విమోచకుడు (క్రీస్తు) 62:1,11వ.

# 40వ. అధ్యాయము (10+10+11=31వ)

**అంశము:- సాటిలేని విమోచకుడు**

**1-10వ. విమోచకుని రాక - విడుదల ప్రకటన:- 1-2వ.** యెరూషలేమును ఓదార్చుడి. ప్రేమగా మాటలాడుడి. ఆమె పాపములు విమోచించబడెను. ఆమె పాపముల నిమిత్తమై ఆమె ప్రభువు రెండంతల శిక్ష పొందెను.

3వ. యేసు ప్రభువు మొదటి రాకడలో ప్రకటనకై సిద్ధపాటు: అడవి, అరణ్యము అను లోకానికి ప్రభువు వచ్చాడు. యేసు రాకకై మార్గము సిద్ధపరచి సరాళము చేసినవాడు బాప్తీస్మమిచ్చు యోహాను. 4వ. ప్రతి లోయ ఎత్తు చేయబడుట అనగా సువార్త ప్రకటన ద్వారా మానవుల జీవితాలలోని లోటుపాటులు సరిచేయబడుట అని అర్థము. అలాగే సంఘములలో యూదులు, అన్యులు అను ఎత్తుతగ్గులు, అభిషేకించబడినవారు - సామాన్యులు (clergi - laymen) అను ఎత్తు తగ్గులు సమము చేయబడాలని ప్రభువు కోరుచున్నాడు. మన జీవితాలలో ఆయనకు అయిష్టమైనవి అణచివేయబడాలి. 2 కొరి 11:1 ప్రకారము క్రీస్తు యేసు నందలి సరళత నుండి సర్పము వంకర, కరుకైన మార్గములోనికి మనలను నడిపించాడు. అవి దిద్దబడాలి. 5వ. ప్రభువు రాక ఫలముగా మానవులు పాపము చేసి పోగొట్టుకొనిన మహిమ తిరిగి అనుగ్రహించబడినది. 2 కొరి 4:4 ప్రకారము ప్రకటించబడు సువార్త ప్రకాశమే దేవుని మహిమ బయలుపరచబడుట అని నేర్చుకొందము.

6-8వ. దేవుని స్వరూపమందు చేయబడిన మానవుడు గడ్డితో పోల్చబడుచున్నాడు. మానవుల అందము గడ్డివంటిది. పాపమునుబట్టి మానవుడు గడ్డివలెవాడి మరణించి పొయ్యిలో కాలు గడ్డి వలె నరకాగ్నిలో కాలును. (లూకా 12:27). యేసు ప్రతి మనుష్యుని కొరకు మరణము పొందుటకై తాను కూడా ఎండిన భూమిలో మొలిచిన మొక్క లాగా లోకములో జీవించి సజీవుల భూమిలో నుండి కొట్టివేయబడ్డాడు. నిత్యము నిలుచు దేవుని వాక్యమును అంగీకరించి మానవులు నిత్యజీవమును పొందాలి.

9-10వ. 9వ. ప్రభువు మనలను సీయోనూ అనియు, సువార్త ప్రకటించుచున్నదానా, అని పిలుచుచున్నాడు. సువార్త ప్రకటింపవలసిన విధము, 1) ఉన్నత పర్వతము ఎక్కి ప్రకటించాలి. 2) బలముగా ప్రకటించాలి. 3) భయపడక ప్రకటించాలి. 4) మీ దేవుడు అని పట్టణములకు చూపుచు తేటగా దేవుని ప్రకటించాలి.

10వ. ఈ ప్రభువు శరీరధారిగా లోకములో నుండుటయే బాహువును కలిగియుండుట. ప్రభువగు యెహోవా తానే శక్తిసంపన్నుడై వచ్చుట ఆయన రెండవ రాకడను సూచించును. ఆయన వచ్చినప్పుడు నమ్మిన వారికి బహుమానము ఇచ్చును. (1 కొరింథీ 3:13, 2 కొరి

5:10). ఆయనను నమ్మని వారికి ఆయన చేయు ప్రతికారము అనగా శిక్ష ఆయనకు ముందుగా నడుచుచున్నది. (ప్రక 20:11-15).

**11-20వ. విమోచకుడు సాటిలేని దేవుడు- విడిపించు దేవుడు:-** 11వ. సాటిలేని కాపరి: 1) గొఱ్ఱల కాపరివలె ఆయన తన మందను మేపును. 2) తన బాహువుతో గొఱ్ఱెపిల్లలను కూర్చి రొమ్మున ఆనించుకొని మోయును (యెష 46:3-4). 3) పాలిచ్చువాటిని ఆయన మెల్లగా నడిపించును. 4) మంచి కాపరి (యోహా 10:11) అని, 5) గొప్ప కాపరి (హెబ్రీ 13:2) అని, 6) ప్రధాన కాపరి (1పేతు 5:4) అని చెప్పబడినది. పాలిచ్చు వాటిని మెల్లగా నడుపుతాడు. ఆయన సాటిలేని కాపరి అని గుర్తించుదము. ఎఫె 4:13 ప్రకారము సంఘములను కాయు కాపరులు సాటిలేని కాపరులుగా ఉండవలెనని నేర్చుకొనాలి.

**12వ. విమోచకుడు శక్తి సామర్థ్యములలో సాటిలేనివాడు:** 1) ఆయన పిడికిలి: తన పుడిసిటిలో జలములు కొలిచిన వాడెవడు? 2) ఆయన జేన: జేనతో ఆకాశముల కొలచూచిన వాడెవడు? 3) ఆయన బలము: భూమిలోని మన్ను కొలపాత్రలో ఉంచినవాడెవడు? 4) ఆయన చేయి: త్రాసుతో పర్వతములను తూచిన వాడెవడు? 5) ఆయన శక్తి: తూనిక చేత కొండలను తూచినవాడెవడు?

**13-14వ. విమోచకుడు బుద్ధి జ్ఞానములలో సాటిలేనివాడు:** 1) నేర్పరితనములో: యెహోవా ఆత్మకు నేర్పినవాడెవడు? 2) బోధలో: ఆయనకు మంత్రియై ఆయనకు బోధపరచిన వాడెవడు? 3) ఆలోచనలో: ఎవనియొద్ద ఆయన ఆలోచన అడిగెను? 4) వివేకములో: ఆయనకు వివేకము కలుగజేసిన వాడెవడు? 5) న్యాయ మార్గములో: న్యాయ మార్గమును గూర్చి ఆయనకు నేర్పినవాడెవడు? 6) జ్ఞానాభ్యాసములో: ఆయనకు జ్ఞానమును అభ్యసింపజేసినవాడెవడు? 7) బుద్ధి మార్గములలో: ఆయనకు బుద్ధిమార్గము బోధించినవాడెవడు?

**15-17వ. జనములలో సాటిలేనివాడు:** 1) జనములు చేదనుండి జారు బిందువులు. 2) జనులు త్రాసుమీది ధూళివంటివారు. 3) ద్వీపములు గాలికి ఎగురు సూక్ష్మ రేణువులవలె నున్నవి. 4) సమిధలకు లెబానోను చాలకపోవును. 5) దహనబలికి దాని పశువులు చాలవు. 6) ఆయన దృష్టికి సమస్త జనములు లేనట్టుగానే యుండును. 7) ఆయన దృష్టికి అవన్నియు అభావముగాను శూన్యముగాను ఎంచబడును. ఆయనయైతే సాటిలేనివాడు.

**18-20వ. విగ్రహములతో సాటిలేనివాడు:** 1) ఎవరితోను పోలికలు లేని దేవుడు: ఎవనితో దేవుని పోల్చుదురు? 2) ఏ రూపముతోను సాటిలేని దేవుడు: ఏ రూపమును ఆయనకు సాటిచేయగలరు? విగ్రహమునకు పోతపోయుట, పొదుగుట, అలంకరణ చేయుట

అవసరము. ఆయనకు అవేవి అవసరము లేదు. (ఆయన యొక్క సాటిలేని ఇరువది ఏడు గుణములు ఇక్కడ చెప్పబడ్డాయి.) మరికొన్ని సాటిలేని గుణములు:

1) మీకా. 7:18-తన స్వాస్థ్యములో శేషించినవారి దోషమును పరిహరించి, వారు చేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతో సముడైన దేవుడున్నాడా? 2) కీర్త 77:13 - దేవునివంటి మహా దేవుడు ఎక్కడ ఉన్నాడు? 3) కీర్త 40:5 - యెహోవా నా దేవా, నీవు మా యెడల జరిగించిన ఆశ్చర్యక్రియలును, మాయెడల నీకున్న తలంపులును బహు విస్తారములు. వాటిని వివరించి చెప్పెదననుకొంటినా అవి లెక్కకు మించియున్నవి నీకు సాటియైనవాడొకడును లేదు.

4) నిర్గ 15:11 - యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు పరిశుద్ధతను బట్టి నీవు మహానీయుడవు స్తుతికీర్తనలనుబట్టి పూజ్యుడవు అద్భుతములు చేయు నీవంటి వాడెవడు?

5) 1 యోహా 3:16 - ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. ప్రాణమిచ్చిన పరిశుద్ధుడు మరెవరు లేరు.

6) కీర్త. 89:5 - యెహోవా, ఆకాశ వైశాల్యము నీ ఆశ్చర్యకార్యములను స్తుతించుచున్నది. పరిశుద్ధ దూతల సమాజములో నీ విశ్వాస్యతనుబట్టి నీకు స్తుతులు కలుగుచున్నవి.

7) కీర్త. 89:5 - దైవపుత్రులలో యెహోవా వంటివాడెవడు?

**21-31వ. సృష్టికర్త - బలమిచ్చు దేవుడు - విడువని దేవుడు:-** 21-22వ. సృష్టికర్త: 1) భూమిని స్థాపించి, భూమండలముమీద ఆసీనుడై యుండగా ఆయనకు దాని నివాసులు మిడతలవలె కనబడుచున్నారు. 2) ఒకడు తెరను విప్పినట్లు ఆయన ఆకాశ వైశాల్యమును వ్యాపింపజేసెను. 3) ఒకడు గుడారము వేసినట్లు ఆయన దానిని నివాసస్థలముగా ఏర్పరచెను. 23-25వ. కార్యములలో సాటిలేనివాడు: 1) రాజులను ఆయన లేకుండ చేయును. 2) భూమి యొక్క న్యాయాధిపతులను మాయాస్వరూపులుగా చేయును. 3) వారు నాటబడగనే విత్తబడగనే వారి మొదలు భూమిలో వేరుతన్నక మునుపే ఆయన వారిమీద ఊదగా వారు వాడిపోవుదురు. 4) సుడిగాలి పొట్టును ఎగరగొట్టునట్లు ఆయన వారిని ఎగురగొట్టును. 5) నీవు ఇతనితో సమానుడవని మీరు నన్నెవనికి సాటి చేయుదురు? 26వ. మీ కన్నులు పైకెత్తి చూడుడి. వీటిని ఎవడు సృజించెను? వీటి లెక్కచొప్పున వీటి సమూహములను బయలుదేరజేసి వీటన్నిటికిని పేరులు పెట్టి పిలుచువాడే గదా. తన అధిక శక్తి చేతను తనకు కలిగియున్న బలాతిశయముచేతను ఆయన యొక్కటి అయినను విడిచిపెట్టడు.

27-31వ. బలమిచ్చు దేవుడు- విడువని దేవుడు:- 27-28వ. యెహోవా 1) నిత్యుడగు దేవుడు 2) సొమ్మసిల్లడు 3) అలయడు 4) బలమిచ్చువాడు 5) శోధింప అసాధ్యమైన

జ్ఞానము గల దేవుడు ఆయన జ్ఞానమును శోధించుట అసాధ్యము. కీర్త 73:11-12లో దేవుడు ఎట్లు తెలిసికొనును మహోన్నతునికి తెలివి యున్నదా? అని భక్తిహీనులు అనుకొందురు అని వ్రాయబడినది. 1 కొరి 1:25లో దేవుని వెఱ్ఱితనము మనుష్య జ్ఞానముకంటె జ్ఞానముగలదని వ్రాయబడినది. కనుక మహోన్నతునికి తెలివిలేదని అనుకొనువారు భక్తిహీనులు. 29-31వ. సొమ్మసిల్లిన వారికి బలమిచ్చువాడు ఆయనే, శక్తిహీనులకు బలాభివృద్ధి కలుగజేయువాడు ఆయనే: బాలురు సొమ్మసిల్లుదురు, అలయుదురు. యవ్వనస్థులు తప్పక తొట్రిల్లుదురు అని వ్రాయబడినది. 1కొరి 1:25లో దేవుని బలహీనత మనుష్యుల బలముకంటె బలమైనది. కనుక బాలురు సొమ్మసిల్లి అలసినను, యవ్వనస్థులు తొట్రిల్లినను, యెహోవా కొరకు ఎదురు చూచిన యెడల నూతనబలము పొందుదురు. వారు పక్షిరాజులవలె రెక్కలుచాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు సొమ్మసిల్లక నడిచి పోవుదురు. పక్షి రాజులు ఎల్లప్పుడు పై చూపు కలిగియుడును. ఆలాగే మనము పై చూపు కలిగి యుండి దేవుని బలముతో అలయక, సొమ్మసిల్లక ముందుకు సాగాలి.

## 41వ. అధ్యాయము (7+7+7+8=29వ)

అంశము:- సహాయకుడైన విమోచకుడు - కార్యములు చేయలేని విగ్రహములు

**1-7వ. అన్యజనులకు విమోచకుని హెచ్చరిక:-** 1-3వ. తన ప్రవర్తన అంతటిలో నీతిని జరిగించువాడైన పారసీకుడగు కోరెషు రాజును తూర్పు నుండి రేపి పిలిచి అతనికి ప్రపంచ జనములపై అధికారమును దేవుడు అప్పగించాడు. రాజులనందరిని లోపరచుకొనునట్లు అతని ఖడ్గమునకు అప్పగించాడు. తాను ఇంతకు ముందు వెళ్ళని త్రోవనే సురక్షితముగా దాటిపోవుచున్నాడు. 4-7వ. దేవుడు ఈ కార్యము జరిగించినను అన్యులు దానిని గుర్తించుట లేదు. అది బాగుగా ఉన్నదని చెప్పి విగ్రహములు చేసికొనుటలో శిల్పి, కంసాలి, నునుపు చేయువాడు, నాగలి మీద కొట్టువాడు అన్యజనులందరు కలిసి విగ్రహము కదలకుండ మేకులతో దానిని బిగించి పూజించుచున్నారు.

**8-14వ. తన జనులకు విమోచకుని సహాయము:-** 8-9వ. దేవుడు తన జనులను పిలుచు విధము:- 1) నా సేవకుడవైన ఇశ్రాయేలు, 2) నేనేర్పరచుకొనిన యాకోబు, 3) నా స్నేహితుడైన అబ్రాహాము సంతానము, 4) భూదిగంతముల నుండి నేను పట్టుకొని దాని కొనల నుండి పిలుచుకొనినవాడు, 5) నా దాసుడు 6) నేను ఉపేక్షింపక యేర్పరచుకొనినవాడు,

**10వ. తన జనులకు దేవుని సహాయము:-** 1) నీకు తోడైయున్నాను, 2) భయపడకుము, 3) నేను నీ దేవుడనై యున్నాను, 4) దిగులుపడకుము, 5) నేను నిన్ను బలపరతును,

6) నీకు సహాయము చేయువాడను, 7) నేనే నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును.

**11-12వ. శత్రువుపై దేవుడిచ్చు విజయము:** 1) నీ మీద కోపబడిన వారందరు సిగ్గుపడి విస్మయ మొందెదరు. 2) నీతో వాదించువారు మాయమై నశించిపోవుదురు, 3) నీతో కలహించువారిని నీవు వెదకుదువు గాని వారిని కనుగొనలేక పోవుదువు, 4) నీతో యుద్ధము చేయువారు మాయమైపోవుదురు, అభావులగుదురు.

**13-14వ. దేవుడు సహాయము చేయు విధము:** 1) భయపడకుము అని చెప్పుచున్నాడు, 2) కుడిచేతిని పట్టుకొనుచున్నాను. 3) నేను నీకు సహాయము చేయుచున్నాని దేవుడు చెప్పుచున్నాడు. యాకోబు పురుగువంటివాడు, స్వల్పజనము, కాని సహాయము చేయు దేవుడైన యెహోవా, శక్తిగల విమోచకుడు, పరిశుద్ధ దేవుడు.

**15-21వ. కార్యములు చేయు దేవుడు:-** 15-17వ. దేవుడు చేయు కార్యములు: 1) కక్కులు పెట్టబడి పదునుగల క్రొత్తదైన నురిపిడి మ్రానుగా ఇశ్రాయేలును నియమించును, 2) ఇశ్రాయేలు పర్వతములను నూర్చును, వాటిని పొడి చేయును, 3) ఇశ్రాయేలును కొండలను పొట్టువలె చేయును, 4) ఇశ్రాయేలు వాటిని గాలించగా గాలి వాటిని కొనిపోవును, 5) సుడిగాలి వాటిని చెదరగొట్టును, 6) ఇశ్రాయేలు యెహోవానుబట్టి సంతోషించును, 7) ఇశ్రాయేలు పరిశుద్ధ దేవునిబట్టి అతిశయపడును, యెహోవా వారికి ఉత్తరమిచ్చును.

**18-21వ. దేవుడు చేయు మరి కొన్ని కార్యములు:** 8) ఇశ్రాయేలు దేవుడు వారిని విడనాడడు. 9) చెట్లులేని మెట్టలమీద దేవుడు నదులను పారజేయును, 10) లోయల మధ్యను ఊటలను ఉబుకజేయును, 11) అరణ్యమును నీటిమడుగుగాను ఎండిన నేలను నీటి బుగ్గలుగాను చేయును. 12) అరణ్యములో దేవదారు వృక్షమును, తుమ్మచెట్లను గొంజిచెట్లను తైలవృక్షమును నాటును, 13) అడవిలో తమాల వృక్షములను సరళ వృక్షములను నేరెడి వృక్షములను నాటును. ఇశ్రాయేలు జనులు చూచి యెహోవా హస్తము ఈ కార్యములు చేసెననియు ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడు దీని కలుగజేసెననియు తెలిసికొని స్పష్టముగా గ్రహించుదురు.

**21-29వ. విగ్రహము చేయలేనివి (21:24వ) - దేవుడు చేయగలవి (25-29వ):-**

21-24వ. మీ రుజువు చూపించుడని యాకోబు దేవుడు విగ్రహములతో చెప్పుచున్నాడు. జరుగబోవు వాటిని విశదపరచుడి, పూర్వమైన వాటిని విశదపరచుడి, రాగలవాటిని మాకు తెలియజెప్పుడి, రాబోవు సంగతులను తెలియజెప్పుడి. మీరు మేలైనను కీడైనను చేయుడి. అప్పుడు మీరు దేవుడని మేము ఒప్పుకొందుము. మీరు మాయా సంతానము మీ కార్యము

శూన్యము మిమ్మును కోరుకొనువారు హేయులు అని యెహోవా విగ్రహములతో చెప్పుచున్నాడు.

25-29వ. 25వ. ఉత్తర దిక్కు నుండి నేనొకని (కోరెషు 45:13వ.) రేపుచున్నాడు. నా నామమున ప్రార్థించు వాడొకడు (కోరెషు) సూర్యోదయ దిక్కునుండి వచ్చుచున్నాడు. ఒకడు బురద త్రొక్కునట్లు కుమ్మరి మన్ను త్రొక్కునట్లు అతడు (కోరెషు) శత్రువులగు బబులోనీయుల సైన్యాధిపతులను నలగద్రొక్కును, పారశీకుడగు కోరెషు బబులోను రాజ్యముపై సంపూర్ణ విజయము పొందునని సుమారు రెండు వందల ఏండ్ల ముందు ప్రవచనముగా యెహోవా చెప్పుచున్నాడు. 26-27వ. జరిగిన దానిని ఆదినుండి తెలియజెప్పువాడు, వినిపించువాడు, ఎవడును విగ్రహములలో లేడు అని మొదట సీయోనుతో చెప్పిన వాడు యెహోవాయే. 28-29వ. నేను చూడగా ఎవడును లేకపోయెను. నేను వారిని ప్రశ్న వేయగా ప్రత్యుత్తరమియ్యగల ఆలోచనకర్త యెవడును విగ్రహములలో లేకపోయెను అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

## 42వ. అధ్యాయము (4+5+4+4+4+4=25వ)

### అంశము:- సేవకుడైన విమోచకుడు

**1-4వ.** విమోచకుడైన క్రీస్తు:- 1వ. 1) క్రీస్తు దేవుని ప్రాణమునకు ప్రియుడు, మానవులను పాపపు శిక్ష నుండి విడిపించుటకు దేవుడు ఏర్పరచుకొనిన సేవకుడు. 2) క్రీస్తునందు దేవుడు తన ఆత్మను ఉంచియున్నాడు. అపొ 16:7లో ఆసియాలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారి నాటంకపరచినందున, వారు ఫ్రుగియ గలతీయ ప్రదేశముల ద్వారా వెళ్ళిరి, యేసు యొక్క ఆత్మ వారిని వెళ్ళనియ్యలేదు. ఈ వచనమునుబట్టి యేసులో ఉన్నది దేవుని ఆత్మయైన పరిశుద్ధాత్మయే. 3) క్రీస్తు అన్యజనులకు న్యాయము కనుపరచును. 2-4వ. సేవకుడైన క్రీస్తు గుణములు:

విధేయుడైన సేవకుడు: 1) అతడు కేకలు వేయడు, అరువడు 2) తన కంఠస్వరము వీధిలో వినబడనియ్యడు. రక్షకుడైన సేవకుడు. 3) నలిగిన రెల్లును అతడు విరువడు. 4) మకమకలాడుచున్న జనుపనార వత్తిని ఆర్పడు. వేయి ఏండ్ల పాలనలో రాజగు సేవకుడు (యెష 42:25) అతడు సత్యము ననుసరించి న్యాయము కనుపరచును. 6) భూలోకమున న్యాయము స్థాపించు వరకు అతడు మందగిలడు. 7) ద్వీపములు అతని బోధ కొరకు కనిపెట్టును.

**5-9వ.** నియమించబడిన క్రీస్తు:- 5-7వ. దేవుడు ఆకాశములను సృజించి వాటిని

విశాలపరచి భూమిని అందులో పుట్టించినవాడు. భూమి మీదనున్న జనులకు ప్రాణమును దానిలో నడచు వారికి జీవాత్మను ఇచ్చినవాడు.

దేవుడు క్రీస్తును నియమించుట: 1) గ్రుడ్డివారి కన్నులు తెరచుటకును, 2) బంధింపబడిన వారిని చెరసాలలో నుండి వెలుపలికి తెచ్చుటకును, 3) చీకటిలో నివసించు వారిని బంధీ గృహములో నుండి వెలుపలికి తెచ్చుటకును దేవుడు యేసును నియమించాడు. యెహోవా యేసును పిలిచి చేయి పట్టుకొని కాపాడి ప్రజల కొరకు నిబంధనగాను అన్యజనులకు వెలుగుగాను నియమించియున్నాడు. 8-9వ. యెహోవా ఎవనికిని తన మహిమను ఇవ్వడు. తనకు రావలసిన స్తోత్రమును విగ్రహములకు చెందనియ్యడు.

**10-13వ. శత్రువులను ఓడించు విమోచకుడు:-** 13వ.లో శ్రమలు మహాశ్రమల ముగింపులో శత్రువులైన క్రీస్తు విరోధిని, అబద్ధ ప్రవక్తను క్రీస్తు సంహరించును కనుక ఆయనను స్తుతించుచు క్రొత్త గీతము పాడాలని 10వ వచనములోను, కేదారు గ్రామ నివాసులు బిగ్గరగా కేకలు వేయుచు పాడాలని 11వ వచనములోను, యెహోవాను కొనియాడుచు స్తోత్రము ప్రచురము చేయాలని 12వ వచనములోను చెప్పుచున్నాడు.

**14-17వ. తన వారిని విడువక విగ్రహారాధికులను సిగ్గుపరచు విమోచకుడు:-** మడుగులను ఆరిపోచేసి ఇశ్రాయేలీయులను, వారెరుగని మార్గమున వారెరుగని త్రోవలలో వారిని నడిపించి తీసుకొని వత్తునని దేవుడు చెప్పుచున్నాడు. ఏడేండ్ల శ్రమల కాలమున ప్రక 8-9 అధ్యాయములలో చెప్పబడిన శ్రమలలో ఇశ్రాయేలు శేషమును నడిపించుటను గూర్చి చెప్పుచున్నాడు. వారి యెదుట చీకటిని వెలుగుగాను వంకర త్రోవలను చక్కగాను చేయుదురు. నేను వారిని విడువక యీ కార్యములు చేయుదునని దేవుడు చెప్పుచున్నాడు. ఆ దినములలో విగ్రహములను ఆశ్రయించి మీరే మాకు దేవతలని చెప్పువారు వెనుకకు తొలగి కేవలము సిగ్గుపడునట్లు దేవుడు చేయును.

**18-21వ. చెవిటి, గ్రుడ్డివారైన ఇశ్రాయేలీయులు:-** 18-19వ. చెవిటివారు, గ్రుడ్డివారైన, ఇశ్రాయేలీయులతో మీరు గ్రహించునట్లు ఆలోచించుడని దేవుడు చెప్పుచున్నాడు. సేవకుడు క్రీస్తు గ్రుడ్డివాడుగా లోకాశలను చూడలేదు. వాటిని గూర్చి వినలేదు. అలాగే దేవుని భక్తుడు లోకాశల విషయమై చెవిటివాడుగా, గ్రుడ్డివాడుగా ఉండాలి.

20-21వ. ఇశ్రాయేలీయులు దేవుని గూర్చిన అనేక సంగతులను చూచుచున్నారు, గాని గ్రహింపకున్నారు. వారు చెవి యొగ్గిరి గాని వినకున్నారు. యెహోవా తన నీతిని బట్టి సంతోషము గలవాడై తన న్యాయవిధుల ఉపదేశ క్రమమొకటి ఘనపరచి గొప్ప చేసెను, కాని ఇశ్రాయేలీయులు దేవుని న్యాయ విధులకు లోబడలేదు.

**22-25వ. విధేయత కొరకైన విమోచకుని పిలుపుకు లోబడనందున శిక్ష :-** దేవుని న్యాయవిధులకు లోబడని ఇశ్రాయేలు జనములను శత్రువులకు అప్పగించాడు. శత్రువు వారిలో కొందరిని అపహరించి, ఎవరును తప్పించుకొనకుండ వారిని బబులోనునకు బందీలుగా పంపాడు. మిగిలిన వారి మీద ఆయన తన కోపాగ్నియు యుద్ధ బలమును కుమ్మరించగా అది వానికి అంటుకొనెను గాని వాడు మనస్సున పెట్టలేదు.

## 43వ. అధ్యాయము (7+7+7+7=28వ)

అంశము:- విమోచన

**1-7వ. విమోచకుడు - కార్యములు:** 1-2వ. మనపట్ల విమోచకుడైన దేవుని కార్యములను ఇశ్రాయేలుగా మారిన యాకోబులో చూడగలము.

యెహోవా మనలను **1) సృజించిన వాడు:** దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి. (ఆది 1:27,28).

**2) నిర్మించినవాడు:** దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. (ఆది 2:7).

**3) విమోచించినవాడు:** మానవులు పాపములో పడి నిస్సహాయ స్థితిలో నున్నారు - ఎవడును ఏ విధముచేతనైనను తన సహోదరుని విమోచింపలేడు. వాడు కుళ్ళు చూడక నిత్యము బ్రతుకునట్లు వాని నిమిత్తము దేవుని సన్నిధిని ప్రాయశ్చిత్తము చేయగలవాడు ఎవడును లేడు, వారి ప్రాణవిమోచన ధనము బహు గొప్పది అది ఎన్నటికిని తీరక అట్లుండవలసినదే (కీర్త 49:9). అట్టి సమయములో యేసుక్రీస్తు తన ప్రాణమును విమోచన క్రయధనముగా ఇచ్చి తాను కార్చిన రక్తము ద్వారా మన పాపముల నుండి మనలను విమోచించాడు.

**4) పిలిచియున్నాడు - పిలుపు వివరము:-** ఎ) మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. క్రీస్తుయేసు, మరణమును నిరర్థకము చేసి జీవమును అక్షయతను సువార్త వలన వెలుగు లోనికి తెచ్చెను. (2 తిమో 1:10).

బి) ఇందువలన, పరలోకసంబంధమైన పిలుపులో పాలు పొందిన పరిశుద్ధ.. (హెబ్రీ 3:1)
సి) క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురి యొద్దకే పరుగెత్తుచున్నాను (ఫిలి 3:14).

డి) దేవుడు మనలను పరిశుద్ధులగుటకే పిలిచెను గాని అపవిత్రులుగా ఉండుటకు పిలువలేదు. (1 థెస్స 4:7).

**5) తన సొత్తుగా చేసికొన్నాడు:-** దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు. (ఎఫె. 1:14).

**6) జలములలో బడి దాటునప్పుడు, నదులలో బడి వెళ్ళునప్పుడు, అగ్ని మధ్యను నడుచునప్పుడు కాపాడువాడు:** యెహోవా ఆ రాత్రి అంతయు బలమైన తూర్పుగాలి చేత సముద్రమును తొలగించి దానిని ఆరిన నేలగా చేసెను. నీళ్ళు విభజింపబడగా ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిన నేల మీద నడిచిపోయిరి. ఆ నీళ్లు వారి కుడి యెడమ ప్రక్కలకు వారికి గోడవలె నుండెను. (నిర్గ 14:21-22). దానియేలు విషయమై - రాజు నేను నలుగురు మనుష్యులు బంధకములు లేక అగ్నిలో సంచరించుట చూచుచున్నాను; వారికి హాని కలుగలేదు; ప్రధాన మంత్రులు వచ్చి ఆ మనుష్యులను పరీక్షించి, వారి శరీరములకు అగ్ని యేహాని చేయకుండుటయు, అగ్ని వాసనయైనను వారి దేహములకు తగలకుండుటయు చూచిరి. నెబుకద్నెజరు షద్రకు, మేషాకు, అబెద్నెగోయను వీరి దేవుడు పూజార్హుడని చెప్పిరి. (దాని 3:25-28).

**3-4వ. 7)** రక్షించువాడు: మరియు క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తి కలుగజేయవలెనని, దేవుడు తన చిత్త ప్రకారమైన సంకల్పమునుబట్టి మనలను ముందుగా రక్షణకై నిర్ణయించి.. (ఎఫె. 1:12).

**8) ప్రేమించువాడు:** శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను. (యిర్మీ 31:3). లోకములోనున్న తన వారిని ప్రేమించి వారిని అంతము వరకు ప్రేమించెను. (యోహా 13:1).

**5-6వ. 9) తోడైయుండువాడు:-** నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివసించును. (యోహా 14:16-17).

**10) పడమటి నుండి సమకూర్చి రప్పించువాడు:** ఈ దొడ్డివి కాని వేరే గొఱ్ఱెలును నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగును (యోహా 10:16).

**7వ. 11) తన నామము పెట్టినవాడు:** నా మహిమ నిమిత్తము నేను సృజించిన వారిని నా నామము పెట్టబడిన వారినందరిని తెప్పించుము. మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి అనగా క్రీస్తు పేరును కలిగియున్నారు. (అపొ 11:26). తన మహిమ నిమిత్తము ఆయన మనకు చేసినవి: ఈ క్రింది లేఖనముల ద్వారా తన మహిమ నిమిత్తము మనలను 1) నిర్ణయించుకొని, 2) ఏర్పరచుకొని, 3) రక్షించి, 4) తన కోపమును బిగబట్టుకొని, 5) మనము తనను అంటియుండ చేసికొన్నాడని గమనించగలము. 1) తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు మనలు నిర్ణయించుకొని... 2) తన కృపా మహిమకు కీర్తికలుగునట్లు, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా నిర్ణయించుకొని.. జగత్తు పునాది వేయబడక మునుపే, ఏర్పరచుకొనెను. (ఎఫె. 1:5). 3) అయినను తన మహా పరాక్రమమును మహిమను ప్రసిద్ధి చేయుటకే ఆయన తన నామమును బట్టి వారిని రక్షించెను. (కీర్త 106:8). 4) తన కీర్తి నిమిత్తము మన విషయములన్నిటిని బిగబట్టుకొనుచున్నాడు: నేను నిన్ను నిర్మూలము చేయకుండునట్లు నా నామమునుబట్టి నా కోపము మానుకొనుచున్నాను నా కీర్తి నిమిత్తము నీ విషయములో నన్ను బిగబట్టుకొనుచున్నాను. (యెష 48:9). 5) తనకు కీర్తి స్తోత్రమహిమలు కలుగుటకై ఇశ్రాయేలు వంశస్థులనందరిని అంటి యుండజేసితిని; నాకు కీర్తి స్తోత్రమహిమలు కలుగుటకై వారు నాకు జనముగా ఉండునట్లు నేను ఇశ్రాయేలు వంశస్థులనందరిని యూదా వంశస్థులనందరిని, నడికట్టు నరుని నడుముకు అంటియున్న రీతిగా నన్ను అంటియుండజేసితిని (యిర్మీ 13:11) అంటున్నాడు. మనము చేయవలసినవి: 6) అన్యజనులు ఆయన కనికరమును గూర్చి దేవుని మహిమపరచుటకును. అన్యజనులలో నేను నిన్ను స్తుతింతును, నీ నామ సంకీర్తనము చేయుదును. (రోమా 15:9).

7) మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమ కొరకు చేయుడి ( 1 కొరి 10:31).

8) అన్యజనులలో ఆయన మహిమను ప్రచురించుడి (కీర్త 96:8).

**8-14వ. విమోచనకు సాక్షులు (10,11వ):-** 8-10వ. దేవుడైన యెహోవా: సర్వజనులారా, గుంపుకూడి రండి. కన్నులుండి అంధులైన వారిని, చెవులుండి బధిరులైనవారిని తీసికొని రండి. వారిలో ఎవరు ఇట్టి సంగతులు తెలియజేయుదురు? పూర్వకాలమున జరిగిన వాటిని ఎవరు మాకు వినిపించుదరు? మీరు తెలిసికొని నన్ను నమ్మి నేనే ఆయనని గ్రహించునట్లు మీరును నేను ఏర్పరచుకొనిన నా సేవకుడును నాకు సాక్షులు. నాకు ముందు ఏ దేవుడను లేడు. నా తరువాత ఏ దేవుడు నుండడు.

**11-12వ. రక్షకుడైన యెహోవా:** యెహోవా తప్ప వేరొక రక్షకుడు లేడు. ప్రకటించినవాడు (తండ్రియైన దేవుడు), రక్షించిన వాడు (యేసుక్రీస్తు), దాని గ్రహింపజేసినవాడు (పరిశుద్ధాత్ముడు) త్రియేక దేవుడు ఆయనే. అన్యదేవత ఎవరు ఉండియుండలేదు. కనుక నేనే దేవుడను మీరే నాకు సాక్షులు అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**13-14వ. విమోచకుడైన యెహోవా:** ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడును విమోచకుడునైన యెహోవాయే యూదులను బబులోనుకు పంపాడు. యూదావారిని విమోచించుటకై కల్దీయులను పడగొట్టాడు.

**15-21వ. బబులోను చెరనుండి విమోచన విధము (15-19వ.):-** 15-17వ. కల్దీయులందరు ఏకముగా పండుకొని లేవలేక లయమై జనుపనారవలె ఆరిపోయిరి. 18-21వ. దేవుడు చేయు నూతన క్రియ: అరణ్యములో త్రోవ కలుగజేయుదును అన్నాడు. ఎడారిలో నదులు కలుగజేసి, నేను ఏర్పరచుకొనిన ప్రజలు త్రాగుటకు అరణ్యములో నీళ్ళు పుట్టించుచున్నానని చెప్పుచున్నాడు. ఐగుప్తు నుండి ప్రజలను విమోచించినప్పుడు ఇవన్నియు జరిగించాడు. బబులోను చెరనుండి విడిపించునప్పుడు, అలాగే అంత్యకాలములో క్రీస్తు విరోధి నుండి విడిపించునప్పుడు ఆలాగు చేయును. తన నిమిత్తము తాను నిర్మించిన జనులు స్తోత్రమును ప్రచురము చేయు నిమిత్తము ఆలాగు జరిగించును.

**22-28వ. పాపపు చెర నుండి విడిపించు విధము:-** 22-25వ. యాకోబూ, ఇశ్రాయేలూ, అని పాత, క్రొత్త పేరుతో పిలుచుచున్నాడు. 1) తనకు మొఱ్ఱపెట్టనివారిని, 2) విసికించిన వారిని విమోచించు దేవుడుగా నున్నాడు. 3) దహన బలులుగా గొఱ్ఱెమేకల పిల్లలను తన యొద్దకు తేని వారిని, 4) బలులచేత ఘనపరచనివారిని, 5) నైవేద్యములు చేయనివారిని, 6) ధూపము వేయని వారిని ప్రేమించి విమోచించాడు. 7) సువాసనగల లవంగపు చెక్కను రూకలిచ్చి కొననివారిని, 8) బలి పశువుల క్రొవ్వు చేత దేవుని తృప్తిపరచని వారిని, 9) పాపములచేత విసికించిన వారిని, 10) దోషములచేత ఆయాసపెట్టిన వారిని విమోచించాడు. దేవుడు తన చిత్తానుసారముగా మన యతిక్రమములను తుడిచి వేశాడు. మన పాపములను జ్ఞాపకము చేసికొనననని సెలవిచ్చుచున్నాడు.

26-28వ. మనము దేవునితో వ్యాజ్యెమాడలేము. మన మూలపితరులు మధ్యవర్తులు పాపము తిరుగుబాటు చేసినవారే. ప్రతిష్ఠితులగు ప్రధానులును అపవిత్రపరచబడిరి. అందుకై యాకోబు శపించబడి, ఇశ్రాయేలు దూషణ పాలు చేయబడెను. అయినను దేవుడు తన కృప చేత బబులోను చెరనుండి యూదులను విడిపింతునని చెప్పుచున్నాడు.

# 44వ. అధ్యాయము (7+7+7+7=28వ)

అంశము:- విమోచించలేని విగ్రహాలు - క్రీస్తు విమోచన క్రియ వివరము.

**1-7వ. విమోచించు దేవుడు (1-2వ) - విమోచించిన విధము (3-4వ) - విమోచన వివరము (5-7వ):** 1-2వ. యాకోబును, ఇశ్రాయేలును విమోచించు యెహోవా: 1) మానవులను సృష్టించిన వాడు. 2) మనలను తల్లి గర్భములో నిర్మించినవాడు. 3) మనకు సహాయము చేయువాడు. 4) మనలను సేవకులుగా ఏర్పరచుకొనినవాడు. 5) మనకు భయపడకుమని అభయమిచ్చువాడు.

3-4వ. విమోచించిన విధము: ఎండిన భూమిమీద నున్న దప్పికగల మానవులు ఆత్మీయ దప్పిక మీద వాక్యమను నీళ్ళను, ప్రవాహ జలముగా కుమ్మరించును. మానవుల మీద తన పరిశుద్ధాత్మను కుమ్మరించును. మనకు పుట్టిన వారిని ఆశీర్వదించును. నీటికాలువల యొద్ద నాటబడిన నిరవంజిచెట్లు గడ్డిలో ఎదుగునట్లు ఎదిగింపచేయును.

**5-6వ. విమోచన వివరము:** ప్రజల పేరులు మార్చబడి ఒకడు నేను యెహోవావాడను, మరియొకడు యాకోబువాడనని చెప్పుకొనుచు, తమకు మారు పేరులు పెట్టుకొందురు. 7వ. దేవుని గుణములు: 1) నేను మొదటివాడను కడపటివాడను. 2) నేను తప్ప ఏ దేవుడును లేడు. 3) ఆదిలోనున్న జనములు నియమించబడినది మొదలుకొని యెహోవావలె జరుగబోవు సంగతులు తెలియజేయగల వాడెవడు? అట్టివాడెక్కడైన ఉండిన యెడల తెలియజెప్పవలెను అని యెహోవా చెప్పుచున్నాడు. అట్టి భవిష్య ద్విషయమును తెలియజెప్పి విమోచించు వారెవరును లేరు.

**8-14వ. విమోచించలేని విగ్రహాలు-వాటిని నిర్మించు వారు:-** 8-11వ. విగ్రహములను చేయువారు: పూర్వకాలమునుండి యెహోవా తాను తప్ప వేరే దేవుడు లేడను సంగతి వినిపించి తెలియజేసియున్నాడు. ఇందుకు మీరే నాకు సాక్షులు అని అంటున్నాడు. యెహోవా తప్ప ఆశ్రయదుర్గమేదియు లేదు, విగ్రహమును నిర్మించు వారందరు మాయవంటివారు. వారికిష్టమైన విగ్రహములు నిష్ప్రయోజనములు. ఎందుకును పనికిరాని, తమ్మును విమోచించలేని విగ్రహమును పోతపోసి దాని నొక దేవునిగా నిరూపించుచున్నారు. ఆ శిల్పకారులందరు, వాటిని పూజించువారందరు పోగుచేయబడి యెహోవా ఎదుట నిలువబెట్టబడుదురు. నిశ్చయముగా వారు భయపడి సిగ్గుపడుదురని యెహోవా సెలవిచ్చుచున్నాడు. 12-14వ. కుమ్మరి గొడ్డలి పదును చేయుచు, నిప్పులతో పనిచేయును. సుత్తెతో దానిని రూపించి తన బాహు బలముచేత దాని చేయును. వడ్లవాడు దాని చక్కచేసి

రూపించును. మందిరములో దాని స్థాపింపవలెనని నరరూపము గలదిగాను నరసౌందర్యము గలదానిగాను చేయును. ఒకడు చెట్టు నాటగా వర్షము దాని పెంచును. ఒకడు దేవదారు చెట్లను నాటగా వర్షము దాని పెంచును. ఒకడు దేవదారు చెట్లను నరకవలెనని పూనుకొనినను, అలాగే చేయక శ్మశానవృక్షమును గాని, సరళ వృక్షమును గాని, సింధూర వృక్షములనుగాని అడవి వృక్షములలో ఏదో ఒకదానిని తీసికొని, దానిని దేవుడుగా నిర్మించి, పూజించుట సమంజసమా అని దేవుడు అడుగుచున్నాడు.

**15-21వ. విగ్రహాలను పూజించువారు:-** 15-17వ. ఒకడు పొయ్యికట్టెలకు, చలి కాచుకొనుటకు, నిప్పు రాజబెట్టి రొట్టె కాల్చుకొనుటకు కొయ్యలను వాడును. దానిలోనుండి ఒక తుండు తీసికొని దానితో ఒక విగ్రహమును దేవతగా చేసి దానికి నమస్కారము చేయును. అగ్నితో సగము కాల్చియున్నాడు. కొదువ సగముతో మాంసము వండి భక్షించియున్నాడు. తిని తృప్తి పొందగా చలి కాచుకొనుచు మిగిలిన భాగముతో తనకు దేవతగానున్న విగ్రహమును చేయించుకొనును. దాని యెదుట సాగిలపడుచు నమస్కారము చేయుచు నీవే నా దేవుడవు నన్ను రక్షింపుమని ప్రార్థించుట సరికాదు. 18-21వ. వారు వివేచింపరు, గ్రహింపరు. చూడకుండునట్లు వారి కన్నులు కప్పబడెను, గ్రహింపకుండునట్లు వారి హృదయములు మూయబడెను. ఎవడును ఆలోచనచేయడు. నేను అగ్నిలో సగము కాల్చితిని నిప్పుల మీద వేసి రొట్టె కాల్చితిని దానితో మాంసము వండుకొని భోజనము చేసితిని మిగిలిన దానితో చేయబడిన చెట్టుమొద్దుకు సాష్టాంగ పడుదునా? అని యెవడును ఆలోచింపడు. వాడు తన ఆత్మను రక్షించుకొనజాలడనియు అనుకొనుటకు వానికి బుద్ధి చాలదు. యాకోబూ, ఇశ్రాయేలూ; వీటిని జ్ఞాపకము చేసికొనుము, నీవు నా సేవకుడవు నేను నిన్ను నిర్మించితిని. ఇశ్రాయేలూ, నీవు నాకు సేవకుడవైయున్నావు నేను నిన్ను మరచి పోజాలనని యెహోవా సెలవిచ్చుచున్నాడు. నేటి దినములలోను అన్యులు ఆలాగే విగ్రహములను తయారు చేసి పూజించుచున్నారు. బబులోను చెరనుండి యూదులు తిరిగి వచ్చిన తరువాత నేటి వరకు విగ్రహారాధన పూర్తిగా మాని వేసిరి.

**22-28వ. అతిక్రమము నుండి విమోచన (22,23వ.) - బబులోను చెర నుండి విమోచన (28వ.):-** 22-23వ. మంచు విడిపోవునట్లుగా నేను నీ యతిక్రమములను మబ్బు తొలగునట్లుగా నీ పాపములను తుడిచి వేసి యున్నాను. నేను నిన్ను విమోచించియున్నాను, నా యొద్దకు మళ్లుకొనుమని చెప్పి యెహోవా ఆ కార్యమును సమాప్తి చేసియున్నాడు. ఆకాశములారా, ఉత్సాహధ్వని చేయుడి. భూమి అగాధ స్థలములారా, ఆర్భాటము చేయుడి.

పర్వతములారా, అరణ్యమా, అందులోని ప్రతి వృక్షమా, సంగీతనాదము చేయుడి. యెహోవా యాకోబును విమోచించును, ఆయన ఇశ్రాయేలులో తన్నుతాను మహిమోన్నతునిగా కనపరచుకొనును. 24-25వ. సమస్తమును నిర్మించినవాడు, జరిగించువాడు, ప్రగల్భములను వ్యర్థము చేయువాడు: మానవులను గర్భము నుండి నిర్మించి, విమోచించిన యెహోవాయే సమస్తమును జరిగించువాడు. ఆకాశమును విశాల పరచినవాడు, భూమిని పరచినవాడు ఆయనే. ప్రగల్భ ప్రవచనములను వ్యర్థము చేయువాడు, జ్ఞానులను వెనుకకు త్రిప్పి వారి విద్యను అవిద్యగా చేయువాడు యెహోవాయే. 26-28వ. యెరూషలేమును, దాని నగరులను కట్టి, పాడైన స్థలములను బాగుచేయువాడు: యెరూషలేము, యూదా నగరులనుగూర్చి అవి కట్టబడుననియు, నీలోనున్న దేవాలయమునకు పునాది వేయబడుననియు చెప్పుచున్నాడు. దాని పాడైన స్థలములను బాగుచేయును. నదులను, ప్రవాహమును ఎండిపోచేయువాడు. కోరెషుతో మందకాపరీ, యెరూషలేములోని దేవాలయము విషయమై నా చిత్తమంతయు నెరవేర్చువాడా, అని చెప్పువాడు ఆయనే. ఈ ప్రవచన నెరవేర్పుగా క్రీ.పూ. 536-515 మధ్య యెరూషలేములో దేవాలయము, పట్టణము కట్టబడినవి.

## 45వ. అధ్యాయము (4+4+5+6+6=25వ)

**అంశము:- కోరెషు ద్వారా చెరనుండి విమోచన (1-13), క్రీస్తు ద్వారా నిత్య విమోచన (14-25)**

**1-4వ.** విమోచకుడైన కోరెషును పిలిచి అభిషేకించుట (4వ).:- 1-2వ. ఇశ్రాయేలును విమోచించు నిమిత్తమై దేవుడు కోరెషును పిలిచి రాజులందరి మీద జయమిచ్చి, అభిషేకించాడు. 3-4వ. కోరెషు దేవుని ఎరుగకపోయినను యాకోబు నిమిత్తము, ఇశ్రాయేలు నిమిత్తము ఇశ్రాయేలు దేవుడైన యెహోవాయే దేవుడని కోరెషు తెలిసికొనునట్లు పేరుపెట్టి అతనిని పిలిచి, రాజ్యములపై జయమిచ్చుట మాత్రమే కాక ఆ రాజ్యముల ధనమును కూడా ఇచ్చాడు. అదియే అంధకార స్థలములలో ఉంచబడిన నిధులను, రహస్య స్థలములలోని మరుగైన ధనమును అతనికి ఇచ్చాడని చెప్పబడుచున్నది.

**5-8వ.** దేవుడైన క్రీస్తు మానవులను పిలుచుట (6వ.):- 5-6వ. నేను యెహోవాను, మరి ఏ దేవుడును లేడు. నేను తప్ప ఏ దేవుడును లేడు. తూర్పుదిక్కు నుండి పడమటి దిక్కువరకు నేను తప్ప ఏ దేవుడును లేడని జనులు తెలిసికొనునట్లు నీవు నన్ను

ఎరుగకుండినప్పటికిని నిన్ను సిద్ధపరచితినని లోకమందలి సర్వజనులతో యెహోవా చెప్పుచున్నాడు. 7-8వ. వెలుగును సృజించువాడు, అంధకారమును కలుగజేయువాడు, సమాధానకర్తయై కీడును కలుగజేయువాడు యెహోవా అను యేసే వీటినన్నిటిని కలుగజేసియున్నాడు. ఆకాశమండలము నీతిని కురిపించునట్లు అంతరిక్షము, మహా వర్షము, వర్షించునట్లు, భూమి నెరలు విడిచి రక్షణ ఫలించునట్లు భూమి నీతిని మొలిపించునట్లు యెహోవాయగు క్రీస్తు దాని కలుగజేసియున్నాడు.

**9-13వ. కోరేషు ద్వారా బబులోను చెర నుండి విమోచన (13వ).:-** 9-10వ. మంటి కుండ పెంకులలో ఒక పెంకై యుండిన ఇశ్రాయేలు తన్ను సృజించిన వానితో వాదించినందున ఇశ్రాయేలును శ్రమలకు అప్పగించాడు. జిగట మన్నయిన మానవుడు తనను రూపించు దేవునితో నీవేమి చేయుచున్నానని అనదగునా అని యెహోవా అడుగుచున్నాడు. 11-13వ. భూమిని కలుగజేసి, దానిమీద నున్న నరులను సృజించి, ఆకాశములను విశాలపరచి వాటి సర్వసమూహమునకు దేవుడు ఆజ్ఞ ఇచ్చాడు. నీతిని బట్టి కోరెషును రేపి, అతని మార్గములన్నియు సరాళము చేసి అతని చేత యెరూషలేము పట్టణమును కట్టించుటకు ఇశ్రాయేలును విడిపించుటకు నిర్ణయించాడు. అందుకొరకే యెష 41:2లో తన ప్రవర్తన అంతటిలో నీతిని జరిగించువానిని తూర్పు నుండి పిలిచి అతనికి జనములను, రాజులను అతని ఖడ్గమునకు అప్పగించానని చెప్పుచున్నాడు.

**14-19వ. క్రీస్తు ద్వారా ఇశ్రాయేలు నిత్య విమోచన(17వ):-** 14-16వ. విగ్రహము ఒట్టిది కనుక విగ్రహములు చేయువారు సిగ్గుపడి, విస్మయము పొందియున్నారు. 17-19వ. యెహోవా వలన ఇశ్రాయేలు సిగ్గుపడక, నిత్యమైన రక్షణపొంది యున్నది. ఆకాశములకు సృష్టికర్తయగు యెహోవాయే దేవుడని ఇశ్రాయేలు గుర్తించాలి. ఆయన భూమిని ఆది 1:1లో కలుగజేసి దాని సిద్ధపరచిస్థిరపచాడు. నిరాకారముగా నుండునట్లు ఆయన దాని సృజింపలేదు. నివాసస్థలమగునట్లుగా దాని సృజించాడు. అప్పుడు భూమిమీద నివసించిన ఆత్మలగు దూతలు పాపము చేసినందున భూమి శపించబడి నిరాకారముగా మార్చి, మరల దానిని నివాస యోగ్యమైనదిగా ఆరు దినములలో కలుగజేసాడు. ఇది యథార్థమని తెలియజేయువాడను నేనే అని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**20-25వ. విమోచకుడగు క్రీస్తు (21వ) - భూదిగంత నివాసులకు విమోచన (22వ). - క్రీస్తు హెచ్చింపు (23వ):-** 20-21వ జనములు కూడివచ్చి తమ కొయ్య విగ్రహమును

మోయుచు రక్షింపలేని దేవతకు మొక్కుపెట్టువారు ఆలోచన చేయమంటున్నాడు. పూర్వకాలము మొదలుకొని భవిష్యత్తులో జరుగబోవు కార్యమును తెలియజేసిన వాడెవడు? చాలాకాలము క్రిందట దాని ప్రవచించిన వాడెవడు? యెహోవానగు నేనే గదా? నేను తప్ప వేరొక దేవుడు లేడు. నేను నీతిపరుడనగు దేవుడను, రక్షించువాడను నేనే. కనుక నేను తప్ప మరి ఏ దేవుడును లేడు అని జనులు గుర్తించాలని చెప్పుచున్నాడు.

22-23వ. భూదిగంతముల నివాసులారా, నా వైపు చూచి రక్షణ పొందుడి దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడని చెప్పుచున్నాడు. కీర్త 33:14- తానున్న నివాస స్థలములో నుండి భూలోక నివాసులందరివైపు ఆయన చూచుచున్నాడు. భూలోక నివాసులందరి రక్షణ విషయమై ఆయన తలంపు కలిగియున్నాడు. యోహా 3:15 - విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను. యోహా 12:32 - నేను భూమి మీద నుండి పైకెత్తబడిన యెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని చెప్పెను. ఈ విషయమే అపొ 4:12లో మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అని చెప్పబడినది. నా యెదుట ప్రతి మోకాలు వంగుననియు ప్రతి నాలుక నాతోడని ప్రమాణము చేయునను ఈ మాట ఫిలి 2:9-11వ.లో చెప్పబడినది. అందుచేత పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలోగాని, భూమిక్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుక తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను. 24-25వ. యెహోవాయందే నీతి బలములున్నవని ఆయన యొద్దకే మనుష్యులు వచ్చెదరు. యెహోవా యందే ఇశ్రాయేలు సంతతివారు నీతిమంతులుగా ఎంచబడినవారై అతిశయపడుదురని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

## 46వ. అధ్యాయము (2+2+3+3+3=13వ)

**అంశము:- సీయోనుకు విమోచన - బబులోను కూలుట.**

**1-2వ. బబులోనును కూల్చిన దేవుడు:-** బేలు, నెబో, మొరదేకు అను ముగ్గురు బబులోను దేవతలు. బబులోను సామ్రాజ్యము కూలుచున్నప్పుడు దాని దేవతలు కూలుచున్నారని

చెప్పబడినది. వారి దేవతలను మోయు పశువులకు అవి భారముగా నున్నందున అవి క్రుంగుచున్నవని చెప్పబడినది.

**3-4వ. యూదాను ఎల్లప్పుడు విమోచించి కాపాడు దేవుడు:-** యాకోబు ఇంటివారిని, ఇశ్రాయేలు ఇంటివారిని యూదావారిని / మనలను పిలచుచున్నాడు. గర్భమున పుట్టినది మొదలుకొని తనచేత భరింపబడిన వారని చెప్పుచున్నాడు. తల్లి ఒడిలో కూర్చుండినది మొదలు చంకపెట్టుకొనియున్నానని, ముదిమివచ్చు వరకు ఎత్తికొనువాడను నేనే తలవెంట్రుకలు నెరయు వరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే అని చెప్పుచున్నాడు. నేనే చేసియున్నాను చంకపెట్టు కొనువాడను నేనే నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే అని అంటున్నాడు. ముదిమి వచ్చువరకు, తల వెంట్రుకలు నెరయు వరకు ఎత్తుకొని చంక పెట్టుకొను తల్లితండ్రులు భూలోకములో ఎవరును లేరు.

**5-7వ. విమోచించుటలో సాటిలేని దేవుడు - విమోచించలేని విగ్రహాలు:-** 5వ. యెహోవా దేవుడు విగ్రహములలో తనకు సాటి / పోటి లేనివాడుగా నున్నాడు. 6-7వ. విగ్రహములకు సాగిలపడి నమస్కారము చేయుటకై సంచి నుండి బంగారము మెండుగా పోసి, దాని దేవతగా నిరూపించవలెనని కంసాలిని కూలికి పిలిచి, భుజము మీద దాని నెక్కించుకొని, దాని మోసికొనిపోయి తగినచోట నిలువబెట్టి దానికి మొఱ్ఱపెట్టినను అది ఉత్తరము చెప్పదు. వాని శ్రమ పోగొట్టి యెవనిని విమోచించి రక్షింపదు.

**8-10వ. జరుగబోవు వాటిని తెలిపి క్రమపరచు దేవుడు:-** 8-9వ. దీని జ్ఞాపకము చేసికొని ధైర్యముగా నుండుడి. అతిక్రమము చేయువారలారా, దీని ఆలోచించమని చెప్పుచున్నాడు. చాల పూర్వమున జరిగినవాటిని జ్ఞాపకము చేసికొనిన యెహోవా తప్ప మరి ఏ దేవుడును లేడని యెహోవాను పోలినవాడెవడును లేడని గ్రహింపగలము. 10వ. యెహోవా తన ఆలోచన నిలుచుననియు తన చిత్తమంతయు నెరవేర్చుకొనెదనని చెప్పుకొనుచున్నాడు. ఆది నుండి యెహోవాయే కలుగబోవు వాటిని అనగా యింక జరుగని వాటిని ప్రవచనముగా తెలియజేయుచున్నాడు.

**11-13వ. కోరెషు ద్వారా తప్పక ఇశ్రాయేలుకు విమోచన:-** 11వ. తూర్పున, దూర దేశము నుండి క్రూర పక్షియగు కోరెషును రప్పించుచున్నాను, నేను యోచించిన కార్యమును నెరవేర్చు కోరెషు పిలిచి దాని సఫలపరచ ఉద్దేశించియున్నానని దేవుడు సెలవిచ్చుచున్నాడు 12వ. యూదా వారు కఠిన హృదయులై నీతికి దూరముగా ఉన్నారని తన మాట

ఆలకించవలెనని దేవుడు చెప్పుచున్నాడు. 13వ. తన నీతిని రక్షణను ఆలస్యము చేయక దగ్గరకు రప్పించియున్నాడు. సీయోనులో రక్షణనుంద నియమించి ఇశ్రాయేలునకు మహిమను అనుగ్రహించుచున్నానని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

## 47వ. అధ్యాయము (7+8=15వ)

అంశము:- బబులోను పాపమును ఐదు శిక్షలు.

**1-4వ. బబులోను రాణి బానిసయగుట:-** మొదటి శిక్ష: 1వ. కన్యకయైన కల్దీయులనబడు బబులోను కుమారీ, సింహాసనమునుండి క్రిందికి దిగి మంటిలో నేలమీద కూర్చుండాలి. ఆమె మృదువైనదని, సుకుమారి అనియైనను జనులు ఇకమీదట చెప్పరు. ఇదియే మొదటి శిక్ష. 2వ. బానిసయైన స్త్రీ వలె తిరుగటి దిమ్మలు తీసికొని పిండి విసరాలి. ముసుకును, కాలిమీద జీరాడు వస్త్రము తీసి నదులు దాటాలని దేవుడు చెప్పుచున్నాడు. 3-4వ. ఆమె కోక తీసి వేయబడుట ద్వారా ఆమె అవమానము వెల్లడియగును. విమోచకుడు సైన్యములకధిపతియు ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడగు యెహోవా ఈ రీతిగా ఆమెకు ప్రతిదండన చేయును.

**5-7వ. దొరసానియైన బబులోను రాణి చీకటిలో కూర్చుందుట:-** రెండవ శిక్ష: 5వ కల్దీయుల కుమారీ, మౌనముగా నుండి చీకటి లోనికి పోవుట ద్వారా రాజ్యములకు దొరసానియని యిక మీదట ఎవ్వరు చెప్పరు.

6-7వ. దేవుని స్వాస్థ్యమగు యూదా జనుల మీద దేవుడు కోపబడి వారి అపవిత్రతను బట్టి వారిని గతములో బబులోను చేతికి వారిని అప్పగించాడు. ఇప్పుడు బబులోనును శిక్షించి యూదులకు విడుదల ఆశీర్వాదమిచ్చుచున్నాడు. కాని బబులోనీయులు వారి యుందు కనికరపడక వృద్ధుల మీద కాడి ప్రానును మిక్కిలి బరువుగా మోపిరి. సర్వదా దొరసానినై యందునని బబులోను అనుకొని వీటిని ఆలోచింపక, వాటి ఫలమేమవునోయని మనస్సునకు తెచ్చుకొనకపోయెను. అందువలన బబులోను ఈ రెండవ శిక్ష అనుభవించవలసి వచ్చినది.

**8-9వ. సుఖాసక్తురాలగు బబులోను రాణి విధవరాలగుట:-** మూడవ శిక్ష: 8-9వ. సుఖాసక్తురాలవై నిర్భయముగా నివసించుచు నేనే ఉన్నాను. నేను తప్ప మరి ఎవరునులేరు నేను విధవరాలనై కూర్చుందను పుత్రశోకము నేను చూడనని అనుకొనుచున్నదానా, ఒక్క దినములోగా ఒక్కనిమిషముననే పుత్రశోకమును వైధవ్యమును, ఈ రెండును నీకు

సంభవించును. అధికముగా శకునము చూచి అత్యధికమైన కర్ణపిశాచ తంత్రములను ఆధారముగా చేసికొని అపాయములు రాకుండవలెనని ప్రయత్నించినను మూడవశిక్షగా అపాయము సంపూర్తిగా వచ్చునని దేవుడు చెప్పుచున్నాడు.

**10-11వ. చెడుతనమును ఆధారము చేసికొనినందున నివారింపలేని కీడు కలుగుట:-**

నాల్గవ శిక్ష: 10వ చెడుతనమును నీవు ఆధారము చేసికొని యెవడును నిన్ను చూడడని నీ విద్యయు నీ జ్ఞానమును ఆధారము చేసికొని నిన్ను నీవు చెరిపి వేసికొంటివి. 11వ. నీమీదికి వచ్చు కీడును నీవు మంత్రించి పోగొట్టుకొనాలని తలంచినను ఆ కీడు నీ మీద పడును, నాల్గవ శిక్షగా నీకు తెలియని నాశనము నీ మీదికి ఆకస్మికముగా వచ్చునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**12-15వ. శకునములు చూచినందున సహాయకులు లేక నాశనమగుట:-** ఐదవ శిక్ష 12-13వ. విగ్రహారాధికులు కర్ణపిశాచ తంత్రములను, శకునములను చూచు అలవాటు కలిగియుందురు. అలాగే బాల్యము నుండి ప్రయాసపడి అభ్యసించిన కర్ణపిశాచ తంత్రములు విస్తారమైన శకునములను చూపుట ప్రయోజనములగునని తలంచి, బబులోనీయులు విస్తారమైన యోచనల వలన అలసి యున్నారని చెప్పుచున్నాడు. జ్యోతిష్కులు నక్షత్ర సూచకులు మాసచర్య చెప్పువారు నిలువబడి నీ మీదికి వచ్చునవి రాకుండ నిన్ను తప్పించి రక్షించలేరని తెలిసికొనవలెనని చెప్పుచున్నాడు.

14-15వ. బబులోనీయులు (వారి విగ్రహములు) ఐదవ శిక్షగా కొయ్యకాలువలెనై అగ్నిచేత కాల్చి వేయబడుదురని చెప్పుచున్నాడు. మొదట నుండి బబులోనీయులతో వ్యాపారము చేసినవారు తమ తమ చోట్లకు వెళ్లిపోవుదురే కాని ఆ దినమున బబులోనీయులను రక్షించువాడొకడైనను ఉండడు.వీటి వివరములు యెష 13, 14అ.లలో చూతుము. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా దాని 5:27వ.లో బబులోను పట్టణమును పడగొట్టబడి మాదీయ పారశీకులకు రాజ్యము అప్పగింపబడినది. ఈ ప్రవచన అంత్యకాల నెరవేర్పును శ్రమల కాల అంతములో ప్రక 17,18లలో బబులోను సంపూర్ణ నాశనమును చూతుము. బబులోను పతనము గూర్చి యెషయా గ్రంథము, ప్రకటన గ్రంథములో చెప్పబడిన వాక్యముల పోలికలను చూతము.

| యెషయా గ్రంథము | ప్రకటన గ్రంథము |
|---|---|
| 1) 47:1 బబులోను కూలిపోవుట | 1) 18:2,4 బబులోను కూలిపోయెను. |
| 2) 47:2 మా విమోచకునికి | 2) 18:1 మహా అధికారము గలవాడు. |
| 3) 47:3 ప్రతిదండన చేయబడును | 3) 17:16 అగ్నిచేత దానిని బొత్తిగా కాల్చివేతురు. |
| 5) 47:4 విమోచకునికి పేరు | 5) 18:20 దేవుడు ఆ పట్టణమునకు తీర్పు తీర్చియున్నాడు. |
| 6) 47:4 పరిశుద్ధ దేవుడు. | 6) 18:20 పరిశుద్ధులు. |
| 7) 47:5 మౌనముగా చీకటిలోనికి పొమ్ము, బూరల శబ్దము నీలో వినబడదు. | 7) 18:22 బూరలు శబ్దము నీలో వినబడదు. |
| 8) 47:5 మౌనముగా నుండి చీకటి లోనికి పొమ్ము. | 8) 18:23 దీపపు వెలుగు నీలో ఇకను ప్రకాశింపనే ప్రకాశింపదు. |
| 9) 47:6 నా జనుల మీద కనికరపడక కాడి మ్రానును మోపితివి. | 9) 18:24 ప్రవక్తల యొక్క రక్తము ఆ పట్టణములో కనబడెను. |
| 10) 14:11 నీ మహోత్యమును పాతాళమున పడవేయబడెను. | 10) 18:7 ఒక్క దినముననే మరణము వచ్చును. |
| 11) 47:8 విధవరాలనై కూర్చుండును | 11) 17:3 నేను విధవరాలను కాను |
| 12) 47:8 సుఖాసక్తురాలు | 12) 18:7 సుఖభోగవంతురాలు. |
| 13) 47:8 నిర్భయముగా నివసించుట | 13) 18:7 రాణినిగా కూర్చుండుట |
| 14) 47:9 ఒక్క దినములోనే అపాయము. | 14) 18:8 ఒక్క దినములోనే తీర్పు. |
| 15) 47:12 శకునములను చూపుటకు | 15) 18:2 దయ్యముల కార్యములు. |
| 16) 47:14 అగ్ని వారిని కాల్చివేయుచున్నది. | 16) 18:8 అగ్నిచేత బొత్తిగా కాల్చివేయబడును. |

## 48వ. అధ్యాయము (5+6+5+6=22వ)

అంశము:- యూదా విమోచన వివరము

**1-5వ. యూదావారు తమ పేరుకు తగిన జీవితము లేనివారు - అలకించవలసిన అవసరత:-** 1-2వ. యాకోబు వంశస్థులై ఇశ్రాయేలు అను పేరు కలిగినవారు, యూదా

ప్రజలలో నుండి బయలుదేరి వచ్చినవారు యెహోవా నామముతోడని ప్రమాణము చేయుచున్నారు. కాని దేవుని మాట ఆలకించుట లేదు కనుక ఆలకించవలెనని దేవుడు చెప్పుచున్నాడు. 3-4వ. పూర్వకాలమున జరిగిన సంగతులను దేవుడు పూర్వకాలముననే వారికి ప్రవచనముగా తెలియజేశాడు. కాని యూదావారు మూర్ఖులై తమ విగ్రహము ఈ కార్యములను జరిగించెనని చెప్పుచున్నారు.

**6-11వ. అపనమ్మకస్తులు, తిరుగుబాటు చేయువారు - దేవుని కీర్తిని బట్టి నిర్మూలము కానివారు - ఆలోచించవలసిన అవసరత:-** 6-7వ. ఈ దినమునకు ముందు మనము వినియుండని/ తెలియని మరుగైన క్రొత్త సంగతులు ఇకమీదట తెలియజేతునని దేవుడు చెప్పుచున్నాడు. అవి పూర్వకాలమున ఉండినవి కావు ఇప్పుడు కలుగుననియే. కనుక అవి నాకు తెలిసేయున్నవని నీవు చెప్పలేని సంగతులను చెప్పుచున్నానని దేవుడు సెలవిచ్చుచున్నాడు. 8-9వ. యూదావారు అపనమ్మకస్తులైనను తల్లి గర్భమున పుట్టినది మొదలుకొని తిరుగుబాటు చేయువారని దేవునికి తెలియును. కాని అపనమ్మకత్వమును, తిరుగుబాటునుబట్టి నిర్మూలము చేయక తన నామమునుబట్టి తన కీర్తి నిమిత్తము బిగబట్టుకొనుచున్నానని యెహోవా చెప్పుచున్నాడు. 10-11వ. దేవుడు తన నామము అపవిత్రపరచబడక యుండునట్లు, ఇబ్బంది కొలిమిలో యూదాను పరీక్షించిన తరువాత విమోచింతునని చెప్పుచున్నాడు. తన మహిమను మరి ఎవరికిని ఇచ్చువాడను కానని సెలవిచ్చుచున్నాడు.

**12-16వ. విమోచకునికి చెవి యొగ్గి వినాలి:-** 12-13వ. దేవుడు ఇశ్రాయేలూ, యాకోబూ చెవి యొగ్గి వినాలని చెప్పుచున్నాడు. యెహోవాయే మొదటివాడు, కడపటివాడు, ఆయన హస్తము భూమికి పునాదివేసి, ఆకాశ వైశాల్యములను వ్యాపింపజేసినది. దేవుడు వాటిని పిలువగా ఒకటి తప్పకుండ అవన్నియు విధేయత చూపుచున్నవి. 14-15వ. ఆలాగే మీరందరు కూడి వచ్చి ఆలకించుడి అని చెప్పుచున్నాడు. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా యెహోవా ప్రేమించువాడగు కోరెషు ఆయన చిత్త ప్రకారము బబులోనునకు చేసాడు. యెహోవాయే ఆజ్ఞ ఇచ్చి కోరెషును పిలిచి రప్పించాడు. అతని మార్గము తేజరిల్లునట్లుగా చేసాడు. 16వ. ఈ ప్రవచన అంత్యకాల నెరవేర్పుగా మహాశ్రమల కాల అంతములో మహాబబులోను కూలిపోవుట, తదుపరి క్రీస్తు భూమి మీదకు దిగివచ్చి హార్ మేగిద్దోను యుద్ధములో క్రీస్తు విరోధిని సంహరించి యూదులను కాపాడును.

**17-22వ. విమోచన వివరము సెలవిచ్చుచున్నాడు:** 17-18వ. విమోచకుడును పరిశుద్ధ దేవుడునైన యెహోవా ఇశ్రాయేలుకు ప్రయోజనము కలుగునట్లు ఉపదేశముచేసి, బబులోను నుండి నడవ వలసిన త్రోవను వారిని నడిపించును. ఇశ్రాయేలు దేవుని ఆజ్ఞను

ఆలకించిన యెడల క్షేమము నదివలెను, ఉండునని చెప్పుచున్నాడు. 19-20వ. ఇశ్రాయేలీయుల సంతానము ఇసుక విస్తారమగునట్లు విస్తరింపచేసి, వారి నామము దేవుని సన్నిధినుండి కొట్టివేయబడదని చెప్పుచున్నాడు. బబులోను నుండి బయలు వెళ్ళి యెహోవా తన సేవకుడైన యాకోబును విమోచించెనను సంగతి ఉత్సాహధ్వనితో భూదిగంతములవరకు వినబడునట్లు ప్రకటించమని చెప్పుచున్నాడు. 21-22వ. ఎడారి స్థలములలో ఆయన వారిని నడిపించెను. వారు దప్పిగొనలేదు. రాతికొండలో నుండి వారికొరకు ఆయన నీళ్లు ఉబుక జేసెను, ఆయన కొండను చీల్చగా నీళ్లు ప్రవాహముగా బయలు దేరెను. కాని రాబోవు దినములలో దేవుని మాట వినని దుష్టులకు నెమ్మది యుండదని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

## 49వ. అధ్యాయము (4+4+5+5+4+4=26వ)

అంశము:- సేవకుడైన రక్షకుడు

ఈ గ్రంథములోని అనేక భాగములలో రక్షకుడైన యేసు పిలుపును, ఇశ్రాయేలీయుల పిలుపును చూతుము.

| యేసును గూర్చి.... | ఇశ్రాయేలును గూర్చి... |
|---|---|
| 1) నేను ఆదుకొను నా సేవకుడు నేను ఏర్పరచుకొనినవాడు 42:1. | 1) నా సేవకుడవైన ఇశ్రాయేలూ, నేనేర్పరచుకొనిన యాకోబు 41:8-9. |
| 2) ఇశ్రాయేలూ, నీవు నా సేవకుడవు నీలో నన్ను మహిమపరచుకొనెదను 49:3. | 2) ఇశ్రాయేలూ, వీటిని జ్ఞాపకము చేసికొనుము నీవు నా సేవకుడవు నేను నిన్ను నిర్మించితిని 44:21. |
| 3) నేను గర్భమున పుట్టగానే యెహోవా నన్ను పిలిచెను. 49:1 | 3) గర్భమునుండి నిన్ను నిర్మించిన నీ విమోచకుడగు యెహోవా 43:24. |
| 4) ఆయన నా నామము జ్ఞాపకము చేసికొనెను. 49:1. | 4) యాకోబు పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను. 43:1. |

ఈ అధ్యాయములో అన్నిటిలో ముఖ్యమైనదగు యేసు రక్షకుడుగా పిలువబడుటను మనము ధ్యానింతుము.

**1-4వ. రక్షకుని పిలుపు (1వ):-** 1-2వ. ద్వీపములు, దూరమున నున్న జనములు, యేసు మాటలు ఆలకించాలి. గర్భమున పుట్టగానే యేసు యెహోవా చేత పిలవబడి నియమించబడ్డాడు. ఆయన నోరు వాడిగల ఖడ్గముగా చేయబడినది. దేవుడు తన చేతి

నీడలో యేసును దాచి, మెరుగు పెట్టిన అంబుగా చేసి, తన అంబుల పొదిలో మూసిపెట్టి యున్నాడు. 3-4వ. సేవకుడగు యేసులో దేవుడు తనను మహిమపరచుకొనదలచాడు. న్యాయకర్త యేసే, ఆయన మానవులకు యిచ్చు బహుమానము ఆయన యొద్దనే యున్నది.

**5-8వ. రక్షకుని నియామకము(7వ):-**

**అన్యులకు వెలుగు (5-6వ.):** 5వ క్రీస్తు సేవకుడై యుండి తన యొద్దకు యాకోబును తిరిగి రప్పించుటకు ఇశ్రాయేలీయులను దేవుని యొద్దకు సమకూర్చుటకు క్రీస్తును మానవ గర్భమున పుట్టించాడు. యెహోవా దృష్టికి క్రీస్తు ఘనుడయ్యాడు. 6వ. భూదిగంతములవరకు దేవుడు కలుగజేయు రక్షణకు సాధనమగుటకై అన్యజనులకు వెలుగైయుండుసట్లు క్రీస్తును నియమించాడు. హెబ్రీ 2:14-15 ప్రకారము పిల్లలవైన మనము రక్తమాంసములు గలవారమైనందున మరణము యొక్క బలముగల వానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింప జేయుటకును, జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన కూడా రక్తమాంసములలో పాలివాడాయెను.

**ఇశ్రాయేలుకు వెలుగు ( 7-8వ.):** 7వ. ఇశ్రాయేలు విమోచకుడును పరిశుద్ధ దేవుడగు యెహోవా అనగా ఇక్కడ క్రీస్తు అని గుర్తించాలి. ఆయన 1) మనుష్యులచేత నిరాకరింపబడినవాడు, 2) జనులకు అసహ్యుడు, 3) నిర్దయాత్ముల సేవకుడుగా నున్నాడు. 4) నమ్మకమైన వాడనియు, ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడు క్రీస్తును ఏర్పరచుకొన్నాడని రాజులు గ్రహించి లేచెదరు. 5) అధికారులు క్రీస్తుకు నమస్కారము చేసెదరు. 8వ. బయలు వెళ్ళుడి అని బంధింపబడిన వారితోను బయటికి రండి అని చీకటిలో నున్న వారితోను చెప్పుచు దేశమును చక్కపరచి పాడైన స్వాస్థ్యములను పంచిపెట్టుటకై యేసును ప్రజలకు నిబంధనగా నియమించాడు. యేసు సిలువ మరణము పొందు వరకు తండ్రియైన దేవుడు యేసును శత్రువుల నుండి కాపాడాడు. యేసు మన మొర నాలకించి, ఉత్తరమిచ్చి, రక్షణ దినమందు మనలను ఆదుకొంటున్నాడు.

**9-13వ.ఇశ్రాయేలు సమకూర్పు - మార్గములో దేవుడు కాపాడుట (12వ):-** 9-11వ 1) మార్గములలో వారు మేయుదురు. 2) చెట్లు లేని మెట్టలన్నిటి మీద వారికి మేపు కలుగును. 3) వారియందు కరుణించువాడు వారిని తోడుకొని పోవును. 4) నీటి బుగ్గల యొద్ద వారిని నడిపించును. 5) వారికి ఆకలియైనను దప్పికయైనను కలుగదు, ఎండమావులైనను ఎండయైనను వారికి తగులదు. 6) పర్వతములన్నిటిని త్రోవగా చేసెదను. 7) రాజమార్గములు ఎత్తుగా చేయబడును. 12వ. చూడుడి. వీరు దూరము నుండి వచ్చుచున్నారు. వీరు ఉత్తర దిక్కునుండియు పడమటి దిక్కు నుండియు వచ్చుచున్నారు.

వీరు సినీయుల దేశమునుండి వచ్చుచున్నారు. ఈ ప్రవచన ప్రకారము ఇశ్రాయేలు చైనా మొదలగు దేశములనుండి అంత్యకాలములో వచ్చుదురు. 13వ. శ్రమనొందిన తన జనుల యందు జాలిపడి యెహోవా తన జనులను సేవకుడైన క్రీస్తు ద్వారా ఓదార్చియున్నాడు. ఆకాశము, భూమి, పర్వతములు, ఆనంద ధ్వని చేయాలని చెప్పుచున్నాడు.

**14-18వ. యెరూషలేమును జ్ఞాపకము చేసికొనుట (15వ):-** 15-16వ. స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరుచునా? వారైనా మరుచుదురు గాని నేను నిన్ను మరువనని దేవుడు సెలవిచ్చుచున్నాడు. తన అరచేతుల మీదనే మనలను చెక్కియున్నాడు. 17-18వ. నలుదిశల నుండి ఇశ్రాయేలీయులు కూడి వచ్చుచున్నారు. క్రీస్తు వీరినందరిని ఆభరణముగాను, పెండ్లికుమార్తె ఒడ్డాణము ధరించుకొనునట్లు వారిని అలంకారముగా ధరించుకొనును.

**19-22వ. యెరూషలేమును కట్టుట:-** 19-20వ. శత్రువులు యెరూషలేమును పాడుచేసిరి. ఇప్పుడు యెరూషలేములో నివాసులు విస్తరించినందున విశాలమైన స్థలము మాకిమ్మని వారు యేసుతో చెవులో చెప్పుదురు.

వేయి ఏండ్ల కాలములో దీని నేరవేర్పును చూతుము. 21-22వ. ప్రభువగు యెహోవా జనములతట్టు తన చెయ్యిని, ధ్వజమును ఎత్తగా వారు ఇశ్రాయేలు కుమారులను రొమ్మున నుంచుకొని వచ్చెదరు. ఇశ్రాయేలు నేను నా పిల్లలను పోగొట్టుకొని, సంతాన హీనురాలను, ఒంటరికత్తెనై విడువ బడితిని. వీరు ఎక్కడ ఉండిరి? అని ఇశ్రాయేలు మనస్సులో అనుకొనుచు ఆశ్చర్యపడును. ఇశ్రాయేలు కుమార్తెలు జనముల భుజముల మీద మోయబడెదరని దేవుడు చెప్పుచున్నాడు. 14-22వ.లోని ప్రవచన సమీప నెరవేర్పుగా యూదులు బబులోను చెరనుండి తిరిగి వచ్చినప్పుడు, అంత్యకాల నెరవేర్పుగా శ్రమలు, మహాశ్రమలకాల ముగింపులో ప్రపంచపు నలుమూలల నుండి ఇశ్రాయేలీయులు వచ్చుట పట్టణము దేవాలయము కట్టబడుటను సూచించును.

**23-26వ. శత్రువును శిక్షించుట:-** ఇశ్రాయేలుతో యుద్ధము చేయు శత్రువులను దేవుడు యుద్ధములో సంహరించి ఇశ్రాయేలీయుల పిల్లలను రక్షించెదనని వాగ్దానము చేయుచున్నాడు. క్రొత్త ద్రాక్షారసముచేత మత్తులైనట్టుగా తమ రక్తముచేత వారు మత్తులగుదురని ప్రవచన సమీపనెరవేర్పుగా బబులోనులో బెల్షస్సరు హతుడైనప్పుడు జరిగినది. అంత్యకాల నెరవేర్పుగా మహాశ్రమల కాల చివరలో హర్మేగిద్దోను యుద్ధములో శత్రువులను దేవుడు శిక్షించునప్పుడు జరుగును.

# 50వ. అధ్యాయము (3+4+4=11వ)

అంశము:- రక్షకుని విధేయత

**1-3వ. దోషమునుబట్టి దూరమై దేవుని మాట వినని యూదావారు (1వ.):-** ఇశ్రాయేలు జనులు తమ దోషములను, అతిక్రమములనుబట్టి దేవునికి అయన ఆశీర్వాదములకు దూరమైరి. దేవుడు వారిని పరిత్యజించలేదు. ఒకడు తన భార్యను విడనాడినట్లు, లేదా ఒకడు బానిసను అప్పుల వాడికి అమ్మినట్లు దేవుడ చేశాడని వారు తలంచుచున్నారు. దేవుని చెయ్యి వారి పాపమును విమోచింపలేనంత కురచయైపోలేదు. దేవుడు అనేకసార్లు ఆహ్వానించినను వారు రాలేదు. విడిపించుటకు దేవుని శక్తి చాలును. దేవుని గద్దింపు చేత సముద్రము ఎండిపోవును, నదులు ఎడారిగా చేయబడును. ఆకాశములో చీకటి కమ్మును. దేవుని శక్తి ఇంత గొప్పదైనను తమ పాపమును గుర్తించి, పాప క్షమాపణకై ఇశ్రాయేలీయులు దేవుని ఆశ్రయించలేదు.

**4-7వ. వినుబుద్ధి కలిగిన సేవకుడు - శ్రమను అనుభవించుట (6వ):-** యూదా వారికి వినుబుద్ధిలేదు. యేసు జ్ఞానము కలిగిన శిష్యుడుగా తగిన నోరును, శిష్యులు వినునట్లుగా ప్రతి ఉదయమున వినుబుద్ధిని కలిగియున్నాడు. ప్రభువగు యెహోవా యేసుకు వినుబుద్ధి పుట్టింపగా యేసు యెహోవా మీద తిరుగుబాటు చేయలేదు. 6వ. కొట్టువారికి వీపును అప్పగించాడు. వెంట్రుకలు పెరికివేయువారికి చెంపలను అప్పగించాడు. ఉమ్మివేయు వారికిని అవమానపరచు వారికి యేసు ముఖము దాచుకొనలేదు. ఈ విషయము మార్కు 14:65;15:15-19లో... యేసును కొరడాలతో కొట్టించి సిలువ వేయనప్పగించెను. రెల్లుతో ఆయన తలమీద కొట్టి, ఆయన మీద ఉమ్మివేసి, మోకాళ్లూని ఆయనకు నమస్కారము చేసిరని వ్రాయబడింది.

ప్రభువగు యెహోవా సహాయము చేయువాడు గనుక యేసు సిగ్గుపడలేదు. ముఖమును చెకుముకి రాతివలె చేసికొన్నాడు. ఇదంతయు సిలువలో యేసు చూపిన విధేయత.

**8-11వ. యూదా వారు దేవుని సేవకుడైన రక్షకునితో వాజ్యమాడక (8-9వ.) మాట వినవలెనన్న హెచ్చరిక (10-11వ.):-** యూదా వారందరు తమ పాపమునుబట్టి వస్త్రమువలె పాతగిలిపోయిరి. చిమ్మెట వారిని తినివేసెను. రోమా 3:23 ప్రకారము ఏ బేధమును లేక అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. యూదా వారిని నీతిమంతునిగా ఎంచువాడగు యేసు రాకడ ఆసన్నమై యున్నది, కనుక ఆయనతో వ్యాజ్యెమాడక, యెహోవాకు భయపడి ఆయన సేవకుడైన యేసుమాట వినవలెనని దేవుడు చెప్పుచున్నాడు. వెలుగు లేకయే చీకటిలో నడుచువాడు యెహోవా

నామమును ఆశ్రయించి తన దేవుని ఎల్లప్పుడు నమ్ముకొనుచుండవలెను. యేసుమాట వినని యెడల రాజబెట్టిన అగ్ని, అనగా నరకాగ్ని శిక్షలో మీరు వేదనగలవారై పండుకొనెదరని సెలవిచ్చుచున్నాడు.

## 51వ. అధ్యాయము (3+3+2+4+4+4+3=23వ)

అంశము:- రక్షకుడు పిలుచుట - ఐదు పిలుపులు

**1-3వ. యూదా ప్రజలకు రక్షకుని మొదటి పిలుపు - యెహోవాను వెదకువారలారా, నా మాట వినుడి:-** 1-2వ. ఆలోచించుడి అని నాలుగు పర్యాయములు చెప్పుచున్నాడు. తండ్రియైన అబ్రాహాము ఒంటరియైయుండగా దేవుడు పిలిచి గొప్ప జనాంగమగునంతగా ఆశీర్వదించెను. స్త్రీ ధర్మము నిలిచిపోయిన శారా గర్భము తెరచి ఆశీర్వదించి పెక్కుమందియగునట్లు చేసెను. 3వ. పాడైన యెరూషలేమును గూర్చి యిర్మీయా విలపించాడు. కాని ఇప్పుడు యెహోవా సీయోనును ఆదరించుచున్నాడు. దాని పాడైన స్థలములన్నిటిని ఆదరించి దాని అరణ్య స్థలములను ఏదెనువలె చేయుదునంటున్నాడు. దాని యెడారి భూములు యెహోవా తోటవలెనగునట్లు చేయును. ఆనంద సంతోషములును కృతజ్ఞతాస్తుతియు సంగీత గానమును దానిలో వినబడును. వేయి ఏండ్ల కాలములో ఇదంతయు జరుగును.

**4-6వ. యూదా ప్రజలకు రక్షకుని రెండవ పిలుపు - నా ప్రజలారా, నా మాట వినుడి:-** 4-5వ. వేయి ఏండ్ల పాలనలో ఉపదేశము దేవుని యొద్ద నుండి బయలుదేరును. జనములకు వెలుగు కలుగునట్లుగా ప్రభువు విధిని నియమించును. దేవుడు ఏర్పరచు నీతిగల పాలన, రక్షణ సమీపముగా ఉన్నది. ప్రభువు బాహువును జనములు ఆశ్రయింతురు. జనములకు ప్రభువు తీర్పు తీర్చును. ద్వీపవాసులు నా తట్టు చూచి నిరీక్షణ గల వారగుదురు. 6వ. ఆకాశము, భూమి వస్త్రమువలె పాతగిలి నశించును. దేవుని రక్షణ నిత్యముండును, నీతి కొట్టివేయబడదు.

**7-8వ. యూదా ప్రజలకు రక్షకుని మూడవ పిలుపు - నీతిని అనుసరించువారలారా, నా మాట వినుడి:-** మనుష్యులు పెట్టు నిందకు భయపడకుడి, వారి దూషణ మాటలకు దిగులు పడకుడని దేవుడు సెలవిచ్చుచున్నాడు. చిమ్మట వస్త్రమును కొరికివేయునట్లు, బొద్దీక గొఱ్ఱబొచ్చును కొరికివేయునట్లు దేవుడు ఏడేండ్ల శ్రమల కాలము ఇశ్రాయేలీయుల శత్రువులను నశింపచేయును. దేవుని రక్షణ తరతరములు ఉండును.

**9-12వ. యూదా ప్రజలు రక్షకుని పిలుచుట - యెహోవా బాహువా, లెమ్ము లెమ్ము**

**బలము తొడుగుకొమ్ము:-** 9-10వ. కీర్తన 121:365వ. ఆయన నీ పాదము తొట్రిల్లనియ్యడు. ఇశ్రాయేలును కాపాడువాడు కునకడు నిద్రపోడు. యెహోవాయే నిన్ను కాపాడువాడు నీ కుడిప్రక్కను యెహోవా నీకు నీడగా నుండును. పూర్వకాలములో, రాహాబును అనగా ఐగుప్తీయులను ఓడించి ఇశ్రాయేలును కాపాడాడు. అగాధ జలములు గల సముద్రమును ఇంకిపోజేసినవాడవు నీవే గదా? విమోచింపబడినవారు దాటిపోవునట్లు సముద్రా గాధ స్థలములను త్రోవగా చేసినవాడవు నీవే గదా? మకరము అనగా సాతానును పొడిచిన వాడవు నీవే గదా? అని దేవుని బలమును జ్ఞాపకము చేసికొనుచున్నారు. 11-12వ. యెహోవా విమోచించినవారు సంగీతనాదముతో సీయోనునకు తిరిగి వచ్చెదరు. నిత్యసంతోషము వారి తలల మీద ఉండును వారు సంతోషానందము గలవారగుదురు దుఃఖమును నిట్టూర్పును తొలగిపోవును. నేను నేనే మిమ్ము నోదార్చువాడను అని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఇది వేయి ఏండ్ల కాల పాలనలో జరుగును. తరువాత నిత్యకాలమును గూర్చి ప్రక 21:3-4 లో చెప్పబడినది. - ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది. ఆయన వారితో కాపుర ముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడైయుండి వారికి తోడైయుండును. ఆయన వారి కన్నుల బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనైనను ఇక ఉండదు అని నిత్యకాలమును గూర్చి చెప్పబడినది.

**13-16వ.** విమోచన వాగ్ధానము:- 13-14వ. బాధపెట్టువాడగు సాతాను మనలను నాశనము చేయుటకు సిద్ధపడునప్పుడు వాని క్రోధమునుబట్టి నిత్యము భయపడుచు, యెహోవాను మరవకూడదు. ఆకాశములను సృష్టించి వ్యాపింపజేసి భూమి పునాదులను వేసిన యెహోవా తన శక్తిని బట్టి మనకు త్వరగా విడుదల కలుగజేయును. కనుక దిగులు పడకూడదు. 15-16వ. దేవుడైన యెహోవా సముద్రము యొక్క కెరటములు ఘోషించునట్లు శ్రమలు రేగినను, ఆయన ఆకాశములను స్థాపించి భూమికి పునాదులను వేసినట్లు తన బలమైన చేతినీడలో మనలను కప్పును. అందుకే సైన్యములకు అధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు.

**17-20వ. యూదా ప్రజలకు రక్షకుని నాలుగవ పిలుపు - యెరూషలేమా, లెమ్ము లెమ్ము... నిలువుము:-** 17-18వ. యెహోవా క్రోధపాత్రను అనగా శిక్షను దేవునిచేతి నుండి యెరూషలేము పుచ్చుకొన్నది. యెరూషలేము కనిన కుమారులందరిలో, ఆమె పెంచిన కుమారులందరిలో ఆమెకు దారి చూపగలవాడెవడును లేకపోయెను.

19-20వ. పాడు, నాశనము, కరువు, ఖడ్గము అను అపాయములు యెరూషలేముకు ప్రాప్తించినను, ఆమెను ఓదార్చువారు లేరు. ఆమె కుమారులు మూర్చిల్లియున్నారు. దుప్పి

వలలో చిక్కుపడినట్లు వీధులన్నిటి చివరలలో వారు పడియున్నారు. 2 దిన 36:17-19వ. లో నెబుకద్నెజరు యెరూషలేముపై దండెత్తినప్పుడు దీని నెరవేర్పు చూతము... ఆయన వారిమీదికి కల్దీయుల రాజును రప్పింపగా అతడు వారికి పరిశుద్ధ స్థలముగానున్న మందిరములోనే వారి యౌవనులను ఖడ్గముచేత చంపాడు.

అతడు యౌవనులయందైనను, యువతుల యందైనను, ముసలివారియందైనను, నెరసిన వెండ్రుకలుగల వారియందైనను కనికరింపలేదు. దేవుడు వారనందరిని అతని చేతికప్పగించెను. మరియు బబులోను రాజు పెద్దవేమి చిన్నవేమి దేవుని మందిరపు ఉపకరణములన్నిటిని యెహోవా మందిరపు నిధులలోనిదేమి రాజు నిధులలోనిదేమి అధిపతుల నిధులలోనిదేమి, దొరకిన ద్రవ్యమంతయు బబులోనునకు తీసికొని పోయెను. అదియుగాక కల్దీయులు దేవుని మందిరమును తగులబెట్టి, యెరూషలేము ప్రాకారమును పడగొట్టి, దానియొక్క నగరులన్నిటిని కాల్చివేసిరి. దానిలోని ప్రశస్తమైన వస్తువులన్నిటిని బొత్తిగా పాడు చేసిరి. (2దిన 36:17-19).

**21-23వ. యూదా ప్రజలకు రక్షకుని అయిదవ పిలుపు - మత్తురాలవై శ్రమపడినదానా, ఈ మాట వినుము:-** 21-22వ. ప్రభువగు యెహోవా తన జనులనిమిత్తము వ్యాజ్యెమాడును. తన క్రోధ పాత్రను యూదా చేతిలోనుండి తీసివేయును, అనగా యూదాను ఆశీర్వదించును. 23వ. యూదాను బాధాపరచు శత్రువులను దేవుడు శిక్షించబోవుచున్నాడు. ఈ ప్రవచన తాత్కాలిక నెరవేర్పుగా బబులోనీయులను శిక్షించాడు. దీని ఆత్మీయ నెరవేర్పుగా మేము దాటిపోవునట్లు క్రిందికి వంగి సాగిలపడుమని వారు నీతో చెప్పగా నీవు నీ వీపును దాటువారికి దారిగా చేసి నేలకు దానిని వంచితివి గదా, అను ప్రవచన ప్రకారము సిలువలో ప్రభువు తన వీపును వంచాడు. యోహాను 5:24వ. ప్రకారము మనము మరణము నుండి జీవములోనికి దాటితిమి (నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడు.)

## 52వ. అధ్యాయము (3+3+3+3+3=15వ)

**అంశము:- రక్షకుని సిద్ధపాటు**

**1-3వ. రక్షకుని ఆజ్ఞ (2వ.):-** 1వ. యెరూషలేమా, లెమ్ము లెమ్ము యేసు ప్రభువు తన వీపును దాటు వారికి దారిగాచేసి నేలకు వంచినందున ఇక మీదట సీయోనూ, బలము ధరించుకొని, సుందర వస్త్రములను ధరించుకొనవచ్చును. గత కాలములో గోనె పట్టలు

ధరించుకొని యుండిరి. 2వ. బబులోనులో బానిసగా చెరపట్టబడిన సీయోను కుమారీ, ధూళి దులుపుకొని, లేచి కూర్చుండి, మెడకట్లు విప్పివేసికొనుమని దేవుడు ఆజ్ఞాపించుచున్నాడు. 3వ. పాపమును బట్టి ఊరకయే బబులోనీయులకు అమ్మబడిన యూదావారు ఇప్పుడు రూకలియ్యకయే రక్షకుని ద్వారా విమోచింపబడుదురని దేవుడు సెలవిచ్చుచున్నాడు. అనాథలను, విధవరాండ్రను, బానిసలను విడిపించువాడు సమీపబంధువై అమూల్యమైన రక్తము కార్చుట ద్వారా వెల చెల్లించి యూదులనే కాక మానవులందరిని విమోచించాడు.

**4–6వ. రక్షకుని వాగ్దానము (6వ):–** 4వ. దేవుడైన యెహోవా అనుకొనుచున్నదేమనగా తాత్కాల నివాసము చేయుటకై పూర్వకాలమున ఇశ్రాయేలీయులు ఐగుప్తునకు పోయి వారిచే బాధింపబడిరి. మరియు పది గోత్రముల ఇశ్రాయేలు వారిని అష్షూరు నిర్నిమిత్తముగా బాధపరచెను. 5వ. ఇశ్రాయేలీయులు తమ పాపమునుబట్టి గతములో ఐగుప్తునకు, ఇప్పుడు బబులోనుకు అంత్యకాలములో క్రీస్తు విరోధికి దేవునిచేత అప్పగింపబడి, బాధింపబడిరి. అందునుబట్టి దినమెల్ల దేవుని నామము దూషింపబడుచున్నది. 6వ. కావున జనులు తన నామమును తెలిసికొనునట్లు దేవుడు వారిని రక్షింతునని వాగ్దానము చేయుచున్నాడు. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా బబులోను చెరనుండి విడిపించాడు. మరొక నెరవేర్పుగా పాపము నుండి విడిపించాడు. అంత్యకాల నెరవేర్పుగా క్రీస్తు విరోధినుండి విడిపించును.

**7–9వ. రక్షణ వార్త ప్రకటన – సిద్ధపాటు (7వ):–** 7వ. బబులోనును విడిచి యెరూషలేముకు వెళ్లవచ్చునని మంచి వార్త కోరెషు రాజు ఎజ్రా 1:1–3లో చాటించెను. నీ దేవుడు ఏలుచున్నాడని సీయోనుతో చెప్పుచూ, ఈ సమాధానము చాటించుచు సువార్తమానము ప్రకటించుచుం, రక్షణ సమాచారము ప్రచురించు వాని పాదములు, ఎంతో సుందరములైయున్నవి అని చెప్పబడుచున్నది. ఈ దినములలో పాపమునుండి యేసు వలన కలుగు రక్షణవార్త చాటించబడుచున్నది. 8వ. సీయోను కావలివారు కూడుకొని బిగ్గరగా పాడుదురు. యెహోవా సీయోనుకు మరల వారిని రప్పించగా వారు కన్నులార చూచుదురు. 9వ. యెరూషలేమునందు పాడైయున్న స్థలములు, ఉత్సహించి యేకముగా సంగీతగానము చేయును, యెహోవా తన జనులను ఆదరించెను. యెరూషలేమును విమోచించెను అని చెప్పబడును. దీని నెరవేర్పుగా నేడు రక్షణ వార్త ప్రకటించబడుచు, రక్షణ గీతములు, ఆనంద గానములు ప్రపంచమంత పాడబడుచున్నవి. అంత్యకాల నెరవేర్పుగా వేయి ఏండ్ల కాలములోను ప్రకటించబడుట, పాడబడుట నెరవేరును.

**10–12వ. రక్షణ వివరము (10వ).:–** 10వ. సమస్త జనముల కన్నుల యెదుట సిలువతో యెహోవా అనగా యేసు ప్రభువు తన పరిశుద్ధ బాహువును బయలుపరచియున్నాడు.

భూదిగంత నివాసులందరు దేవుని రక్షణ చూచెదరు. రోమా 10:5-17లో ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించు వారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడియున్నది. అయినను అందరు సువార్తకు లోబడలేదు ప్రభువా, మేము తెలియజేసిన సమాచారమెవడు నమ్మెను అని యెషయా చెప్పుచున్నాడు గదా? కాగా వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును. 11వ. యెహోవా సేవోపకరణములను మోయువారు, అపవిత్రమైన దేనిని ముట్టక తొలగిపోయి, పవిత్ర పరచుకొనాలి. 12వ. యెహోవా వారి ముందర నడచును, ఇశ్రాయేలు దేవుడు వెనుకటి భాగమును కావలికాయును. కనుక ఇశ్రాయేలు బబులోను నుండి యెరూషలేముకు నిర్భయముగా సాగి వెళ్ళుదురు. ఆత్మీయముగా ఈ దినములలో మనము పాపపు చెరనుండి విడిపించబడి నిర్భయముగా సాగివెల్లగలము. 2 కొరి 6:16-18లో నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనైయుందును వారు నా ప్రజలైయుందురు. కావున మీరు వారి మధ్య నుండి బయలు వెళ్ళి ప్రత్యేకముగా ఉండుడి. అపవిత్రమైనదాని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు. ఎఫె. 6:15లో చెప్పబడినట్లు పాదములకు సమాధాన సువార్తవలననైన సిద్ధమనస్సును జోడు తొడుగుకొని సువార్త ప్రకటించాలి.

**13-15వ. రక్షణ క్రియకు పీఠిక:- తరువాత అధ్యాయములో ధ్యానింతము.**

## 53వ. అధ్యాయము (3+3+3+3=12వ)

**అంశము:- విమోచకుడు (Savior)- శ్రమలు (Sufferings) - విమోచన (Sorrows - Silence) - సంతృప్తి, మహిమ (Satisfaction)**

పీఠిక: 52:13-15వ. సేవకుడు వివేకముగా ప్రవర్తించుట.

**13వ. ప్రసిద్ధుడైన సేవకుడు:-** సేవకుడుగా యేసు సిలువలో వివేకముగా ప్రవర్తించినందున ప్రసిద్ధుడై పరలోకము మట్టుకు హెచ్చింపబడి మహా ఘనుడుగా ఎంచబడెను. ఫిలి 2:9-11లో అందుచేతను పరలోకమందున్న వారిలోగాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లు, ప్రతివాని నాలుకయు, తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను.

**14వ. సేవకుని గూర్చి అనేకుల విస్మయము:-** కీర్త 22:6-7వ. ప్రకారము ఎముకలు స్థానముతప్పి పోయినప్పుడు నరరూపముండదు. నేను నరుడను కాను నేను పురుగును నరులచేత నిందింపబడినవాడను ప్రజలచేత తృణీకరింపబడినవాడను అన్నాడు. యేసును సిలువలో చూచి యే మనిషి రూపముకంటె అతని ముఖమును, నరరూపము కంటె అతని రూపమును చాల వికారమని చాలమంది యేలాగు విస్మయమొందిరో అలాగే యేసు సిలువ అనుభవముద్వారా అనేకులను రక్షించి విస్మయపరచుచున్నాడు.

**15వ. సేవకుని చూచి గ్రహించుట:-** ఈ ప్రవచన నెరవేర్పుగా ప్రస్తుతము అనేకులు సామాన్యులు మొదలు రాజుల వరకు యేసు సంగతిని చూచి నోరు మూసికొని, తమకు తెలియజేయబడని సంగతులు చూచి, తాము వినని దానిని గ్రహింతురు. ప్రవచన అంత్యకాల నెరవేర్పుగా అంత్యకాలమందును సామాన్యులు మొదలు రాజుల వరకు ఆలాగే ఆశ్చర్యపడుట జరుగును.

**1-3వ. మెస్సియా - యేసు తృణీకరించబడిన విమోచకుడు (Savior):-**

**1వ. మెస్సియా బాహువు బయలుపరచబడలేదు:-** మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? యెహోవా బాహువు ఎవనికి బయలు పరచబడెను? యెష 6:9-11తో ఆయన నీవు పోయి యీ జనులతో ఇట్లనుము మీరు నిత్యము వినుచుందురు గాని గ్రహింపకుందురు; నిత్యము చూచుచుందురు గాని తెలిసికొనకుందురు. వారు కన్నులతో చూచి, చెవులతో విని, హృదయముతో గ్రహించి, మనస్సు మార్చుకొని స్వస్థత పొందక పోవునట్లు ఈ జనుల హృదయము క్రొవ్వియున్నది అన్నాడు.

**2వ. యేసు పుట్టుట - పెరుగుట (Born - Brought up):** 11:1-4 యెష్షయి మొద్దు నుండి చిగురు పుట్టును. వాని వేరుల నుండి అంకురము ఎదిగి ఫలించును. యెహోవా ఆత్మ జ్ఞానవివేకములకు ఆధారమగు ఆత్మ ఆలోచన బలములకు ఆధారమగు ఆత్మ తెలివిని యెహోవా యెడల భయభక్తులను పుట్టించు ఆత్మ అతని మీద నిలుచును. యెహోవా భయము అతనికి ఇంపైన సువాసనగా ఉండును. కనుక లేత మొక్కవలెను ఎండిన భూమిలో మొలిచిన మొక్కవలెను యేసు తండ్రి యెదుట పెరిగెను. అతనికి సురూపమైనను సొగసైనను లేదు మనమతని చూచి, అపేక్షించునట్లుగా అతనియందు సురూపము లేదు.

**3వ. యేసు ఎన్నిక చేయబడక పోవుట:** అతడు తృణీకరింపబడినవాడును ఆయెను మనుష్యుల వలన విసర్జింపబడినవాడును, వ్యసనాక్రాంతుడుగాను, వ్యాధిననుభవించిన వాడుగాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను. అతడు తృణీకరింపబడ్డాడు. ఎవరు అతనిని ఎన్నికచేయకపోయిరి. కొద్దిమంది శిష్యులు తప్ప అందరు ఆయనను తృణీకరించిరి. మానవులను సృజించిన సృష్టికర్త మానవులు నివసించు భూమి మీదకు రాగా మానవులచే

తృణీకరించబడి, చంపబడ్డాడు. లూకా 4:28-29లో సమాజ మందరములో ఉన్నవారందరు ఆ మాటలు విని ఆగ్రహముతో నిండుకొని, లేచి ఆయనను పట్టణములో నుండి వెళ్ళగొట్టి, ఆయనను తలక్రిందుగా పడద్రోయవలెనని తమ పట్టణము కట్టబడిన కొండపేటు వరకు ఆయనను తీసికొని పోయిరి. ఆయన వారి మధ్య నుండి దాటి మార్గమున వెళ్ళిపోయెను అని వ్రాయబడినది.

**4-6వ. మెస్సియా శ్రమలకు మరణమునకు కారణములు (Sufferings):-**

4వ. యేసు మన రోగములు - దుఃఖములు భరించుట:- నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను, మన వ్యసనములను వహించెను, ఆ దినములలో ఆయన కుష్ఠ రోగులను స్వస్థపరచాడు, ఈ దినములలోన స్వస్థపరచుచున్నాడు. 2 కొరి 5:21లో ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను అని వ్రాయబడినది. అయినను రోగముతో మొత్తబడినవానిగాను, దేవుని వలన బాధింపబడిన వానిగాను, శ్రమనొందిన వానిగాను ఇశ్రాయేలీయులు యేసును ఎంచి కుష్ఠ రోగికి దూరముగానున్నట్లు యేసుకు దూరముగా నుండిరి. (లేవి 13:45-46).

**5వ. మన యతిక్రమ క్రియలు - దోషములు:** మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. 1 పేతు 2:22-24లో క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగు జాడలనుబట్టి నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను. మనము పాపముల విషయమై చనిపోయి నీతివిషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి అని వ్రాయబడినది. ప్రక 5:9లో నీవు వధింపబడిన వాడవై నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడువారిలోను, ప్రతి ప్రజలోను, ప్రతి జనములోను, దేవునికొరకు మనుష్యులను కొన్నావని వ్రాయబడినది. దేవుడు మానవులకై పాప పరిహార్థ బలియగుట అర్థము కాని విషయము. కనుక మానవులు యేసు తన గొప్ప పాపముల నిమిత్తము శిక్ష పొందుచున్నాడని తలంచిరే, కాని మానవులకై శిక్ష పొందెనని తలంచలేదు. మత్త 26:65లో ప్రధాన యాజకుడు తన వస్త్రము చింపుకొని - వీడు దేవదూషణ చేసెను, మనకిక సాక్షులతో పని ఏమి? ఇదిగో ఈ దూషణమాట

మీరు ఇప్పుడు విన్నారు గాదా, మీకేమి తోచుచున్నదని అడిగెను. అందుకు వారు - వీడు మరణమునకు పాత్రుడనిరి

**6వ. మనము దారి తప్పుట :** పౌలు తెలియక అవిశ్వాసము వలన పాపము చేసితిని అని 1 తిమో 1:12లో అన్నాడు. అలాగే మనమందరము గొఱ్ఱెలవలె తెలిసి, తెలియక త్రోవ తప్పిపోతిమి. దారి తప్పిన గొర్రెను కాపరి వెదకి రక్షించినట్లు గొర్రెలవలె తెలిసి, తెలియక త్రోవ తప్పిన మానవులను వెదకి రక్షించాడు.

సామె 16:25లో ఒకని మార్గము వాని దృష్టికి యథార్థముగా కనబడును. అయినను తుదకు అది మరణమునకు చేరునని చెప్పబడినది. అలాగే మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలగించినందున శిక్షకు పాత్రులము. కాని యెహోవా మన పాప దోషములు మన మీద మోపక మన యందరి దోషమును అతని మీద మోపెను. యోహా 1:29 ప్రకారము లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల అయ్యాడు. యేసు కాపరివలె దారితప్పి పాపములో పడిన మనలను వెదకుచు ఈ లోకానికి వచ్చి గొర్రెవలె ప్రాణమిచ్చి రక్షించాడు.

రోమా పత్రికలోని ఈ క్రింది లేఖనములను చూడండి.

రోమా 5:12 ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను. రోమా 4:25 ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను.

రోమా 5:8-10 అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు, ఎట్లనగా మనమింక పాపులమైయుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను.

కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా, శత్రువులమైయుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన పక్షమున, సమాధాన పరచబడినవారమై, ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము.

**7-9వ. మెస్సియా మౌనము, మరణము (Sorrows - silence):-**

**7వ. యేసు అన్యాయపు తీర్పును పొందుట - మౌనముగా ఉండుట:** నిర్గ 5:14వ. ప్రకారము తప్పు చేసిన బానిసను యజమాని బాధించినను అతడు నోరు తెరువకూడదు. కాని ఏ తప్పిదము చేయని యేసు దౌర్జన్యము నొందెను, బాధింపబడినను అతడు నోరు

తెరువలేదు. వధకు తేబడు గొఱ్ఱపిల్లయు బొచ్చుకత్తిరించు వాని యెదుట గొఱ్ఱయు మౌనముగా నుండునట్లు యేసు నోరు తెరువలేదు. పరిపూర్ణుడైన మానవుడుగా యేసు ప్రధాన యాజకుని దగ్గర, పిలాతు దగ్గర వారి తీర్పులో మౌనముగా ఉండెను.

**8వ. మెస్సియా అగు యేసు మరణము:-** ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతిమాట స్థిరపరచబడాలి. కాని అబద్ధసాక్షలే పిలాతు యెదుట వున్నారు. మార్కు 14:56వ. ప్రకారము వారి సాక్షములు కూడా ఒకదాని కొకటి సరిపడలేదు. కనుక అన్యాయపు తీర్పు నొందినవాడై అతడు కొనిపోబడెను. జనుల యతిక్రమమునుబట్టి మొత్తబడెను. సజీవుల భూమిలో నుండి అతడు కొట్టివేయబడి మరణించాడు. అయినను ఈ సంగతి ఎవరు ఆలోచించలేదు.

**9వ. యేసు సమాధి:** రోమా ప్రభుత్వము క్రీస్తును నేరస్తుడుగా ఎంచి అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమించిరి. కాని దేవుడు ఆయన కొరకు ఒక ధనవంతుని చేత సమాధి ముందుగానే సిద్ధపరచెను. ధనవంతుని యొద్ద అతడు ఉంచబడెను. నిశ్చయముగా అతడు అన్యాయమేమియు చేయలేదు అతని నోట ఏ కపటమును లేదు. పేతురు కూడా తన మొదటి పత్రిక 2:22లో ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదని చెప్పాడు.

**10-12వ. మెస్సియా సంతానము - సంతృప్తి - మహిమ (Satisfaction):-**

10వ. యేసు సంతానము: క్రీస్తును నలుగగొట్టుటకు తండ్రియైన దేవునికి ఇష్టమాయెను, ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. కుమారుడైన క్రీస్తు మానవుల కొరకై తన్ను తానే అపరాధ పరిహారార్థబలి చేశాడు. పరిశుద్ధాత్ముడు ఆ సంగతిని లోకమునకు వివరించి, ఒప్పించి నమ్మిన వారిని కుమారులుగా / దేవుని సంతానముగా చేసాడు. క్రీస్తు దీర్ఘాయుష్మంతుడై తండ్రి ఉద్దేశ్యము సఫలము చేసాడు. ఈ రీతిగా తండ్రి, కుమార, పరిశుద్ధాత్ములు పాపములు క్షమించి ప్రజలను దేవుని కుమారులుగా చేశారు. పేతురు తండ్రియైన దేవుని భవిష్యద్ జ్ఞానమునుబట్టి, ఆత్మవలన పరిశుద్ధత పొందిన వారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తము వలన ప్రోక్షింపబడుటకును మన కొరకు ఏర్పాటు జరిగినదని 1 పేతు 1:1లో వ్రాశాడు.

**11వ. మెస్సియాకు కలిగిన తృప్తి:** 1 తిమో 2:4 ప్రకారము ఆయన, మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు. కనుకనే ఈయన అందరి కొరకు విమోచన క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను. నీతిమంతుడైన క్రీస్తు జనుల దోషములను భరించి తనకున్న అనుభవ జ్ఞానము చేత / తనకు కలిగిన వేదననుబట్టి అనేకులను నిర్దోషులుగా చేసి తన ఇష్టమును నెరవేర్చుకొనినందున తృప్తిచెందాడు.

**12వ. మెస్సియా అగు యేసు మహిమ:** కావున తండ్రియైన దేవుడు గొప్పవారితో నేనతనికి పాలు పంచి పెట్టెదను ఘనులతో కలిసి అతడు కొల్లసొమ్ము విభాగించుకొనును అన్నాడు. ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడై అనేకుల పాపమును భరించాడు. సాతాను మానవులను వారి పాపమునుబట్టి గత కాలములో దోచుకున్నాడు. మానవుల పాపములు భరించి మానవులను విమోచించినందున కొల్లసొమ్ముగా దొరికిన ఈ మానవులను ఘనులైన తండ్రి, పరిశుద్ధాత్ములతో పంచుకున్నాడు. తిరుగుబాటు చేసిన వారిని గూర్చి సిలువలో ప్రారంభించిన విజ్ఞాపన నేటికిని తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండి కొనసాగించుచున్నాడు. ముందుగా పీఠికలో చెప్పబడినట్లు సేవకుడుగా యేసు సిలువలో వివేకముగా ప్రవర్తించినందున ప్రసిద్ధుడై పరలోకముమట్టుకు హెచ్చింపబడి మహా ఘనుడుగా ఎంచబడెను.

<u>ఒక్కొక్క వచనము వారిగా అంశములు. 52:13-15వ. ప్రసిద్ధుడైన సేవకుడు.</u> 53:1వ. మెస్సియా బాహువు బయలుపరచబడుట. 2వ. యేసు పుట్టుట - పెరుగుట. 3వ యేసు ఎన్నిక చేయబడక పోవుట. 4వ. యేసు మన రోగములను - దుఃఖములను భరించుట 5వ. మన యతిక్రమ క్రియలు - దోషములు. 6వ. మనము దారి తప్పుట. 7వ. యేసు అన్యాయపు తీర్పు - మౌనముగా ఉండుట. 8వ. మెస్సియా అగు యేసు మరణము. 9వ. యేసు సమాధి. 10వ యేసు సంతానము. 11వ. మెస్సియాకు కలిగిన తృప్తి. 12వ. మెస్సియా అగు యేసు మహిమ.

<u>రెండు రెండు వచనముల వారిగా అంశములు. 52:13-15వ. ప్రసిద్ధుడైన సేవకుడు.</u>

53:1-2వ. మెస్సియా పుట్టుట - పెరుగుట, 3-4వ. మెస్సియా ఎన్నిక చేయబడకపోవుట - మన రోగములు భరించి వ్యసనాక్రాంతుడగుట. 5-6వ. మానవుల యతిక్రమక్రియలు- దోషములు - దారితప్పుట. 7-8వ. మెస్సియా అన్యాయపు తీర్పు -మౌనము -మరణము. 9-10వ. మెస్సియా సమాధి -సంతానము. 11-12వ మెస్సియా తృప్తి - మహిమ.

<u>మూడు మూడు వచనముల వారిగా అంశములు. 52:13-15వ. ప్రసిద్ధుడైన సేవకుడు.</u>

1-3వ. మెస్సియా తృణీకరించబడిన విమోచకుడు (Savior)

4-6వ. మెస్సియా శ్రమలకు మరణమునకు కారణము(Suffering)

7-9వ. మెస్సియా మౌనము - మరణము (Sorrows - silence)

10-12వ. మెస్సియాకు సంతానము - సంతృప్తి - మహిమ (Satisfaction)

**ఈ అధ్యాయములో పాపమునకు చెప్పబడిన ఇతర పదములు :-** 1) అతిక్రమము, 2) దోషము, 3) త్రోవ తప్పిపోవుట 4) భక్తిహీనత, 5) అపరాధము.

## 54వ. అధ్యాయము (3+2+3+2+3+2+2=17వ)

అంశము:- రక్షకుని వాగ్దానము (ఇశ్రాయేలీయులకు - సంఘమునకు)

**1-3వ. సంఘ విస్తరణ శిరసత్వమును గూర్చిన వాగ్దానము:-** ఈ అధ్యాయమునందు అక్షరార్థముగా ఇశ్రాయేలీయుల ఆశీర్వాదమును గూర్చిన వాగ్దానము. ఆత్మీయముగా సంఘ ఆశీర్వాదమును గూర్చిన వాగ్దానము కలదు. స్త్రీలు సంతానము కావలెనని కోరుకొందురు. బబులోను చెరలో నున్నందున ఇశ్రాయేలీయుల సంతానము విస్తరించుట లేదు. ఇప్పుడు దేవుడు వారిని విమోచింతునని వాగ్దానము చేసినందున రాబోవు దినములలో విస్తారముగా పిల్లలు కలుగుదురని చెప్పుచున్నాడు. 2-3వ. నీ గుడారపు స్థలమును విశాలపరచుము. నీ నివాసస్థలముల తెరలు నిరాటంకముగ సాగనిమ్ము, నీ త్రాళ్ళను పొడుగుచేయుము నీ మేకులను దిగగొట్టుము. కుడివైపునకు ఎడమవైపునకు నీవు వ్యాపించెదవు. నీ సంతానము అన్యజనుల దేశమును స్వాధీనపరచుకొనును. పాడైన పట్టణములను నివాస స్థలములుగా చేయును అని సెలవిచ్చుచున్నాడు. ఈ ప్రవచన నెరవేర్పుగా అక్షరార్థముగా నేడు ఇశ్రాయేలీయులు ప్రపంచమంతటవున్న 240 దేశములలో వున్నారు. ఆత్మీయముగా సంఘము ప్రపంచమంతా విస్తరించినది. వేయి ఏండ్ల పాలనలోను ఈలాగు జరుగును. జయ కీర్తన నెత్తి ఆనందపడుమని చెప్పుచున్నాడు.

**4-5వ. సృష్టికర్త భర్తగా నుందునన్న వాగ్దానము:-** భయపడకుము సిగ్గు, అవమానము, లజ్జపడనక్కరలేదని చెప్పుచున్నాడు. నిన్ను సృష్టించినవాడు నీకు భర్తయై యున్నాడు. ఇశ్రాయేలీయులకు ఆయన భర్త. సంఘమునకును ఆయనే భర్త. సైన్యముల కధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు. ఆయనకు పేరులు గమనించండి. 1) సృష్టికర్త. 2) భర్త 3) సైన్యములకధిపతి 4) యెహోవా 5) పరిశుద్ధ దేవుడు 6) విమోచకుడు 7) సర్వలోకమునకు దేవుడు, 6వ. విడువబడి దుఃఖాక్రాంతురాలైన భార్యను పురుషుడు రప్పించినట్లును తృణీకరింపబడిన యౌవనపు భార్యను పురుషుడు రప్పించినట్లును యెహోవా ఇశ్రాయేలును / లోకపు ప్రజలను రక్షణ కొరకు పిలుచుచున్నాడు.

**6-8వ. నిత్య నిబంధనను గూర్చిన వాగ్దానము:-** 7వ. నిమిష మాత్రము నేను నిన్ను విసర్జించితిని గొప్ప వాత్సల్యముతో నిన్ను సమకూర్చెదము. కీర్త 30:5లో ఆయన కోపము నిమిష మాత్రముండును ఆయన దయ ఆయుష్కాలమంతయు నిలుచునని చెప్పబడినది. 8వ. మహోద్రేకము కలిగి నిమిషమాత్రము నీకు విముఖుడైనను, నిత్యమైన కృపతో వాత్సల్యము చూపుదును. అని విమోచకుడగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. సాయంకాలమున ఏడ్పు వచ్చి, రాత్రి యుండినను ఉదయమున దేవుడు సంతోషమిచ్చును.

**9-10వ. కృపను గూర్చిన వాగ్దానము:**-9వ నోవహు కాలమున జలప్రళయమును గూర్చి దేవుడు వాగ్దానము చేశాడు. జలములు భూమిమీదికి ఇకను పొర్లుచురావని నోవహు కాలమున ఒట్టుపెట్టుకొనినట్లు ఇకమీదట ఇశ్రాయేలును కోపముతో గద్దింపనని దేవుడు సెలవిచ్చుచున్నాడు. 10వ. పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను దేవుని కృప, సమాధాన విషయమైన నిబంధన తొలగిపోక దేవుడు జాలిపడుదునని సెలవిచ్చుచున్నాడు.

**11-13వ. యెరూషలేము కట్టబడునను వాగ్దానము:**- 11-12వ. ప్రయాసపడి గాలి వానచేతకొట్టబడి ఆదరణలేక యున్నదానా, నీలములతో పునాదులను వేసి నీలాంజనములతో కట్టడమును కట్టుదునని, మాణిక్యమణులతో కోటకొమ్ములను సూర్యకాంతులతో గుమ్మములను కట్టుదునని, ప్రశస్తమైన రత్నములతో సరిహద్దులు ఏర్పరచుదునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. 13వ. నీ పిల్లలందరు యెహోవాచేత ఉపదేశము నొందుదురు. నీ పిల్లలకు అధిక విశ్రాంతి కలుగును. ఈ ప్రవచన నెరవేర్పుగా ప్రస్తుతము పరలోకమందు నూతన యెరూషలేము కట్టబడి నూతన భూమి మీదకు దిగి వచ్చును. ఇశ్రాయేలీయులు వేయి ఏండ్ల పాలనలోను, నిత్యకాలములోను ఉపదేశమునొంది అధిక విశ్రాంతి పొందుదురు.

**14-15, 16-17వ. భద్రత గూర్చిన వాగ్దానము:**- 14-15వ. నీవు నీతిగలదానవై స్థాపింపబడుదువు. నీవు భయపడనక్కరలేదు, బాధించువారు వారి దగ్గరకురాక దూరముగా ఉందురు. జనులు గుంపు కూడినను నీకు విరోధముగా గుంపు కూడక నీ పక్షపు వారగుదురని దేవుడు చెప్పుచున్నాడు. 16-17వ. నిప్పులూది తగినట్టుగా పనిముట్టు చేయు కమ్మరిని, పాడుచేయుపనివానిని సృజించువాడు దేవుడే. ఇశ్రాయేలుకు విరోధముగా రూపింపబడిన యే అయుధమును వర్ధిల్లదు. యెహోవా యొక్క సేవకుల నీతి దేవుని వలన స్వాస్థ్యముగా కలుగునని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

## 55వ. అధ్యాయము (5+2+4+2=13వ)

**అంశము:- రక్షకుని ఆహ్వానము**

**1-5వ. శాశ్వత కృపకు ఆహ్వానము. (1వ):**- 1-2వ. 1) దప్పిగొనినవారలారా, నీళ్ల యొద్దకు రండి (జీవజలము). 2) రూకలు లేనివారలారా, మీరు వచ్చి కొని భోజనము చేయుడి (జీవిత సుఖము). 3) రండి రూకలు లేకపోయినను ఏమియు నియ్యకయే ద్రాక్షారసమును పాలను కొనుడి. (నిత్య జీవము - జీవాహారము). మానవుడు ఆత్మలో దప్పిక / దరిద్రత కలిగియున్నాడు. తన వద్ద వున్న రూకలను ఆహారము కాని దాని

కొరకు/ సంతుష్టి కలుగజేయని దాని కొరకు వ్యయపరచుచున్నాడు. ఆత్మలో సుఖము లేనివాడుగా నున్నాడు. ఆత్మీయ దప్పిగల మానవులను నీరు అను దేవుని వాక్యము దగ్గరకు రమ్మని ఆహ్వానించుచున్నాడు. ఏమి ఇవ్వకయే ద్రాక్షారసమును కొనసమంటున్నాడు. ఏమి ఇవ్వకుండా దేనిని లోకములో కొనలేము. ద్రాక్షరసమగు క్రీస్తు రక్తమును మన కొరకు సిలువలో క్రీస్తు కార్చినందున మనమేమి చేయక పోయినను / ఇవ్వక పోయినను తన రక్తముతో క్రీస్తు మన పాపములను కడిగి రక్షించును. రక్షించిన తరువాత వాక్యమను పాలను ఉచితముగా ఇచ్చి మనలను ఆత్మీయముగా పెంచును. దేవుని మాట జాగ్రత్తగా ఆలకించిన మన ప్రాణము సారమైన దానియందు సుఖించును. 3-4వ. 4) నా యొద్దకు వచ్చి చెవియొగ్గిడి. (జీవపు మాటలు). మీరు వినిన యెడల బ్రదుకుదురు. నేను మీతో నిత్యనిబంధన చేసెదను. దావీదుకు చూపిన శాశ్వత కృపను మీకు చూపుదునని ఆహ్వానించుచున్నాడు. 5వ. మనలను ఎరుగని జనులు యెహోవా మనలను మహిమపరచగా చూచి ఇశ్రాయేలు పరిశుద్ధ దేవునిబట్టి పరుగెత్తి వచ్చెదరు. కనుక మన మెరుగని జనులను మనము పిలువగలము.

**6-7వ.** ఆహ్వాన వివరము:- 6వ. 1) యెహోవా దొరుకు కాలమునందు ఆయనను <u>వెదకాలి.</u> 2) ఆయన సమీపములో ఉండగా ఆయనను <u>వేడుకొనాలి.</u>

7వ. 3) దేవుని యొద్దకు వచ్చిన తరువాత భక్తిహీనులు తమ మార్గమును <u>విడువవలెను.</u> 4) తమ తలంపులను <u>మానవలెను.</u> రక్షణకై ద్వారము మూయబడిన తరువాత వెదికి లాభము లేదు. యెహోవా వైపు తిరిగిన యెడల ఆయన మనయందు జాలిపడును. దేవుని వైపు తిరిగిన యెడల ఆయన మనలను బహుగా క్షమించును.

**8-11వ.** రక్షకుని తలంపు **(8వ).** - మార్గము **(9వ).** - మాటలు **(10వ):-** 8-9వ. నా తలంపులు మీ తలంపుల వంటివి కావు. మీ త్రోవలు నా త్రోవల వంటివి కావు. ఇదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికి పైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గములకంటే నా మార్గములు, మీ తలంపుల కంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి.

ఈ క్రింది వచనాలు గమనించండి.

కీర్త 139:11-12వ. - దేవా, నీ తలంపులు నా కెంత ప్రియమైనవి వాటి మొత్తమెంత గొప్పది. వాటిని లెక్కించెదననుకొంటినా అవి యిసుకకంటెను లెక్కకు ఎక్కువై యున్నవి. కీర్త 40:5వ. -- యెహోవా నా దేవా, నీవు మా యెడల జరిగించిన ఆశ్చర్య క్రియలును మాయెడల నీకున్న తలంపులును బహు విస్తారములు. వాటిని వివరించి చెప్పెదనను కొంటినా అవి లెక్కకు మించి యున్నవి, నీకు సాటియైన వాడొకడును లేడు. సాటిలేని దేవుడు మనపట్ల ఎంతో గొప్ప తలంపులు కలిగియున్నాడు.

10-11వ. వర్షమును హిమమును ఆకాశము నుండి వచ్చి అక్కడికి ఏలాగు మరలక భూమిని తడిపి విత్తువానికి విత్తనమును భుజించువానికి ఆహారమును కలుగుటకై అది చిగిర్చి వర్ధిల్లునట్లు చేయునో ఆలాగే దేవుని నోటనుండి వచ్చు మాటలు నిష్ఫలముగా మరలక అనుకూలమైన దాని నెరవేర్చి కార్యమును సఫలము చేయును, మసలను చిగిర్చి వర్ధిల్లునట్లు చేయును.

**12-13వ. రక్షకుడిచ్చు ఆశీర్వాదము:-** 12వ. సంతోషముగా బయలు వెళ్లుదురు సమాధానము పొంది తోడుకొని పోబడుదురు. ఈ ప్రవచన సమీప నెరవేర్పుగా యూదులు బబులోనుకు సంతోషముగా వెళ్లిరి. అంత్యకాల నెరవేర్పుగా ప్రభువు వచ్చినప్పుడు సంతోషముగా వెళ్లుదురు. మీ యెదుట పర్వతములును మెట్టలును సంగీతనాదము చేయును పొలములోని చెట్లన్నియు చప్పట్లు కొట్టును. యెష 44:23 గమనించండి... ఆకాశములారా, ఉత్సాహధ్వని చేయుడి భూమి, ఆర్భాటము చేయుడి పర్వతములు, అరణ్యము, అందులోని ప్రతి వృక్షము, సంగీతనాదము చేయుడి. యెహోవా యాకోబును విమోచించును. ఆయన ఇశ్రాయేలులో తన్నుతాను మహిమోన్నతునిగా కనుపరచుకొనును. 13వ. ముండ్ల చెట్లకు బదులుగా దేవదారు వృక్షములు మొలుచును దురదగొండి చెట్లకు బదులుగా గొంజివృక్షములు ఎదుగును అది యెహోవాకు ఖ్యాతిగాను ఆయనను కొట్టి వేయబడని నిత్యమైన జ్ఞాపక సూచనగాను ఉండును. యెష 35:1-2-- అరణ్యమును ఎండిన భూమియు సంతోషించును. అడవి ఉల్లసించి కస్తూరి పుష్పమువలె పూయును. అది బహుగా పూయుచు ఉల్లసించును. ఉల్లసించి సంగీతములు పాడును, లెబానోను సౌందర్యము దానికి కలుగును. కర్మెలు షారోనులకున్న సొగసు దానికుండును, అవి యెహోవా మహిమను మన దేవుని తేజస్సును చూచును.

## 56వ. అధ్యాయము (4+4+4=12వ)

### అంశము:- రక్షకుని ఆశీర్వాదము - సోమరులైన ఇశ్రాయేలు కాపరులు

**1-4వ. అన్యులకు ఆశీర్వాదము:-** 1-2వ. యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. నా రక్షణవచ్చుటకు సిద్ధముగా ఉన్నది. నా నీతి వెల్లడియగుటకు సిద్ధముగా ఉన్నది. న్యాయవిధిని అనుసరించుడి. నీతిని అనుసరించి నడుచుకొనుడి. నేను నియమించిన విశ్రాంతి దినమును అపవిత్రపరచకుండ దానిని అనుసరించుచు ఏ కీడు చేయకుండ తన చేతిని బిగబట్టువాడు ధన్యుడు. ఆ ప్రకారము చేసి దాని రూఢిగా గైకొనునరుడు ధన్యుడు. 3-4వ. యెహోవాను హత్తుకొను అన్యుడు నిశ్చయముగా యెహోవా తన జనులలో నుండి నన్ను వెలివేయునని

అనుకొనవద్దు. షండుడు నేను ఎండినచెట్టని అనుకొనవద్దు. నేను నియమించిన విశ్రాంతి దినములను ఆచరించుచు దేవునికిష్టమైన వాటిని కోరుకొనుచు దేవుని నిబంధన నాధారము చేసికొనుచున్నందున యెహోవా వారిని ఆశీర్వదించును. ఎండినచెట్టు నిరీక్షణ లేనివారికి సూచన. ఆలాంటివారైనను దేవుని నిబంధనను ఆచరించిన దేవుడు వారిని ఆశీర్వదించును.

**5-8వ. అన్యులను మరిన్ని ఆశీర్వాదములు:-** 5-6వ. **1)** నా యింటను నా ప్రాకారములో ఒక భాగమును వారికిచ్చెదను. 2) కొడుకులు కూతుళ్లు అని యనిపించుకొనుట కంటె శ్రేష్ఠమైన పేరు వారికి పెట్టుచున్నాను. 3) కొట్టివేయబడని నిత్యమైన పేరు వారికి పెట్టుచున్నాను. 4) విశ్రాంతి దినమును అచరించుచు నిబంధనను ఆధారము చేసికొనుచు యెహోవాకు దాసులై యెహోవా నామమును ప్రేమించి, పరిచర్య చేయవలెనని ఆయన పక్షమున చేరు అన్యులను దేవుడు పరిశుద్ధ పర్వతమునకు తోడుకొని వచ్చును. 7-8వ. 5) ప్రార్థన మందిరములో వారిని ఆనందింపజేయును 6) బలిపీఠము మీద వారర్పించు దహన బలులును దేవుడు అంగీకరించును. 7) తన మందిరము సమస్త జనులకు ప్రార్థన మందిరముగా చేయును.

**9-12వ. సోమరులైన ఇశ్రాయేలు కాపరులు:-** 9-10వ. ఇశ్రాయేలు కాపరులు గ్రుడ్డివారు, వారందరు తెలివిలేనివారు, మూగ కుక్కలు మొరుగలేరు కలవరించుచు పండుకొను నిద్రాసక్తులు. 11-12వ. కాపరులు కుక్కలవలె తిండికి ఆతురపడుచున్నారు. ఎంత తినినను వారికి తృప్తిలేదు. వారందరు తమకిష్టమైన మార్గమున పోవుదురు. ఒకడు తప్పకుండ అందరు స్వప్రయోజనమే విచారించుకొందురు. ద్రాక్షారసము నిండారులగునట్లు త్రాగుదము రండి నేడు జరిగినట్లు రేపు మరి లక్షణముగా జరుగునని చెప్పుచున్నారు. అటువంటివారి విషయము దేవుడు సంతోషించడు.

# 57వ. అధ్యాయము (2+5+6+2+4+2=21వ)

**అంశము:- రక్షణ వివరము - భక్తులు - భక్తిహీనులు, వారి మార్గము, అంతము.**

**1-2వ. నీతిమంతులు కొనిపోబడు విధము:-** 1వ. నీతిమంతులు నశించుట చూచి యెవరును దానిని మనస్సున పెట్టరు. భక్తులైనవారు / నీతిమంతులు తీసికొని పోబడుట, కీడు చూడకుండ దేవుడు వారిని కొనిపోబడుచున్నారని గుర్తించాలి. 2వ. వారు విశ్రాంతిలో ప్రవేశించుచున్నారు తమకు సూటిగానున్న మార్గమున నడచువారు తమ పడకల మీద పరుండి విశ్రమించుచున్నారని గుర్తించాలి.

**3-7వ దుష్టులు జీవించు విధము -వారి పాపములు:-** 4వ. 1) ఎగతాళి చేయువారు, 2) నోరు తెరచి నాలుక చాచువారు 3) తిరుగుబాటు చేయువారు 4) అబద్ధికులు.

5వ. 5) ప్రతిచెట్టు క్రిందను కామము రేపుకొనువారు, 6) లోయలలో రాతిసందులక్రింద పిల్లలను చంపువారు, 6వ. 7) లోయలోని రాళ్లకు పానీయార్పణము చేయువారు, 8) వాటికి నైవేద్యము సర్పించువారు 7వ. 9) ఉన్నతమైన మహాపర్వతముమీద బలి అర్పించుటకు అక్కడికి ఎక్కువారు.

**8-13వ. దుష్టుల మరిన్ని పాపములు:-** 8వ. 10) వ్యభిచారులతో నిబంధన చేసికొనుట, 11) వారి మంచము కనబడిన చోట దాని ప్రేమించుట 10వ. 12) మారుమనస్సును పొంద ఇష్టపడకుండుట. 11వ. 13) కల్లలాడుట 14) దేవుని జ్ఞాపకము చేసికొనక పోవుట, 15) దేవునికి భయపడకుండుట, 12వ. 16) నీతిలేని జీవితము, 17) నిష్ప్రయోజనమగు క్రియలు చేయుచు దేవునికి దూరముగా నున్నారు.

**14-15వ. దుష్టుల దేవుడు - నీతిమంతుల దేవుడు:-** దుష్టుల దేవుడగు విగ్రహము మొఱ్ఱపెట్టునప్పుడు మొరపెట్టు వారిని తప్పించలేవు. ఒకడు ఊపిరి విడిచిన మాత్రమున అవియన్నియు కొట్టుకొనిపోవును. నీతిమంతుల దేవుడు తనను నమ్ముకొను వారిని దేశమును స్వతంత్రించుకొనువారుగా చేయును. వారు పరిశుద్ధ పర్వతమును స్వాధీనపరచుకొందురు. 15వ. నీతిమంతుల దేవుడు మహాఘనుడును, మహోన్నతుడు, పరిశుద్ధుడు, నిత్యనివాసియైనవాడు, మహోన్నతమైన పరిశుద్ధ స్థలములో నివసించువాడు. అయినను వినయము గలవారి ప్రాణమును ఉజ్జీవింప చేయుటకును నలిగిన వారి ప్రాణమును ఉజ్జీవింప జేయుటకును వినయము గలవారి యొద్దను దీనమనస్సు గలవారి యొద్దను నివసించుచున్నాడు. 66:2 చూడండి.

**16-19వ. నీతిమంతులు జీవించు విధము:-** 16-17వ. దేవుడు మానవులతో నిత్యము పోరాడువాడు కాడు. ఎల్లప్పుడును కోపించువాడు కాడు. అలాగుండిన యెడల నరుల జీవాత్మ క్షీణించును. దేవుడు పుట్టించిన నరులు క్షీణించిపోవుదురు. దోషమునుబట్టి దేవుడు ఆగ్రహపడి వారిని కొట్టి, తన ముఖము మరుగు చేసికొని కోపించగా వారు తిరుగబడి తమ కిష్టమైన మార్గమున నడచుచు వచ్చిరి. 18-19వ. దేవుడు వారి ప్రవర్తనను చూచి వారిని స్వస్థపరచును, వారిని నడిపించును, వారిలో దుఃఖించు వారిని ఓదార్చును. వారిలో కృతజ్ఞతాబుద్ధి పుట్టించుచు దూరస్థులకును సమీపస్థులకును సమాధానమిచ్చి దేవుడు వారిని స్వస్థపరచుదునని సెలవిచ్చుచున్నాడు.

**20-21వ. దుష్టులు కొనిపోబడు విధము:-** భక్తిహీనులు కదలుచున్న సముద్రము వంటి వారు అది నిమ్మళింపనట్లు దుష్టులకు ఈ లోకములో నెమ్మది యుండదని చనిపోయిన

తరువాత కూడా నరకములోని అగ్ని గుండములో నెమ్మది యుండదని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

## 58వ. అధ్యాయము (2+3+3+3+3=14వ)

అంశము:- ప్రీతికరమైన ఉపవాసము

**1-2వ వేషధారణతో కూడిన ఉపవాస ప్రార్థన:-** ఇశ్రాయేలీయులు తిరుగుబాటును పాపములను చేయుచు, నీతిని అనుసరించువారైనట్లు నటించుచు అనుదినము దేవుని యొద్ద ప్రార్థన చేయుచు దేవుని మార్గములను తెలిసికొన ఇచ్ఛకనుపరచుచున్నారు. కనుక వారి పాపమునుబట్టి దేవుడు వారి ప్రార్థనకు జవాబిచ్చుట లేదు.

**3-5వ. ప్రీతికరము కాని ఉపవాస ప్రార్థన:-** మేము ఉపవాసముండి మా ప్రాణములను ఆయాసపరచుకొనగా నీవెందుకు లక్ష్యపెట్టవు? అని ఇశ్రాయేలీయులు దేవుని అడుగగా 1) ఉపవాస దినమున వ్యాపారము చేయుట, 2) పనివారిచేత కఠినమైన పని చేయించుట, 3) కలహములు, వివాదములు, అన్యాయము చేయుచు, గుద్దులాడుచు ఉపవాసముండుట, 4) కంఠధ్వని పరమున వినబడునట్లుగా కాక వట్టిగా ఉపవాసముండుట మొదలగునవి తనకు అనుకూలము కాని ఉపవాసములని దేవుడు చెప్పుచున్నాడు.

**6-8వ. ప్రీతికరమైన ఉపవాస ప్రార్థన (బీదలకు సహాయము చేయుట):-** దేవునికిష్టమైన ఉపవాసము ఏదనగా 1) దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుట 2) కాడిమాను మోకులు తీయుట, 3) బాధింపబడిన వారిని విడిపించి, ప్రతి కాడిని విరుగగొట్టుట, 4) ఆకలి గొనిన వారికి ఆహారము పెట్టుట 5) రక్త సంబంధికి ముఖము తప్పింపకుండుట, 6) దిక్కుమాలిక బీదలను యింట చేర్చుకొనుట 7) వస్త్రహీనుడు కనబడినప్పుడు వానికి వస్త్రములిచ్చుట మొదలగునవి. ఆలాగున చేసిన యెడల మనకు కలుగు మేలులు: 1) మన వెలుగు ఉదయించుట 2) స్వస్థత మనకు శీఘ్రముగా లభించుట 3) నీతిమన ముందర నడచుట 4) యెహోవా మహిమ మన వెనుకటి భాగమున కావలి కాయుట

**9-11వ. జవాబు వచ్చు ప్రార్థన (ఇతరుల పట్ల దయచూపుట):-** 9-10వ. 1) ఇతరులను బాధించుటయు, 2) వ్రేలుపెట్టి చూపి తిరస్కరించుటయు, 3) చెడ్డదానిని బట్టి మాటలాడుటయు మాని 4) ఆశించిన దానిని ఆకలి గొనినవానికిచ్చి 5) శ్రమపడిన వానిని తృప్తి పరచి మనము ప్రార్థించిన యెడల ఆయన నేనున్నానని ఉత్తరమిచ్చును. అంతేకాక 1)చీకటిలో మన వెలుగు ప్రకాశించును, 2) అంధకారము మనకు మధ్యాహ్నమువలె నుండును, 3) యెహోవా మనలను నిత్యము నడిపించును 4)క్షామ కాలమున ఆయన

మనలను తృప్తిపరచును, 5) మన యెముకలను బలపరచును 6) మనము నీరు కట్టిన తోటవలె నుందుము 7) ఎప్పుడును ఉబుకుచుండు నీటి ఊటవలె ఉండెదము.

**12-14వ. విశ్రాంతి దినమును ఘనపరచాలి:-** విశ్రాంతి దినమున వ్యాపారము చేయకుండ దేవునికి ప్రతిష్ఠితమైనదినమని ఊరకుండాలి. విశ్రాంతి దినము మనోహరమైనదని, యెహోవాకు ప్రతిష్ఠితదినమని, ఘనమైనదని, అనుకొని దానిని ఘనముగా ఆచరించాలి. మనకిష్టమైన పనులు చేయకయు, వ్యాపారము చేయకయు, లోకవార్తలు చెప్పుకొనకయు ఉండాలి. విశ్వాసులు ఆదివారమున అలాగుండుట సమంజసము. అప్పుడు మనము 1) యెహోవా యందు మనము ఆనందించెదము, 2) ఆయన మనలను దేశము యొక్క ఉన్నత స్థలములమీదికెక్కించును, 3) తండ్రియైన యాకోబు స్వాస్థ్యమును మన యనుభవములో ఉంచును. 4) పూర్వకాలము నుండి, అనేక తరముల క్రిందట పాడైపోయిన మనకు సంబంధించిన వాటి పునాదులు మరల కట్టబడును. 5) విరుగబడిన దానిని బాగుచేయువాడనియు దేశములో నివసించునట్లుగా త్రోవలు సిద్ధపరచువాడనియు మనకు పేరు పెట్టబడును.

## 59వ. అధ్యాయము (7+7+7=21వ)

అంశము:- పాపమునకు పశ్చాత్తాపము - పరిహరించిన క్రీస్తు

**1-7వ. ఇశ్రాయేలీయుల పాపము (2వ):-** కీర్త 66:18లో నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును. రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు, విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. కాని వారికిని దేవునికిని అడ్డముగా నిలిచిన దోషములు - ఆయన ముఖమును మరుగుపరచిన ఇశ్రాయేలు వారి పాపములు ఇక్కడ చెప్పబడ్డాయి. 1) మీ చేతులు రక్తముచేత నిండియున్నవి. 2) మీ వ్రేళ్ళు దోషము చేతను అపవిత్రపరచబడి యున్నవి. 3) ఈ పెదవులు అబద్ధములాడుచున్నవి. 4) మీ నాలుక కీడునుబట్టి మాటలాడుచున్నది, 5) నీతినిబట్టి యెవడును సాక్ష్యము పలుకడు, 6) సత్యమునుబట్టి యెవడును వ్యాజ్యెమాడడు, 7) అందరు వ్యర్థమైనదాని నమ్ముకొని మోసపు మాటలు పలుకుదురు, 8) చెడుగును గర్భము ధరించి పాపమును కందురు, 9) మిడునాగుల గుడ్లను పొదుగుదురు, 10) సాలెపురుగు వల నేయుదురు 11) వారి పట్టు బట్ట నేయుటకు పనికి రాదు. వారు నేసినది ధరించుకొనుటకు ఎవనికిని వినియోగపడదు, 12) వారి క్రియలు పాప క్రియలే. వారు బలాత్కారము చేయువారే. 13) వారి కాళ్ళు పాపము చేయ

పరుగెత్తుచున్నవి. 14) నిరపరాధులను చంపుటకు అవి త్వరపడును, 15) వారి తలంపులు పాపహేతుకమైన తలంపులు, 15) పాడును నాశనమును వారి త్రోవలలో ఉన్నవి, 16) వారి నడవడులలో న్యాయము కనబడదు, 17) వారు తమ కొరకు వంకర త్రోవలు కల్పించుకొనుచున్నారు. కనుకనే ఇశ్రాయేలీయుల పాప ఫలితముగా వారు శాంతి లేక యున్నారు. రోమా 3:15-17లో ఇవి లోకులందరి పాపములుగా చెప్పబడ్డాయి. కనుక దేవుని ప్రజలగు ఇశ్రాయేలీయులు అన్యులవలె పాపము చేయుచున్నారు.

**8-14వ. ఇశ్రాయేలీయుల పశ్చాత్తాపము - ప్రార్థన (12వ):-** 8-10వ. ముందుగా పాపమును గుర్తించి పాశ్చాత్తాపపడుట:- న్యాయము, నీతి మమ్మును కలిసికొనుట లేదు. వెలుగు కొరకు కనిపెట్టుకొనుచున్నను, చీకటియే ప్రాప్తించును. ప్రకాశము కొరకు ఎదురు చూచుచున్నాము, గాని అంధకారములోనే నడుచుచున్నాము. గ్రుడ్డివారివలె, కన్నులు లేని వారివలె తడవులాడుచు మధ్యాహ్నే కాలమున కాలుజారి పడుచున్నాము. బాగుగ బ్రతుకుచున్న వారిలో నుండియు చచ్చినవారివలె ఉన్నామని గుర్తించిరి.

**11-13వ. ప్రార్థించుట:** మేమందరము ఎలుగుబంట్లవలె బొబ్బరించుచున్నాము. గువ్వల వలె దుఃఖరవము చేయుచున్నాము. న్యాయము కొరకు కాచుకొనుచున్నాము. అది లభించుట లేదు, రక్షణ కొరకు కాచుకొనుచున్నాము గాని అది మాకు దూరముగా ఉన్నది. మేము చేసిన తిరుగుబాటు క్రియలు, మా దోషములు, మాకు తెలిసే యున్నవి. తిరుగుబాటు చేయుటయు, యెహోవాను విసర్జించుటయు, మా దేవుని వెంబడింపక వెనుక దీయుట, బాధకరమైన మాటలు వచించుట, హృదయమున యోచించుకొని అసత్యపు మాటలు పలుకుట అవిధేయత చూపుట ఇవియే మావలన జరుగు పాపములని ఒప్పుకొనిరి.

**14వ. యెహోవా చూచుట:** న్యాయమునకు ఆటంకము కలుగుట నీతి సత్యములు లేక పోవుట దేవుడు చూచాడు. చెడుతనము విసర్జించువాడు దోచబడుచున్నాడు. న్యాయము జరుగక పోవుట యెహోవా చూచెను.

**15-21వ. పాపమునకు పరిహారము:-** విమోచకుడైన దేవుడు 15-18వ.: పాపమును పరిహరించు రక్షకుడు, మధ్యవర్తి లేకుండుట ఆయన చూచెను. కాబట్టి ఆయన బాహువు ఆయనక సహాయము చేయగా, ఆయన మొదటి రాకడలో రక్తమాంసములుగల బాహువును ఆ బాహువుకు నీతిని కవచముగాను, రక్షణను తలమీద శిరస్త్రాణముగాను, ధరించుకొని ఈ లోకానికి వచ్చి పాపమును పరిహరించాడు. రెండవ రాకడలో ప్రతిదండనను వస్త్రముగా వేసికొని వచ్చుట అనగా మహా శ్రమలకాల చివరలో శత్రువులకు ప్రతిదండన చేసి సంహరించును. మొదటి రాకడలో లోకరక్షకుడుగా వచ్చుటను రెండవ రాకడలో ఇశ్రాయేలు విమోచకుడుగా వచ్చుటను ఈ ప్రవచనము సూచించును. 19-21వ. సీయోను నొద్దకు,

యాకోబులో తిరుగుబాటు చేయుటమాని మళ్లుకొనిన వారియొద్దకు విమోచకుడు వచ్చును. రెండవ రాకడలో విమోచకుడు వచ్చి, వారందరితో శాశ్వత కాలము నిలుచు నిబంధన చేయును.

# 60వ. అధ్యాయము (6+6+6+4=22వ)

అంశము:- క్రీస్తు వేయి ఏండ్ల రాజ్య మహిమ

**1-6వ. సీయోను పట్టణ మహిమ- సీయోనుకు కుమారులు వచ్చుట - ఆశీర్వదించబడుట:-**

1-2వ. సీయోను పట్టణ మహిమ: చీకటి తరువాత వెలుగు వచ్చినట్లు శ్రమలు, మహాశ్రమల తరువాత ఇశ్రాయేలీయులు యెష 58:8-10, 59:9లో పశ్చాత్తాపపడినందున ప్రభువు రెండవ రాకడలో భూమి మీదికి దిగివచ్చి దేశమును వెలుగుమయము చేయును. 3-4వ. సీయోనుకు కుమారులు వచ్చుట: ఇశ్రాయేలు కుమారులు దూర దేశముల నుండి కుమార్తెలను చంకనెత్తుకొని వచ్చెదరు. నీవు చూచి ప్రకాశింతువు, నీ గుండె కొట్టుకొనుచు ఉప్పొంగును. ఇది వేయి ఏడ్ల పాలనలో జరుగును.

5-6వ. ఆశీర్వదించబడుట: జనముల తమ ఐశ్వర్యము ఇశ్రాయేలు దేశమునకు తెచ్చెదరు. ప్రభువు మొదటి రాకడలో తూర్పుదేశపు జ్ఞానులు బంగారు ధూపద్రవ్యములు తెచ్చినట్లు మిద్యానీయులు షేబ నుండి బంగారమును ధూప ద్రవ్యమును తీసికొనివచ్చి యెహోవా స్తోత్రములను ప్రకటించెదరు.

**7-12వ. అన్యులు ఆహారానికి, బలికి తమ మందల నిచ్చుట - అన్యులు పట్టణము కట్టి సేవించుట:-** 7-9వ. అన్యులు ఆహారానికి, బలికి తమ మందల నిచ్చుట: కేదారు గొఱ్ఱ మందలన్నియు, నెబాయోతు పొట్టేళ్ళును అన్యులు తీసికొనిరాగా దేవుని బలిపీటము మీద పరిచర్యకు అవి ఉపయోగములగును. మత్త 21:13 నా మందిరము ప్రార్థన మందిరమనబడును అని వ్రాయబడి యున్నది. అయితే మీరు దానిని దొంగల గుహగా చేసెడివారనెను. మందిరము మీద ప్రభువు కలిగి వున్న ఆసక్తిని బట్టి మందిరమును దేవుడు శృంగారించును. మేఘమువలెను, ఎగయు గువ్వలవలెను గూళ్లకు ఎగసివచ్చు పక్షులవలె ఇశ్రాయేలీయులు తమ దేశమునకు తిరిగి వచ్చుట, విమానములపై వారు తమ దేశమునకు తిరిగి వచ్చుటను సూచించును. దేవుడైన యెహోవా తన నామమును బట్టి ఇశ్రాయేలును శృంగారించినందున దేవుని నామమునుబట్టి ఇశ్రాయేలీయులకు దూరమునుండి తమ వెండి బంగారములను తీసికొని వచ్చుటకు ద్వీపములు, ఓడలు సహకరించుచున్నవి. 10-12వ. అన్యులు పట్టణము కట్టి సేవించుట: దేవుడు ముందుగా

కోపపడి ఇశ్రాయేలును కొట్టెను, కాని ఇప్పుడు అన్యులచే ప్రాకారములను కట్టించును. వారి రాజులు ఉపచారము చేయుదురు. ఇశ్రాయేలు యొద్దకు జనముల భాగ్యము తేబడునట్లు వారి ద్వారములు రాత్రింబగళ్లు వేయబడక నిత్యము తెరువబడి యుండును. ఇశ్రాయేలును సేవింపనొల్లని ఏ జనమైనను రాజ్యమైనను నిలువక, నిర్మూలము చేయబడును. ఈ ప్రవచన నెరవేర్పును వేయి ఏండ్ల కాలములో చూతుము.

**13-18వ. పరిశుద్ధ ఆలయ మహిమ - పట్టణ మహిమ (13-15వ) - దేశ మహిమ (16-18):-** 13-15వ. ఆలయ మహిమ: పరిశుద్ధాలయపు అలంకారము నిమిత్తమై లెబానోను శ్రేష్ఠమైన దేవదారు వృక్షములును, సరళ వృక్షములును అనగా యూదులు, గొంజిచెట్లు అనగా అన్యులు అందరు కలసి వేయి ఏండ్లపాలనలో మందిరమునకు వత్తురు.

పట్టణ మహిమ: యెహోవా పట్టణమనియు ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుని సీయోననియు క్రొత్త పేరుపెట్టబడి, శాశ్వత శోభాతిశయముగాను బహుతరములకు సంతోషకారణముగాను చేయబడును.

**16-18వ. దేశ మహిమ:** దేశములో బలాత్కారమను మాట వినబడకుండ, దేశ సరిహద్దులలో పాడు అను మాట గాని, నాశనము అను మాటగాని వినబడకుండ రక్షణను ప్రాకారముగాను, ప్రఖ్యాతిని గుమ్మములుగాను కలిగి ఉండును.

**19-22వ. రక్షకుని మహిమ:** సూర్యుని ప్రకాశము కాని, చంద్రుని ప్రకాశము అవసరముండదు. యెహోవా అనబడిన యేసు ఆ పట్టణమునకు నిత్యమైన వెలుగుగా నుండును. దేవుడే ఈ పట్టణమునకు అలంకారముగా ఉండును.

వేయి ఏండ్ల కాలములోను శాశ్వతపాలనలోను ఇశ్రాయేలుకు కలుగు ఆశీర్వాదములు:-

13వ. 1) దేవాలయము సుందరముగా నుండును, 14-15వ. 2) అన్యులు ఇశ్రాయేలును ఘనపరచుదురు, 16-17వ. 3) దేశములో సమృద్ధి ఉండును, 18వ. 4) దేశము శాంతితో నిండి యుండును. 19-20వ 5) రాత్రి, పగలు ప్రభువగు యెహోవాయే వెలుగిచ్చును, 21వ. 6) నీతి పాలన చేయును, 22వ. 7) జన సంఖ్య పెరుగును.

## 61వ. అధ్యాయము (3+3+3+2=11వ)

అంశము:- విమోచకుని రెండు రాకడలు

**1-3వ. మెస్సియా మొదటి రాకడ, రెండు రాకడలలో చేయు కార్యములు:**

**1వ. మొదటి రాకడ:** ప్రభువగు యెహోవా ఆత్మ యేసు మీదికి వచ్చియున్నది. యెహోవా ఆయనను రాజుగా, యాజకుడుగా కీర్త 45:6,7,110:4లో అభిషేకించిన కారణములు.

1) దీనులకు సువార్తమానము ప్రకటించుటకు, 2) నలిగిన హృదయముగలవారిని దృఢపరచుటకు, 3) చెరలో నున్నవారికి విడుదలనిచ్చుటకు 4) బంధింపబడిన వారికి విముక్తిని ప్రకటించుటకును మొదటి రాకడలో ప్రభువు వచ్చాడు. హితవత్సరము అనగా రక్షణ వార్త మాత్రమే కాక దేవుని ప్రతిదండన దినము అనగా తీర్పు తీర్చు దినమును కూడా ప్రకటించాడు.

**2-3వ. రెండవ రాకడ :** యేసు రెండవ రాకడలో శత్రువుల మీద ప్రతిదండన దినము యొక్క నెరవేర్పును చూతుము (వివరములు ప్రక 19:20-21లో కలవు.)

రెండవ రాకడలలో చేయు కార్యములు: 5) దుఃఖాక్రాంతులందరిని ఓదార్చుటకును, 6) దుఃఖించువారికి ఉల్లాసవస్త్రములు ధరివంజేయుటకును, 7) బూడిదెకు ప్రతిగా పూదండను, 8) దుఃఖమునకు ప్రతిగా ఆనంద తైలమును, 9) భారభరితమైన ఆత్మకు ప్రతిగా స్తుతి వస్త్రమును వారికిచ్చుటకును, 10) ప్రతిదండన దినమున క్రీస్తును ఎరుగని వారికి ప్రతిదండన చేయుటకు తండ్రి ఆయనను రెండవ రాకడలో పంపును.

**4-6వ. యెరూషలేమును గూర్చిన వాగ్దానము:-** చాలా కాలమునుండి పాడుగా నున్న స్థలములు, పూర్వమున పాడైన స్థలములు, పాడైన పట్టణములను నూతనముగా కట్టబడి స్థాపించబడును. తరములనుండి శిథిలములైయున్న పురములు బాగుచేయుబడునను వాగ్దానము రెండవరాకడలో వేయిఏండ్ల పాలనలో ముఖ్యముగా ఇశ్రాయేలు దేశములో నెరవేరును. అన్యులు నిలువబడి ఇశ్రాయేలీయుల మందలను మేపెదరు. ఇశ్రాయేలీయులు ఆశీర్వదింపబడగా ఇతరులు ద్రాక్షతోట కాపరులుగాను ఉందురు.

**7-9వ. యెహోవా ఇచ్చు నిత్య ఆశీర్వాదము:-** ఇశ్రాయేలీయులు అవమానమునకు ప్రతిగా రెట్టింపు ఘనత నొందుదురు. రెట్టింపు జ్యేష్ఠ పుత్రునికి ఇవ్వబడును. నిర్గ 4:22లో ఇశ్రాయేలు నా కుమారుడు, నా జ్యేష్ఠ పుత్రుడు అని దేవుడు పలికిని మాట నెరవేర్చును. యోబు కూడా తాను శ్రమలు పొందిన తరువాత రెండంతల ఆశీర్వాదము పొందెను. (యెహోవా యోబును మొదట ఆశీర్వదించినంతకంటె మరి అధికముగా ఆశీర్వదించెను. అతనికి పదునాలుగువేల గొర్రెలను, ఆరువేల ఒంటెలును వెయ్యి జతల యెడ్లును వెయ్యి ఆడుగాడిదలును కలిగెను. అతనికి ఏడుగురు కుమారులు ముగ్గురు కుమార్తెలు కలిగిరి, యోబు 42:12-13). నిందకు ప్రతిగా తాము పొందిన భాగముననుభవించి వారు సంతోషింతురు. వారు తమ దేశములో రెట్టింపు భాగమునకు కర్తలగుదురు. నిత్యానందము వారికి కలుగును. జనముల మధ్య వారి సంతానము ప్రసిద్ధి నొందును. వారు యెహోవా ఆశీర్వదించిన జనమని వారిని చూచిన వారందరు వేయి ఏండ్ల పాలనలో ఒప్పుకొందురు.

**10-11వ. పెండ్లి కుమారుడు, కుమార్తె, ముగింపు:-** శృంగారమైన పాగా ధరించుకొనిన పెండ్లికుమారునిరీతిగాను ఆభరణములతో అలంకరించుకొనిన పెండ్లి కుమార్తెరీతిగాను

ఆయన రక్షణ వస్త్రములను నాకు ధరింపజేసియున్నాడు. నీతి అను పైబట్టను నాకు ధరింపజేసియున్నాడు. కాగా యెహోవానుబట్టి మహానందముతో నేను ఆనందిచుచున్నాను. నా దేవుని బట్టి నా ఆత్మ ఉల్లసించుచున్నది. రక్షణ వస్త్రములను, నీతి అను పైబట్టను నాకు ధరింపజేయుట అనగా అయనను ప్రస్తుత కాలములో నమ్మిన వారిని రక్షించి నీతిమంతులుగా తీర్చి గొర్రెపిల్ల వివాహములో తన భార్యగా చేసికొనుటయే. ఇశ్రాయేలీయులపట్ల దీని నెరవేర్పును వేయిఏండ్లపాలనలో చూతుము.

## 62వ. అధ్యాయము (1+4+2+2+3=12వ)

### యెరూషలేముకు మహిమ నిచ్చు విమోచన క్రియ

### అంశము:- యెరూషలేము మహిమ గల విమోచన

**1వ. యెరూషలేము మహిమ:-** సీయోను నీతి సూర్యకాంతివలె కనబడువరకు యెరూషలేము పక్షమందు మౌనముగా ఉండక, సీయోను మహిమను చూపిస్తాను అంటున్నాడు.

**2-5వ.** క్రొత్త పేరుల **వివరము:** యెహోవా నియమింపబోవు క్రొత్తపేరు నీకు పెట్టబడును అని చెప్పుచున్నాడు. 1) విడువబడినది, 2) పాడైనది అని పిలువబడు యెరూషలేముకు 1) హెఫ్సీబా (ఇష్టురాలు) 2) బ్యూలా (పతివ్రత) అనియు, పం|డెండవ వచనములో 3) పరిశుద్ధ ప్రజలు 4) యెహోవా విమోచించిన వారు, 5) ఆశింపతగినది 6) విసర్జింపబడనిది అని క్రొత్త పేరులు పెట్టబడినవి. ఈ పేరులను వివరముగా ధ్యానించిన మనము ఆత్మీయ పాటమును నేర్చుకొనగలము.

3వ. వేయి ఏండ్ల పాలనలో ఇశ్రాయేలు యెహోవా చేతిలో అలంకరించబడిన కిరీటము గాను దేవుని చేతిలో రాజకీయ మకుటముగాను ఉండును అంటున్నాడు. 4-5వ. పెండ్లి కుమారుడు పెండ్లికూతురిని చూచి సంతోషించునట్లు ప్రభువు వేయిఏండ్ల పాలనకు ముందు గొర్రెపిల్ల వివాహములో సంఘమును చూచి వివాహమాడి సంతోషించును.

యెహోవా ఈ దేశమును గూర్చి ఆనందించును.

**6-7వ. యెరూషలేము కాపరుల** ప్రార్థన:- యెరూషలేము ప్రాకారములమీద ప్రభువు కావలి వారిని ఉంచియున్నాడు. రేయైన పగలైన వారు మౌనముగా ఉండరు. యెహోవా జ్ఞాపక కర్తలారా, విశ్రమింపకుడి ఆయన యెరూషలేమును స్థాపించువరకు లోకమంతట దానికి ప్రసిద్ధి కలుగజేయువరకు ఆయనను విశ్రమింపనియ్యకుడని చెప్పుచున్నాడు. మనము యెరూషలేము క్షేమము కొరకు ప్రార్థించాలి. అలాగే సంఘములలో పెద్దలు విశ్రమించక యెరూషలేము అను సంఘ క్షేమముకై మరియు యెరూషలేము పట్టణముకై ప్రార్థనలో పోరాడవలెనని నేర్చుకొందము.

**8-9వ. జవాబుగా యెహోవా ప్రమాణము:** ప్రార్థనకు జవాబుగా యెహోవా ఈలాగున ప్రమాణము చేయుచున్నాను. నిశ్చయముగా ఇశ్రాయేలీయుల ధాన్యమును, వారు ప్రయాసపడి తీసిన ద్రాక్షారసమును అన్యులు తీసుకొనరని చెప్పుచున్నాడు. ధాన్యము కూర్చినవారే దాని భుజించి యెహోవాకు స్తుతి చెల్లింతురని చెప్పుచున్నాడు. యెష 54:10 పర్వతములు తొలగి పోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచి పోదు, సమాధాన విషయమైన నా నిబంధన తొలగిపోదు అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**10-12వ. యెహోవా ప్రకటన:** గుమ్మముల ద్వారా వచ్చుటకు జనమునకు త్రోవ స్థిపరచబడును. భూదిగంతముల వరకు యెహోవా సమాచారము ప్రకటింపచేసి యున్నాడు. రక్షణ నీ యొద్దకు వచ్చుచున్నది. ఇదిగో ఆయన ఇచ్చు బహుమానము, జీతము ఆయన తీసికొని వచ్చుచున్నాడని సీయోను కుమార్తెకు తెలియ జేయుడి. పరిశుద్ధ ప్రజలనియు యెహోవా విమోచించిన వారనియు వారికి పేరు పెట్టబడును. యెరూషలేమా, ఆశింప తగిన దానవనియు విసర్జింపబడని పట్టణమనియు నీకు పేరు. ఈ ప్రవచన సమీప నెరవేర్పు బబులోను చెరనుండి విముక్తియే. అంత్యకాలములో ఈ ప్రవచన నెరవేర్పు రెండవ రాకడలో ప్రభువు భూమి మీదకు వచ్చినప్పుడు జరుగుట చూతుము.

## 63వ. అధ్యాయము (6+8+5=19వ)

### శత్రువుకు శిక్ష - ప్రభువుకు స్తుతి

### అంశము:- ప్రభువు శత్రువును శిక్షించుట - ప్రభువుకు స్తుతి

**1-6వ.** శత్రువును శిక్షించుటకు ప్రభువు దిగి వచ్చుట: 1-3వ. ముందు అధ్యాయములలో విమోచకుడుగా ప్రభువు దిగివచ్చి ఇశ్రాయేలు ప్రజలను, యెరూషలేము పట్టణమును మహిమతో నింపుట చూచితిమి. దానికంటే ముందుగా శత్రువులను శిక్షించుట ఈ అధ్యాయములో చూతుము. రక్తవర్ణ వస్త్రములు ధరించి ఎదోము నుండి బొస్రా నుండి బలాతిశయముతో వచ్చు యితడెవడు? తన వస్త్రము ఎఱ్ఱగా మారింది. జనములలో ఎవడును ఆయనతో కూడ ఉండలేదు. ఒంటరిగా ద్రాక్షగానుగను త్రొక్కినందున బట్టలు ద్రాక్షగానుగను త్రొక్కువాని బట్టలవలె మారిపోయాయి. రౌద్రము చేత వారిని అణగ ద్రొక్కినందున వారి రక్తము ఆయన వస్త్రముల మీద చిందినది. ఈ ప్రవచన నెరవేర్పును మహాశ్రమల కాల చివరలో హర్మెగిద్దోను యుద్ధములో జరుగుట ప్రక 16:16, యోవేలు 3:12లో చూతుము. క్రీస్తు విరోధిని, అబద్ధ ప్రవక్తను అగ్ని గుండములో వేసి, వారిని వెంబడించిన భూరాజులను, ప్రజలను ప్రభువు తన నోట నుండి వచ్చు ఖడ్గము చేత సంహరించుట ప్రక 19:17-21లో చూతుము.

**4-6వ. విమోచించుటకు తగినవాడు లేక పోగా ప్రభువే విమోచకుడగుట:-** విముక్తి చేయదగిన సంవత్సరమువచ్చి యుండెను. నేను చూచి ఆశ్చర్యపడితిని. సహాయము చేయువాడు,

ఆదరించువాడు లేక పోయెను. కావున నా బాహువు నాకు సహాయము చేసెను. పాపముల నుండి, దాని శిక్ష నుండి విడుపించు వాడెవడును లేనప్పుడు ప్రభువు మొదటి రాకడలో భూమి మీదకు దిగివచ్చి శరీరము ధరించుకొని తన శరీరమందు మన పాపములను సిలువ మీద మోసి మనలను విమోచించాడు. రెండవ రాకడలో ఇశ్రాయేలీయులను మహాశ్రమల నుండి విముక్తి చేయుటకు భూమి మీదకు దిగివచ్చును. కోపముగలిగి క్రీస్తు విరోధిని, వానిని అనుసరించిన జనములను త్రొక్కివేయునని పైభాగములో చూచితిమి.

**7-14వ. ప్రభువుకు స్తుతి:** 7-9వ. యెహోవా స్తోత్రములను గానముచేయవలసిన కారణములు: 1) యెహోవా మనకుచేసిన వాటన్నిటినిబట్టి 2) యెహోవా కృపాతిశయమునుబట్టి, 3) ఆయన వాత్సల్యమునుబట్టి 4) కృపాబాహుళ్యమునుబట్టి 5) ఇశ్రాయేలు యొక్క వంశస్థులకు ఆయన చూపిన మహాకనికరమునుబట్టి 6) మనలను తన జనులని అనుకొనుటనుబట్టి 7) ఆయన రక్షకుడైనందుకు 8) వారి యావద్బాధలో ఆయన బాధనొందెను గనుక 9) ఆయన సన్నిధి దూత వారిని విమోచించి, రక్షించెను కనుక, 10) ఆయన ప్రేమనుబట్టి 11) ఆయన తాలిమిబట్టి 12) పూర్వదినములన్నిటను ఆయన వారిని ఎత్తికొనుచు మోసికొని వచ్చుటనుబట్టి ఆయనను స్తుతించాలి.

**10-14వ. పరిశుద్ధాత్మను దుఃఖపరచిన ఇశ్రాయేలీయులు:** ఎఫె 4:30లో దేవుని పరిశుద్ధాత్మను దుఃఖ పరచకుడి; విమోచన దినము వరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు అని ఉన్నది. కాని వారు తిరుగుబాటు చేసి ఆయన పరిశుద్ధాత్మను దుఃఖింపజేయగా ఆయన వారికి విరోధియై యుద్ధము చేసి వారిని శిక్షించెను. కాని ఆయన పూర్వదినములను, మోషేను తన జనులను, ఆయన వారిని నడిపించి కాపాడిన రీతిని జ్ఞాపకము చేసికొనెను. పల్లమునకు దిగు పశువులు విశ్రాంతినొందునట్లు యెహోవా ఆత్మ ఇప్పుడు వారికి విశ్రాంతి కలుగజేసెను. ఘనమైన పేరు ఇశ్రాయేలుకు కలుగునట్లు వారిని నడిపించెను.

## 64వ. అధ్యాయము (4+4+4=12వ)

### ఇశ్రాయేలీయుల విమోచనకై ప్రార్థన

### అంశము:- ఇశ్రాయేలీయుల విడుదల విమోచనకై ప్రార్థన

**63:15-19వ. ప్రభువుకు ప్రార్థన:** 15-16వ. ప్రార్థనకు ముందు ప్రభువు ఎవరో గుర్తించాలి. 1) ప్రభువు పరమునుండి చూచువాడు. 2) మహిమోన్నతుడు. 3) పరిశుద్ధ నివాసస్థలములో నుండి దృష్టించువాడు అని గుర్తించాలి 4) తన బిడ్డలపట్ల ఆసక్తి కలవాడు 5) శౌర్యకార్యములు చేయువాడు 6) ఇశ్రాయేలు యెడల జాలిగలవాడు 7) వాత్సల్యత కలవాడు 8) తండ్రియైనవాడు 9) అనాదికాలము నుండి విమోచకుడని పేరుగలవాడు.

17-19వ రెండవదిగా ఇశ్రాయేలు తానెవరో గుర్తించాలి. 1) మార్గము తప్పి తిరుగువారు 2) దేవుని భయము విడుచినవారు 3) హృదయములను కఠినపరచుకొనినవారు, దేవుని దాసుల నిమిత్తము, స్వాస్థ్యగోత్రముల నిమిత్తము తిరిగి రమ్మని ప్రార్థించాలి.

**64:1-4వ. శత్రువును శిక్షించుటకు దిగిరమ్మని ప్రభువుకు ప్రార్థన:-** నీ శత్రువులకు దేవునిని తెలియజేయుటకై దిగిరమ్మని ప్రార్థన. తన కొరకు కనిపెట్టువాని విషయమై తప్ప తన కార్యము సఫలము చేయు మరి ఏ దేవునిని ఎవడును ఏ కాలమున చూచియుండలేదని దేవుని గొప్పతనమును జ్ఞాపకము చేయుచు ప్రార్థించాలి.

**5-8వ. పాపాలను ఒప్పుకొనుట:-** 5-6వ. వారు తమ పాపములను ఒప్పుకొనిన రీతిని గమనింతము. 1) మేము పాపులమైతిమి 2) బహుకాలము నుండి పాపములలో పడియున్నాము. 3) రక్షణ మాకు కలుగునా? 4) మేమందరము అపవిత్రులవంటి వారమైతిమి, 5) మా నీతి క్రియలన్నియు మురికి గుడ్డవలె ఆయెను, 6) మేమందరము ఆకువలె వాడిపోతిమి 7) గాలివాన కొట్టుకొనిపోవునట్లుగా మా దోషములు మమ్మును కొట్టుకొని పోయెను 7-8వ. 8) నీ నామమునుబట్టి మొఱ్ఱపెట్టి, నిన్ను ఆధారము చేసికొనుటకై తన్ను తాను ప్రోత్సాహపరచుకొను వాడొకడును మాలో లేడు, కనుక నీవు మాకు ముఖము చాటుచేసికొని, మా దోషములచేత మమ్మును కరిగించియున్నావు. 9) యెహోవా నీవే మాకు తండ్రివి మేము జిగటమన్ను 10) నీవు మాకు కుమ్మరివాడవు, మేమందరము నీ చేతిపనియైయున్నాము. 2తిమో 2:21వ. ప్రకారము యజమానుడు వాడుకొను అర్హమైన పాత్రగా ఉండుట ముఖ్యము. యెహోవా, అత్యధికముగా కోపపడకుము. మేము చేసిన దోషమును నిత్యము జ్ఞాపకము చేసికొనకుము అని ప్రార్థించిరి. యెష 65-6వ.లో ప్రవక్త యెషయా పాపములు క్షమించబడినను ఇక్కడ తన పాపములను కూడా ఒప్పుకొనుట గమనించతగినది.

**9-12వ. తమ విడుదలకై వేడుకొనుట:-** చిత్తగించుము, చూడుము, దయచేయుము, మేమందరము నీ ప్రజలమే గదా. పాపములను నిత్యముగా జ్ఞాపకము చేసికొనవద్దని వేడుకొనుచున్నారు. పాడయిన పరిశుద్ధ పట్టణము కొరకు, అగ్నిపాలైన శృంగారమైన మందిరము కొరకు, నాశనమైపోయిన వాటి కొరకు యెహోవాను ప్రార్థించుచున్నారు.

## 65వ. అధ్యాయము (7+8+9=25వ)

ఇశ్రాయేలీయుల విమోచన-వేయిఏండ్ల పాలన గూర్చిన వాగ్దానము

అంశము:- వేయి ఏండ్ల పాలన గూర్చిన వాగ్దానము

**1-7వ. ఇశ్రాయేలు జనాంగమునకు హెచ్చరిక:-** ఇశ్రాయేలీయులు విగ్రహారాధన చేయుచు, చెడునడత నడచుచు, దేవుని దూషించుచు, దేవునికి లోబడకయు జీవించుచు మేము

పరిశుద్ధులమని తలంచుచున్నారే కాని పాపమునకు పశ్చాత్తాపబడుట లేదు. నిశ్చయముగా వారి దోషము వారి పితరుల దోషమును బట్టి అనగా పర్వతములమీద ఈ జనులు ధూపము వేసిన దానినిబట్టి మొట్టమొదట వారి ఒడిలోనే వారికి ప్రతీకారము కొలిచి పోయుదురని దేవుడు చెప్పుచున్నాడు. అదే సమయములో తన కృపనుబట్టి నన్ను వెదకని వారికి దొరికితిని, నా యొద్ద విచారణ చేయనివారికి నేను ప్రత్యక్షమైతిని అని ఇశ్రాయేలు విషయము చెప్పుచున్నాడు. (రోమా 10:20వ.) అంటున్నాడు. ముందు అధ్యాయములోని వారి ప్రార్థనకు దేవుడిచ్చిన జవాబును 65 అధ్యాయములో చూతుము

**8-15వ. ఇశ్రాయేలులో నమ్మిన శేషము, మాట వినని వారికి హెచ్చరిక:- 9-10వ.** ఇశ్రాయేలులో నమ్మిన శేషమునకు దీవెన: యాకోబు నుండి సంతానమును యూదా నుండి దేవుని పర్వతములను స్వాధీనపరచుకొనువారిని పుట్టించెదను, దేవుడు ఏర్పరచుకొనినవారు దాని స్వతంత్రించుకొందురు, దేవుని సేవకులు అక్కడ నివసించెదరు. దేవుని గూర్చి విచారణ చేసిన ప్రజల నిమిత్తము షారోను గొఱ్ఱల మేత భూమియగును, ఆకోరు లోయ పశువులు పరుండు స్థలముగా ఉండును. మాట వినని వారికి హెచ్చరిక: దేవుని మాట ఆలకింపక ఆయన దృష్టికి ఇష్టము కానిది. చెడ్డదైన దానిని చేసినందున, ఖడ్గము చేత వారందరు వధకు లోనగుదురని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

కావున ప్రభువగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు ఆలకించుడి.

1) నా సేవకులు భోజనము చేయుదురు గాని మీరు ఆకలిగొనెదరు.

2) నా సేవకులు పానము చేయుదురు గాని మీరు దప్పిగొనెదరు.

3) నా సేవకులు సంతోషించెదరు గాని మీరు సిగ్గుపడెదరు.

4) దేవుని సేవకులు హృదయానందముచేత కేకలు వేసెదరు గాని దేవుడు మాట విననివారు చింతాక్రాంతులై మనోదుఃఖముచేత ప్రలాపించెదరు. ప్రభువగు యెహోవా తన మాట వినని వారిని హతముచేసి తన సేవకులకు వేరొక పేరు పెట్టును.

**16-25వ. ఇశ్రాయేలుకు వాగ్దానము:- 16-19వ.** యేసు ప్రభువు దేవుని తోడని ప్రమాణము చేయుచు క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని సృజించుచున్నానని, మునుపటివి మరువబడును జ్ఞాపకమునకు రావు అని చెప్పుచున్నాడు. నేను సృజించుచున్న దాని గూర్చి మీరు ఎల్లప్పుడు హర్షించి ఆనందించుడి, అనియు నిశ్చయముగా నేను యెరూషలేమును ఆనందకరమైన స్థలముగాను ఆమె ప్రజలను హర్షించువారినిగాను చేయుచున్నాను అనియు చెప్పుచున్నాడు. యెరూషలేమును గూర్చి ఆనందము, హర్షించుట ఉండునని రోదనధ్వని, విలాపధ్వని దానిలో ఇక వినబడవని చెప్పుచున్నాడు. 20-25వ. వేయి ఏండ్ల పాలనలో కాలము

నిండని ముసలివారుండరు. బాలురు నూరు సంవత్సరముల వయస్సు గలవారై చనిపోవుదురు. జనులు ఇండ్లు కట్టుకొని వాటిలో కాపురముందురు. ద్రాక్షతోటలు నాటించుకొని వాటి ఫలముల ననుభవింతురు. వివరములు 11అ.లో కూడా చూడండి.

## 66వ. అధ్యాయము (3+3+3+3+3+3+3+3=24వ)

ఇశ్రాయేలీయుల విమోచన, సృష్టి విమోచన

అంశము:- ఇశ్రాయేలీయుల విమోచన, సృష్టి విమోచన - నూతనములు.

**1-3వ. ప్రస్తుత కాల జనాంగాలకు హెచ్చరిక:-** రక్షణ పొందని ప్రజలు తమ కిష్టమైనట్లుగా త్రోవలను ఏర్పరచుకొని, అసహ్యమైన పనులు చేయుచు వేషధారణగా బలులు, నైవేద్యము అర్పించు వారిని దేవుడు దృష్టించుట లేదు ఆకాశమంత సింహాసనము, భూమి అంత పాద పీఠము ఆయనకు అవసరము. కనుక హస్తకృత్య ఆలయములలో నివసించి రక్షణ పొందని వారి బలులు స్వీకరించుట ఆయనకు ఇష్టము లేదు. కాని ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై ఆయన మాట విని వణుకుచుండునో వానినే దృష్టించి వాని హృదయములో నివసించుదునని చెప్పుచున్నాడు. 57:15 కూడా చూడండి.

**4-6వ. శేషమునకు వాగ్దానము:-** యెహోవా వాక్యమునకు భయపడు నమ్మకమైన యూదా వారు ద్వేషించబడి దేవుని నామమును బట్టి తమ స్వజనులచే త్రోసివేయబడి శ్రమపెట్టబడుదురు. శ్రమపెట్టు ఈ దుర్మార్గులు మీ సంతోషము మాకు కనబడునట్లు యెహోవా మహిమ నొందును గాక అని చెప్పుదురు. కాని దేవుడు మిమ్మును కాపాడి వారికి ప్రతీకారము చేయును కనుక చివరకు వారే సిగ్గు నొందుదురు. యెహోవా తన శత్రువులకు ప్రతీకారము చేయుచుండు శబ్దము వినబడుచున్నదని చెప్పుచున్నాడు.

**7-9వ. సీయోను రెండు పుట్టుకలు:-** ఒకనాటి ప్రసవవేదన, ఒక్క నిమిషములో ఒక జనము జన్మించదు. సీయోనునకు ప్రసవ వేదన కలుగగానే ఆమె బిడ్డలను కనెను. సీయోనునకు ప్రసన వేదన కలుగగానే ప్రభువు మొదటి రాకడగా సీయోనుకు యేసు పుట్టెను. మహాశ్రమల కాలములో సీయోనుకు ప్రసవవేదన కలుగగా ప్రభువు భూదిగంతముల నుండి తనవారైన ఇశ్రాయేలీయులను సమకూర్చగా ఒక నూతన జనాంగముగా వారు పుట్టుదురు. కనుక సీయోనులో క్రీస్తు పుట్టుక ఒక పుట్టుక, మహా శ్రమల ముగింపులో నూతన జనాంగపు పుట్టుక రెండవ పుట్టుక.

**10-12వ. యెరూషలేము యొక్క మహిమ:-** నదివలె సమాధానమును ఆమె యొద్దకు పారచేయుదును, మీరు జనముల ఐశ్వర్యము అనుభవించునట్లు ఒడ్డు మీద పొర్లి పారు

జలప్రవాహమువలె వారి యొద్దకు దానిని రాజేయును. యెరూషలేమువారు చిన్న బిడ్డవలె చంకను ఎత్తికొనబడెదరు, మోకాళ్లమీద ఆడింపబడెదరు.

**13-15వ. యెరూషలేము ఆదరణ:-** ఒకని తల్లి వానిని ఆదరించునట్లు దేవుడు యెరూషలేము ప్రజలను ఆదరించును. యెరూషలేములోనే వారు ఆదరింపబడెదరు. వారి హృదయము ఉల్లసించును. వారి యెముకలు లేతగడ్డివలె బలియును. యెహోవా హస్తబలము ఆయన సేవకుల యెడల కనుపరచబడును.

**16-18వ. శత్రువు పై యెహోవా కోపము:-** మహాకోపముతో విగ్రహారాధికులకు ప్రతికారము చేయుటకును అగ్ని జ్వాలలతో యెహోవా అగ్ని రూపముగా వచ్చుచున్నాడు, ఆయన రథములు తుపానువలె త్వరపడుచున్నవి. అగ్నిచేతను తన ఖడ్గముచేతను శత్రువులందరితో ఆయన వ్యాజ్యెమాడును, యెహోవా చేత అనేకులు హర్మెగిద్దోను యుద్ధములోను, గోగు మాగోగుల యుద్ధములోను హతులవుదురు.

**19-21వ. నూతన సృష్టి వివరము:-** ఇశ్రాయేలీయులు పవిత్రమైన పాత్రలో నైవేద్యమును యెహోవా మందిరములోనికి తెచ్చునట్లుగా అన్యులు వేర్వేరు ప్రయాణ సాధనముల మీద, సర్వజనములలో చెదరియున్న యూదులను యెరూషలేములోని ప్రతిష్ఠిత పర్వతమునకు యెహోవాకు నైవేద్యము తెచ్చినట్లుగా తీసికొని వచ్చెదరని యెహోవా సెలవిచ్చుచున్నాడు. (ప్రక 21-22అ). యాజకులుగాను లేవీయులుగాను ఉండుటకై వారిలో కొందరిని ఏర్పరచుకొందును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

**22-24వ. ముగింపు:-** దేవుడు సృజింపబోవు క్రొత్త అకాశమును క్రొత్త భూమియు లయము కాక నిత్యము నిలుచునట్లు ఇశ్రాయేలు సంతతియు వారి నామము నిలిచియుండును. 66వ అధ్యాయము 22వ వచనములోని క్రొత్త ఆకాశమును క్రొత్త భూమియు, క్రొత్త యెరూషలేము నుండి శాశ్వత పాలన యుండునను సంగతులు 66వ గ్రంథము 22వ అధ్యాయములో అనగా ప్రకటన 22:5లో దేవుడు చెప్పుట గమనించగలము. దేవుని మీద తిరుగుబాటు చేసిన వారి కళేబరములు నరకములో కనబడును. వాటి పురుగు చావదు. వాటి అగ్ని ఆరిపోదు (మార్కు 9:44,46,48). అవి సమస్త శరీరులకు హేయముగా ఉండును.

అందరికి శుభవార్త ఏదనగా యెషయా ఈ గ్రంథమందు వివరించిన సేవకుడైన క్రీస్తుయందు విశ్వాసముంచుట ద్వారా నరకశిక్షను తప్పించుకొందురు. రక్షించబడిన వారికి ఈ గ్రంథము ఆనందించదగ్గ ఒక రమ్యమైన ప్రవచన, పద్య గ్రంథముగా నున్నది.

# ఇశ్రాయేలు దేశము - చుట్టునున్న పది శత్రు దేశాలు 13-23 అధ్యా

తూర్పున:- 1. బబులోను 13 అ., 2. అష్షూరు 14 అ.,3. మోయాబు 15,16 అ, పడమర:- 4. ఫిలిస్తియ 14 అ., ఉత్తరమున :- 5. దమస్కు 17 అ., 6. తూరు 23 అ., దక్షిణమున:- 7. కూషు 18 అ., 8. ఐగుప్తు 19,20 అ., 9. ఎదోము 21 అ., 10. అరేబియా 21 అ.

